# భగవద్గీత

# ఉపన్యాసాలు - 4

## (25 నుండి 32 వ ఉపన్యాసం వరకు)



డా॥ ఎమ్. శ్రీరామకృష్ణ M.Sc., Ph.D.

# భగవద్గీత ఉపన్యాసాలు - 4

ఎడిటర్ : పి. సీతారాముడు

శ్రీ తారణ నామ సంవత్సరం,
ఫాల్గుణ బహుళ పంచమి, బుధవారం.
30.3.05

వెల : రూ. 160.00

ప్రతులకు :
పి. సీతారాముడు,
ఇంద్ర సర్వీసెస్,
7-7-4/1, కుముదవల్లి రోడ్,
రైల్వే గేటు దగ్గర,
భీమవరం - 534 203
ఫోన్ నెం. : 08816 - 309719

పబ్లిషర్స్ :
విశ్వకర్మ పబ్లికేషన్స్, భీమవరం

ప్రింటర్స్ :
సాయి ఆఫ్‌సెట్ ప్రింటర్స్, భీమవరం

# భగవద్గీత ఉపన్యాసాలు - 4

## (25 నుండి 32 వ ఉపన్యాసం వరకు)

mission RK
SSS-Hyderabad.
Phone: 23834474

## విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | భగవద్గీత ఉపన్యాసం - 25 | 384 |
| 2. | భగవద్గీత ఉపన్యాసం - 26 | 400 |
| 3. | భగవద్గీత ఉపన్యాసం - 27 | 416 |
| 4. | భగవద్గీత ఉపన్యాసం - 28 | 430 |
| 5. | భగవద్గీత ఉపన్యాసం - 29 | 446 |
| 6. | భగవద్గీత ఉపన్యాసం - 30 | 461 |
| 7. | భగవద్గీత ఉపన్యాసం - 31 | 476 |
| 8. | భగవద్గీత ఉపన్యాసం - 32 | 493 |

# భగవద్గీత ఉపన్యాసాలు - 25

## జ్ఞానయోగము

1998, నవంబరు 16 వ తారీఖున సుకృతవిల్లా, గుంటూరులో
మాస్టరుగారు భగవద్గీతపై ఇచ్చిన ఉపన్యాసము



- గురువు మీ మనస్సే
- మూడు రకాల సాధకులు
- భగవంతుణ్ణి వినాలి, శృతి
- ముక్కు, కన్నుల ద్వారా మానేసి, చెవుల ద్వారా జీవించాలి
- రాగము వల్లనే భయము, క్రోధము వస్తాయి
- భౌతిక జగత్తులో సిద్ధి త్వరగా లభిస్తుంది
- 24 నిమిషాల్లో ముక్తస్థితిని రుచి చూడవచ్చు
- ఎరుపు - ఆరంజ్ - ఎల్లో - గ్రీన్
- రంగుల ద్వారా ప్రారబ్ధకర్మను మార్చుకోవచ్చు
- కలర్ థెరపి - కలర్ హాస్పిటల్స్

సాధనాత్మకమైన భగవద్గీత జీవితవిధానంలో మనం గురువు యొక్క పాత్రని అసలు మర్చిపోకూడదు. గురువు లేనిదే ఏ విద్య అయినా సిద్ధించదు అని.

కానీ మన భారతదేశంలో గురువు అనే పదాన్ని పూర్తిగా మనం గందరగోళం పడిపోయి ఒక భౌతికశరీరధారి అయిన వ్యక్తి ఏమి చెప్తే అది కరెక్ట్, ఇంక అతను నోటితో ఉచ్చరించిన మాటను తప్ప మిగతావేవీ పట్టించుకోకూడదు, వినకూడదు, మిగతా గురువుల దగ్గరకి వెళ్ళకూడదు అనేది వచ్చేసింది. దురదృష్టం అది.

జ్ఞానయోగంలో ఆ అవగాహనా లోపాన్ని అర్థం చేసుకోవాలి. మామూలు ఒక జీవితంలో కొంత మనకి పనికొచ్చే చదువు చదువుకోవటానికి ఎంతమంది గురువులు కావలసి వచ్చిందో ఆలోచించుకోండి. ఎలిమెంటరీ స్కూల్లో చెప్పిన గురువులు, హైస్కూలు, కాలేజీలో చెప్పిన గురువులు, ఇదంతా కాకుండా జీవితంలో స్నేహితుల రూపంలో, తల్లి తండ్రుల రూపంలో, చుట్టుప్రక్కల ఉన్న వాళ్ళ రూపంలో, రకరకాలైనటువంటి సలహాలు మనం అడుగుతూవుంటాం.

ఏదైనా ఒక పని మొదలెట్టాలన్నా, ఇల్లు కట్టుకోవాలన్నా, పెళ్ళిళ్ళు చేయాలన్నా మనంతట మనం నిర్ణయించుకోం, స్నేహితులదీ వాళ్ళదీ సలహాలు అడుగుతాం.

సలహా అంటే గురువేకదా!

ఒక గురువు ఉండడు.

అనేక మంది శరీరధారులు గురువుగా వర్తిస్తారు.

కానీ భౌతిక శరీరధారి యొక్క గురుత్వాన్ని గురించి ఆధ్యాత్మిక జగత్తు మాట్లాడటం లేదు. అది మీరు చాలా జాగ్రత్తగా గమనించుకోవాలి.

మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః

మీ మనస్సు ఒప్పుకోకపోతే గురువు మాట మీరు వినరు. మూడు గంటలు సేపు గాయత్రీ మంత్రజపం చేసేయాలి అని కూర్చున్నాం మనం. మీ మనస్సు లొంగక పోతే కూర్చోండి చూస్తాను!

"నేను కూర్చోలేనండి మూడు గంటలు సేపు!"

మరి సినిమాహాల్లో ఎలా కూర్చుంటున్నారండి మూడు గంటల సేపు?

"మాకు స్థిరం కుదరటం లేదండి, మాకు వీలు కుదరటం లేదండి, మా శరీరం వినటం లేదండి."

టీవీ ముందు ఎలా కూర్చుంటున్నారు గంటలు, గంటలు? క్రికెట్ మ్యాచ్ వస్తూవుంటే, మిగతా వాళ్ళ సంగతి నాకు తెలియదుకాని, నా సంగతి నాకు తెలుసు. ఆ రోజు టిఫిను ఉండదు, ఫుడ్ కరెక్ట్‌గా తినం. తింటే ఏమో, ఒక బాల్ మిస్సయిపోతే ఏమయిపోతానో! కానీ ఆ స్థిరత్వం ఎక్కడ్నుంచి వచ్చేసింది నాకే?

- అంచేత గురువు మీ మనస్సే.

చాలా జాగ్రత్తగా అది అర్థం చేసుకోండి. అది అర్థం కానంత వరకు భగవద్గీత యొక్క జ్ఞానయోగం మనకి అర్థం కాదు. మీరు ప్రకృతిని ఎలా అర్థం చేసుకుంటున్నారు అన్నది చాలా ముఖ్యం.

- సమాజంలో రెండు రకాలైన మనుష్యులు ఉంటారు. ఒకడు ఆశాజీవి. ఇంకొకడు నిరాశాజీవి.

వాళ్ళని ఎలా గుర్తించాలి అనే దానికి సైకాలజిస్టులు ఒక ఉదాహరణ ఇస్తూవుంటారు. సగం నిండిన గ్లాసు వాడి ముందు పెట్టి, ఇందులో ఎలా ఉంది అంటే,

సగం ఖాళీగా ఉంది అన్నవాడు "నిరాశాజీవి".
సగం నిండి ఉన్నది అన్నవాడు "ఆశాజీవి".

- జరిగింది ఒకటే, సంఘటన అదే. ఖాళీతనం వాడికి కనిపిస్తోంది, నిండినతనం వీడికి కనిపిస్తోంది.

శ్రీ ఆ ఆశావహ మానసికస్థితి కనుక మనం తెచ్చుకుంటే, అదే నిజమైనటువంటి గురువు.

-- అంచేత గురువుని వ్యక్తులలో వెతుక్కోకండి. మీ మనస్సుని మౌల్డ్ చేసుకోండి.

- మన శరీరములో శిరస్సులో ఉన్న జ్ఞానేంద్రియాలను గురువులు అని పిలుస్తారు. వీటి యొక్క దివ్యత్వాన్ని మనం అర్థం చేసుకోవాలి.

మూడు రకాలైన మనుష్యులు సాధారణంగా ఉంటారు. అలాగే సత్వ, రజస్తమో గుణాలు అని మూడు రకాలైనటువంటి గుణాలు చెప్తూవుంటాం.

- అలాగే ఆధ్యాత్మిక జగత్తులో, సాధనా జగత్తులో 3 రకాలైనటువంటి సాధకులు ఉంటారు.

① ఒకళ్ళు మామూలుగా మానవులుగా ఏది ఎలా జరుగుతుందో అలా జీవిస్తూ, విశేషమైనటువంటి ప్రయత్నం ఏమీ వాళ్ళు చెయ్యరు వాళ్ళు.

-- అలాంటి వాళ్ళని ముక్కు ద్వారా జీవిస్తోన్నటువంటి సాధకులు అంటారు. అక్కడ గురువు ముక్కు.

- ముక్కు అంటే వాసనలు. వాసనలు అంటే మన శరీరంలో ఉన్న వాసనలు.

-- ఇది వరకటి జీవితం యొక్క వాసనలు వల్లే ఈ మానవ శరీరం మనకి వస్తోంది.

వాసనలు మారిపోతే
మానవ జీవితం మారిపోతుంది.

ఇవంతా కూడా పృథ్వీతత్వం వల్ల వస్తూవుంటాయి.

② ఇది కాకుండా కొంత మంది సాధకులు ఉంటారు. వీళ్ళ జీవితాలు మామూలు వ్యక్తులులాగ వాసనా మయమైనటువంటి జీవితాలు కాదు.

*వాసనామయమైనటువంటి జీవితాలు అంటే ఏమిటి?*

ఆకలేసింది, తినాలనిపిస్తుంది, తింటాడు. వాడం తట వాడు ఏమీ నిర్ణయించుకోడు. వాడి శరీరం వాడిని ఎటు త్రిప్పితే అటు వెళతాడు.

- మనమందరం ఆ స్థితిలో ఉన్నవాళ్ళమే. మన కోరికలు, మన వాసనలు మనల్ని ఎటు వైపు త్రిప్పితే అటు వెళుతున్నాం.

ఆ యాంగిల్లో పునర్జన్మ ఉండదు. మళ్ళా శరీరం రాదు అని కాదు. చాలా జాగ్రత్తగా అర్థం చేసుకుందాం.

ఎంచేతంటే శ్రీకృష్ణుడే చెప్తాడు అనేక సార్లు, మళ్ళా ప్రామిస్ కూడా ఉంది. ఎప్పుడెప్పుడు ఇలాంటి పరిస్థితి వస్తుందో, అప్పుడప్పుడు నేను పుడతాను అని. మరి దేహం వస్తోందిగా! దేహం లేకుండా పుడతాడా?

అంచేత ఆ పదాల వెనకాతల ఉన్న అంతరార్థాన్ని అర్థం చేసుకోండి. ప్రతీ రోజు రాత్రి మనం నిద్రపోతున్నాం, మళ్ళా రెండవ రోజు నిద్ర లేస్తున్నాం. చచ్చిపోయాం అనుకోవటం లేదే! పడుకున్నాం, లేచాం. ఎందుకు గాబరాపడటం లేదు మనం? ఎందుకు భయపడటం లేదు? గ్యారంటీగా రెండవ రోజు మెలకువ వచ్చినప్పుడు ఇక్కడ ఈ రోజు జరిగినవి అన్నీ కూడా మనకి గుర్తు ఉండటమే కాకుండా, ఏయే పనిని ఎక్కడ ఆపామో, అక్కడ్నుంచి మొదలెడతాం.

ఆధ్యాత్మిక జగత్తులో ఆ పని చేయలేకపోతున్నాం మనం. క్రిందటి జన్మల్లో మనం ఎంత వరకు సాధన చేశామో, ఆ సాధన తరవాత నుంచి మనం మొదలెట్ట గలగాలి. అప్పుడు ఫాస్ట్‌గా రిజల్ట్స్ వస్తాయి.

మరి దానికి మార్గం ఉందా ?

ఉంది మార్గం. ఆ మార్గం భగవద్గీతలోనే చెప్తాడు.

***కానీ మనకి గొడవ ఎక్కడొస్తోంది,***

మనం అసలు ఆధ్యాత్మిక సాధనను ఒక విద్యగా అభ్యసించటం లేదు. పేరు మాత్రం ఆత్మవిద్య అనే చెప్తున్నాం, ఒక ఎడ్యుకేషన్ అంటున్నాం. కానీ ఏమిటి మన ఆధ్యాత్మికత అంటే, బొట్టు పెట్టేసుకున్నాం, గుడికి వెళ్ళాం, వచ్చేశాం. లేదూ, గాయత్రీ జపం చేయమన్నారు. ప్రొద్దున్న ఒక వెయ్యి, మధ్యాహ్నం ఒక వెయ్యి, సాయంత్రం ఒక వెయ్యి జపం చేసేశాం. భక్తుడ్ని.

ఏం జరిగిందని? అది చేయటం వల్ల ఏ లక్ష్యాన్ని పొందుతున్నాం? ఏ ఉద్దేశ్యం కోసం మనం చేస్తున్నాం?

ఒక డాక్టరు అవ్వాలి అంటే ఐదేళ్ళ పాటు చదవాలి. 5 × 365 రోజులు. అందులో ప్రతీ రోజూ చదవడు. మళ్ళా ఎండాకాలం సెలవలు వస్తూవుంటాయి, స్ట్రయిక్‌లు వస్తూవుంటాయి, నానా గందరగోళాలు వస్తూవుంటాయి. మళ్ళా వీడు కాలేజీ ఎగ్గొట్టేసే రోజులు ఉంటాయి. వీడు కాలేజీకి వెళ్ళిన రోజు లెక్చరర్స్ రాని రోజులు ఉంటాయి. కానీ ఇంత గందరగోళాలు ఉన్నా ఐదేళ్ళల్లో మొత్తము నేర్చుకోవలసిన విద్య వాడు నేర్చేసుకుంటాడు.

***ఎంచేత?***

అవగాహన ఉంది. లక్ష్యము ఉంది.
ఏం నేర్చుకోవాలో చాలా స్పష్టంగా తెలుసు.

***అన్‌ఫార్చునేట్లీ మన దౌర్భాగ్యం ఏమిటంటే,***

ఆత్మవిద్య అంటే జన్మరాహిత్యం. ఇంక మనం పుట్టం. భగవంతుడిలో లీనం అయిపోతాం.

ఇంక సిలబస్ ఏం ఉంటుంది దానికి? లీనం అయిపోవటమేగా! కానీ లీనం అయిపోవటం అంటే ఏమిటి అన్నది మనం మర్చిపోతున్నాం.

***లీనం అయిపోవటం అంటే,***

ఆ సర్వజ్ఞత్వం మీకు రావాలి.
ఆ సర్వవ్యాపకత్వం మీకు రావాలి.
ఆ సర్వ సమర్థత మనకి రావాలి.

ఆత్మవిద్య అంటే అంతే. ఆ భగవంతుడి యొక్క అన్ని లక్షణాలూ మీలో ఉండాలి.

ఇంజనీరింగ్ చదివితే ఇంజనీర్ యొక్క లక్షణాలు మీలో ఎలా ఉంటాయో, కెమిస్ట్రీ చదివితే కెమిస్ట్ యొక్క లక్షణాలు మీలో ఎలా ఉంటాయో, మీరు చేస్తోన్నటువంటి సాధనలు, ఏ సాధనలు అయినా చేసుకోండి. లక్ష్యం ఏమిటి అంటే, జన్మ కర్మ చ మే దివ్యం, దివ్యత్వం వైపుకు వెళ్ళాలి మనం. దాన్ని మనం అర్థం చేసుకుంటూ, ఎలా వెళ్ళాలి?

**వీతరాగభయక్రోధాః మన్మయా మాముపాశ్రితాః
బహవో జ్ఞానతపసా పూతా మద్భావమాగతాః. (4-10)**

అనురాగము, భయము, క్రోధము విడిచినవారును, నా యందేలగ్నమైన చిత్తముగలవారును, నన్నే ఆశ్రయించినవారు నగు అనేకులు ఇట్టి జ్ఞానతపస్సుచే పవిత్రులై నా స్వరూపమును (మోక్షమును) పొందియుండిరి.

ఎగ్జాంపుల్స్ ఇస్తున్నాడు.

ఈ టెక్నికల్ కోర్సెస్‌కి వెళ్ళినప్పుడు చాలా మంది ఆ సిలబస్ చూసి భయపడతారు. "ఏమీ అర్థమవటం లేదు

మాస్టారు!'' అంటారు. మొదట్లో అలాగే ఉంటుంది. అప్పుడు ఏం చెప్తాడు ఆ లెక్చరరు, ''అందరికీ అలాగే ఉంటుంది. నేను చదివినప్పుడు కూడా అలాగే గాబరా పడ్డాను, కొన్నాళ్ళు నువ్వు ఓపిక పట్టి దాన్ని కంటిన్యూ చేస్తే మెల్లిమెల్లిగా అర్థమవటం మొదలెడుతుంది''

పూతా మద్భావమాగతాః - ఈ విధమైన భావాన్ని ఎవరైతే తయారుచేశారో, వాళ్ళందరూ పవిత్రులు అయిపోయి,

బహవో జ్ఞానతపసా - ఈ జ్ఞానతపస్సు వల్ల బహవో, చాలా మంది అలా అయ్యారు. ఒకళ్ళు ఇద్దరూ కాదు.

''నీకేం కారణజన్ముడివి కనుక అయ్యావు, చెప్తూ వుంటావులే ఇలాగ కబుర్లు, నీ సొమ్మేం పోయింది. చిన్నప్పటి నుంచి నీకు ఆ మాయాశక్తులు అవీ ఉన్నాయి. నాకేం ఉంది, ఒక పాశుపతాస్త్రం కావాలంటే నా నా గందరగోళం పడ్డాను'' అని మనస్సులో అర్జునుడు అనుకుని ఉంటాడు. ఆ థాట్ జగద్గురువుకి అర్థమవుతుందికదా!

గాబరాపడకు, బహవో జ్ఞానతపసా, చాలా మంది, టూ మెనీ ప్యూపుల్స్, యాక్చువల్‌గా మనం లెక్కపెట్టలేం. ఎంచేతంటే, మనకి హిస్టరీలో కానీ, పురాణాలలో కానీ చెప్పబడిన ఈ సిద్ధపురుషుల కంటే ఎక్కువ మంది మనకి తెలియని సిద్ధపురుషులు ఉండి ఉంటారు. హిమాలయాల్లో ఎంత మంది ఉన్నారో మనకి తెలియదు కదా! ఒకళ్ళో ఇద్దరో గురువులు కనిపిస్తూవుంటారు, రెండు మూడు ఆశ్రమాలు కనిపిస్తూ ఉంటాయి. మరి మిగతా వాళ్ళు? అచేంత ఈ జ్ఞానతపస్సు వల్ల చాలా మంది ఆ స్థితికి వెళ్ళారు.

- కానీ మూడు పోగొట్టుకోవాలి మీరు. వీతరాగభయక్రోధాః రాగము, భయము, క్రోధము. అసలు యాక్చువల్‌గా ఇవంతా కూడా రాగము వల్ల వచ్చేవే.
- రాగము అంటే కోరిక.

ఒక వస్తువు ఇవాళే నేను కొన్నాను. అక్కడ టేబుల్ మీద పెట్టాను. అప్పుడే ఉంటుంది ఆ మోజు అంతా. మళ్ళా నాలుగైదు రోజులు తరవాత ఉండదు. క్రొత్తగా స్కూటరు కొంటారు. ఎంత బాగా తుడుస్తారో! ఇంక వాళ్ళ జీవితం అంతా ఆ స్కూటర్ మీద ఉన్నట్టే ఉంటుంది. ఒక రెండేళ్ళు అయ్యాక చూడాలి ఆ స్కూటరు యొక్క పరిస్థితి పాపం. రాగము! దాని మీద ఆ మోజు, ఆ భావన ఉన్నంత వరకు దాన్ని చాలా జాగ్రత్తగా చూసుకుంటాం.

- రాగము అంటే అర్థమయిందికదా, ఎఫెక్షన్, ప్రేమ. అది ఎప్పుడైతే ఉంటుందో, అది మన దగ్గర నుంచి పోతుందేమో అని భయం వేస్తుంది.

ప్రక్క ఇంట్లో ఏదో అయితే మనకి భయం వేయదు. కానీ మన ఇంట్లో జరుగుతుంది ఏమో అని భయం.

- దానికి ఎవడైనా అడ్డొచ్చాడనుకోండి, క్రోధము.

రాగము, భయము, క్రోధము. ఈ మూడూ వదిలెయ్యాలి.

- కానీ భారతీయ జీవిత విధానంలో జరిగిన పెద్ద తప్పు ఏమిటంటే, ఎప్పుడైతే రాగం వదిలేశామో, ఎప్పుడైతే ప్రేమను వదిలేశామో, ఎప్పుడైతే ఈ మోహాన్ని వదిలేశామో, బాధ్యతల్ని కూడా వదిలేశాం.
- బాధ్యతల్ని చాలా జాగ్రత్తగా పట్టించుకోవాలి.

బెనారస్‌లో నేను ఉంటున్నప్పుడు మా ప్రక్క ఇంట్లో ఒక కుటుంబం ఉండేది. చాలా పెద్ద కృష్ణ భక్తుడు. ఆ చుట్టుప్రక్కల వాళ్ళందరికీ కూడా అతను చాలా మంచి భక్తుడిగా ప్రసిద్ధికెక్కాడు. ఒక రోజు నేను వాళ్ళ ఇంటికి వెళ్ళాను. ఆయన బాలకృష్ణుడ్ని ఉయ్యాలలో పడుకోబెట్టి ఊపుతూ ఉన్నాడు. ఈ లోపల వాళ్ళ మనవడు పాకుతూ వచ్చాడు. పూజ డిస్టర్బ్ చేశాడు మనవడు.

ఉయ్యాలలో వేసి కొయ్యబొమ్మను ఊపుతున్నాడు. వాళ్ళ మనవడ్ని ఊపలేకపోతున్నాడు. అవగాహనా లోపం. బాలకృష్ణుడ్ని పూజ చేయటం ఎందుకు అంటే, ప్రతీ వ్యక్తిలోనూ ఆ బాలకృష్ణుడ్ని చూడగలగాలి కనుక.

ఇటువంటిదే రామకృష్ణ పరమహంస జీవిత చరిత్రలో ఒక అద్భుతమైన సంఘటన వస్తుంది. రామలాల గురించి చాలా మంది చదివి ఉంటారు. కానీ ఆ సంఘటన వెనకాతల ఉన్న ప్రాముఖ్యత, రామకృష్ణ పరమహంస యొక్క ఆ గురుత్వము అర్థం కాదు.

రామకృష్ణ పరమహంస దగ్గరకి ఒకడు వచ్చాడు. అతని దగ్గర కొయ్యతో చేసిన బాలరాముడి బొమ్మ ఉండేది. అతను దాన్ని ఎంతగా సిద్ధింప చేసుకున్నాడు అంటే, ఇంక అతనికి రాముడు కనిపించేవాడు అక్కడ. అంచేత ఆయన

భోజనం పెడుతూవుంటే అక్కడ కర్రబొమ్మ ఉండేదికాదు, నిజంగా తినేది. మనుష్యులు కూడా చూసేవారు. అంటే ఆ రాముడ్ని చూడలేకపోయినా, ఈయన నోట్లో పెడుతూ వుంటే ఆ ఆహారం మాయం అవటం గమనించేవారు.

ఆయన దురదృష్టం, అంత పెద్ద భక్తుడు రామకృష్ణ పరమహంస దగ్గరకి ఆ కొయ్య విగ్రహాన్ని తీసుకొచ్చాడు. ఇంక ఈయన ప్రసాదం టైమ్‌కి చూస్తే అక్కడ రాముడు కనిపించేవాడు కాదు. ఎక్కడ ఉన్నాడు రాముడు అంటే, రామకృష్ణ పరమహంస ఒళ్ళో ఉండేవాడు. ఇంక ఈయనకి కోపం. "ఇన్నాళ్ళ బట్టి నేను సాధన చేసి, నీకు తిండి పెడు తూవుంటే, నన్ను వదిలేసి వీడి దగ్గరకి వెళ్ళిపోతావా?"

రామకృష్ణ పరమహంస కూడా ఆ బాలరాముడికి, "వద్దు బాబూ, నువ్వు ఆయన దగ్గరకే వెళ్ళు, ఎందుకు నా దగ్గరకి వస్తావు!" అని చెప్పేవాట్ట. అయినా వదిలి రాడుగా రామకృష్ణ పరమహంసని.

- అసలు సాధనలో అంత ఉచ్చస్థితికి చేరుకున్న వాళ్ళకే గందరగోళం అవుతూవుంటే, మన సాధన ఎంతో ఊహించుకోండి. మనం పెద్ద భక్తులం అనుకుం టాం. సాధన తీవ్రత, తీవ్రత లేనిదే లాభం లేదు.

నేను అక్బరు - బీర్బల్ కథని చాలా సార్లు చెప్తూ వుంటాను. చాలా జాగ్రత్తగా ఆ కథ గుర్తుంచుకోండి. ఆ కథ మన మనస్సులో ఉంటే, ఆ తప్పు ఎప్పుడూ చెయ్యం. అందుకే అది నేను చాలా సార్లు రిపీట్ చేస్తాను.

యమునానదిలో శీతాకాలంలో మెడ లోతు వరకు నిలుచుని ఒక రాత్రి అంతా ఉన్నవాడికి పదివేల దీనార్లు ఇస్తానన్నాట్ట అక్బరు. ఒకడు ఉన్నాడు. సరే రెండో రోజు ప్రొద్దున్న వాడు వచ్చి నిన్న రాత్రల్లా ఉన్నాన్నేను, నాకు పదివేలు ఇవ్వండి అన్నాడు. రాజు ఇష్టం! ఎందుకో మూడ్ బాగో లేదు ఆ రోజు అక్బరుది. ఇవ్వనన్నాడు.

ఎందుకు ఇవ్వట్ట? ఎక్కడో రెండు మైళ్ళ దూరంలో అక్బరు శయనాగారం ఉంది. ఆ దివిటీని చూస్తూ నించు న్నాను అన్నాడు. "నా పడకగదిలో వెలుగుతోన్నటువంటి దివిటీని చూస్తూ నిలుచున్నావు కనుక, అక్కడ్నుంచి నీకు వేడి వచ్చింది. చచ్చినా నీకు డబ్బు ఇవ్వను" అన్నాడు.

సరే, బీర్బల్ దగ్గరకి వెళితే, బీర్బల్ నేను సర్దుతాన్లే అన్నాట్ట. బీర్బల్‌కి ఒక అలవాటు ఉంది. తన వంట తానే వండుకుని తినేవాడు. ఒకసారి అక్బరు వేటకి వెళితే తనూ కూడా వెళ్ళాడు. అక్బరు వేటాడి, అలిసిపోయాక, భోజనాలు అవీ చేసి పడుకుని బీర్బల్‌ని పిలిపిస్తాడు. సాధారణంగా బీర్బలు - అక్బరు కాలక్షేపం చేసేవారు.

ఆ రోజు ఎప్పటికీ బీర్బల్ రాడు. ఎందుకు రాడు వెళ్ళి చూడు అంటే, ఇంకా వంట అవలేదండి బీర్బల్‌ది. అతను వండుకునే పులగానికి ఇంకా వంట అవ్వకపోవటం ఏమిటి? నేను ఇంత పంచభక్ష్య పరమాన్నాలతో చేయించు కుని చేశానుకదా అని వెళ్ళి చూశాడు.

చూస్తే బీర్బలు ఏం చేశాడు? పైన చెట్టు చిటారు కొమ్మకి గిన్నె కట్టాట్ట. అందులో పెసరపప్పు, బియ్యం పోసి, క్రిందన అగ్గిపుల్లలు గిసి దానికి చూపిస్తున్నాడు. ఎన్ని అగ్గి పుల్లలు గీస్తే అది ఉడుకుతుంది?

ఎన్ని రోజులు మీరు ఓం భూర్భువః స్వః అని ఒకసారి అని మళ్ళా ఈ వీతరాగభయక్రోధాలు పెట్టుకుంటే ఆ సాధన పరిపక్వస్థితికి వస్తుందా? రాదు పరిపక్వస్థితికి. మీకు మాత్రం అదొక అసంతృప్తి, "నేను ఇంత పూజలు చేశాను, భగవంతుడు నా మాట వినలేదు!"

- నిరంతర సాధన. అగ్గిపుల్లలు గీసి వెలిగిస్తే లాభం లేదు. ఆ అగ్గిపుల్లలు మహామంటగా మారాలి.
-- ఆ మహామంట, ఆ మహాసాధనలో, ఆ తీవ్రతలో మనకి ఫలితాలు వస్తాయి.

***అంచేత ఆ సాధన యొక్క తీవ్రత ఎప్పుడొస్తుంది?***

ముందు భౌతిక జగత్తు మీద రాగం పోవాలి.

***రాగం పోయిన దానికి గుర్తు ఏమిటి?***

మీకు భయమూ ఉండదు, క్రోధమూ ఉండదు.

భయమూ, క్రోధమూ ఎప్పుడొస్తుంది? రిజల్ట్స్ వస్తున్నాయి. టెన్షన్!

రెండు రకాలైన వ్యక్తులకి టెన్షన్ రాదు. ఒకడు యోగికి రాదు. ఇంకొకడు అసలు చదవని వాడికీ టెన్షను రాదు. వాడికి ఎలాగూ తెలుసుగా రిజల్ట్ ఏమౌతుందో! మధ్యన ఉన్న వాడికి వస్తుంది. "ఏమో! బొటాబొటీగా

# భగవద్గీత ఉపన్యాసాలు - 4

## (25 నుండి 32 వ ఉపన్యాసం వరకు)



డా॥ ఎమ్. శ్రీరామకృష్ణ M.Sc., Ph.D.

# భగవద్గీత ఉపన్యాసాలు - 4

ఎడిటర్ : పి. సీతారాముడు

శ్రీ తారణ నామ సంవత్సరం,
ఫాల్గుణ బహుళ పంచమి, బుధవారం.
30.3.05

వెల : రూ. 160.00

ప్రతులకు :
పి. సీతారాముడు,
ఇంద్ర సర్వీసెస్,
7-7-4/1, కుముదవల్లి రోడ్,
రైల్వే గేటు దగ్గర,
భీమవరం - 534 203
ఫోన్ నెం. : 08816 - 309719

పబ్లిషర్స్ :
విశ్వకర్మ పబ్లికేషన్స్, భీమవరం

ప్రింటర్స్ :
సాయి ఆఫ్‌సెట్ ప్రింటర్స్, భీమవరం

# భగవద్గీత ఉపన్యాసాలు - 4

## (25 నుండి 32 వ ఉపన్యాసం వరకు)

mission RK
SSS-Hyderabad.
Phone: 23834474

## విషయ సూచిక

| | | |
|---|---|---|
| 1. | భగవద్గీత ఉపన్యాసం - 25 | 384 |
| 2. | భగవద్గీత ఉపన్యాసం - 26 | 400 |
| 3. | భగవద్గీత ఉపన్యాసం - 27 | 416 |
| 4. | భగవద్గీత ఉపన్యాసం - 28 | 430 |
| 5. | భగవద్గీత ఉపన్యాసం - 29 | 446 |
| 6. | భగవద్గీత ఉపన్యాసం - 30 | 461 |
| 7. | భగవద్గీత ఉపన్యాసం - 31 | 476 |
| 8. | భగవద్గీత ఉపన్యాసం - 32 | 493 |

# భగవద్గీత ఉపన్యాసాలు - 25

## జ్ఞానయోగము

1998, నవంబరు 16 వ తారీఖున సుకృతవిల్లా, గుంటూరులో మాస్టరుగారు భగవద్గీతపై ఇచ్చిన ఉపన్యాసము



- గురువు మీ మనస్సే
- మూడు రకాల సాధకులు
- భగవంతుడ్ని వినాలి, శృతి
- ముక్కు, కన్నుల ద్వారా మానేసి, చెవుల ద్వారా జీవించాలి
- రాగము వల్లనే భయము, క్రోధము వస్తాయి
- భౌతిక జగత్తులో సిద్ధి త్వరగా లభిస్తుంది
- 24 నిమిషాల్లో ముక్తస్థితిని రుచి చూడవచ్చు
- ఎరుపు - ఆరంజ్ - ఎల్లో - గ్రీన్
- రంగుల ద్వారా ప్రారబ్ధకర్మను మార్చుకోవచ్చు
- కలర్ థెరపి - కలర్ హాస్పిటల్స్

సాధనాత్మకమైన భగవద్గీత జీవితవిధానంలో మనం గురువు యొక్క పాత్రని అసలు మర్చిపోకూడదు. గురువు లేనిదే ఏ విద్య అయినా సిద్ధించదు అని.

కానీ మన భారతదేశంలో గురువు అనే పదాన్ని పూర్తిగా మనం గందరగోళం పడిపోయి ఒక భౌతికశరీరధారి అయిన వ్యక్తి ఏమి చెప్తే అది కరెక్ట్, ఇంక అతను నోటితో ఉచ్చరించిన మాటను తప్ప మిగతావేవీ పట్టించుకోకూడదు, వినకూడదు, మిగతా గురువుల దగ్గరకి వెళ్ళకూడదు అనేది వచ్చేసింది. దురదృష్టం అది.

జ్ఞానయోగంలో ఆ అవగాహనా లోపాన్ని అర్థం చేసుకోవాలి. మామూలు ఒక జీవితంలో కొంత మనకి పనికొచ్చే చదువు చదువుకోవటానికి ఎంతమంది గురువులు కావలసి వచ్చిందో ఆలోచించుకోండి. ఎలిమెంటరీ స్కూల్లో చెప్పిన గురువులు, హైస్కూలు, కాలేజీలో చెప్పిన గురువులు, ఇదంతా కాకుండా జీవితంలో స్నేహితుల రూపంలో, తల్లి తండ్రుల రూపంలో, చుట్టుప్రక్కల ఉన్న వాళ్ళ రూపంలో, రకరకాలైనటువంటి సలహాలు మనం అడుగుతూవుంటాం.

ఏదైనా ఒక పని మొదలెట్టాలన్నా, ఇల్లు కట్టుకోవాలన్నా, పెళ్ళిళ్ళు చేయాలన్నా మనంతట మనం నిర్ణయించుకోం, స్నేహితులదీ వాళ్ళదీ సలహాలు అడుగుతాం.

సలహా అంటే గురువేకదా!

ఒక గురువు ఉండడు.

అనేక మంది శరీరధారులు గురువుగా వర్తిస్తారు.

కానీ భౌతిక శరీరధారి యొక్క గురుత్వాన్ని గురించి ఆధ్యాత్మిక జగత్తు మాట్లాడటం లేదు. అది మీరు చాలా జాగ్రత్తగా గమనించుకోవాలి.

మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః

- మీ మనస్సు ఒప్పుకోకపోతే గురువు మాట మీరు వినరు. మూడు గంటలు సేపు గాయత్రీ మంత్రజపం చేసేయాలి అని కూర్చున్నాం మనం. మీ మనస్సు లొంగక పోతే కూర్చోండి చూస్తాను!

"నేను కూర్చోలేనండి మూడు గంటలు సేపు!"

మరి సినిమాహాల్లో ఎలా కూర్చుంటున్నారండి మూడు గంటల సేపు?

"మాకు స్థిరం కుదరటం లేదండి, మాకు వీలు కుదరటం లేదండి, మా శరీరం వినటం లేదండి."

టీవీ ముందు ఎలా కూర్చుంటున్నారు గంటలు, గంటలు? క్రికెట్ మ్యాచ్ వస్తూవుంటే, మిగతా వాళ్ళ సంగతి నాకు తెలియదుకాని, నా సంగతి నాకు తెలుసు. ఆ రోజు టిఫిను ఉండదు, ఫుడ్ కరెక్ట్‌గా తినం. తింటే ఏమో, ఒక బాల్ మిస్సయిపోతే ఏమయిపోతానో! కానీ ఆ స్థిరత్వం ఎక్కడ్నుంచి వచ్చేసింది నాకే?

- అంచేత గురువు మీ మనస్సే.

చాలా జాగ్రత్తగా అది అర్థం చేసుకోండి. అది అర్థం కానంత వరకు భగవద్గీత యొక్క జ్ఞానయోగం మనకి అర్థం కాదు. మీరు ప్రకృతిని ఎలా అర్థం చేసుకుంటున్నారు అన్నది చాలా ముఖ్యం.

- సమాజంలో రెండు రకాలైన మనుష్యులు ఉంటారు. ఒకడు ఆశాజీవి. ఇంకొకడు నిరాశాజీవి.

వాళ్ళని ఎలా గుర్తించాలి అనే దానికి సైకాలజిస్టులు ఒక ఉదాహరణ ఇస్తూవుంటారు. సగం నిండిన గ్లాసు వాడి ముందు పెట్టి, ఇందులో ఎలా ఉంది అంటే,

సగం ఖాళీగా ఉంది అన్నవాడు "నిరాశాజీవి".
సగం నిండి ఉన్నది అన్నవాడు "ఆశాజీవి".

- జరిగింది ఒకటే, సంఘటన అదే. ఖాళీతనం వాడికి కనిపిస్తోంది, నిండినతనం వీడికి కనిపిస్తోంది.

- ఆ ఆశావహ మానసికస్థితి కనుక మనం తెచ్చుకుంటే, అదే నిజమైనటువంటి గురువు.

-- అంచేత గురువుని వ్యక్తులలో వెతుక్కోకండి. మీ మనస్సుని మౌల్డ్ చేసుకోండి.

- మన శరీరములో శిరస్సులో ఉన్న జ్ఞానేంద్రియాలను గురువులు అని పిలుస్తారు. వీటి యొక్క దివ్యత్వాన్ని మనం అర్థం చేసుకోవాలి.

మూడు రకాలైన మనుష్యులు సాధారణంగా ఉంటారు. అలాగే సత్వ, రజస్తమో గుణాలు అని మూడు రకాలైనటువంటి గుణాలు చెప్తూవుంటాం.

- అలాగే ఆధ్యాత్మిక జగత్తులో, సాధనా జగత్తులో 3 రకాలైనటువంటి సాధకులు ఉంటారు.

① ఒకళ్ళు మామూలుగా మానవులుగా ఏది ఎలా జరుగుతుందో అలా జీవిస్తూ, విశేషమైనటువంటి ప్రయత్నం ఏమీ వాళ్ళు చెయ్యరు వాళ్ళు.

-- అలాంటి వాళ్ళని ముక్కు ద్వారా జీవిస్తోన్నటువంటి సాధకులు అంటారు. అక్కడ గురువు ముక్కు.

- ముక్కు అంటే వాసనలు.
వాసనలు అంటే మన శరీరంలో ఉన్న వాసనలు.

-- ఇది వరకటి జీవితం యొక్క వాసనలు వల్లే ఈ మానవ శరీరం మనకి వస్తోంది.

వాసనలు మారిపోతే
మానవ జీవితం మారిపోతుంది.

ఇవంతా కూడా పృథ్వీతత్వం వల్ల వస్తూవుంటాయి.

② ఇది కాకుండా కొంత మంది సాధకులు ఉంటారు. వీళ్ళ జీవితాలు మామూలు వ్యక్తులులాగ వాసనా మయమైనటువంటి జీవితాలు కాదు.

**వాసనామయమ్మైనటువంటి జీవితాలు అంటే ఏమిటి?**

ఆకలేసింది, తినాలనిపిస్తుంది, తింటాడు. వాడంతట వాడు ఏమీ నిర్ణయించుకోడు. వాడి శరీరం వాడిని ఎటు త్రిప్పితే అటు వెళతాడు.

- మనమందరం ఆ స్థితిలో ఉన్నవాళ్ళమే.
మన కోరికలు, మన వాసనలు మనల్ని ఎటు వైపు త్రిప్పితే అటు వెళుతున్నాం.

మనం మంచి చేస్తున్నాం, మంచి చెయ్యాలని ఉంది, అలాంటి అపోహ మనకి వద్దు. ఎంచేతంటే, కాస్త చిన్న అవాంతరం వస్తే చాలు ఆ పని అవుట్.

నేను మా స్నేహితులతో చాలా సార్లు చెప్తూవుం టాను, రెండు వర్షపు చినుకులు పడితే సాధన అవుట్. రెండు నీళ్ళ చుక్కలు పడితే రావటానికి ఇబ్బంది. ఎందు కంటే, "మాస్టారూ, వర్షం కురిసింది-కదా!"

☹ మీ సాధన భంగం చేయటానికి పెద్ద పెద్ద అప్సరసలు వాళ్ళూ ఏం రావక్కర్లేదు. ఒక రెండు నీటి చుక్కలు పడితే చాలు. కాస్త గాలి గట్టిగా వీస్తే చాలు. కాస్త తుమ్ములొస్తే చాలు, సాధన అవుట్.

వాసనామయ జీవితం అనేది అందుకు.

-- మనం ఇంట్రస్ట్ వల్ల చేస్తున్నాం తప్ప, ఈ సాధన మంచిదని కాదు. అదొక రకమైనటువంటి హేబిట్. రాగము. ఆ మానసికస్థితిని అర్థం చేసుకోండి.

మనం చేసే పూజలుకాని, మనం చేసేటటువంటి మిగతా పనులు కాని ఆనందం కోసము, ఇష్టపడి చేస్తాం. బాధ్యతగా చేయం. లక్ష్యశుద్ధి కొరకు చేయము.

② లక్ష్యశుద్ధి కొరకు ఎప్పుడైతే మనం చేయటం మొదలెడ తామో, కళ్ళను ఉపయోగించుకోవటం మొదలెడతాం.

-- మనం ఎక్కడికి వెళుతున్నాం, ఈ పని నేను చేయటం వల్ల ఎటు వైపు వెళుతున్నాను అనేది సాధకుడు గమ నిస్తూవుంటాడు. దృష్టి!

అందుకనే మన ఆధ్యాత్మికతను అంతటినీ దర్శనము అంటాం. ఈ పని నన్ను ఎక్కడికి తీసుకెళుతుంది అనేది సాధకుడు దర్శించటం మొదలెడతాడు.

ఇప్పుడు చదవం, అంతా బాగానే ఉంది. పరీక్షలు లేవు. ఏమీ లేవు, క్లాసులు ఎగ్గొట్టేసి సినిమాకి వెళ్ళిపోతాడు. బాగానే ఉంది. ఆ రోజు క్లాసుకి వెళ్ళకపోవటం వల్ల వచ్చే ఇబ్బంది పరీక్ష రోజుల్లో అప్పుడు తెలుస్తుంది.

కళ్ళని ఉపయోగించుకుంటే, అది వాడు దర్శనం చేసుకుని, చేసేటటువంటి బాధ్యతలకి ప్రాముఖ్యత ఇచ్చి మిగతా వాటికి ప్రాముఖ్యత ఇవ్వడు. కళ్ళు.

③ ఇవి రెండూ కాకుండా మూడవ రకమైన స్థితి ఉంది. దివ్యత్వము వైపు తీసుకువెళ్ళే స్థితి. చెవులు.

అందుకే పోతన తన భాగవతంలో ఒక చోట వ్రాస్తాడు, ఇందుగలడు అందులేడు సందేహము వలదు, అన్ని చోట్లా ఉన్నాడు. దానవాగ్రణీ, వింటే.

చూస్తే కాదు, వింటే.

భగవంతుడ్ని వినాలి. శృతి.

ఇప్పుడు మనం వింటున్నాం అంతే. భగవంతుడి గురించి మనం వినటానికి ప్రయత్నం చేస్తున్నాం. చెవులు ద్వారా వెళుతోందది.

కానీ చెవులు ద్వారా వెళ్ళినటువంటి జ్ఞానాన్ని ఆచరణలో పెట్టగలిగితే, దర్శించగలిగితే, అంటే చెవుల ద్వారా విన్నటువంటి ఆధ్యాత్మికతను కనుక మనం మన జీవితాలలో పెట్టగలిగితే, భగవద్గీత యొక్క, నిన్న మనం చదువుకుంటూ ఆపేసిన శ్లోకంలోకి ప్రవేశిస్తాం.

అంచేత మూడు మార్గాలు.

నాసికా మార్గము, వాసనలు. దుర్వాసన వేస్తోంది, ఇంక అక్కడ కూర్చోలేం, పారిపోతాం. లేకపోతే ముక్కు మూసేసుకుంటాం. అంటే ఏంటక్కడ? మీరేం చేయటం లేదు. ప్రకృతి మిమ్మల్ని ఎటు తోస్తోందో, అటు వెళుతున్నారు.

***కానీ మీరేం అనుకుంటున్నారు?***

"మేం చేస్తున్నాము." అదీ మనం చేసే తప్పు. మీరేం చేయటం లేదు. ప్రకృతి మిమ్మల్ని తీసుకెళుతోంది.

అక్కడ్నుంచి రెండవ స్థితికి వెళ్ళారు. ప్రకృతి నన్ను ఈ పరిస్థితుల్లో ఉంచింది. ఎందుకు ఉంచింది ప్రకృతి?

శ్రీ దయచేసి మీరు పరిస్థితుల్ని నిర్మించుకొనకండి. మనం చేసేటటువంటి చాలా పెద్ద తప్పు అది.

ఈ పరిస్థితి మారాలి అనుకుంటాం. పరిస్థితుల్ని మారిస్తే ఎంత సేపు మారుతుంది? మీ శక్తి ఉన్నంత వరకు మారుస్తారు. మన శక్తి ఎంత పనిచేస్తుంది ప్రకృతి ముందు?

అంచేత రెండవది దర్శనం. ఇప్పుడు ఉన్నటువంటి పరిస్థితి ఎక్కడికి మనల్ని తీసుకెళుతోంది? అనేది దర్శించ టం మొదలెడతాం.

ప్రకృతి ఏ పరిస్థితుల్ని వేస్ట్ కానివ్వదు.

-- నేచర్ ఎబోర్స్ వేక్యూమ్.
అయిష్టత కాదనలు. ఇంక అది విసుగు దానికి, వేక్యూమ్ ఉండకూడదు, శూన్యత ఉండకూడదు.

కానీ మన జీవితాలలో ఎంత శూన్యత ఉందో చూసు కోండి. ఎంత లక్ష్యరహితమైనటువంటి బ్రతుకులు మనం చిన్నప్పటి నుంచి, ఎన్ని వేల జన్మలు నుంచి మనం ఇప్పటి వరకు బ్రతుకుతున్నామో!

ప్రకృతి పరిణామక్రమంలో ఈ శరీరాల్ని ఇచ్చింది. మనం తయారు చేసుకోలేదు. ఈ శరీరం ఇలా ఏర్పడు తోంది అని మనకి అసలు అవగాహన కూడా లేదు. తల్లి గర్భంలో జరుగుతోన్నటువంటి ఆ శరీర నిర్మాణ ప్రక్రియ ఎంత మందికి తెలుసు? పూర్వకాలంలో అయితే ఆ 9 నెలలు చాలా బాగా వాడుకునేవారు.

తల్లి గర్భంలోని ఆ శిశువు యొక్క పెరుగుదలని కనుక మనం కరెక్ట్‌గా అవగాహన చేసుకోగలిగితే, ఆఖరికి మహాభారత యుద్ధంలో జరగబోయే ఆ చక్రవ్యూహాన్ని ఎలా భేదించాలో చెప్పగలిగాడు. అభిమన్యుడు అప్పుడు నేర్చుకున్నదే, మళ్ళా ఎప్పుడూ నేర్చుకోలేదతను.

మరి మనం ఏం చేయగలుగుతున్నాం?
ఎంత గ్రుడ్డిగా బ్రతుకుతున్నాం?

ఒక విశాలమైనటువంటి దేహానికి, ఒక అద్భుత మైనటువంటి జీవానికి, ఒక ఆత్మకి జన్మనిస్తోన్నటువంటి వాతావరణాన్ని ఎలా ఉంచాలి? ఎంత శ్రద్ధగా ఉంచాలి? మన జీవితాలు ఎలా ఉన్నాయి? అందుకని చెప్తున్నాను.

నాసిక ద్వారా బ్రతకటమే తప్పు, వాసనలు ద్వారా బ్రతకటమే తప్పు, అలవాట్లు ద్వారా బ్రతకటమే తప్పు,

సుఖంగా ఏది ఉంటే అది చేస్తాం. అది మంచిదా, చెడ్డదా అనేది ఆలోచించం. ఇది నాసిక ద్వారా బ్రతకటం. ఈ బ్రతుకు మామూలు బ్రతుకు.

☹ లక్ష్యం! ఇంజనీర్‌ని అవ్వాలి, డాక్టర్ని అవ్వాలి, ఇది చాలా పెద్ద లక్ష్యం అనుకుంటారు.

ఎందుకూ పనికిరాని లక్ష్యాలవి.

ఒక్క ఇంజనీర్ని, ఒక్క డాక్టర్ని మనం గుర్తుంచు కోం. కానీ ఒక జిల్లెల్లమూడి అమ్మని గుర్తుంచుకుంటాం. ఆవిడ గురించి చెప్తాం. ఏముంది ఆవిడలో? మరి మన గురించి ఎవడూ ఎందుకు చెప్పుకోవటం లేదని? ఆవిడ ఏం చదువుకుంది? ఏమీ చదువుకోలేదు.

తణుకు దగ్గర ఉన్న చివటం అమ్మ, ఆవిడ గురించి మనం ఇక్కడ కూర్చుని చెప్పుకుంటున్నాం. మరి మిగతా ఇంత మంది ఇంజనీర్లు, ఇంత మంది డాక్టర్లు, ఇంత మంది మంత్రులు, వీళ్ళ గురించి మనం ఏం మాట్లాడుకుం టున్నాం? లక్ష్యరహితమైన బ్రతుకులు బ్రతుకుతున్నాం.

ఈ శరీరము దేని కొరకు అయితే ఇవ్వబడిందో, దాని గురించి తప్ప మిగతావన్నీ చేస్తున్నాం మనం. చాలా బాధ్యతగా చేస్తున్నాం అనుకుంటున్నాం.

సామాజికమైనటువంటి బాధ్యత మాత్రమే మనం నిర్వహిస్తున్నాం. మానవ శరీరధారులు యొక్క బాధ్యత మనం నిర్వర్తించటం లేదు.

కూతురికి పెళ్ళిచెయ్యాలి, కొడుక్కి చదువు చెప్పించాలి, వాళ్ళు సుఖంగా ఉండాలి. ఇది సామాజికమైన బాధ్యత. ప్రకృతి ఇదేం చెప్పలేదు మీకు. ప్రకృతిలో ఇవేం లేవు. ఇవి సమాజం ఏర్పరచుకున్నటువంటివి.

భారతదేశం ఇంత అని ఎవడు ఏర్పరచుకున్నాడు? మనిషి ఏర్పరచుకున్నాడు. ఇది పాకిస్తాను, ఇది బంగ్లాదేశ్ అన్నాడు. అదే భూభాగం.

మనం ఏర్పరచుకున్నదాన్ని చాలా పెద్ద బాధ్యతలు మనం నిర్వహించేస్తున్నాం అనుకోవటం మన మూర్ఖత్వం.

ఇది కాకుండా ఎప్పుడైతే దీన్ని కళ్ళ ద్వారా, అంటే దర్శనం, చూపు, అవగాహన, దృష్టికోణం ఎప్పుడైతే మనకి అర్థమవటం మొదలెడుతుందో, భౌతిక జగత్తులో ఉన్న ఎంత పెద్ద అవధులైనా, ఎంత అద్భుతమైనటువంటి స్థాయిల్ని అయినా మనం పట్టించుకోం. అనవసరం అది.

***ఎంత వరకు మనకి అవసరం?***

ఆకలి లేకుండా, చలి వేస్తూవుంటే చలివేయకుండా మామూలు అవసరాలు తీరే వరకు ఉంటే చాలు. అంత కంటే ఎక్కువ ఆశించడు.

**ఇంక అక్కడ్నుంచి ఎక్కడికి వెళ్ళాలి?**

"వింటే!" చెవుల్లోకి వెళ్ళాలి.

ఆకాశతత్వంలోకి వెళ్ళాలి. ఆ ఆకాశతత్వంలో శృతి, స్మృతి, పురాణాలు ఉన్నాయి. పుస్తకాల్లో లేవవి.

"పురాణాలు మేం చదవలేం మాస్టారు! మాకు సంస్కృతం రాదు మాస్టారు!" అని చాలా రకరకాలైనటు వంటి గందరగోళాలు పడిపోతూవుంటారు మనుష్యులు. అసలు అవి పుస్తకాల్లో ఏం లేవు.

ప్రకృతిలో ఉన్నది పుస్తకాల్లో వ్రాశారు.

కరెంట్ ఎక్కడుంది? ప్రకృతిలో ఉంది. కరెంట్ మీద పుస్తకం మీరు చదివినా, చదవకపోయినా, మీకు తెలిసినా, తెలియకపోయినా, దాని గురించి అవగాహన ఉన్నా లేకపోయినా, ఇదిగో ఫలానా చోట ఏదో స్విచ్ ఉంటుందిట అని వింటే, దాన్ని ఉపయోగించుకుంటే కరెంట్ పనిచేస్తుంది మీకు. తెలియాల్సిన పనేం లేదు.

**జన్మ కర్మ చ మే దివ్యమేవం యో వేత్తి తత్త్వతః**
**త్యక్త్వా దేహం పునర్జన్మ నైతి మామేతి సోఽర్జున. (4-9)**

అర్జునా! ఎవడీప్రకారముగ నాయొక్క దివ్యమైన జన్మమును, కర్మమును గూర్చి యథార్థముగ తెలిసికొనుచున్నాడో, అట్టివాడు మరణానంతరము మఱల జన్మమునొందక నన్నే పొందుచున్నాడు (మోక్షమును బడయుచున్నాడు).

ఈ ప్రిన్సిపుల్ అర్థమవ్వాలి మనకి. ఏమిటది? మీరు పుస్తకాలు ఏమీ చదవక్కరలేదు. ప్రకృతిని చదవండి..

ఇన్‌క్యూరబుల్ డిసీజెస్ అనేక మంది యోగులు నయం చేసిన దాఖలాలు మనకి అందరికీ ఉన్నాయి. అందరి రోగాలూ అందరూ నయం చేయగలుగుతున్నారా? దాని గురించి మనం మాట్లాడుకోవక్కరలేదు.

**మనకి అవగాహన ఉన్నది ఏమిటి అంటే,**

ఈ యోగశక్తి, అంటే చెవుల ద్వారా శృతి, స్మృతి, పురాణాలను అర్థం చేసుకున్నటువంటి వ్యక్తి కచ్చితంగా పరిస్థితులు మీద ఆధిపత్యం వహిస్తాడు అన్నది అనేక మంది యోగుల జీవిత చరిత్రలో, అనేక మంది సాధకుల యొక్క జీవిత చరిత్రలో మనకి తెలుస్తూనే ఉంది.

అయినప్పటికీ కూడా భౌతికమైనటువంటి కోరికల వలలో చిక్కుకుని అదే కావాలి అనుకునే జాఢ్యాన్ని వదిలించుకుంటే తప్ప ఈ జ్ఞానయోగం యొక్క అవగాహన రాదు. అందుకు ఇది ఈ జ్ఞానయోగంలో నొక్కి నొక్కి చెప్పేది. ఇప్పుడు మనం చదువుకుంటోన్నటువంటి అధ్యాయము మనకి పూర్తిగా అవగాహనకి వచ్చేస్తే, ఇంక అవగాహన వచ్చినట్టే. ఇంక ఎక్కడా మనకి తప్పటడుగులు పడవు.

**ఎటొచ్చి ఎక్కడ మళ్ళా గందరగోళం పడతాం?**

మళ్ళా సమాజం ఏదో అంటుంది. గాబరాపడిపోతాం. ప్రహ్లాదుడు ఉన్నాడు, తండ్రి మాట జవదాట కూడదు అని ఒక్క మాట శాస్త్రంలో చెప్పింది పట్టేసుకుని ఉంటే ఎంత సుఖంగా ఉండేవాడో! కానీ ఈనాడు అతను గురించి మనం చెప్పుకునేవాళ్ళం కాదు. అనేక మందిలో ఒకడు అయ్యుండేవాడు.

అతను వినలేదు. నువ్వు విను నాయనా అన్నాడు. నేను ఆకాశతత్వంలో, ప్రకృతిలో ఉన్నది నేను విన్నాను. అదే కరెక్ట్. ఇంక నువ్వు ఏం చెప్పినా నేను వినను అన్నాడు. ఆ కరెక్ట్ అయిన అవగాహనని పట్టుకోవటానికి కావలసినది, మన శరీరంలో ఉన్నది, జన్మ కర్మ చ మే దివ్యం.

శ్రీకృష్ణుడు యొక్క శరీరమే దివ్యమైనటువంటి శరీరం కాదు. మీ శరీరాలు, మన శరీరాలు, ప్రతీ ప్రాణి యొక్క శరీరము కూడా దివ్యత్వాన్ని ఆపాదించుకున్నదే.

జ్ఞానేశ్వర్‌ని వేదాలు చదవటానికి నీకు అర్హత లేదు అని వెలివేశారు. ఎంచేతంటే, సన్యాసికి పుట్టాడు కనుక. సన్యాసం తీసుకున్నవాడికి మళ్ళా పిల్లలు పుట్టకూడదు అని అదేదో ఉందిట, కానీ ప్రకృతి వింటుందా ఏమిటి, వీడు సన్యాసి కనుక పిల్లలు పుట్టకూడదు అని. ప్రకృతి ప్రకృతే.

వెలివేసి నువ్వు వేదాధ్యయనం చేయటానికి వీల్లేదు అన్నారు. అక్కడ్నుంచి ఒక గేదె వెళుతోంది. తెలుసుకదా మనకి, గేదె ద్వారా వేదాలు పలికించాడు. నా ఉద్దేశ్యం, బైఛాన్స్ అక్కడ గేదె వెళ్ళింది. దాని చేత పలికించాడు. గాడిద వెళుతూవుంటే గాడిద చేత వేదాలు పలికించేవాడు.

- ప్రతీ ప్రాణికీ ఆ హక్కు ఉంది.
- -- కానీ మీరు దాన్ని పలకటానికి ఇష్టపడుతున్నారా? మీకు అసలు ఆ కోరిక ఉందా అని?
- -- ఆ కోరిక తీవ్రతని బట్టి మీకు ఫలితాలు ఉంటాయి.

జన్మకర్మచ మే దివ్యం, నా జీవితము కూడా దివ్య మైనదే, ఈచ్ సోల్ ఈజ్ పొటెన్షియల్లీ డివైన్. ప్రతీ ప్రాణీ బీజాత్మకంగా భగవత్స్వరూపుడే. అందులో డౌట్ లేదు. ప్రతీ ప్రాణీ, మనిషే కాదు. అనేక జంతు స్వరూపాల్లో కూడా మనం దేవత్వాన్ని చూస్తాం. హయగ్రీవుడు, హనుమంతుడు.

అంచేత ఆ దివ్యత్వానికి ప్రతీ మానవ శరీరధారి అర్హుడే. జన్మ కర్మ చ మే దివ్యం, ఇదీ మనం అర్థం చేసు కున్నది. కృష్ణుడు యొక్క జన్మ దివ్యం. అది తెలియనిది ఎవడికి? అందరూ ఒప్పుకున్నారు. దాని గురించి చెప్పు కుంటే కృష్ణుడు ఒక్కడికీ గొప్ప, మనకి ఏంటిట గొప్ప?

మనకి ఎక్కడ గొప్ప, ఎక్కడ ఇంపార్టెంట్ అంటే, ఆ జగద్గురువు డైరెక్ట్‌గా చెప్పేది ఏమిటంటే, నేను చేసిందే నువ్వూ చేయగలవు.

- మరి అది చేయగలగటానికి నువ్వు చేయాల్సిన పని ఏమిటంటే, నీ దృష్టికోణం మార్చుకో.
- -- ముక్కు, కన్నుల ద్వారా జీవించటం మానేసి, చెవుల ద్వారా జీవించటం మొదలెట్టు.

ఎందుకు చెవుల ద్వారా జీవించటం ఇంపార్టెంటు? ఏమిటి అక్కడ ఉన్న సింబాలిజము?

- కారు చీకటిలో మీకు ఏమీ కనిపించకపోయినా డైరెక్షన్ ఎటుందో మీకు తెలియకపోయినా, శబ్దాన్ని విని మీరు వెళ్ళొచ్చు.

శబ్దము కారు చీకటిలో కూడా మీకు గైడెన్స్ ఇస్తుంది. అదిగో ఇటు ఇటు అని మెల్లిమెల్లిగా ఆ చీకట్లోనే తడుముకుంటూనే వెళ్ళిపోతాం. కనిపించాల్సిన పనిలేదు.

- అజ్ఞానాంధకారంలో ఉన్న మనకి ఆ ఆకాశంలో ఉన్న శూన్యత మాత్రమే గోచరిస్తోంది. ఈ ఆకాశంలో ఉన్నటువంటి దివ్యత్వం మనకి అర్థం కావటం లేదు.
- -- ఈ ఆకాశమే. ఎక్కడో ఉన్నటువంటి ఆకాశం కోసం వెళ్ళకండి. మనం ఎక్కడ కూర్చున్నామో, ఈ ఆకాశం లోనే దివ్యత్వమూ ఉంది, సాధకత్వమూ ఉంది, మామూలు వాసనామయ జీవితమూ ఉంది.

మీరు ఏ స్టేషనుకి ట్యూన్ అవుతారు? ఈటీవీ ఉంది, జెమినీ టీవీ ఉంది, స్టార్ టీవీ ఉంది, అన్ని ఈ ఆకాశంలోనే ఉన్నాయి. మీరు స్టేషన్ మార్చుకోవాలి. స్టేషన్ మార్చుకోకుండా నాకు ఫలితాలు రావాలి అంటే కుదరదు.

ముక్కుని వదిలేసి, కళ్ళని వదిలేసి, చెవులకి ఎప్పుడు ప్రాముఖ్యత ఇస్తామో, చెవులు అంటే శృతి.

- "శృతి" చెప్పిన, వేదాలు చెప్పినటువంటి ప్రమాణభూత మైన వాక్కులు మీరు "స్మృతి"లోకి ఉంచుకుంటే "పురాణాలు" ఏర్పడతాయి.

అనేక యుగాలుగా, సనాతనంగా ఈ విధమైన సాధనలు చేసిన వాళ్ళందరూ గొప్పవాళ్ళు అయ్యారు. పురాణాలు. పురాణా అంటే ఓల్డ్, ఏన్షియంట్. ఇలా చేసిన వాళ్ళందరూ బాగుపడ్డారు. బాగుపడని వాళ్ళని మీరు ఎవర్నీ చూపించలేరు.

### ఎవర్ని చూపించగలరు?

ఇది చేస్తూ మానేసిన వాళ్ళు పాడైపోయివుండొచ్చు. దానికి ఎవడేం చేస్తాడు? పరీక్షకి చదవకుండా మధ్యలో చదువు మానేసి డిగ్రీ రాలేదంటే ఎవడేం చేస్తాడు?

జన్మ కర్మ చ మే దివ్యమేవం యో వేత్తి తత్త్వతః
త్యక్త్వా దేహం పునర్జన్మనైతి మామేతి సోఽర్జున. (4-9)

ఇది కూడా ఒక గందరగోళం శ్లోకం. పునర్జన్మ మరి ఉండదు అంటున్నాడు. మరి ఆ శ్రీకృష్ణుడే ఏం చెప్పాడు? అనేక జన్మలు నువ్వూ నేనూ కలిసి జీవించాం.

- పునర్జన్మ ఉండదు అంటే, ఈ విధమైనటువంటి పునర్జన్మ ఉండదు. మళ్ళా ముక్కు, చెవుల మీద మనం ఆధారపడం. ఒకసారి ఈ జీవిత విధానాన్ని అర్థం చేసుకున్న సాధకుడు మళ్ళీ మళ్ళీ ఎన్ని జన్మలు ఎత్తినా, అది వాడికి ఇంకొక జన్మ అవదు.

### ఎందుకు ఇంకొక జన్మ అవదు?

కంటిన్యూటీ ఆఫ్ కాన్షస్‌నెస్ ఉంటుంది కనుక. ఇప్పుడు మనం నిద్రపోయి రేప్పొద్దున్న లేస్తున్నాం. దాన్ని పునర్జన్మ అనంకదా! ఎంచేత అనం? ఇవాళ జరిగింది మనకి రేపు గుర్తు ఉంటోంది.

- అలాగే ఈ శరీరంలో జరిగినవి ఇంకొక శరీరంలో గుర్తున్నాయి అనుకోండి, అప్పుడు దాన్ని పునర్జన్మ అనంకదా!

ఆ యోగంలో పునర్జన్మ ఉండదు. మళ్ళా శరీరం రాదు అని కాదు. చాలా జాగ్రత్తగా అర్థం చేసుకుందాం.

ఎంచేతంటే శ్రీకృష్ణుడే చెప్తాడు అనేక సార్లు, మళ్ళా ప్రామిస్ కూడా ఉంది. ఎప్పుడెప్పుడు ఇలాంటి పరిస్థితి వస్తుందో, అప్పుడప్పుడు నేను పుడతాను అని. మరి దేహం వస్తోందిగా! దేహం లేకుండా పుడతాడా?

అంచేత ఆ పదాల వెనకాతల ఉన్న అంతరార్థాన్ని అర్థం చేసుకోండి. ప్రతీ రోజు రాత్రి మనం నిద్రపోతున్నాం, మళ్ళా రెండవ రోజు నిద్ర లేస్తున్నాం. చచ్చిపోయాం అనుకోవటం లేదే! పడుకున్నాం, లేచాం. ఎందుకు గాబరాపడటం లేదు మనం? ఎందుకు భయపడటం లేదు? గ్యారంటీగా రెండవ రోజు మెలకువ వచ్చినప్పుడు ఇక్కడ ఈ రోజు జరిగినవి అన్నీ కూడా మనకి గుర్తు ఉండటమే కాకుండా, ఏయే పనిని ఎక్కడ ఆపామో, అక్కడ్నుంచి మొదలెడతాం.

ఆధ్యాత్మిక జగత్తులో ఆ పని చేయలేకపోతున్నాం మనం. క్రిందటి జన్మల్లో మనం ఎంత వరకు సాధన చేశామో, ఆ సాధన తరవాత నుంచి మనం మొదలెట్టగలగాలి. అప్పుడు ఫాస్ట్‌గా రిజల్ట్స్ వస్తాయి.

మరి దానికి మార్గం ఉందా ?

ఉంది మార్గం. ఆ మార్గం భగవద్గీతలోనే చెప్తాడు.

***కానీ మనకి గొడవ ఎక్కడొస్తోంది,***

మనం అసలు ఆధ్యాత్మిక సాధనను ఒక విద్యగా అభ్యసించటం లేదు. పేరు మాత్రం ఆత్మవిద్య అనే చెప్తున్నాం, ఒక ఎడ్యుకేషన్ అంటున్నాం. కానీ ఏమిటి మన ఆధ్యాత్మికత అంటే, బొట్టు పెట్టేసుకున్నాం, గుడికి వెళ్ళాం, వచ్చేశాం. లేదూ, గాయత్రీ జపం చేయమన్నారు. ప్రొద్దున్న ఒక వెయ్యి, మధ్యాహ్నం ఒక వెయ్యి, సాయంత్రం ఒక వెయ్యి జపం చేసేశాం. భక్తుడ్ని.

ఏం జరిగిందని? అది చేయటం వల్ల ఏ లక్ష్యాన్ని పొందుతున్నాం? ఏ ఉద్దేశ్యం కోసం మనం చేస్తున్నాం?

ఒక డాక్టరు అవ్వాలి అంటే ఐదేళ్ళ పాటు చదవాలి. 5 × 365 రోజులు. అందులో ప్రతీ రోజూ చదవడు. మళ్ళా ఎండాకాలం సెలవలు వస్తూవుంటాయి, స్ట్రయిక్‌లు వస్తూవుంటాయి, నానా గందరగోళాలు వస్తూవుంటాయి. మళ్ళా వీడు కాలేజీ ఎగ్గొట్టేసే రోజులు ఉంటాయి. వీడు కాలేజీకి వెళ్ళిన రోజు లెక్చరర్స్ రాని రోజులు ఉంటాయి. కానీ ఇంత గందరగోళాలు ఉన్నా ఐదేళ్ళల్లో మొత్తము నేర్చుకోవలసిన విద్య వాడు నేర్చేసుకుంటాడు.

***ఎంచేత?***

అవగాహన ఉంది. లక్ష్యము ఉంది.
ఏం నేర్చుకోవాలో చాలా స్పష్టంగా తెలుసు.

***అన్‌ఫార్చునేట్లీ మన దౌర్భాగ్యం ఏమిటంటే,***

ఆత్మవిద్య అంటే జన్మరాహిత్యం. ఇంక మనం పుట్టం. భగవంతుడిలో లీనం అయిపోతాం.

ఇంక సిలబస్ ఏం ఉంటుంది దానికి? లీనం అయిపోవటమేగా! కానీ లీనం అయిపోవటం అంటే ఏమిటి అన్నది మనం మర్చిపోతున్నాం.

***లీనం అయిపోవటం అంటే,***

ఆ సర్వజ్ఞత్వం మీకు రావాలి.
ఆ సర్వవ్యాపకత్వం మీకు రావాలి.
ఆ సర్వ సమర్థత మనకి రావాలి.

ఆత్మవిద్య అంటే అంతే. ఆ భగవంతుడి యొక్క అన్ని లక్షణాలూ మీలో ఉండాలి.

ఇంజనీరింగ్ చదివితే ఇంజనీర్ యొక్క లక్షణాలు మీలో ఎలా ఉంటాయో, కెమిస్ట్రీ చదివితే కెమిస్ట్ యొక్క లక్షణాలు మీలో ఎలా ఉంటాయో, మీరు చేస్తోన్నటువంటి సాధనలు, ఏ సాధనలు అయినా చేసుకోండి. లక్ష్యం ఏమిటి అంటే, జన్మ కర్మ చ మే దివ్యం, దివ్యత్వం వైపుకు వెళ్ళాలి మనం. దాన్ని మనం అర్థం చేసుకుంటూ, ఎలా వెళ్ళాలి?

***వీతరాగభయక్రోధాః మన్మయా మాముపాశ్రితాః***
***బహవో జ్ఞానతపసా పూతా మద్భావమాగతాః.*** (4-10)

అనురాగము, భయము, క్రోధము విడిచినవారును, నాయందేలగ్నమైన చిత్తముగలవారును, నన్నే ఆశ్రయించినవారు నగు అనేకులు ఇట్టి జ్ఞానతపస్సుచే పవిత్రులై నా స్వరూపమును (మోక్షమును) పొందియుండిరి.

ఎగ్జాంపుల్స్ ఇస్తున్నాడు.

ఈ టెక్నికల్ కోర్సెస్‌కి వెళ్ళినప్పుడు చాలా మంది ఆ సిలబస్ చూసి భయపడతారు. "ఏమీ అర్థమవటం లేదు

మాస్టారు!" అంటారు. మొదట్లో అలాగే ఉంటుంది. అప్పుడు ఏం చెప్తాడు ఆ లెక్చరరు, "అందరికీ అలాగే ఉంటుంది. నేను చదివినప్పుడు కూడా అలాగే గాబరా పడ్డాను, కొన్నాళ్ళు నువ్వు ఓపిక పట్టి దాన్ని కంటిన్యూ చేస్తే మెల్లిమెల్లిగా అర్థమవటం మొదలెడుతుంది"

శ్రుతా మద్భావమాగతాః - ఈ విధమైన భావాన్ని ఎవరైతే తయారుచేశారో, వాళ్ళందరూ పవిత్రులు అయిపోయి,

బహవో జ్ఞానతపసా - ఈ జ్ఞానతపస్సు వల్ల బహవో, చాలా మంది అలా అయ్యారు. ఒకళ్ళు ఇద్దరూ కాదు.

"నీకేం కారణజన్ముడివి కనుక అయ్యావు, చెప్తూ వుంటావులే ఇలాగ కబుర్లు, నీ సొమ్మేం పోయింది. చిన్నప్పటి నుంచి నీకు ఆ మాయాశక్తులు అవీ ఉన్నాయి. నాకేం ఉంది, ఒక పాశుపతాస్త్రం కావాలంటే నా నా గందరగోళం పడ్డాను" అని మనస్సులో అర్జునుడు అనుకుని ఉంటాడు. ఆ థాట్ జగద్గురువుకి అర్థమవుతుందికదా!

గాబరాపడకు, బహవో జ్ఞానతపసా, చాలా మంది, టూ మెనీ ప్యూపుల్స్, యాక్చువల్‌గా మనం లెక్కపెట్టలేం. ఎంచేతంటే, మనకి హిస్టరీలో కానీ, పురాణాలలో కానీ చెప్పబడిన ఈ సిద్ధపురుషుల కంటే ఎక్కువ మంది మనకి తెలియని సిద్ధపురుషులు ఉండి ఉంటారు. హిమాలయాల్లో ఎంత మంది ఉన్నారో మనకి తెలియదు కదా! ఒకళ్ళో ఇద్దరో గురువులు కనిపిస్తూవుంటారు, రెండు మూడు ఆశ్రమాలు కనిపిస్తూ ఉంటాయి. మరి మిగతా వాళ్ళు? అచేంత ఈ జ్ఞానతపస్సు వల్ల చాలా మంది ఆ స్థితికి వెళ్ళారు.

- కానీ మూడు పోగొట్టుకోవాలి మీరు. వీతరాగభయక్రోధా రాగము, భయము, క్రోధము. అసలు యాక్చువల్‌గా ఇవంతా కూడా రాగము వల్ల వచ్చేవే.
- రాగము అంటే కోరిక.

ఒక వస్తువు ఇవాళే నేను కొన్నాను. అక్కడ టేబుల్ మీద పెట్టాను. అప్పుడే ఉంటుంది ఆ మోజు అంతా. మళ్ళా నాలుగైదు రోజులు తరవాత ఉండదు. క్రొత్తగా స్కూటరు కొంటారు. ఎంత బాగా తుడుస్తారో! ఇంక వాళ్ళ జీవితం అంతా ఆ స్కూటర్ మీద ఉన్నట్టే ఉంటుంది. ఒక రెండేళ్ళు అయ్యాక చూడాలి ఆ స్కూటరు యొక్క పరిస్థితి పాపం. రాగము! దాని మీద ఆ మోజు, ఆ భావన ఉన్నంత వరకు దాన్ని చాలా జాగ్రత్తగా చూసుకుంటాం.

- రాగము అంటే అర్థమయిందికదా, ఎఫెక్షన్, ప్రేమ. అది ఎప్పుడైతే ఉంటుందో, అది మన దగ్గర నుంచి పోతుందేమో అని భయం వేస్తుంది.

ప్రక్క ఇంట్లో ఏదో అయితే మనకి భయం వేయదు. కానీ మన ఇంట్లో జరుగుతుంది ఏమో అని భయం.

- దానికి ఎవడైనా అడ్డొచ్చాడనుకోండి, క్రోధము.

రాగము, భయము, క్రోధము. ఈ మూడూ వదిలెయ్యాలి.

- కానీ భారతీయ జీవిత విధానంలో జరిగిన పెద్ద తప్పు ఏమిటంటే, ఎప్పుడైతే రాగం వదిలేశామో, ఎప్పుడైతే ప్రేమను వదిలేశామో, ఎప్పుడైతే ఈ మోహాన్ని వదిలేశామో, బాధ్యతల్ని కూడా వదిలేశాం.
- -- బాధ్యతల్ని చాలా జాగ్రత్తగా పట్టించుకోవాలి.

బెనారస్‌లో నేను ఉంటున్నప్పుడు మా ప్రక్క ఇంట్లో ఒక కుటుంబం ఉండేది. చాలా పెద్ద కృష్ణ భక్తుడు. ఆ చుట్టుప్రక్కల వాళ్ళందరికీ కూడా అతను చాలా మంచి భక్తుడిగా ప్రసిద్ధికెక్కాడు. ఒక రోజు నేను వాళ్ళ ఇంటికి వెళ్ళాను. ఆయన బాలకృష్ణుడ్ని ఉయ్యాలలో పడుకోబెట్టి ఊపుతూ ఉన్నాడు. ఈ లోపల వాళ్ళ మనవడు పాకుతూ వచ్చాడు. పూజ డిస్టర్బ్ చేశాడు మనవడు.

ఉయ్యాలలో వేసి కొయ్యబొమ్మను ఊపుతున్నాడు. వాళ్ళ మనవడ్ని ఊపలేకపోతున్నాడు. అవగాహనా లోపం. బాలకృష్ణుడ్ని పూజ చేయటం ఎందుకు అంటే, ప్రతీ వ్యక్తిలోనూ ఆ బాలకృష్ణుడ్ని చూడగలగాలి కనుక.

ఇటువంటిదే రామకృష్ణ పరమహంస జీవిత చరిత్రలో ఒక అద్భుతమైన సంఘటన వస్తుంది. రామలాల గురించి చాలా మంది చదివి ఉంటారు. కానీ ఆ సంఘటన వెనకాతల ఉన్న ప్రాముఖ్యత, రామకృష్ణ పరమహంస యొక్క ఆ గురుత్వము అర్థం కాదు.

రామకృష్ణ పరమహంస దగ్గరకి ఒకడు వచ్చాడు. అతని దగ్గర కొయ్యతో చేసిన బాలరాముడి బొమ్మ ఉండేది. అతను దాన్ని ఎంతగా సిద్ధింప చేసుకున్నాడు అంటే, ఇంక అతనికి రాముడు కనిపించేవాడు అక్కడ. అంచేత ఆయన

భోజనం పెడుతూవుంటే అక్కడ కర్రబొమ్మ ఉండేదికాదు, నిజంగా తినేది. మనుష్యులు కూడా చూసేవారు. అంటే ఆ రాముడ్ని చూడలేకపోయినా, ఈయన నోట్లో పెడుతూ వుంటే ఆ ఆహారం మాయం అవటం గమనించేవారు.

ఆయన దురదృష్టం, అంత పెద్ద భక్తుడు రామకృష్ణ పరమహంస దగ్గరకి ఆ కొయ్య విగ్రహాన్ని తీసుకొచ్చాడు. ఇంక ఈయన ప్రసాదం టైమ్‌కి చూస్తే అక్కడ రాముడు కనిపించేవాడు కాదు. ఎక్కడ ఉన్నాడు రాముడు అంటే, రామకృష్ణ పరమహంస ఒళ్ళో ఉండేవాడు. ఇంక ఈయనకి కోపం. "ఇన్నాళ్ళ బట్టి నేను సాధన చేసి, నీకు తిండి పెడు తూవుంటే, నన్ను వదిలేసి వీడి దగ్గరకి వెళ్ళిపోతావా?"

రామకృష్ణ పరమహంస కూడా ఆ బాలరాముడికి, "వద్దు బాబూ, నువ్వు ఆయన దగ్గరకే వెళ్ళు, ఎందుకు నా దగ్గరకి వస్తావు!" అని చెప్పేవాట్ట. అయినా వదిలి రాడుగా రామకృష్ణ పరమహంసని.

- అసలు సాధనలో అంత ఉచ్చస్థితికి చేరుకున్న వాళ్ళకే గందరగోళం అవుతూవుంటే, మన సాధన ఎంతో ఊహించుకోండి. మనం పెద్ద భక్తులం అనుకుం టాం. సాధన తీవ్రత, తీవ్రత లేనిదే లాభం లేదు.

నేను అక్బరు - బీర్బల్ కథని చాలా సార్లు చెప్తూ వుంటాను. చాలా జాగ్రత్తగా ఆ కథ గుర్తుంచుకోండి. ఆ కథ మన మనస్సులో ఉంటే, ఆ తప్పు ఎప్పుడూ చెయ్యం. అందుకే అది నేను చాలా సార్లు రిపీట్ చేస్తాను.

యమునానదిలో శీతాకాలంలో మెడ లోతు వరకు నిలుచుని ఒక రాత్రి అంతా ఉన్నవాడికి పదివేల దీనార్లు ఇస్తానన్నాట్ట అక్బరు. ఒకడు ఉన్నాడు. సరే రెండో రోజు ప్రొద్దున్న వాడు వచ్చి నిన్న రాత్రల్లా ఉన్నానేను, నాకు పదివేలు ఇవ్వండి అన్నాడు. రాజు ఇష్టం! ఎందుకో మూడ్ బాగో లేదు ఆ రోజు అక్బరుది. ఇవ్వనన్నాడు.

ఎందుకు ఇవ్వట్ట? ఎక్కడో రెండు మైళ్ళ దూరంలో అక్బరు శయనాగారం ఉంది. ఆ దివిటీని చూస్తూ నించు న్నాను అన్నాడు. "నా పడకగదిలో వెలుగుతోన్నటువంటి దివిటీని చూస్తూ నిలుచున్నావు కనుక, అక్కడ్నుంచి నీకు వేడి వచ్చింది. చచ్చినా నీకు డబ్బు ఇవ్వను" అన్నాడు.

సరే, బీర్బల్ దగ్గరకి వెళితే, బీర్బల్ నేను సర్దుతాన్లే అన్నాట్ట. బీర్బల్‌కి ఒక అలవాటు ఉంది. తన వంట తానే వండుకుని తినేవాడు. ఒకసారి అక్బరు వేటకి వెళితే తనూ కూడా వెళ్ళాడు. అక్బరు వేటాడి, అలిసిపోయాక, భోజనాలు అవీ చేసి పడుకుని బీర్బల్‌ని పిలిపిస్తాడు. సాధారణంగా బీర్బలు - అక్బరు కాలక్షేపం చేసేవారు.

ఆ రోజు ఎప్పటికీ బీర్బల్ రాడు. ఎందుకు రాడు వెళ్ళి చూడు అంటే, ఇంకా వంట అవలేదండి బీర్బల్‌ది. అతను వండుకునే పులగానికి ఇంకా వంట అవ్వకపోవటం ఏమిటి? నేను ఇంత పంచభక్ష్య పరమాన్నాలతో చేయించు కుని చేశానుకదా అని వెళ్ళి చూశాడు.

చూస్తే బీర్బలు ఏం చేశాడు? పైన చెట్టు చిటారు కొమ్మకి గిన్నె కట్టాట్ట. అందులో పెసరపప్పు, బియ్యం పోసి, క్రిందన అగ్గిపుల్లలు గిసి దానికి చూపిస్తున్నాడు. ఎన్ని అగ్గి పుల్లలు గీస్తే అది ఉడుకుతుంది?

ఎన్ని రోజులు మీరు ఓం భూర్భువః స్వః అని ఒకసారి అని మళ్ళా ఈ వీతరాగభయక్రోధాలు పెట్టుకుంటే ఆ సాధన పరిపక్వస్థితికి వస్తుందా? రాదు పరిపక్వస్థితికి. మీకు మాత్రం అదొక అసంతృప్తి, "నేను ఇంత పూజలు చేశాను, భగవంతుడు నా మాట వినలేదు!"

- నిరంతర సాధన. అగ్గిపుల్లలు గీసి వెలిగిస్తే లాభం లేదు. ఆ అగ్గిపుల్లలు మహామంటగా మారాలి.
-- ఆ మహామంట, ఆ మహాసాధనలో, ఆ తీవ్రతలో మనకి ఫలితాలు వస్తాయి.

***అంచేత ఆ సాధన యొక్క తీవ్రత ఎప్పుడొస్తుంది?***

ముందు భౌతిక జగత్తు మీద రాగం పోవాలి.

***రాగం పోయిన దానికి గుర్తు ఏమిటి?***

మీకు భయమూ ఉండదు, క్రోధమూ ఉండదు.

భయమూ, క్రోధమూ ఎప్పుడొస్తుంది? రిజల్ట్ వస్తున్నాయి. టెన్షన్!

రెండు రకాలైన వ్యక్తులకి టెన్షన్ రాదు. ఒకడు యోగికి రాదు. ఇంకొకడు అసలు చదవని వాడికీ టెన్షను రాదు. వాడికి ఎలాగూ తెలుసుగా రిజల్ట్ ఏమౌతుందో! మధ్యన ఉన్న వాడికి వస్తుంది. "ఏమో! బొటాబొటీగా

వ్రాశాను. ఓ రెండు మార్కులు ఎక్కువ వేస్తే పాస్ అయిపోతాను, వెయ్యకపోతే ఫెయిలయిపోతాను." అసలు చదవని వాడికి ఖాళీగా ఇచ్చి వచ్చానని తెలుసుగా, వాడికి బాధలేదు.

అంచేత సాధన చెయ్యని వాళ్ళు ఎక్కువ సుఖంగా ఉన్నట్టు కనిపిస్తారు మనకి. అందుకు చెప్తున్నాను ఈ ఉదాహరణ. చాలా మంది అంటారు, "మాస్టారు! వాళ్ళు ఎంతో సుఖంగా ఉన్నారు. మేము సాధనలు చేస్తున్నాం, మేము ఎక్కువ బాధపడిపోతున్నాం!"

రోగం ఉంటే బాధపడక ఏం చేస్తారు?

**మీ దృష్టి ఎక్కడ ఉంది?**

"భౌతిక జగత్తులో నాకేం లాభం అవుతోంది?"

భౌతిక జగత్తులో లాభాలు ఉండవు సాధనలో. ఆ అవగాహన పోగొట్టుకోవాలి.

- ఆధ్యాత్మిక జగత్తులో వచ్చే లాభాల్ని భౌతిక జగత్తులోని లాభాలతో బేరీజు వేసుకోకండి. భౌతిక జగత్తులో మీకు లాభాలు వచ్చాయంటే, మీకు ఆ అర్హత ఉంది కనుక వచ్చాయి అంతే. అర్హత లేకపోతే రావు.

"మరి సాధన చేస్తే కష్టాలు పోతాయి అన్నారు!"

పోతాయి! ఏ విధంగా పోతాయో చెప్పానుకదా, దాని మీద మీకు యావపోతే, అసలా కోరికే లేకపోతే ఇంక అంతా సుఖమే కదా! ఏది ఉన్నా సుఖమే. ఆ మానసికస్థితి.

**రెండవది ఏం చెప్పాను?**

చీకట్లో అడ్డంకులు కనిపించవు, వాటిని త్రొక్కుకుంటూ పడుతూ, లేస్తూ ఉంటాం. ఒక టార్చిలైట్ ఏదో చేతిలో పెట్టుకున్నాం, అడ్డంకులు అక్కడే ఉన్నాయి, కష్టాలు అక్కడే ఉన్నాయి. కానీ మనం ఆ కష్టాల్ని తప్పించుకుని వెళతాం. సాధన చేస్తున్నప్పుడు అది జరుగుతుంది.

**వీతరాగభయక్రోధాః** - రాగము లేకపోతే ఇది జరుగుతుందా, జరగదా అనే భయమూ ఉండదు, తరవాత వీడు ఎవడైనా అడ్డు తగులుతాడు ఏమో అనే కోపమూ రాదు. ఈ రెండూ లేనటువంటి వ్యక్తి,

**మన్మయా మాముపాశ్రితాః** - నన్నే ఉపాసన చేసేవాడు, నన్నే పొందుతాడు.

యే యథా మాం ప్రపద్యన్తే తాంస్తథైవ భజామ్యహమ్
మమ వర్త్మానువర్తన్తే మనుష్యాః పార్థ సర్వశః. (4-11)

ఓ అర్జునా! ఎవరేప్రకారముగ నన్ను సేవింతురో వారి నాప్రకారముగనే నేననుగ్రహింతును. మనుజులు సర్వవిధముల నామార్గమునే అనుసరించుచున్నారు.

భగవంతుడి మీద, సాధనలు మీద నమ్మకం లేదు. ఆధ్యాత్మిక దృష్టికోణముతో వాడు ఏమీ చేయటం లేదు. ఈ శ్లోకంలో ఆ జగద్గురువు ఏం చెప్తున్నాడు? అయినా కూడా వాడు నా మార్గంలోనే నడుస్తున్నాడు.

**ఎంచేతంటే,**

జీవించి ఉన్నాడు. జీవించి ఉండటానికి కారణం ఎవరు? లోపల ఉన్నటువంటి ఆ చైతన్యమే. ఆ చైతన్యం లేకపోతే వాడు జీవించి ఉండలేడు.

అంచేత వాడు సాధనలు, పూజలు చేస్తున్నాడా లేదా? భగవంతుడి మీద నమ్మకం ఉందా, లేదా? వాడిది ఏ మతం? ఇవంతా అక్కర్లేదు. అసలు వాడు జీవించి ఉన్నాడంటేనే అర్థం, వాడు నా మార్గాన్నే అనుసరిస్తున్నాడు.

**ఏ "నా" మార్గాన్ని?**

శ్రీకృష్ణుడి మార్గాన్ని కాదు. లైఫ్, జీవితం ఉంది, లైఫ్ ప్రిన్సిపుల్ ఉంది వాడిలో. లైఫ్ ప్రిన్సిపుల్ ఎక్కడ్నుంచి వచ్చింది వాడిలో? వాడు తెచ్చుకున్నాడా? ప్రకృతి ఇచ్చింది. ప్రకృతి యొక్క అధిపతి, ప్రెసిడెంట్ ఎవడు?

మయాధ్యక్షేణ ప్రకృతిః సూయతే సచరాచరమ్
హేతునానేన కౌన్తేయ జగద్విపరివర్తతే. (9-10)

ఓ అర్జునా! అధ్యక్షుడనై (సాక్షీమాత్రుడనై) యున్న నాచేత ప్రకృతి చరాచర ప్రపంచమునంతను సృజించుచున్నది. ఈ కారణము చేతనే జగత్తు ప్రవర్తించుచున్నది.

నేను ప్రెసిడెంట్‌గా ఉన్నాను. నా సీల్ లేకుండా ప్రకృతి ఏమీ చేయదు.

- అంచేత భగవద్భక్తి, ఆధ్యాత్మిక సాధన లేని, కేవలం నాసిక ద్వారా వాసనామయ జీవితం జీవిస్తోన్న వ్యక్తుల జీవితాలు కూడా నా వల్లనే వచ్చాయి.

నా వల్లనే అంటే కృష్ణుడు వల్ల అని కాదు. కృష్ణ శరీరం వల్ల రాలేదు. ఏ శక్తి అయితే కృష్ణుడిలో ఉన్నదో, ఆ శక్తే మనలో కూడా ఉంది. తేడా ఏమిటి? నాకు అన్ని

జన్మలు గురించి తెలుసు, నీకు ఆ మిగతా జన్మలు గురించి తెలియవు అంటాడు. ఆ తేడా.

*యే యథా మాం ప్రపద్యన్తే తాంస్తథైవ భజామ్యహమ్* – ఎవరు నన్ను ఏ విధంగా అయితే పూజిస్తారో, వారికి ఆ విధమైనటువంటి ఫలితాలను నేనే ఇస్తాను.

ఇక్కడ కొంచెం అవగాహన చేసుకోండి. జ్ఞాన యోగంలో ఇది చెప్పాల్సిన అవసరం ఏం వచ్చింది?

చాలా మంది ఏం చెప్తారు అంటే, భగవద్గీతలో ఉన్న శ్లోకాలు అసంబద్ధంగా ఉంటాయండి అని.

**ఇందాక చదువుకున్న శ్లోకంలో ఏం చెప్పాడు?**

*బహవో జ్ఞానతపసా పూతా మద్భావమాగతాః*, ఈ జ్ఞానయోగాన్ని ఆశ్రయించి, *వీతరాగభయక్రోధాః*, భయము, క్రోధము, రాగము, వీటన్నిటినీ వదిలేసినటువంటి వాడు నన్ను పొందుతున్నాడు. బాగానే ఉందికదా!

**తరవాత శ్లోకంలో ఏం చెప్పాడు?**

ఇవేవీ చెయ్యకుండా అత్యంత స్థూల జగత్తులో, ఆధ్యాత్మికత యొక్క టచ్, వాసన లేని, భౌతిక జీవితము జీవిస్తోన్నవాడు కూడా నా దారినే నడుస్తున్నాడు అని మనకి ఎందుకు చెప్పటం? సాధకుడికి ఎందుకు చెప్పటం?

జ్ఞానము రెండు రకాలుగా పొందవచ్చు.

① ఒకటి, మన అనుభవంతో పొందవచ్చు. అది డైరెక్ట్. కానీ ప్రతీదీ నేను అనుభవించి పొందాలంటే కుదరదు.

② అంచేత రెండవది ఏమిటి? ఇంకొకళ్ళ అనుభవాల నుంచి మనం జ్ఞానం పొందటం.

సైన్స్ డెవలప్‌మెంట్ కూడా, ప్రతీ సైంటిస్టు చేసిన ప్రయోగాలు అన్నీ కూడా నేను చేసి మళ్ళీ అవంతా రిపీట్ చేస్తాను అంటే, సైన్స్ డెవలప్ కాదు.

ఇతరులు చేసిన ప్రయోగాలలో జరిగిన తప్పులను గమనించుకోగలిగితే, ఆ తప్పులు మనం చేయకుండా జీవించగలిగితే, దానికి చెప్పాడు.

*వీతరాగభయక్రోధాః* , ఎలా జీవించాలి? మిగతా వాళ్ళను చూడు. ఆధ్యాత్మిక జగత్తులో జీవించకుండా ఉన్న వాళ్ళు చేసే ప్రతీ పనీ ఈ మూడింట్లో ఏదో ఒకటి అయి ఉంటుంది. రాగంతో అయినా చేస్తారు. భయంతో అయినా చేస్తారు. క్రోధంతో అయినా చేస్తారు. ఇవి నువ్వు చెయ్యకు. దాని కోసం చెప్పాడు ఆ శ్లోకాన్ని.

**కానీ మరి వాళ్ళకి అది తెలుస్తోందా, లేదా?**

లోపల ఉన్న నేను, ఈ అనుభవాల సారాంశాన్ని వాసనామయ దేహంలో వాళ్ళకి అందిస్తూవుంటాను అని చెప్తున్నాడు. కానీ వాళ్ళ గురించి మనకి అనవసరం.

**మనం ఏం చూసుకోవాలి?**

సాధన చేయకుండా, ఈ మార్గంలో లేకుండా చేస్తోన్న వాళ్ళ జీవిత విధానం మనము పాటించకూడదు. ఎలా ఉండాలో ఈ శ్లోకం చెప్తుంది.

*కాంక్షన్తః కర్మణాం సిద్ధిం యజన్త ఇహ దేవతాః*
*క్షిప్రం హి మానుషే లోకే సిద్ధిర్భవతి కర్మజా .* (4-12)

కర్మములయొక్క ఫలప్రాప్తిని అపేక్షించు మానవులు ఈ ప్రపంచమున దేవతల నారాధించుచున్నారు. ఏలయనగా కర్మఫల సిద్ధి ఈ మనుష్యలోకమున శీఘ్రముగ గలుగుచున్నది.

ఇక్కడ చాలామంది నన్ను అనేక డౌట్స్ అడుగుతూ ఉంటారు. నాకూ ఒకప్పుడు ఆ డౌట్స్ వచ్చేవి. కానీ ఇప్పుడు చదివినటువంటి ఈ శ్లోకం ఆ డౌట్స్ పూర్తిగా తీర్చేస్తుంది.

ఆలోచనలకి శక్తి ఉంది అని మనం చెప్పుకుంటూ ఉంటాం. మనం ఏ విధమైన ఆలోచనలు ఆలోచిస్తామో, అలాంటి పరిస్థితులు ఏర్పడతాయి అని చెప్పుకుంటాం.

"మరి మాకు వచ్చే ఆలోచన్లు ఎక్కువగా నెగెటివ్. మంచి ఆలోచనలు రావు. మరి మా పరిస్థితి ఏమిటి?" ఇది సాధకుడికి వచ్చే డౌట్.

"ఆలోచనలకి శక్తి ఉంది అంటారు. యాజ్ యూ థింక్, నువ్వు ఎలా ఆలోచిస్తావో, సో యూ బికమ్, నువ్వు ఆ విధంగానే తయారవుతావు అంటాం. మరి మా ఆలోచనలు అన్నీ సవ్యంగా ఉండవు. ముఖ్యంగా జపం చేసుకుంటోన్నప్పుడు, సాధనలు చేసుకుంటోన్నప్పుడు అంత వరకు రాని పిచ్చి పిచ్చి ఆలోచనలు వస్తూవుంటాయి. అసలు అంత ఘోరంగా నేను ఆలోచించగలనా అనిపిస్తుంది. మరి అలాంటప్పుడు జపం చేసుకోకుండా, ధ్యానం చేసుకోకుండావుంటే ఇంకా మంచిదికదా, కనీసం ఈ పిచ్చి ఆలోచనలు మాకు వచ్చేవి కాదు."

దానికి జవాబు నేను చాలా సార్లు చెప్పాను. దేవతలు కూడా మానవ శరీరం కోరుకునేది ఎందుకంటే,

- మీ మనస్సులో ఉన్న ఆలోచనలు కార్యరూపం దాలిస్తేకాని ఫలితాలు రావు.

ఫలానా వాడ్ని చంపేయాలి అని అనుకున్నంత మాత్రాన నీకు ఉరిశిక్ష పడదు. నువ్వు చంపేస్తే ఉరిశిక్ష పడుతుంది. కోపం రావచ్చు, ఫలానా వాడ్ని చంపేయాలి అనుకున్నంత మాత్రాన ఆ ఆలోచన వల్ల ఏం జరగదు.

- ప్లస్, ఆలోచనలు యొక్క తీవ్రత ఎంతగా ఉన్నా, ఆలోచన అనేది నీటి మీద గీత లాంటిది.

గీతలు గీస్తూ ఉండు నువ్వు, తప్పేం లేదు. కానీ నీటి యొక్క సహజ స్వభావం వల్ల ఏం అవుతుంది ఆ గీతలు? స్థిరంగా ఉండవు. అంచేత ఏం కంగారు లేదు.

మనస్సు నీటి కంటే చాలా సూక్ష్మమైనది.
నీటి మీద గీతలే స్థిరంగా ఉండవు.

**మనస్సు ఏ స్థితిలో ఉంటుంది?**

పృథ్వీతత్వం నుంచి జలతత్వం, దాని తరవాత అగ్ని తత్వం, అగ్నితత్వం తరవాత ఇంకా సూక్ష్మమైనది వాయు తత్వం, వాయుతత్వం కంటే ఇంకా సూక్ష్మమైనది ఆకాశం. ఆకాశతత్వం కంటే సూక్ష్మమైనది మనస్సు.

- ఇంక దాని మీద గీతలు ఏం స్థిరత్వం ఉంటాయి? నువ్వు ఎంత గీసినా ఏం ఫర్వాలేదు, నో ప్రాబ్లమ్. గీసుకుంటూ ఉండండి, చెరిపేస్తూవుండొచ్చు.

**ఇంకొకటి ఏమిటంటే,**

మన ఆలోచనల యొక్క తీవ్రత మామూలుగా ఉంటుంది. ఒక రాజర్షి యొక్క ఆలోచనలు, ఒక విశ్వామిత్రుడి యొక్క ఆలోచనలు చాలా తీవ్రంగా ఉంటాయి కదా! విశ్వామిత్రుడి యొక్క యజ్ఞం భంగం అవుతోంది. రాక్షసులు ఆ యజ్ఞాన్ని జరగనివ్వకుండా చూస్తున్నారు.

నేచురల్‌గా విశ్వామిత్రుడికి కోపం ఎక్కువేకదా, అంచేత గ్యారంటీగా కోపం వచ్చివుంటుంది. కోపం వస్తే రాక్షసులని చంపేయాలనే అనుకుని ఉంటాడుకదా! కానీ రాక్షసులేం చావలేదు. చావాలి అంటే భౌతికంగా నువ్వు ఒక కర్మ చెయ్యాలి.

- భౌతికమైనటువంటి ఆచరణ లేనంత వరకు ఏ ఆలోచన అయినా నిన్ను ప్రమాదంలోకి తీసుకొని వెళ్ళదు. అదీ ఆ శ్లోకం అర్థం.

**కాంక్షన్తః కర్మణాం సిద్ధిం యజన్త ఇహ దేవతాః** – ఈ ఇహ లోకంలో, ఈ భౌతికజగత్తులో కర్మణాం సిద్ధిం, వాళ్ళు చేసినటువంటి పనులు యొక్క సిద్ధిని పొందటానికి మనుష్యులు ఏం చేస్తారు? దేవతల్ని పూజలు చేస్తారు.

**క్షిప్రం హి మానుషే లోకే సిద్ధిర్భవతి** – ఈ మానవలోకంలో సిద్ధి చాలా తొందరగా వస్తుంది. అంత వరకు ఉంటే చాలా బావుండ్ను. దాని తరవాత ఒక మాట పడేశాడు.

**కర్మజా** – పనిచేస్తే.

**ఎందుకు సిద్ధి చాలా తొందరగా వస్తుంది?**

స్థూల సూక్ష్మ కారణ శరీరాలు అని చెప్పుకుంటాం కదా! ఆ డీటైల్స్‌లోకి మనం వెళ్ళకుండా, రాత్రి పడుకున్నాం, ఒక కల చూస్తున్నాం, ఒక 500 సంవత్సరాలు నేను తపస్సు చేశాను అనేటటువంటి కల ఎంత సేపట్లో చూస్తాను? 2 సెకండ్లో, 3 సెకండ్లో, లేకపోతే 2 నిమిషాలో, 3 నిమిషాలో.

- భౌతిక జగత్తులో కాలము చాలా తొందరగా మారుతుంది. సూక్ష్మజగత్తులోకి వెళుతోన్న కొద్దీ కాలము యొక్క అవధి పెరుగుతుంది.

అందుకే కలియుగం 4,32,000 సంవత్సరాలు ఉంటే, ద్వాపరయుగం 8,64,000. రెండు రెట్లు. ద్వాపర యుగం నుంచి త్రేతాయుగానికి వెళితే 12,96,000. కృత యుగానికి వెళితే 17,28,000 సంవత్సరాలు. అలాగ కాలము యొక్క పరిమాణము భౌతిక జగత్తులోకి వచ్చే సరికల్లా చాలా తగ్గిపోతుంది. అంచేత దేవతలకి కూడా భౌతిక శరీరంలోకి వచ్చి సాధనలు చెయ్యాలి అనిపిస్తుంది.

- ఎంచేతంటే, బ్రహ్మ కనుక అక్కడ కళ్ళు మూసుకుని తపస్సు చేస్తూవుంటే, కొన్ని కోట్ల సంవత్సరాలు ఆయన తపస్సు చేస్తేకానీ పనులు జరగవు.
- అదే బ్రహ్మ భౌతికజగత్తులోకి వచ్చి కనుక తపస్సు చేస్తే 4 సంవత్సరాల 8 నెలల 9 రోజులు చాలు అని లాహిరీ మహాశయ క్రియాయోగంలో డైరెక్ట్‌గా చెప్తాడు. సిద్ధిర్భవతి కర్మజా, క్రియాయోగము.

మొత్తము ఆధ్యాత్మిక జగత్తులో మీరు పొంద వలసిన అనుభూతుల్ని, ఏ పరిణామక్రమం గురించి అయితే మనం మాట్లాడుకుంటున్నామో, దానిని 4 సంవత్స రాల 8 నెలల 9 రోజుల కాలంలో పూర్తిచేసేసుకోవచ్చు.

ఋషిత్వాలలో కూడా ఐదు స్థితులు మనం చెప్పు కుంటాం. ఋషి, ఋషి తరవాత మహర్షి, రాజర్షి బ్రహ్మర్షి దేవర్షి. వీళ్ళు అందరూ కూడా భౌతిక జగత్తులోకి వచ్చి సాధన చేస్తే తప్ప ఆ స్థితికి వెళ్ళలేరు.

ఆ స్థితికి మీరు కేవలము ఇవాళ మీరు క్రియా యోగం మొదలెట్టి, తీవ్రంగా సాధన మొదలెడితే కరెక్ట్‌గా 4 సంవత్సరాల 8 నెలల 9 రోజుల కాలంలో మీరు ఈ ఐదు స్థితులు దాటేస్తారు అంటాడు లాహిరీ మహాశయ. క్రియాయోగం యొక్క గొప్పతనం అది.

"కానీ మరి మేము ఎన్నో ఏళ్ళ బట్టీ చేస్తున్నాం, మాకు ఏదీ ఆ ఫలితాలు?"

ఎందుకు రావటం లేదు అనే దాని గురించే నేను చెప్తున్నాను. మనం ఎందుకు చదువుతున్నాం, దేని గురించి చదువుతున్నాం అనేది లేకుండా సాధన చేస్తే, ఫలితాలు మన కళ్ళ ముందే ఉంటాయి, అవి మనకి తెలియదు.

**చాలా సార్లు చెప్పానుకదా,**

ఇక్కడ స్థంబాలు ఉంటాయి, ఎన్ని స్థంబాలు ఉన్నాయో లెక్కపెట్టకుండా వెంటనే చెప్పండి. ఇప్పుడైనా చెప్పలేరు చాలామంది. ఈ ప్రశ్న నేను చాలా సార్లు అడుగు తాను. నాకే గుర్తులేదు. కదా! మరి కళ్ళ ముందే ఉందికదా!

- అలాగే లక్ష్యరహితంగా మీరు చేసే సాధన ఏదైనా ఉన్నా మీకు ఫలితాలు ఇవ్వదు. ఎంచేతంటే, ఫలితాలు అక్కడే కళ్ళ ముందు ఉన్నా, మీకు ఫలితాలు రావు.

అంచేత కాంక్షన్తః కర్మణాం సిద్ధిం, మన కర్మ యొక్క సిద్ధి దేనికి? దేనికి ఈ పని మనం చేస్తున్నాం? దానికి ఏ దేవతా శక్తిని మనం ఉపాసన చెయ్యాలి అనేటటువంటి సాధనాత్మకమైనటువంటి విన్యాసం మనకి తెలియాలి.

లాహిరీ మహాశయ యొక్క పుస్తకంలో, అంటే ఇక్కడ కొంత మందికి ఇక్కడ క్రియాయోగంలో ఇంట్రస్ట్ ఉంది. అందుకని చెప్తున్నాను. పురాణ పురుష శ్యామాచరణ లాహిరి అనే బుక్ కనుక మనం తీసి చదివితే, అందులో ఎంత మంది దేవతా శక్తులు ఆయనకి అనుగ్రహాన్ని ప్రసా దించారో మనకి తెలుస్తూవుంటుంది.

- మనం స్టెప్ వైజ్ వెళితే మనకి కూడా వస్తుందది. ఒకళ్ళకి వచ్చింది, రెండవ వాడికి రాకుండా ఏం పోదు.
- అలాగే సావిత్రిలో కూడా అరవిందోకి వచ్చినటువంటి ఎక్స్‌పీరియెన్సెస్ గ్యారంటీగా మనందరికీ వస్తాయి.

దానికి గ్యారంటీ ఏమిటంటే, మదర్ చెప్పిన మాటలే. "ఆ రోజు రాత్రి నేను ఏది అనుభూతి చెందానో, దేన్ని దర్శించానో, రెండవ రోజు ప్రొద్దున్న అరవిందో వ్రాసిన సావిత్రి చదువుతూవుంటే ఆ దృష్టి అంతా నాకు వచ్చేది."

అవి అనుభూతితో వ్రాసినవి. ఇవంతా ఒక కథల్లాగా, పురాణాల్లాగా వ్రాసినవి కాదు. ఈచ్ లైన్, ఈచ్ లెటర్, ఈ శ్యామాచరణ జీవితంకాని, రామకృష్ణ పరమ హంస, వివేకానంద జీవితంకాని, సత్యసాయి బాబా, శిరిడీ సాయిబాబా జీవితంకాని, మీరు ఆ దృష్టితో చదవండి.

కాంక్షన్తః కర్మణాం సిద్ధిం – ఆ గురువులు ఏ కర్మ, ఏ సిద్ధిని పొందటానికి చేశారో మీరు పట్టుకోవాలి.

అది చేయం మనం.

"సాయిరామ్, సాయిరామ్, సాయిరామ్ అంటే పనులు అయిపోతాయి."

- అవుతాయి. అవవని అనటం లేదు. దాని వెనకాతల మంత్రశాస్త్ర విజ్ఞానం ఉంది.

అది తప్పు అని అనటంలేదు కాని, ఇప్పుడు మనం చదువుతున్న జ్ఞానయోగంలో మనం చేసుకోవలసింది ఏమి టంటే, ఆ గురువులు అందరూ కూడా సిద్ధి పొందారు. శిరిడీ సాయి ఒక స్థితికి వచ్చాడు. సత్యసాయిబాబా ఒక స్థితిలో ఉన్నాడు. సి.వి.వి. ఒక స్థితిలో ఉన్నాడు. బ్లావెట్స్కీ ఒక స్థితిలో ఉంది. రామకృష్ణ పరమహంస ఒక స్థితిలో ఉన్నాడు. అరవిందో ఒక స్థితిలో ఉన్నాడు.

వీళ్ళందరూ ఒకే స్థితిలో ఉన్నారా, వేరు వేరు స్థితుల్లో ఉన్నారా? ముందు అది తెలియాలి మనకి.

ఎలా తెలుస్తుంది?

ఒకడు బియ్యేస్సీ, ఒకడు ఎమ్మెస్సీ చదివాడు, ఒకడు పదో క్లాసు చదివాడు. ఎనిమిదవ క్లాసు చదివిన వాడికి ఈ మాట చెప్పాం. వాడు ఆ పై క్లాసులు ఏమీ చదవలేదు. కానీ ఎవడు ఎక్కువ చదివాడో వాడు చెప్పగలడుకదా! ఎమ్మెస్సీ కంటే బియ్యేస్సీ, బియ్యేస్సీ కంటే ఇంటర్మీడియట్ తక్కువ. ఇంటర్మీడియట్ కంటే టెన్త్ క్లాస్ తక్కువ.

అంచేత ఆ డిగ్రీలు యొక్క ఫలితాల్ని కనుక మనం కొలవగలిగితే, మనకి ఆ అనుభూతులు రాకపోయినా, మనం ఆ చదువులు చదవకపోయినా, వాళ్ళ మధ్య ఉన్నటువంటి తారతమ్యాల్ని మనం అర్థం చేసుకోగలం. దాన్నే ఇవల్యూషనరీ ప్రిన్సిపుల్ అంటాం. పరిణామక్రమం.

కాంక్షన్తః కర్మణాం సిద్ధిం - పనుల యొక్క సిద్ధి పొందటానికి, మనం ఆ స్థితిలో లేం. ఇప్పుడు కర్మణాం సిద్ధిం ఏం లేదు మనకి. మనం దేని వల్ల వెళుతున్నాం? ప్రకృతి ఎటు కొడితే అటు పోతున్నాం. ఇష్టం వచ్చినట్టుగా మనం ఈ సిద్ధి పొందాలి, దీనికి ఇది చెయ్యాలి, దీనికి స్థిరంగా ఈ విధమైన ఫలితాలు పొందాలి అనేది మనకి పెద్దగా లేదు. ఈ విధమైనటువంటి అవగాహన,

క్షిప్రం హి మానుషే లోకే సిద్ధిర్భవతి కర్మజా - కానీ మీరు ఇతర సాధకుల యొక్క జీవితాల్ని గమనించి, వాళ్ళు ఏ విధంగా ఆ స్థితికి వెళ్ళారో కనుక మీకు తెలిస్తే, వాళ్ళకంటే తొందరగా మీరు ఆ స్థితికి వెళ్ళిపోవచ్చు.

ఇక్కడ భగవద్గీతలో చెప్పేది భాగవతంలో ఇంకా డైరెక్ట్‌గా చెప్తాడు.

ఒక ముహూర్తకాలంలో, అంటే 24 నిమిషాల్లో మీరు ఆ ముక్తి అనేటటువంటి స్థితిని రుచి చూడగలరు.

కేవలం 24 నిమిషాల్లో. అంతకంటే ఎక్కువ టైమ్ అక్కర్లేదు. ఖట్వాంగుడు అనే రాజు కథలో వస్తుందిది.

- కాంక్షన్తః కర్మణాం సిద్ధిం, ఆ సిద్ధి ఏమిటో, ఏ అనుభూతి మీరు పొందాలని అనుకుంటున్నారో, ఆ అనుభూతిని మాత్రం మీరు నిరంతరం మనస్సులో ఉంచుకోండి.
-- మనం దేనికి ఈ భగవద్గీతను చదువుతున్నాం?

| | |
|---|---|
| పుణ్యం కోసమా? | పుణ్యం అంటే? |
| ముక్తి కోసమా? | ముక్తి అంటే? |

ఇది స్పష్టంగా ఉండటానికి నెక్స్ట్ శ్లోకంలో చెప్తాడు,

**చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మ విభాగశః**
**తస్య కర్తారమపి మాం విద్ధ్యకర్తారమవ్యయమ్. (4-13)**

బ్రాహ్మణక్షత్రియాదులను నాలుగు వర్ణములు సత్త్వాది గుణముల యొక్కయు, ఆ గుణములచే చేయబడు కర్మల యొక్కయు, విభాగము ననుసరించి నాచే సృజింపబడినవి. వానికి నేను కర్తనైనప్పటికిని (ప్రకృతికి అతీతుడనగుటచే) వాస్తవముగ నన్ను అకర్తగను, నాశరహితునిగను (నిర్వికారునిగను) ఎఱుగుము.

భగవద్గీత యొక్క ఈ శ్లోకంలో రకరకాలైన వాళ్ళు, వాళ్ళకి కావలసినటువంటి అర్థాన్ని లాక్కొస్తారు. కానీ మొదటి శ్లోకంలోనే చెప్పినటువంటి మాట కనుక మనకి గుర్తువుంటే, ఈ శ్లోకం అంత కన్‌ఫ్యూజింగ్‌గా ఏం లేదు.

చాతుర్వర్ణ్యం మయా సృష్టం - నాలుగు రకాలైనటువంటి రంగులతో ఈ సృష్టిని సృష్టించాను అన్నాడు.

*ఈ రంగులు ఎక్కడ్నుంచి వచ్చాయి?*

**ఇమం వివస్వతే యోగం ప్రోక్తవానహమవ్యయమ్**
**వివస్వాన్ మనవే ప్రాహ మనురిక్ష్వాకవేఽబ్రవీత్. (4-1)**

ఈ యోగాన్ని మొట్టమొదట నేను సూర్యుడికి చెప్పాను అన్నాడు. సూర్యుడిలో ఏడు రంగులు ఉన్నాయి. అందులో నాలుగు రంగుల్ని మాత్రమే ఉపయోగించుకుని సృష్టిని నేను తయారు చేశాను అని చెప్తున్నాడు.

ఇందులో గందరగోళం పడటానికి, గాబరా పడటానికి ఎక్కడొచ్చింది అంటే, మన ఆలోచనలు భగవద్గీత మీద ఆరోపిస్తాం. మన వర్ణవ్యవస్థను, మన ఆశ్రమ వ్యవస్థను, మన కుల వ్యవస్థను దీని మీద తీసుకొచ్చి పెట్టాం.

**నేను రిపీటెడ్‌గా మీకు చెప్తూవుంటాను,**

మీరు అనాలసిస్ చేసుకుంటూవున్నప్పుడు, ఈ ఆధ్యాత్మిక జగత్తులో చెప్పిన పుస్తకాలు చదువుకొంటున్నప్పుడు, యూనివర్సల్ ట్రూత్స్‌ని మాత్రమే పట్టుకోవాలి. ధర్మాన్ని మాత్రమే మీరు పట్టుకోవాలి.

త్రాగుడు త్రాగవచ్చునా, త్రాగకూడదా? ధర్మము, అధర్మము అనేది ఒక లా పెట్టేస్తే వచ్చేది అయితే, అది ధర్మం ఎలా అవుతుంది? అది యూనివర్సల్‌గా ఉండాలి.

ఈ మొత్తము ప్రపంచం సూర్యకిరణాలు యొక్క సముద్భవమే. ఇమం వివస్వతే యోగం.

- ఒక సంవత్సర కాలంలో జరిగే ఈ సూర్యకిరణాల విన్యాసమే ప్రతీ సంవత్సరం జరుగుతూ ఉంటుంది. ఇంక అందులో మార్పు ఉండదు.
- -- అంచేత ఒక సంవత్సరకాలం పాటు జరిగే విద్యను కనుక మనం పూర్తిగా గ్రహించుకుంటే, ఇంక ఈ సృష్టిలో మీరు నేర్చుకోవలసింది ఏమీ లేదు.

అదే సావిత్రిలో కూడా ఒన్ ఇయర్ ఈజ్ ద లైఫ్ ఆఫ్ సత్యవాన్ అని చెప్తాడు. ఒకే సంవత్సరం. ఇంక ఆ తరవాత నెక్స్ట్ ఇయరూ అంతే ఇంక. భౌతిక జగత్తులో మీరు ఏమి నేర్చుకోదల్చుకున్నా కూడా ఒక సంవత్సరం కంటే ఎక్కువ లేదు అక్కడ నేర్చుకోవటానికి.

అంచేత చాతుర్వర్ణ్యం మయా సృష్టం నాలుగు రకాలైన కిరణాలతో మొత్తము వర్ణవ్యవస్థ ఏర్పడింది. వర్ణము అంటే కిరణము అని అర్థం.

| | | |
|---|---|---|
| మొట్టమొదటిది | - | ఎరుపు |
| రెండవది | - | ఆరంజ్ |
| మూడవది | - | ఎల్లో |
| నాలుగవది | - | గ్రీన్ |

గుణకర్మ విభాగశః - ఈ నాలుగు రంగుల్ని ఉపయోగించుకుని మీ గుణాలనీ మార్చుకోవచ్చు,
మీ కర్మని కూడా మార్చుకోవచ్చు. రంగుల ద్వారా ప్రారబ్ధకర్మని కూడా మీరు మార్చుకోవచ్చు.

విశుద్ధానంద సరస్వతి అని 1930 ఆ ప్రాంతంలో కాశీలో జీవించివుండేవాడు. సూర్యకిరణాల మీద అయనకి ఉన్న అధిపత్యము ఇంక ఎవరికీ లేదు. ఆయన శిష్యుడు గోపీరాజ్ కవిరాజ్ అని చాలా పెద్ద తాంత్రికుడు. అయనకి తల చాలా పెద్దగా ఉండేది. నేను అయన్ని చూసినప్పుడు ఆయనకి 90 ఏళ్ళు. ఆయన శరీరంలో కనిపించేది తల మాత్రమే. ఇంక మిగతాదేం కనిపించేది కాదు.

ఒకసారి మా తాతగారు, నేను ఆయన్ని చూడటానికి వెళితే, అప్పుడు నాకు ఎనిమిదేళ్ళో, తొమ్మిదేళ్ళో, ఆ సీన్ మాత్రం గుర్తుంది. పెద్ద హాలు, ఆ హాలు నిండా పుస్తకాలే. ఆయన తల ఒక్కటే కనిపించింది. నేను చాలా భయపడిపోయాను. మనిషి తల అనుకోలేదు. అందులో చిన్నతనం కదా! భయపడటానికి చిన్నా పెద్దా ఏమిటిలెండి.

***ఎందుకిది చెప్తున్నాను,***

చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మ విభాగశః గుణాలను మార్చుకోవాలన్నా, కర్మలను మార్చుకోవాలన్నా, రంగుల్ని ఉపయోగించుకోండి.

ఈ నాలుగు రకాలైన రంగులే భౌతిక జగత్తులో ఉన్నాయి. ఐదవ రకమైన రంగు భౌతిక జగత్తులో లేదు.

| | |
|---|---|
| తల పైకి ఎత్తి చూస్తే మనకి కనిపించేది | - నీలము |
| ఇంకాస్త క్రిందన కనిపించే చెట్లు అవీ | - గ్రీన్ |
| పండిపోయినటువంటి పళ్ళు | - ఎల్లో |
| మిగతా దంతా | - రెడ్ |
| ఈ ఎల్లోకి, రెడ్‌కి మధ్యన ఉన్న రంగు | - ఆరంజ్ |

ఇవి నాలుగు రంగులు.

చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మ విభాగశః

బ్లూ, బ్లూ తరవాత ఇండిగో, ఇండిగో తరవాత వచ్చే వైలెట్ కలర్స్ భూమి మీద ఉండవు. అందుకే కృష్ణుడి రంగు, భగవంతుడి రంగు మనం నీలం రంగుతో చూపిస్తాం. భూమి మీద ఉండే రంగులు కావవి.

"మరి మనకి కనిపిస్తున్నాయికదా ఆ రంగులు?"

వాటి గురించి తరవాత ఆ కలర్ థెరపీ వాటి గురించి మాట్లాడుకుంటున్నప్పుడు డిస్కస్ చేసుకుందాం.

***ఇప్పుడు మాత్రం మీరు గుర్తుంచుకోవలసింది ఏమిటంటే,***

ఈ మొత్తము సృష్టి కేవలము నాలుగు రంగుల సమ్మేళనమే. ఎరుపు, కాషాయము, పసుపు, ఆకుపచ్చ. ఈ నాలుగు రంగుల యొక్క సృష్టిలో గుణకర్మ విభాగశః, ఈ రంగుల యొక్క మార్పు వల్ల రకరకాలైన ప్రారబ్ధ కర్మలు, రకరకాలైన పరిస్థితులు ఏర్పడతాయి.

ప్రతీ మనిషి చుట్టూ తేజోవలయము, ఆరా ఉంటుంది అని శాస్త్రజ్ఞులు చెప్తూవుంటారు.

***ఈ సర్వజ్ఞత్వం అదీ వాళ్ళకి ఎలా వస్తుంది అంటే,***

ఈ ఆరా, రంగులు వాళ్ళకి కనిపిస్తాయి. ఈ రంగులు ఎప్పుడైతే కనిపిస్తాయో, వాళ్ళ యొక్క గుణకర్మలు సాధకులకి అర్థమైపోతూవుంటాయి. ఆ రంగుల్ని బట్టి వాళ్ళ భవిష్యత్తు ఎలా ఉందో చెప్పటం చాలా తేలిక. గుణకర్మ విభాగశః

తస్యకర్తారమపి మాం విద్ధ్యకర్తారమవ్యయమ్

అయినను, ఇవంతా నేను చెప్పాను, కానీ ఇవంతా ఆ సూర్యుడు వల్ల నడుస్తున్నాయి. ఆ సూర్యుడే లేకపోతే ఈ నాలుగు రంగులూ లేవు, ఈ సృష్టి లేదు. అంచేత మీకు అర్థమయ్యేటట్టు చెప్పటానికి నేను ఈ వేరు వేరు విభాగాలు, వేరు వేరు గుణకర్మలు చెప్పానుకాని, ఈ గుణకర్మలలో ఉన్నటువంటి తేడాలు, ఇవన్నీ కూడా ఎవరి వల్ల వచ్చాయి మళ్ళా? ఆ సూర్యుడు వల్లే వచ్చాయి.

- ఇవి అంతా కాకుండా ఈ సూర్యుడు యొక్క కిరణాలలో ఉండే ఏడు రంగులకి చాలా విచిత్రమైన పేర్లు ఆధ్యాత్మిక విద్య పెడుతుంది. భగవద్గీతలో కూడా పూర్తిగా ఇవ్వడు కాని, వాటి హింట్ ఇస్తాడు.
- -- ఒకొక్క కిరణము 2,400 సంవత్సరాల పాటు నడుస్తూ ఉంటుంది.
- ఈ 2000 ఎ.డి. ఎందుకంత ప్రాముఖ్యత వహించబోతోంది అంటే, ఒక కిరణము తన ఫలితాన్ని పూర్తిగా ఇచ్చేసి, రెండవ కిరణం వైపుకు వెళుతోంది.
- -- ఆ వచ్చే కాలము ఈ రెండు రంగుల మధ్యన ఉన్న సంధికాలం కనుక దీన్ని సంధికాలం అంటాం.

వీటన్నిటినీ కూడ మీ అంతట మీరు రకరకాలైన పుస్తకాలు చదువుకుని డెవలప్ చేసుకోవలసిందే. ఇది ఒక క్లాసులో భగవద్గీత గురించి చెప్తూ చెప్పుకునేటటువంటి విషయాలుకావుకాని, ఈ ఫ్యాక్ట్ గుర్తుంచుకోండి.

- యోగవిద్య మొత్తము సూర్యుడిపై ఆధారపడి ఉంది.
- -- సూర్యుడి నుంచి వచ్చే ఏడు రంగులలో నీలము, ఇండిగో, వైలెట్ కలర్స్ భూమి మీద ఉపయోగపడవు.
- -- భూమి మీద ఉపయోగపడే రంగులు నాలుగే. ఎరుపు, కాషాయము, పసుపుపచ్చ, ఆకుపచ్చ.

కానీ ఆ రంగు చూసి, ఆ రంగు యొక్క ఫలితాలు మన శరీరం మీద ఎలా ఉంటాయి అని చెప్పే కలర్ థెరపీ ఈ మధ్యనే డెవలప్ అవుతోంది.

- ఇంకొక 50, 60 సంవత్సరాలలో ఇప్పుడు హాస్పిటల్స్ ఎలా ఉన్నాయో, గ్యారంటీగా కలర్ హాస్పిటల్స్ వస్తాయి. అది ఒక ప్రిడిక్షన్ ఉంది. అది గ్యారంటీ.

రంగుల ద్వారా మనస్సుని మార్చటం అదీ పెద్ద కష్టమైన పని కాదు. అది ఏ విధంగా జరుగుతుంది, ఆ 4 రంగుల్ని ఎలా ఉపయోగించుకోవాలి అన్న దాన్ని నెక్స్ట్ శ్లోకంలో చెప్తున్నాడు.

ఆ శ్లోకం యొక్క వివరణ ఇవాళ వద్దుకాని, దాని అవగాహన మాత్రం చేసుకుంటూ, రేపు డిస్కస్ చేద్దాం.

న మాం కర్మాణి లిమ్పన్తి న మే కర్మఫలే స్పృహా
ఇతి మాం యోఽభిజానాతి కర్మభిర్న స బధ్యతే. (4-14)

నన్ను కర్మలంటవు. నాకు కర్మఫలమునందపేక్షయు లేదు. ఈ ప్రకారముగ నన్ను గూర్చి యెవడు తెలిసికొనునో ఆతడు కర్మములచే బంధింపబడడు.

ఇదంతా మళ్ళా చెప్పేసరికి మళ్ళా ఎక్కడ కోరికల వలయంలో వాడు చిక్కుకుపోతాడో అని కృష్ణుడికి భయం.

*అంచేత ఏం చెప్తాడు?*

ఏ పనులు చేసినా నన్ను అంటవు. నాకు ఆ కర్మఫలము యొక్క స్పృహ కూడా ఉండదు. నేను ఈ పని చేశానుకదా, అందువల్ల ఈ ఫలితం వచ్చిందా లేదా అనేటటువంటి స్పృహ కూడా ఉండదు.

*మరి ఏం ఉంటుంది?*

కళ్ళు మూసుకుని ఉండిపోతాం.

స్వస్తి.



# భగవద్గీత ఉపన్యాసాలు - 26

## జ్ఞానయోగము

1998, నవంబరు 17 వ తారీఖున సుకృతవిల్లా, గుంటూరులో
మాస్టరుగారు భగవద్గీతపై ఇచ్చిన ఉపన్యాసము



- ఆ ఏడు కిరణాలే మనలో 5 జ్ఞానేంద్రియాలు, 2 + 2 అంతరింద్రియాలు
- నాలుగు కిరణాలు - వాటి గుణాలు
- సర్వరోగ నివారిణిగా వైలెట్ కలర్
- ఆధ్యాత్మిక జగత్తులో రాహుకేతువుల పాత్ర
- జాతక చక్రం - తల్లితండ్రుల బాధ్యత
- నిర్ణయించుకునే బాధ్యత మీ మీద ఉంది
- సుఖము, దుఃఖము అనేది మీ లక్ష్యాన్ని బట్టి ఉంటుంది
- చిత్రగుప్త కిరణం - రాహుకేతువులు
- సంచిత, ఆగామి కర్మల్ని మార్చేసుకోవచ్చు
- ఏ పనినీ నీ అంతట నువ్వు మొదలెట్టకు

భగవద్గీత జీవిత విధానంలో మనం మళ్ళీ మళ్ళీ గుర్తుంచుకోవాల్సింది ఏమిటి అంటే, భగవద్గీత ఆధ్యాత్మిక స్థితిని అతి కచ్చితమైన 18 స్థాయిలలో డివైడ్ చేస్తుంది.

ఒకటవ క్లాసు, రెండవ క్లాసు, మూడవ క్లాసు, నాలుగవ క్లాసు అని మనం ఎలా తెలుసుకోగలుగుతున్నామో, మన ఆధ్యాత్మిక ప్రగతిని కూడా మనం అంచనా వేసుకోవచ్చు. ఇవాళ ఈ క్లాసులో ఉన్నాను, రేపు ఈ క్లాసులో ఉన్నాను, ఎల్లుండి ఈ క్లాసులో ఉన్నాను, అలాగ 18 రోజులు నుంచి 18 ఏళ్ళ లోపల మొత్తం భగవద్గీతను మీరు మీ జీవితంలో ఒక భాగంగా మలుచుకోవచ్చు.

ఆ స్పీడ్ ఆఫ్ లెర్నింగ్ మీ చేతిలో ఉంటుంది.

శ్రీకృష్ణుడు అయితే సాందీపని ఆశ్రమంలో 64 విద్యలూ 64 రోజుల్లో నేర్చేసుకున్నాట్ట.

"శ్రీకృష్ణుడు కనుక నేర్చుకున్నాడు."

భగవద్గీతలో శ్రీకృష్ణుడు ఆ మాట అనటంలేదు. జన్మ కర్మ చ మే దివ్యం, మీరు కూడా దివ్యమైనటువంటి జన్మను ఎత్తినవాళ్ళే. ఎంచేత? మానవశరీరధారి అయిన ప్రతీ ఒక్కడికీ కూడా భగవంతుడ్ని దర్శించేటటువంటి హక్కు ఉంది, ప్రయత్నిస్తే.

అంచేత ఒక శ్రీకృష్ణుడే ఆ దివ్యత్వాన్ని పొందాడు అనేటటువంటిది అయితే అసలు భగవద్గీతను చదవటం మనకి అనవసరం.

కానీ ఈ భగవద్గీత ఇన్ని వేల సంవత్సరాల బట్టీ మనలో ఇంత ప్రాచుర్యం పొందటానికి కారణం ఏమిటి అంటే, దాన్ని ఉపయోగించుకుని మనం ఆ స్థితికి వెళ్ళగలం. అంచేత ఆధ్యాత్మిక జీవితంలోని ఈ వర్గీకరణని మీరు చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేయాలి.

18 కక్ష్యలలో ఆధ్యాత్మికత అనే ప్రతీ వ్యక్తిత్వాన్ని మనం వర్గీకరణ చేయొచ్చు. క్రైస్ట్‌నికాని, మహమ్మద్‌నికాని, సూఫీ సెయింట్‌లుకాని, బాబాలుకాని, అవతార పురుషుల్ని కాని ఈ 18 కక్ష్యలలో వర్గీకరణ చెయ్యొచ్చు.

అవతార పురుషుల విషయంలో పరశురాముడు 3 కళలు మాత్రమే కలవాడు అని, రాముడికి 12 కళలు ఉన్నాయి అని, శ్రీకృష్ణుడికి 16 కళలు కూడా ఉన్నాయి అని మన శాస్త్రాలే చాలా స్పష్టంగా చెప్తాయి.

- అంటే శ్రీకృష్ణుడి అవతారంలో కూడా 18 కళలు గురించి చెప్పటం లేదు, పదహారే చెప్తున్నాయి. పరిపూర్ణత్వానికి ఇంకా అక్కడ రెండు మిగిలాయి.

ఇది వరకు ఋషులు చెప్పిన దానికంటే నేను ముందుకు తీసుకుని వెళుతున్నాను అని అరవిందో చెప్పటానికి కారణం అది. శ్రీకృష్ణుడి అవతారం కూడా 16 కళలే.

- కానీ అరవిందో దగ్గరకి వచ్చేసరికి 17, $17^1/2$ మధ్యన ఊగిసలాడుతూ ఉంటుంది. 18 ఇంకా పూర్తికాలేదు. ఇటీజ్ ఇన్ ద ప్రాసెస్.

ఈ విద్య నేను చెప్పటం, ఎవరో పుస్తకాల్లో చెప్పటం కాకుండా, మీ అంతట మీరు అంచనా వేసుకునే సామర్థ్యం భగవద్గీత వల్ల మొట్టమొదట మీకు వస్తుంది.

మీరు ఏ స్థితిలో ఉన్నా, మీరు ఎలాంటి మానసిక, ఆధ్యాత్మిక స్థాయిల్లో ఉన్నా కూడా. వ్యక్తుల యొక్క ప్రవర్తన బట్టి, వ్యక్తుల యొక్క జీవితవిధానాన్ని బట్టి, వారు చెప్పిన విషయాలను బట్టి, మీకు భగవద్గీత చదివితే వచ్చే మొట్టమొదటి లాభం ఏమిటి అంటే, ఎదుటివాడి యొక్క స్థాయిని కళలలో, అంటే డిగ్రీసెస్‌లో చెప్పగలరు.

మనం కూడా డిగ్రీస్ అనే కొలుస్తాంకదా! బి.ఏ. డిగ్రీ, ఎమ్.ఏ. డిగ్రీ. అలా కాకుండా డైరెక్ట్‌గా 1 నుంచి 18 డిగ్రీలలో సంపూర్ణ ఆధ్యాత్మికత యొక్క లిస్ట్ మనకి తెలుస్తుంది. ఆ డిగ్రీలు యొక్క వివరణ నాలుగవ అధ్యాయంలో సంపూర్ణంగా ఇస్తాడు. నాలుగవ అధ్యాయం యొక్క ప్రాముఖ్యత అందుకు.

ఈ నాలుగవ అధ్యాయాన్ని అవగాహన చేసుకోవటానికి చేసే ప్రయత్నంలో మొట్టమొదట అవగాహన మనం దేనికి వచ్చాం? ఇమం వివస్వతే యోగం.

- ఈ యోగవిద్య గురించి, ఆధ్యాత్మికత గురించి ఏ శ్రేణి కావాలన్నా, మాగ్జిమమ్ ఎటైనబుల్ లిమిట్ ఇన్ దిస్ ఫిజికల్ ప్లేన్, మనం ఉన్న ఈ భౌతిక జగత్తులో సూర్యుడు యొక్క స్థాయిని మించి మీరు ఎదగలేరు.
- -- ఎదగాలి అంటే, ఎదుగుతాం. ఎదిగినవాళ్ళు ఉన్నారు హిమాలయాలలో. కానీ అది తరవాత.
- కృష్ణ కాన్షియస్‌నెస్, కృష్ణుడి యొక్క జీవిత తత్వాన్ని అర్థం చేసుకుని, ఆ విధంగా జీవించగలిగే వ్యక్తులది ఒక సమూహమే ఉంది. దాన్నే లలితా సహస్రనామం వాటిల్లో సిద్ధౌఘ అని పిలుస్తూవుంటాం. హిమాలయాలలో, ఈజిప్టులో వాళ్ళు ఉన్నారు.
- -- ఆ సిద్ధౌఘ గ్రూప్‌లో జీవించే వ్యక్తుల కనీస వయస్సు 60 వేల సంవత్సరాలు.

అంటే 60 వేల సంవత్సరాలు ఆ కంటిన్యూటీ ఆఫ్ కాన్షస్‌నెస్‌లో ఉంటేకాని మీరు ఆ సముదాయంలోకి వెళ్ళటానికి వీల్లేదు. ఇంక అక్కడ్నుంచి వాళ్ళ జీవితాలు ఎన్ని లక్షల కోట్ల సంవత్సరాల మల్టిపుల్స్‌గా ఉంటాయో మీరు ఊహించుకోండి.

కానీ వాళ్ళు భౌతిక జగత్తులో కొంత మందికి కనిపిస్తూనే ఉంటారు, వాళ్ళ యొక్క విశేషాలను చెప్తూనే ఉంటారు. చాలా మంది పెదవి విరిచేసి, మనకెందుకులే అని వదిలేస్తూవుంటారు.

వదిలేసినా కూడా వాళ్ళు మనల్ని వదలరు. గురువు యొక్క గొప్ప అంతే కదా! నువ్వు గురువుకాదు, పో! అన్నాడనుకో, వాడు వదిలేస్తే ఇంక గురువేం ఉంది?

ఆ జ్ఞానం అంతా కూడా ఈ నాలుగవ అధ్యాయంలో చాలా జాగ్రత్తగా గమనించుకుంటే మీకు మొత్తం లభిస్తుంది.

ఇమం వివస్వతే యోగం, పరిణామక్రమంలో మొట్టమొదట సూర్యుడ్ని పట్టుకోండి.

- సూర్యుడు యొక్క జీవిత విధానంలో ఏ విధమైన పరిస్థితులు ఏర్పడుతున్నాయో, మన యొక్క జీవిత విధానంలో కూడా అలాంటి పరిస్థితులే ఏర్పడతాయి.
- -- సూర్యుడు చుట్టూ 9 గ్రహాలు తిరుగుతూ ఉంటాయి. గ్రహము అంటే గ్రహించేది. మనలో కూడా నవ రంధ్రాలు ఉన్నాయి. నవరంధ్రాలు ద్వారా గ్రహిస్తాం.

కానీ శిరస్సులో ఉన్న రంధ్రాలు ద్వారా గ్రహించటం, విడుదల చేయటం, జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు అనే భావన మనకి అర్థమవుతోందికాని,

- కర్మేంద్రియాలలో దిగువ భాగంలో రెండు రంధ్రాలు ఉన్నాయి. వాటిని గ్రహాలుగా ఉపయోగించుకోవటం ఇంకా మనం తెలుసుకోలేకపోతున్నాం.

సూర్యుడు యొక్క జ్ఞానము, ఇమం వివస్వతే యోగం, ఈ జ్ఞానాన్ని పట్టుకోవటానికి మొట్టమొదట మనం ప్రయత్నం చేయాలి. పట్టుకోవటానికి ప్రయత్నం చేయటంలో చాలా స్పష్టమైన నిర్దేశం నిన్న మనం చదువుకున్నాం.

చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మ విభాగశః

ఇక్కడ మన కులగోత్రాలు, మనం అనుకుంటోన్న వాటి గురించి అసలు శ్రీకృష్ణుడు మాట్లాడటం లేదు.

- ఆ స్థాయిలో ఆలోచించే వ్యక్తికి అసలు ఆధ్యాత్మికత అక్కర్లేదు. భౌతిక జగత్తులో ఇంకా వాడు దీన్ని పట్టుకునే వ్రేళ్ళాడుతూవుంటే ఇంక ఆధ్యాత్మికత ఏమిటి?

**కానీ అక్కడ శ్రీకృష్ణుడు దేని గురించి చెప్తున్నాడు?**

సూర్యుడు నుంచి వచ్చే యోగవిద్య భూమిలోకి 7 కిరణాల రూపంలో క్రిందకి దిగుతుంది. అది అందరికీ తెలిసున్నదే. కానీ తమాషా ఏమిటంటే, మేము కూడా ఆఖరికి, పిల్లలకి పాఠాలు చెప్తున్నప్పుడు ప్రిజమ్ ద్వారా, అంటే ఒక గాజు పట్టిక గుండా వెళుతున్నప్పుడు సూర్యుడు యొక్క కిరణం ఏడు రంగులుగా మారుతుంది అని చెప్తాం.

- దీన్ని మొట్టమొదట కనిపెట్టిన వాడు ఎవరు అంటే, న్యూటను అని చెప్తాం. అన్‌ఫార్చునేట్ అది.
- శుక్ల యజుర్వేదానికి కనీసం వయస్సు నిర్ణయించింది ఏమిటంటే, 95 వేల సంవత్సరాలు. అంత పురాతనమైన ఆ పుస్తకంలో చాలా స్పష్టంగా చెప్పబడివుంది,
- -- సూర్యుడు యొక్క ఏడు కిరణాలకు వాటి రోగ నివారణా సామర్థ్యాన్ని బట్టి పేర్లు ఇవ్వబడ్డాయి.
- -- వర్షము యొక్క బిందువుల నుంచి ఆ సూర్య కిరణాలు యొక్క సామర్థ్యము క్రిందకి దిగుతుంది.

శుక్ల యజుర్వేదంలో ఉన్న ఒక మంత్రం అది. మన వేదాలు అంటే ఏమిటో అనుకుంటాం. వేదాలలో ఈ సైన్స్ అంతా ఉంది. సూర్యవిజ్ఞానము = సైన్స్.

కొంచెం ధైర్యం చేసి పుస్తకం అర్థంకాదు అనుకుని కాకుండా, పుస్తకం తీసి చూస్తే మీకే అర్థమవుతుందది. అందులో సూర్యుడు యొక్క వివరణ, సూర్యుడు ఈ సంపూర్ణ సృష్టికి మూల విరాట్ ఎలా అయ్యాడు? సూర్యుడు నుంచి ఈ సంపూర్ణ జ్ఞానము ఎలా వస్తోంది అన్నది చెప్తూ, అక్కడ కూడా నాలుగు వేదాలే ఉంటాయి. ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అథర్వణ వేదము.

యజుర్వేదంలో రెండు విభాగాలు ఉన్నాయి. శుక్ల యజుర్వేదము, కృష్ణ యజుర్వేదము. ఈ వివరణ ఎలా, ఏ విధంగా జరిగింది, ఈ వేదాలు అంటే ఏమిటి అనేదానికి కూడా మనం ఇవాళ చదువుకునే దాంట్లో చదువుకుంటాం.

కానీ చాలా ముఖ్యంగా మనం గమనించుకోవలసింది ఏమిటంటే, సూర్యుడు నుంచి వచ్చేటటువంటి ఏడు కిరణాలే ఈ సంపూర్ణ సృష్టికి కారణము.

- ఆ ఏడు కిరణాలే మన శరీరములో 5 జ్ఞానేంద్రియాలుగా, 2 + 2, నాలుగు అంతరింద్రియాలుగా పనిచేస్తున్నాయి. 5+4 = 9.

సూర్యుడు చుట్టూ ఉన్నటువంటి నవగ్రహాలు నవ రంధ్రాలు అయితే, మన శరీరంలో ఉన్నటువంటి నవ రంధ్రాలు కూడా సూర్యుడికి ఆ గ్రహాలు ఎలాగయితే జ్ఞానాన్ని చేరవేస్తున్నాయో, మళ్ళీ ఆ సెంటెన్స్‌ని జాగ్రత్తగా అవగాహన చేసుకోండి.

- సూర్యుడు వద్దకు మన యొక్క ఉనికి, మన యొక్క పరిస్థితులు చేరవేసేటటువంటి ఏజంట్స్ గ్రహాలు.

-- సూర్యుడు నుంచి శక్తిని మన వద్దకు పంపిస్తూ ఉంటాయి. మన నుంచి శక్తిని సూర్యుడు వద్దకు పంపిస్తూవుంటాయి.

- ఇందులో నాలుగు గ్రహాలు భౌతిక జీవితంలో మానవుడి మీద చాలా ప్రముఖపాత్ర వహిస్తాయి.

-- మిగతా ఐదు గ్రహాలు ఇంకా మానవుడి జీవితం మీద ప్రభావం ఎందుకు చూపించటం లేదు అంటే, మానవీయ చేతనత్వము సూర్యుడు యొక్క ఆ కిరణ సామర్థ్యాన్ని పట్టుకోలేకపోతోంది.

మనం పట్టుకోగలిగే 4 కిరణాలు ఏమిటో కూడా చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మ విభాగశః లో చెప్పాడు.

ఎరుపు రంగు కిరణాన్ని మనం పట్టుకోగలం.

ఎరుపు రంగు అంటే - యాక్టివిటీ.

ఏదైనా ఒక వస్తువు యొక్క సామర్థ్యాన్ని మనం కొలవాలి అంటే, అది చేసే యాక్టివిటీ వల్ల మాత్రమే కొలవగలం. ఎవరి సామర్థ్యం ఎక్కువ అన్నది, వాడి యొక్క కెనెటిక్ ఎనర్జీ అంటాం ఫిజిక్సులో. వాడు చేసే మోషన్, ఒకడు గంటకి 20 మైళ్ళు వెళితే, ఇంకొకడు గంటకు 30 మైళ్ళు వెళితే, గంటకి 30 మైళ్ళు వెళ్ళినవాడు ఎక్కువ శక్తివంతుడు. ఇది ఎరుపు రంగు ద్వారా మనం గ్రహిస్తాం.

① ఈ ఎరుపు రంగు అనే సూర్యుడి కిరణమే లేకపోతే, ఈ శక్తి యొక్క కంపారిజన్, యాక్టివిటీ యొక్క కంపారిజన్ మనం చేయలేము. అది ఫస్ట్ పాయింట్.

② రెండవది, ఆరంజ్ కలర్ - టేస్ట్.

ఏ ఫుడ్ తినొచ్చు, ఏవి తినకూడదు, ఎన్.సి.సి.లో వాటిలో చెప్తూవుంటారు. అడవిలో ఎక్కడైనా ఇరుక్కుపోతే ఎవడూ మనకి తీసుకొచ్చి పెట్టడుకదా! అంచేత మీరు కాస్త గడ్డినో, ఆకో ఏదో తినాలి కనుక, మీరు తినే ఆకునో, గడ్డినో కాస్త నమిలి చూడండి. చేదుగా ఉంటే తినొద్దు. ఆరోగ్యానికి మంచిది కాదు. చేదు లేకపోతే ఆ ఆకుల్ని ధైర్యంగా తినేయండి. ఆరంజ్ కలర్, టేస్ట్. రుచిని తెలుపుతుంది.

③ మూడవది, ఎల్లో కలర్ - నాలెడ్జ్, జ్ఞానము. మనుష్యులకి విలువ ఇస్తున్నప్పుడు వాళ్ళ యొక్క జ్ఞానాన్ని బట్టి కూడా మనం బేరీజు వేసుకుంటాం.

ఏదైనా ఒక వస్తువుని మనం కొనాలి అంటే, మన యొక్క అభిరుచిని బట్టి వస్తువుల్ని కొంటూవుంటాం. మనం ఆ వస్తువు కొనాలి అంటే దాన్ని పొందే శక్తి మనకి ఉండాలి.

- అంచేత "శక్తి",
"రుచి" అంటే అభిరుచి,
ఆ వస్తువుని ఉపయోగించుకునే "జ్ఞానం" ఉండాలి.

కంప్యూటర్స్ అయితే కొనేసి పెట్టేసుకోవచ్చు చాలా మంది. పెద్ద కష్టమేంకాదు ఈ కాలంలో.

- కానీ ఆ కంప్యూటర్స్ యొక్క అసలైన, సిసలైన ఉపయోగం ఇంకా ప్రపంచానికే అందలేదు.

-- కంప్యూటర్ కనిపెట్టిన సైంటిస్ట్కే కంప్యూటర్ని ఎలా ఉపయోగించుకోవాలో తెలియదు.

శక్తి అయితే ముందు కనిపెట్టేస్తారు. ఈ ఉదాహరణని అర్థం చేసుకోండి. అది చాతుర్వర్ణ్యంలో వస్తుంది. ముందు ఆటమిక్ ఎనర్జీ కనిపెట్టేస్తాడు. కొంప మునుగుతుంది. ఆ ఆటమిక్ ఎనర్జీ వల్ల కొన్ని లక్షల మంది చచ్చిపోయిన తరవాత వాళ్ళకి ట్యూబ్లైట్ వెలుగుతూ ఉంటుంది, జ్ఞానం వస్తూవుంటుంది.

ఎంచేత? చంపటం మంచిది కాదు అని అభిరుచులు మారతాయి కనుక. చంపటం మంచిది అనుకునే రుచి ఉంటే, అసలు దాన్ని పీస్ఫుల్ పర్పజెస్ కోసం, యుద్ధం చేయకుండా ఉండటం కోసం పరమాణు శక్తిని ఉపయోగించుకోవాలి అనేటటువంటి అవగాహనే రాదు.

అంచేత శక్తి, శక్తి తరవాత రుచి, అభిరుచి.
దాని తరవాత జ్ఞానము.

ఇంత వరకు ప్రతీ వ్యక్తికీ సెల్ఫ్ పాయింటెడ్ సాధనే. ప్రతీ వాడికీ తను అందరికంటే ఎక్కువ శక్తివంతుడ్ని అవ్వాలి అని ఉంటుంది.

ప్రతీ వాడి అభిరుచి కూడా ఎలా ఉంటుంది? ఎంత బాగా తెచ్చావో, ఎంత బాగా చేశావో అని వాడి యొక్క అభిరుచిని అందరూ పొగడాలి. టీవీ అడ్వర్టయిజ్ మెంట్లో ఉజాలా మహిమ అంటే ఆవిడకి పాపం కోపం వస్తుంది. అప్పుడు భర్త చెప్తాడు, కాదు తల్లీ! నువ్వే బాగా ఉతికావు అని. అభిరుచి.

ఈ అభిరుచి కాకుండా జ్ఞానం, జ్ఞానసంపద పెంచుకోవాలని ఉంటుంది.

ఈ మూడింటిని మన శరీర విజ్ఞానంలో మూలాధారము, స్వాధిష్ఠానము, మణిపూరకము అని చెప్పుకుంటాం. ఆ విషయాలు గురించి 15వ అధ్యాయంలో చాలా డీటైల్డ్‌గా శ్రీకృష్ణుడే చెప్తాడు. కానీ ప్రస్తుతానికి దిగువ చక్రాలు అనుకుందాం. క్రిందన ఉన్న మూడు చక్రాలు.

④ ఇవి కాకుండా గ్రీన్ కలర్. ఆకుపచ్చ రంగులో మొట్ట మొదటసారి వ్యక్తికి తనకు యొక్క శక్తిని, తన దగ్గర ఉన్న రుచులను, తన దగ్గర ఉన్న జ్ఞానాన్ని ఇతరులకి పంచిపెట్టాలి అనే జ్ఞానం వస్తుంది.

-- గ్రీన్ కలర్ ఎప్పుడైతే స్టార్ట్ అవుతుందో, ది అదర్స్ బికమ్ మోర్ ఇంపార్టెంట్.

ఆ గ్రీన్ కలర్ స్టార్ట్ అయిన దగ్గర నుంచి మిగతా రంగులు ఉన్నాయే, బ్లూ, ఇండిగో, వైలెట్. ఇవి ఇంకా భూమి మీదకి దిగలేదు.

ఇవి కూడా భూమి మీదకి దిగుతాయని ప్రిడిక్షన్ ఉంది.

-- ఇప్పుడు ఇంత తొందరపడి ఈ క్లాసులు అవీ కండక్ట్ చేయటానికి మొట్టమొదటి కారణం ఏమిటి అంటే, వైలెట్ కలర్‌ని సర్వరోగనివారిణిగా ఉపయోగించుకునే పరిస్థితులు అతి త్వరలో రానున్నాయి.

-- 50 సంవత్సరాల లోపల అని 1970లో వ్రాశాడు. మనం దగ్గిర పడ్డాం.

***వైలెట్ కలర్ ఉపయోగించుకోవటం అంటే అర్థమేమిటి?***

సూర్యుడు యొక్క ఏడు రంగుల్నీ ఉపయోగించుకోవటం.

***అంటే ఇన్ డైరెక్ట్‌గా ఏం వచ్చింది?***

మన యొక్క గ్రీన్ కలర్ చక్రం, దాన్నే అనాహత చక్రం అని కూడా అంటాం.

దాని పైన బ్లూ కలర్ చక్రం - విశుద్ధి చక్రం.
దాని పైన ఇండిగో - ఆజ్ఞాచక్రం.
దాని పైన వైలెట్ కలర్ చక్రము - సహస్రారము.

ఈ నాలుగు రంగుల్నీ, మిగతా మూడు రంగుల్నీ కూడా మనం ఉపయోగించుకోగలిగితే, మొత్తం ఏడేగా అయ్యాయి. మరి సూర్యుడు చుట్టూ మనం చెప్పుకునేవి ఎన్ని గ్రహాలు? తొమ్మిది గ్రహాలు. దీనికి కూడా ఒక అద్భుతమైనటువంటి సాధనారహస్యం ఇమిడి పెట్టాడు.

చాలా మంది వ్యక్తులు గ్రహాలను, గ్రహగతులు మేము నమ్మము. భూమి మీద మేము చేసినట్టే జరుగుతాయికాని, గ్రహాల వల్ల ఏం జరుగుతాయి? అని చెప్పుకున్నా, ఇవాళ ఏ రోజు అంటే, వాడు ఏదో ఒక గ్రహం పేరు చెప్పాల్సిందే.

సన్‌డే నుండి సాటర్ డే వరకు వాడి ఖర్మ ఏమిటి అంటే, వాడు గ్రహాల్ని నమ్మినా, నమ్మక పోయినా, వాడు జీవితపు రోజుల్ని కనుక గుర్తించాలి అంటే, సన్‌డే, మండే, ట్యూజ్‌డే, వెన్స్‌డే, థర్స్‌డే, ఫ్రైడే, సాటర్‌డే. మళ్ళా సన్‌డే. చైనీస్ భాషలోకి వెళ్ళిపోండి, ఆఫ్రికన్ భాషలోకి వెళ్ళిపోండి, క్రిస్టియన్స్‌కి వెళ్ళిపోండి, ముస్లిమ్స్‌కి వెళ్ళిపోండి, ఎక్కడికైనా వెళ్ళిపోండి. సర్వజనీనమైన ధర్మము అని చెప్తూవుంటాను కదా, ధర్మం యొక్క ముఖ్య లక్షణం ఇదే.

మతాతీతమైన, మీ యొక్క నమ్మకాలకి అతీతమైన ఒక సైక్లిక్ ప్రాసెస్ ఏడు రోజులలో తిరుగుతుంది.

***ఎందుకు ఏడు రోజులలో తిరుగుతూవుంటుంది?***

సూర్యుడు చుట్టూ తిరిగే వాటిలో మానవుడు అర్థం చేసుకోగలిగేవి ఈ ఏడు గ్రహాలే.

ఈ ఏడు గ్రహాలు కాకుండా, ఇంకా రెండు గ్రహాలు మనం చెప్పుకుంటూవుంటాం. రాహువు, కేతువు.

-- చాలా మందికి వాటి పేర్లు వింటేనే భయం. శనిగారు అంటే ఇంకా భయం చాలా మందికి.

-- కానీ ఆధ్యాత్మిక జగత్తులో ఇవి చాలా ప్రముఖపాత్ర వహిస్తాయి.

రాహువు, కేతువు వహించే ఆ ప్రముఖపాత్ర గురించి ఇవాళ చదువుకోబోయే శ్లోకాలలో వస్తుంది.

భగవద్గీత 4వ అధ్యాయము మొత్తము మనకి సూర్య విజ్ఞానం చెప్తోంది. సూర్యవిజ్ఞానంలో సూర్యుడు యొక్క ఏడు కిరణాలు గురించి చెప్తోంది.

ప్రస్తుతం మానవజాతి యొక్క చరిత్ర నాలుగు కిరణాలలో మాత్రమే నిబిడీకృతమై ఉంది. రాబోయే మానవ జాతి చరిత్ర మిగతా మూడు కిరణాలలో ఉంది.

ఈ విషయాల్ని మనస్సులో పెట్టుకుని మిగతా శ్లోకాలు చదువుకుందాం మనం.

ఏవం జ్ఞాత్వా కృతం కర్మ పూర్వైరపి ముముక్షుభిః
కురు కర్మైవ తస్మాత్త్వం పూర్వైః పూర్వతరం కృతమ్. (4-15)

(తాను వాస్తవమ్ముగ కర్తకాదు, తనకు కర్మఫలము నందపేక్షయుండరాదు-అని) ఈ ప్రకారముగ (భగవంతుని కర్మా చరణముద్వారా) తెలిసికొని పూర్వమందలి ముముక్షువులు నిష్కామముగ కర్మలనాచరించియుండిరి. కావున (ఓ అర్జునా!) నీవున్ను పూర్వులచే జేయబడిన అట్టి పురాతనమైన నిష్కామ కర్మమునే చేయుము.

ఏవం జ్ఞాత్వా – ఈ విధంగా అర్థం చేసుకుని,

కృతం కర్మ – మీ పనులు మీరు చేసుకోండి.

పూర్వైరపి ముముక్షుభిః – పూర్వకాలంలో, ఇప్పుడే కాదు, సాధనా విధానంలో యోగవిద్యను ఎవరు అనుష్ఠించ దల్చుకున్నా, చచ్చినట్టు సూర్యవిద్య వరకే రావాలి. దాని తరవాత దానికి సబ్-టైటిల్సు, సబ్స్ ఏవైనా పెట్టు కోవచ్చు వాళ్ళు. కానీ రావలసినటువంటి విజ్ఞానం ఎక్కడొస్తుంది? సూర్యుడు దగ్గరకే.

అందుకే రామాయణ, మహాభారతాలు కూడా ఎప్పుడూ సూర్యుడు తప్ప మిగతా విషయాలు గురించి, యోగవిద్య గురించి మాట్లాడలేదు.

రావణాసురుడ్ని చంపాలి, ఆదిత్య హృదయం. ఆ ఇక్ష్వాకు వంశపు రాజుల యొక్క అద్భుతమైన సామర్థ్యం ఏమిటి అంటే, ప్రాణం పోతే పోవచ్చుగాక. కానీ మా మాట పోకూడదు అనేటటువంటి సత్యసంధత కలిగినటువంటి రాజులు అందరూ కూడా సూర్యవంశపు రాజులే.

మహాభారతంలోకి వస్తే దూర్వాసుడు కుంతీ దేవికి ఇచ్చిన వరదానం సూర్యుడికి సంబంధించినదే. ఇంక ఆ సూర్యుడు నుంచి మిగతా తత్వాలన్నీ వస్తాయి. పంచ పాండవుల తత్వాలు ఆ సూర్యుడు యొక్క తత్వాలే.

ఓడిపోయిన తరవాత అరణ్యవాసంలోకి వెళుతూ వుంటే, వాళ్ళకి ఆహారం కావాలి అంటే సూర్యుడు నుంచి వచ్చిందే ఆ అక్షయపాత్ర. ఇంకా మనం ముందుకు వెళితే, శ్రీకృష్ణుడికి సత్యభామతో పెళ్ళి జరగటానికి కారణం సూర్యుడు నుంచి పొందినటువంటి శ్యమంతక మణి.

అంతా సూర్యవిజ్ఞానమే. ఆ సూర్యవిజ్ఞానాన్ని తెలుసుకుని పూర్వైరపి ముముక్షుభిః, ముముక్షువులు అంటే ముక్తిని, ఈ భౌతిక జగత్తు యొక్క జీవిత విధానాన్ని దాటి బయటకి వెళ్ళాల్సిన వ్యక్తులు నేర్చుకున్నారు.

కురు కర్మైవ తస్మాత్త్వం పూర్వైః పూర్వతరం కృతమ్ – అంచేత నువ్వు ఎలా చేయాలి? నేను చెప్తున్నాను అని చెయ్యకు అన్నాడు శ్రీకృష్ణుడు. ఇది వరకు వాళ్ళు కూడా చేశారు. పూర్వైః పూర్వతరం కృతమ్ పూర్వ కాలంలోనే కాదు, తాతలేకాక, ముత్తాతలు కూడా. వాళ్ళందరూ కూడా ఈ విధమైన కర్మే చేశారు.

### ఏ విధమైనటువంటి కర్మ?

సూర్యుడు యొక్క ప్రభావాన్ని జీవితములో అర్థము చేసుకుంటూ చేయగలిగేటటువంటి కర్మ.

సూర్యుడు యొక్క ప్రభావం మన జీవితాల మీద ఎలా ఉంటుందో తెలిపే జాతకచక్రము ఈనాడు ఎలాగ ఏ గతికి పాలయింది?

ప్రమోషను వస్తుందా, రాదా?
అమ్మాయికి పెళ్ళవుతుందా?
అవేం ఉండవు జాతకచక్రంలో.

### జాతకచక్రంలో ఏం ఉంటుంది?

మీ శరీరాలలో ఉన్న గ్రహాల పరిస్థితి, బాహ్య జగత్తులో మీరు పుట్టినప్పుడు ఎలా ఉందో తెలుపుతుంది.

మనం అది అర్థం చేసుకోవాలి. పుట్టినటువంటి శిశువు యొక్క శరీరములో గ్రహగతులు, మాట్లాడలేడు కదా, వాడేం పనులు చేయలేడుకదా! అప్పుడే పుట్టినటు వంటి వాడాయె! మరి వాడి శరీరంలో బాహ్యజగత్తులో ఉన్నటువంటి గ్రహాలు ఎక్కడ ఉన్నాయి? ఏ విధంగా ఉన్నాయో తెలిపే అద్భుతమైనటువంటి శాస్త్రం అది.

☸ అది తెలుసుకున్న తరవాత తల్లితండ్రులు, సమాజము ఏం చెయ్యాలి అంటే, దానికి అనుగుణ్యంగా వాడి జీవితాన్ని చిన్నప్పటి నుంచి మలచాలి.

చాలా పెద్ద బాధ్యతని భారతీయ జీవిత విధానం మన మీద పెడుతుంది. జ్ఞానయోగము సాధారణమైన యోగము కాదు.

పిల్లవాడు పుట్టాడు. ఎలా పుట్టాడు, ఏ విధంగా పుట్టాడు? వాడి పూర్వపరాలు ఎలాంటివి? వాటి గురించి వేరే శాస్త్రం ఉన్నప్పటికీ, పుట్టిన తరవాత తల్లితండ్రులు కాని, కుటుంబసభ్యులుకాని ఏం చేయాలి అంటే,

- వాడి యొక్క జాతకచక్రంలో ఉన్నటువంటి గ్రహ స్థితులకి అనుగుణ్యముగా మాత్రమే ప్రతీదీ జరపాలి. ఆఖరికి పేరు పెట్టటం దగ్గర్నుంచి.

జాతకచక్రంలో చివరికి మనం అసలు ఏ స్థితికి వచ్చాం? మన శరీరంలో ఉన్న గ్రహాలకి, బాహ్యజగత్తులో ఉన్నటువంటి గ్రహాలకి మధ్య సంబంధాన్ని మర్చిపోయాం.

కానీ మీకు ఇష్టం ఉన్నా, లేకున్నా ఆ సంబంధాలు ఉన్నాయి. ఆ చక్రం అలాగే తిరుగుతుంది. ఏవం ప్రవర్తితం చక్రం అని కర్మయోగంలో చెప్తాడు.

సూర్యుడు,
సూర్యుడు తరవాత చంద్రుడు,
చంద్రుడు తరవాత కుజుడు,
కుజుడు తరవాత బుధుడు,
బుధుడు తరవాత గురుడు,
గురుడు తరవాత శుక్రుడు,
శుక్రుడు తరవాత శని.

మళ్ళీ మీ జీవితంలో మళ్ళా సూర్యుడు. అలాగ ఈ గ్రహాలు మీ జీవితాన్ని ప్రభావితం చేస్తూనే ఉన్నాయి.

- మీరు తెలుసుకుంటే ఆనందం. తెలుసుకోకపోతే ఇప్పుడున్న జీవిత విధానం వస్తుంది మనకి. అందువల్ల,

**కిం కర్మ కిమకర్మేతి కవయోఽప్యత్ర మోహితాః**
**తత్తే కర్మ ప్రవక్ష్యామి యజ్జ్ఞాత్వా మోక్ష్యసేఽశుభాత్ (4-16)**

కర్మయెట్టిది. అకర్మయెట్టిది అను ఈ విషయమును పండితులుకూడ సరిగా తెలిసికొనజాలకున్నారు. దేనినెఱిగినచో నీవు సంసారబంధమునుండి విముక్తుడవు కాగలవో అట్టి కర్మ రహస్యమును నీ కిపుడు తెలుపుచున్నాను.

కిం కర్మ – నేను ఏమి చేయాలి?

కిం అకర్మ - నేను ఏమి చేయకూడదు?

కవయోఽప్యత్ర మోహితాః – కవి అనే మాట భగవద్గీతలో ఎక్కడెక్కడ వస్తే, అక్కడ పొయెట్ అనికాదు అర్థం. ప్రపంచంలో గ్రహాలు యొక్క ఛందస్సు, గ్రహాల యొక్క గతిని, లయబద్ధతను బాగా తెలిసున్న వ్యక్తిని పూర్వకాలంలో కవి అనే వారు.

ప్రతీ గ్రహానికి దాని యొక్క లయబద్ధత ఉంది.

చంద్రుడు రెండున్నర రోజులలో తిరుగుతాడు.
శని రెండున్నర సంవత్సరాలలో తిరుగుతాడు.

అంతా కూడా జీవితానికి సంబంధించిందే పూర్వ కాలంలో ఉండేటటువంటి యోగవిద్య.

ఆ కవికి డౌట్ వచ్చేది. అంటే గ్రహగతులు పూర్తిగా అర్థం చేసుకున్నటువంటి వ్యక్తికి కూడా కిం కర్మ, ఏ పని చెయ్యొచ్చు, ఏది చేయకూడదు అనే డౌట్ వచ్చేది.

***ఎటువంటి పనులు చెయ్యాలని మనం మాట్లాడుకుంటున్నాం?***

సూర్యవిజ్ఞానాన్ని అర్థం చేసుకుని, సూర్యుడు ద్వారా ఆ ఏడు గ్రహాలలో, ప్లస్ ఇంకా రెండు గ్రహాలు ఉన్నాయి, రాహువు, కేతువు. వాటి గురించి నేను ఇంకా మాట్లాడటం లేదు.

- ఆ గ్రహాలు ద్వారా పృథ్వి మీదకి వస్తోన్నటువంటి ఏడు కిరణాలను పట్టుకుని, వీడి యొక్క ఏడు కిరణాలతో దాన్ని సామంజస్యం పెట్టుకోవాలి.

చెప్పటం చాలా తేలిగ్గానే ఉంది. డాక్టరు అంటే ఎవడు? వచ్చిన రోగాన్ని నిర్ధారణ చేసి, రోగానికి తగిన మందు వేసి, రోగం తగ్గించేసేవాడు. సింపుల్‌గా చెప్పేశాం. కానీ రోగ నిర్ధారణ చేయటానికి డాక్టరు అక్కడ ఛస్తాడు. వాటి వెనకాతల ఎంత నాలెడ్జ్ కావాలో. వేసుకున్న తరవాత ఆ రోగనిర్ధారణకి తగిన ఆహారాన్ని, వ్యవహారాన్ని పేషెంట్‌కి చెప్పాలి. చెప్పాక పేషెంట్ దాన్ని జాగ్రత్తగా పాటించాలి. పాటించేటట్టు చూసే బాధ్యత కూడా డాక్టర్‌దే. ఇవంతా మనం చెప్పం. డాక్టర్ అంటే చాలా సింపుల్‌గా చెప్పేస్తాం.

అలాగే చాలా సింపుల్‌గా నేను చెప్పేస్తున్నాను. కానీ చెయ్యాలి అంటే, నాకూ తెలియదు ఎలా చెయ్యాలో.

***కానీ చెయ్యవలసినటువంటి విధానం ఏమిటి?***

ప్రతీ రోజూ సూర్యుడు ఉదయిస్తూ ఉంటాడు. సూర్యుడు ఉదయిస్తూవున్నప్పుడు గ్రహాలు, పృథ్వికి ఉన్న కోణాలు బట్టి గ్రహాలు యొక్క స్థితులు మారుతూ

ఉంటాయి. ఆ మారినటువంటి స్థితులు వల్ల మన పృథ్వి మీదకి వచ్చే గ్రహాలు యొక్క కిరణాలు మారుతూ ఉంటాయి. ఇంత వరకు లెక్కపెట్టటం చాలా తేలికే.

- దాని తరవాత, ఆ కిరణాలు మన వెన్నుపూస మీద ఉన్నటువంటి గ్రహాలకి అనుగుణ్యమైనటువంటి రంధ్రాలలోకి దూరుతాయి.

దూరిన తరవాత ఏం చేయాలి? వాటిని ఎలా ఉప యోగించుకోవాలి? తెలియదు మనకి.

కానీ అన్నం తిన్న తరవాత అరగాలి. మనకి ఎలా అరగాలో తెలుసా? కానీ అరిగిపోతోందికదా!

చూడాలి. చూసేటటువంటప్పుడు మన కళ్ళల్లో ఉన్నటువంటి కోన్స్, రాడ్స్, ఆ రంగులకి యాక్టివేట్ అయ్యే వేరియస్ కణాలు ఉన్నాయి అని శాస్త్రజ్ఞులు చెప్తున్నారు. అవేం మనకి తెలియదు. తెలియకపోయినా ఎరుపు రంగూ గుర్తించగలుగుతున్నాం మనం, పసుపుపచ్చ రంగు గుర్తించ గలుగుతున్నాం, అన్ని రంగులూ గుర్తించగలుగుతున్నాం.

- అందుకే ఒకే ఒక ఫార్ములా, నేచర్ ఈజ్ ఆల్వేస్ రైట్. ప్రకృతి మనల్ని ఎలా జీవించమన్నదో అలా జీవిం చాలి. నువ్వు ఎలా ఇష్టపడతావో అలా కాదు.

-- మీ ఇష్టం వచ్చినట్టు జీవిస్తాం అంటే,
అసలు యోగవిద్యే కాదది.

ఈ జ్ఞానం మనకి పూర్తిగా అవగాహన లేకపో యినా, మనలో ఉన్నటువంటి స్పందనలు, ప్రేరణలు ప్రకృతికి అనుగుణ్యంగానే, ఆ సూర్యుడు యొక్క కిరణా లకి అనుగుణ్యంగానే ఉంటాయి కనుక, **కవయోఽప్యత్ర మోహితాః** ఈ గ్రహగతులు గురించి తెలిసున్నవాళ్ళు కూడా మోహంలో పడిపోతారు. వాళ్ళకి కూడా తెలియదు.

***ఎందుకు మోహంలో పడతారు?***

నేను అనేది అద్భుతగులుతూ వుంటుంది.

**తత్తే కర్మ ప్రవక్ష్యామి యజ్జ్ఞాత్వా మోక్ష్యసేఽశుభాత్**

కవులు కూడా, కవులు అంటే, సూర్యవిజ్ఞానాన్ని, గ్రహగతుల్ని బాగా అర్థం చేసుకున్నటువంటి వ్యక్తులకి కూడా ఏది కర్మ, ఏది అకర్మ అనేది తెలియదు. అయిన ప్పటికీ నేను నీకు చెప్తాను.

***జగద్గురువు అందే అర్థం ఏమిటి అంటే,***

ముందు శిష్యుడు అడక్కుండానే శిష్యుడు యొక్క ప్రోబ్లమ్‌ని గుర్తించాలి. దాని తరవాత శిష్యుడు చాలా సింపుల్‌గా అనుకుంటాడుకదా,

-- "ఏముంది, సూర్యుడు నుంచి కిరణాలు వస్తాయి-ట.

ఆ సూర్యుడు చుట్టూ ఉన్నటువంటి గ్రహాలు లాంటి గ్రహాలే మన వెన్నుపూసలో ఉన్నాయి-ట.

ఈ వెన్నుపూసలో ఉన్నటువంటి గ్రహాల వల్లే మనం కూడా పనిచేస్తూవున్నాము-ట."

అయిపోయింది. ఇంక మనం చేసేదేముంది, అంతా అదే చేస్తుంది అనుకుంటారేమో! కాదు, నిర్ణయించు కునేటటువంటి భారము నీ మీద ఉంది.

భగవద్గీత మొత్తము అయిపోయాక, 18 అధ్యాయం చివర్లో చెప్తాడు, నేను నీకు అంతా చెప్పాను. అయినప్పటికీ **యథేచ్ఛసి తథా కురు.** నీ ఇష్ట ప్రకారం చెయ్. నేను చెప్పానని మాత్రం చేయకు. నిర్ణయించుకునే హక్కు నీకు ఉంది.

- మన భారతీయ ఆధ్యాత్మికత స్వతంత్రం. మనం డెమాక్రసీ, డెమాక్రసీ అని అరుస్తాం తప్ప, ఇంత ఫ్రీడమ్ ఇంక ఎక్కడా దొరకదు. అసలు పూర్తి డిక్టేటర్ షిప్పు ఉండవలసినది యోగవిద్యలో. ఎంచేతంటే, గురువు ఏం చెప్తే, నోరు మూసుకుని అది చెయ్యాలి.

-- అలాంటి డిక్టేటర్‌షిప్పు ఉన్న యోగవిద్యలో కూడా ఎంత డెమాక్రసీయో! **యథేచ్ఛసి తథా కురు** అంటాడు.

***అంచేత ఇక్కడ కూడా శ్రీకృష్ణుడు ఏమని చెప్తున్నాడు?***

కర్మ ఏమిటి? అకర్మ ఏమిటి? నిర్ణయించుకోవ టం చాలా కష్టమే. అయినా కూడా నేను నీకు దాన్ని చాలా క్లియర్‌గా అర్థమయ్యేటట్టు చెప్తాను.

అది చెప్పటం వల్ల ఏమవుతుంది? **మోక్ష్యసేఽశుభాత్** అశుభం నుంచి నువ్వు ముక్తి చెందుతావు.

**కర్మణో హ్యపి బోద్ధవ్యం బోద్ధవ్యం చ వికర్మణః**
**అకర్మణశ్చ బోద్ధవ్యం గహనా కర్మణో గతిః** (4-17)

శాస్త్రములచే విధింపబడిన కర్మముల యొక్కయు, నిషేధింపబడిన వికర్మల యొక్కయు, ఏమియుచేయక సూరకుండుట యను అకర్మముయొక్కయు స్వరూపమును

బాగుగ తెలిసికొనవలసియున్నది. ఏలయనగా కర్మముయొక్క వాస్తవతత్వము చాల లోతైనది. (ఎఱుగుట మిక్కిలి కష్టతరము.)

*గహనా కర్మణో గతిః* అనే భగవద్గీతలోని ఈ శ్లోకం ఎంత మంది ఎన్ని రకాలుగా ఉపయోగించుకుంటారో! అప్ట్ కోటెడ్ శ్లోకం ఇది.

*గహనా కర్మణో గతిః* – కర్మ యొక్క మూవ్‌మెంట్, కర్మ యొక్క గతి.

**కర్మ యొక్క గతి అంటే,**

కర్మ ఏం చేస్తున్నాం అని కాదు. భగవద్గీత జ్ఞాన యోగం మనకి కర్మ అనే పదం వాడినప్పుడు నువ్వు ఏం చేస్తున్నావు అన్నది ముఖ్యంకాదు. సాత్వికాహారమా, రాజసికాహారమా, హింస చేయవచ్చా, చేయకూడదా? బ్రహ్మచర్యం పాటించాలా, పాటించకూడదా? ఈ కర్మ గురించి చెప్పటం లేదు. దేని గురించి చెప్తున్నాడు?

*కర్మణో గతిః* – ద మూవ్‌మెంట్ ఆఫ్ కర్మ. నువ్వు చేసిన ఈ పని వల్ల రేపు రాబోయేటటువంటి ఫలితం ఎలా ఉంటుంది? దాన్ని మనం అర్థం చేసుకోవాలి.

- దీన్ని అర్థం చేసుకోవాలి అంటే, మన భారతీయ యోగవిద్యలో కర్మని మూడు రకాలుగా విభజిస్తాం.

సంచితకర్మ,
పారబ్ధకర్మ,
ఆగామికర్మ.

ఇది కర్మ యొక్క గతి.

కొన్ని పనులు మనం చేస్తాం. ఆ పని యొక్క రిజల్ట్ ఆ రోజే రాదు. క్లాసులు ఎగ్గొట్టాం, హాయిగా తిరిగాం అంతా. దాని ఫలితం ఎప్పుడు తెలుస్తుంది? పరీక్షలు రోజుల్లో తెలుస్తుంది. అంత వరకు దాని యొక్క గతి రాదు మనకి.

***అంత వరకు అప్పుడు చేసిన కర్మ అంతా ఏమౌతుంది?***

① సంచితం అయివుంటుంది. దాని టైమ్ వచ్చినప్పుడు అది దాని ఎఫెక్ట్ చూపిస్తుంది. అది సంచిత కర్మ.

② ప్రారబ్ధకర్మ. ఏ విధమైన ప్రారబ్ధాన్ని తీసుకుని, అంటే ఏ విధమైనటువంటి లక్ష్యాన్ని తీసుకుని ఇప్పుడు ఈ కర్మ చేస్తున్నాం అనేది.

ఇది వరకు చేసినటువంటి కర్మలలో కొన్ని మంచి పనులు చేసివుంటాం, కొన్ని చెడ్డ పనులు చేసి ఉంటాం.

- మంచి, చెడు అన్న దానికి మన యొక్క కొలబద్ధ ఏమిటి? సుఖము, దుఃఖము.
  - సుఖంగా జీవితం గడిచిపోతూవుంటే, మన ఉద్దేశ్యం ఏమిటి అంటే, మనం మంచి పనులు చేశాం అని.
  - కష్టాల్లో మన జీవితం గడిచిపోతూవుంటే మన ఉద్దేశ్యం ఏమిటి అంటే, చెడు పనులు చేశాం అని.

కానీ భారతీయ ఆధ్యాత్మికత దాని గురించి మాట్లాడటం లేదు. సుఖానికి, దుఃఖానికి అంత సింపుల్ నిర్వచనం ఇచ్చేస్తే, మంచి పని, చెడు పని అనేది అంత సులభంగా మనం అర్థం చేసేసుకోగలిగితే, ఇంకేం ఉంది అక్కడ?

ఎండాకాలంలో ఇంటర్మీడియట్ పరీక్షలు అయిపోతాయి. ఇంట్లో హాయిగా పడుకుని వాళ్ళు హాలి డేస్ ఎంజాయ్ చేయొచ్చు. పాపం వాళ్ళు ఎక్కడకొచ్చి పడతారు? మెడికల్ ఎంట్రన్స్‌కి దానికి ట్యుటోరియల్ కాలేజెస్‌కొచ్చి పడతారు. డబ్బు కట్టుకుంటారు. ఒకొక్క రూమ్‌లో సాధారణంగా 20, 30 మంది కూర్చుంటేనే విసుగ్గా ఉంటుంది. ఆ క్లాస్ రూమ్స్‌లో 50 మంది, 60 మందిని తోస్తారు. లెక్చరర్‌కి నించోవటానికి జాగా ఉండదు.

ఆ ఎంట్రన్స్ క్లాసు ఎలా ఉంటుందో చూద్దామని ఒకసారి నేను వెళ్ళాను. మళ్ళా వెళ్ళకూడదు అని లెంపలేసుకున్నాను. ఫ్యాన్లు ఉండవు, లైట్లు ఉండవు. చీకటి గుహలాంటి గది. కాళ్ళ మీదే పిల్లలు కూర్చుని ఉంటారు. బ్లాక్ బోర్డ్ డస్టరు దులిపాడంటే ఆ ప్రక్కవాళ్ళ మీద పడుతుంది.

ఇంతకీ ఒక 20 వేలో, 30 వేలో కట్టుకుని, సెలవలు ఎంజాయ్ చేయకుండా, వాడు అక్కడ ఆ కోచింగ్ తీసుకోవటానికి వస్తే, వాడు సుఖంగా ఉన్నాడా, దుఃఖంగా ఉన్నాడా అన్నది ప్రశ్న. దాని కోసం చెప్తున్నాను.

- అంచేత సుఖము, దుఃఖము అనేది మీ లక్ష్యాన్ని బట్టి ఉంటుంది.

మీ పిల్లవాడికి డాక్టరు అవ్వాలని ఉంది అనుకోండి, అప్పుడు వాడు ఈ కష్టాలు అన్నిటినీ చాలా ఆనందంగా భరిస్తాడు. వాడు అసలు కష్టంగా ఉంది అనడు.

- అంచేత కష్టము, సుఖము అనేది ప్రారబ్దకర్మ బట్టి ఉంటుంది. అది చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోండి.

పాండవులు చాలా కష్టపడ్డారని మీరు అనుకుంటారు. మీరు జాగ్రత్తగా పాండవుల యొక్క జీవితాన్ని కనుక గమనిస్తే, వాళ్ళు సుఖపడింది ఎప్పుడనలు? తీరా సుఖపడదాం అంటే, నానా గందరగోళం అయ్యే. ఒక్క బంధువూ జీవించి మిగల్లేదుకదా, వాళ్లు ఐదుగురే పాపం మిగిలారు. ఉన్నవాళ్ళు అడవుల పాలు అయ్యారు.

అందుకేగా పాపం అసలు భగవద్గీతలో మొదటే చెప్తాడు, నేను ఈ యుద్ధం చేయను బాబూ! గెల్చినా నాకు లాభం లేదు. అంటే మన కొలబద్ధతో.

- కానీ యుగాలు మారిపోయాయి. కానీ వాళ్ళ యొక్క కర్మను, యాక్టివిటీని, కర్మగతిని మనం ఈనాటికీ కూడా ఆదర్శంగా తీసుకుంటున్నాం.
- ఈ ప్రారబ్దకర్మను ప్రతీ వాడికీ, ప్రతీ ప్రాణికీ కూడా సూర్యుడు చాలా అద్భుతంగా మలుస్తాడు.

-- పాండవుల యొక్క జీవితమే ఆదర్శవంతంకాదు. ప్రతీ వాడి జీవితమూ ఆదర్శవంతముగా ఉండాలి అనేదే సూర్యుడు యొక్క లక్ష్యము.

***ఎంచేతంటే,***

మనమందరం సూర్యుడు యొక్క అంశాలు కనుక.

బంగారం యొక్క అంశ ఏ రంగులో ఉంటుంది? బంగారపు రంగులోనే ఉంటుంది. ఏ లక్షణాలు కలిగి ఉంటుంది? బంగారపు లక్షణాలే కలిగివుంటుంది.

మన జీవితం, మన సృష్టి అంతా కూడా సూర్యుడు వల్ల జీవిస్తున్నాము. సూర్యుడు నుంచే మనం ఉద్భవించాం అంటే, మన జీవితాలు ఏ స్థాయిలో ఉండాలి?

- సూర్యుడు లెవెల్లో ఉండాలి.
  ఆ వెలుగు ఉండాలి, ఆ వర్చస్సు ఉండాలి.

-- అంచేత మన ప్రారబ్దకర్మ కచ్చితంగా ఆ సూర్యుడు యొక్క ఆ వర్చస్సు, సూర్యుడు యొక్క ఆ తేజస్సు, సూర్యుడు యొక్క ఆ యశస్సు, ఓజస్సు, అవంతా కూడా మన జీవితాలలో ప్రతిబింబించేటట్టుగానే కచ్చితంగా ఉండి తీరాలి. అందులో డౌటేం లేదు.

***కానీ ఎక్కడ గందరగోళం జరుగుతోంది?***

మన ప్రారబ్దకర్మను మనం జీవించకుండా, ప్రారబ్ద కర్మకు విపరీతంగా జీవించటానికి ప్రయత్నం చేస్తున్నాం.

ప్రకృతి మనల్ని ఎలా జీవించమంటోందో, మనం అలా జీవించటం లేదు. ప్రకృతి మనల్ని ఏ ఉద్దేశ్యంతో ఈ ఊళ్ళో, ఈ స్థలంలో ఉండమని చెప్పిందో, ఆ స్థలంలో మనం ఉండటం లేదు. ప్రారబ్దకర్మ, ప్రారబ్దకర్మ చాలా జాగ్రత్తగా మనం అవగాహన చేసుకోవాలి.

① సంచిత కర్మ అర్థమయిందికదా! పనులు ఇప్పుడు చేస్తాం. దాని ఫలితాలు ఎప్పుడో వస్తాయి.

② కాస్త ఎవేర్‌నెస్‌లో ప్రకృతిని మనం జాగ్రత్తగా గమనిస్తూవుంటే, ప్రారబ్దకర్మని అర్థం చేసుకోవచ్చు.

***కానీ లక్ష్యం గుర్తుంచుకోండి ఎప్పుడూ,***

భారతీయ యోగవిద్య మనకి చూపించే లక్ష్యం ఏమిటంటే, మనమందరము కూడా సూర్యుడు యొక్క అంశములే. సూర్యుడు యొక్క తేజస్సు యొక్క భాగాలే. సూర్యుడు యొక్క కిరణములే మనమందరమూ కూడా. అంచేత ఎట్టి పరిస్థితుల్లోనూ మన స్థాయి సూర్యుడు యొక్క స్థాయికంటే తక్కువ అవకూడదు.

- అంచేత మన ప్రారబ్దకర్మ ఏ స్థాయిలో ఉండాలి? సూర్యుడు యొక్క స్థాయిలో ఉండాలి.

***కానీ సూర్యుడు యొక్క స్థాయిలో ఎందుకు లేదు?***

అసలా అవగాహనే లేనటువంటి సమాజంలో, జీవితవిధానంలో జీవిస్తున్నాం. ఇంక ఎలా వస్తుంది?

సుఖము, దుఃఖము అనేది మన దగ్గర నుంచి ఆలోచించకూడదు. సూర్యుడు లెవెల్లో ఆలోచించాలి. పుట్టిన దగ్గర్నుంచి 22, 23 ఏళ్ళు వచ్చేంత వరకు కుర్రవాడ్ని మనం చావగొట్టి చెవులు మూసి ఏదో ఒకటి చదివిస్తూనే ఉంటాం. ఏ ఉద్దేశ్యంతో చదివిస్తాం? తరవాత వాడి జీవితము చాలా ఆనందమయంగా ఉంటుంది అని.

అదే విధంగా మన భారతీయ సాంప్రదాయ ప్రకారం పిల్లవాడు మొదటి 8 సంవత్సరాలు ఇంటి దగ్గర పెరుగుతాడు. తరవాత 24 సంవత్సరాలు వచ్చే వరకు గురువు యొక్క ఆశ్రమంలో పెరగాలి. వాడు రాజు కొడుకు

అయినా సరే, ఎవడైనా సరే. రాజుగారి కొడుకుకదా అని స్పెషల్ ట్రీట్‌మెంట్ ఉండేదికాదు. సాంధీపని విద్యాలయం లో కృష్ణుడికి, సుధాముడికీ కూడా అదే ట్రీట్‌మెంట్.

గురువులు అక్కడ ప్రారబ్ధకర్మని చాలా బాగా అవగాహన అయ్యేటట్టు నేర్పేవారు. అసలు నీ జీవితం ఎక్కడికి వెళుతోంది? నీ జీవిత లక్ష్యం ఏమిటి?

ప్రతీ వాళ్ళకీ ప్రారబ్ధకర్మ ఉంటుంది. శ్రీకృష్ణా సీరియల్ చూస్తే ఆ ప్రారబ్ధకర్మ యొక్క అవగాహన చాలా స్పష్టంగా అర్థమవుతుంది. శంబరాసురుడు దగ్గర వంట వాడిగా పనిచేస్తున్నవాడి భార్య కీ రోల్. బాణామతి! ఆవిడ శంబరాసురుడి దగ్గర ఆఫ్టరాల్ వంటగత్తె.

- ప్రారబ్ధకర్మలో వంటగత్తెకి ఎంత ప్రముఖపాత్ర వచ్చిందో చూడండి. అలాంటి ప్రారబ్ధకర్మ కచ్చితంగా మన అందరికీ ఉంటుంది. అందులో ముఖ్యంగా భారతదేశంలో పుట్టినటువంటి వాడికి.
- భారతదేశంలో పుట్టటానికి చాలా మంది దేవతలు కూడా బాధపడటానికి కారణం ఈ ప్రారబ్ధకర్మ.

-- ఇక్కడ పుట్టాం అంటే కచ్చితంగా ఏదో ఒక యోగ సాంప్రదాయము, ఏదో ఒక యోగవిద్యను అవగాహన చేసుకుని, ఆ స్థాయికి ఎదగటానికి కావలసిన పరిస్థితి ఉంటుంది.

అది మర్చిపోయాం, ఈనాడున్న ఆధునిక విద్యా సౌలభ్యం అనాలా, ఏమనాలో మరి.

③ అక్కడితో ఆగిపోలేదు. ఆగామీ కర్మ. రాబోయే కర్మ.

***ఈ రాబోయే కర్మ ఎక్కడ్నుంచి వచ్చింది మనకి?***

సంచితకర్మ ఎన్ని జన్మల బట్టి మనం పేర్చుకుంటూ వచ్చామో! ఒక జన్మలో దాన్నంతా భరించలేం.

- అంచేత సూర్యుడు యొక్క ఒక విచిత్రమైన కిరణం ఉంది. దాన్ని "చిత్రగుప్త" కిరణము అంటాం.

దాన్ని చిత్రగుప్తుడు అని, యమధర్మరాజు దగ్గర ఆ చిత్రగుప్తుడు చిట్టాలు వ్రాస్తూవుంటాడు అని అంటాం. కరెక్టే అది. ప్రకృతి తన చిట్టాలను అంతా తను తన కంప్యూటర్‌లో పెట్టేస్తూవుంటుంది.

***ఆ చిత్రగుప్తుడు ఏం చేస్తాట్ట అంటే,***

- మనం భరించగలిగే దాంట్లో 33% మాత్రమే కష్టాలను ఆ జీవితంలో రిలీజ్ చేస్తాట్ట.

-- దానికే మనం ఇంత గందరగోళం పడిపోతాం. మొత్తం రిలీజ్ చేస్తే అసలు ఎంత గందరగోళం పడతామో!

-- <u>అంచేత ఆ సంచితకర్మ అక్కడ ఉంటుంది.</u>

***ఈ యోగవిద్య, జ్ఞానయోగం ఏం చెప్తోంది అంటే,***

- సంచితకర్మను, ఆగామీ కర్మను మీరు పూర్తిగా దగ్ధం చేసేసుకోవచ్చు. పూర్తిగా మార్చేయొచ్చు.

***గహనా కర్మణో గతిః*** - కర్మ యొక్క గతి గురించి చెప్తున్నాను. అంతే తప్ప కర్మ చేయటం గురించి శ్రీకృష్ణుడు మాట్లాడటం లేదు. కర్మ యొక్క గతి గురించి చెప్తున్నాడు.

అది "సంచితకర్మ" గతిగా మారుతోందా?
"ప్రారబ్ధకర్మ" గతిగా మారుతోందా?
"ఆగామీకర్మ" గతిగా మారుతోందా?

- ఆగామీ కర్మను, సంచిత కర్మను కచ్చితంగా మనం పూర్తిగా మార్చేసుకోవచ్చు. మనం దేన్ని మార్చుకోలేం అంటే, ప్రారబ్ధకర్మను మార్చుకోలేం.

ఈ భౌతిక శరీరం రావటానికి సూర్యుడు యొక్క ద సోకాల్డ్ చిత్రగుప్త కిరణం దేన్నయితే నిర్ణయించుకుందో, దాన్ని మాత్రం మీరు మార్చలేరు. వాళ్ళు ఎక్కడ ఏ జాతిలో, ఏ వంశంలో పుట్టారో, ఏ జెనెటిక్ కోడ్‌తో, ఏ రంగుతో, ఏ బుద్ధి విశాలత్వంతో పుడతారో, ఆ విశాలత్వంతో పుడతారు.

కానీ ఈ ప్రారబ్ధకర్మను సూర్యుడు యొక్క ప్రారబ్ధ కర్మగా మార్చుకున్నవాళ్ళ స్టేటస్‌లో ఏమిటో చూసుకోండి.

మాలపిచ్చమ్మ! ఏమీ చదువుకోలేదు. కానీ ప్రారబ్ధ కర్మను సవ్యంగా అవగాహన చేసుకుంది. చెప్పుకుంటున్నాంకదా! కబీరుదాసు, మీరాబాయి, తులసీదాసు, విభీషణుడు, ఉడత, రకరకాలైన జీవప్రాణికోటులు అన్నీ కూడా ఎప్పుడైతే కరెక్ట్‌గా జీవించటం నేర్చుకుంటామో, మనకి ఆ ప్రారబ్ధకర్మ యొక్క భారం మనకి తెలియదు.

***ఎంచేత?***

సూర్యుడు దగ్గరకి తీసుకుని వెళ్ళటానికి మాత్రమే ఆ ప్రారబ్ధకర్మ ఉపయోగపడుతుంది.

మనం సూర్యుడు దగ్గరకి వెళ్ళకుండా, దేని కోసము అయితే ఆ కిరణం వల్ల మానవజన్మ ఇవ్వబడిందో, అది తప్ప మిగతా పనులన్నీ చేస్తున్నాం. మానవజన్మ చిత్రగుప్తుడు అనే కిరణం వల్ల ఇవ్వబడుతుంది అని చెప్పానుకదా!

ఈ చిత్రగుప్తుడే రాహుకేతువులు.

-- అందుకే జ్యోతిశ్శాస్త్రంలో రాహుకేతువులకి ఇవ్వబడిన రంగులు కూడా చిత్రవిచిత్రంగా ఉంటాయి.

రాహువు, కేతువులు రెండూ విరోధమైనటువంటి గ్రహాలుగా మనం చెప్పుకుంటూవుంటాం. ఒకటి తల, ఒకటి తోక అని కూడా చెప్పుకుంటూవుంటాం. దాని గురించి శ్రీకృష్ణుడు ఏం చెప్పున్నాడో చూడండి.

*కర్మణ్యకర్మ యః పశ్యేదకర్మణి చ కర్మ యః*
*స బుద్ధిమాన్ మనుష్యేషు స యుక్తః కృత్స్నకర్మకృత్.*

(భ.గీ. 4-18)

ఎవడు కర్మమునందు అకర్మమును, అకర్మమునందు కర్మమునుజూచునో ఆతడు మనుజులలో వివేకవంతుడును, యోగ యుక్తుడును, సకలకర్మలనాచరించిన వాడును నగుచున్నాడు.

భలే జవాబు చెప్పూవుంటాడు శ్రీకృష్ణుడు. ఇంతకీ ఏం చెప్పాడో నాకు అర్థం కాలేదు. అందుకే *గహనా కర్మణో గతిః* అన్నాడు.

కర్మ, అకర్మ! పేర్లలోనే అర్థమవుతోందికదా!

కర్మ అంటే మీరు ఏం చేయాలో అది.

అకర్మ అంటే ఏది చేయకూడదో అది.

నువ్వు కన్ఫ్యూజ్ అవుతున్నావు. పెద్ద పెద్ద పండితులు కూడా కన్ఫ్యూజ్ అవుతున్నారు. నీకు ఏ విధమైన కన్ఫ్యూజనూ లేకుండా చాలా సింపుల్‌గా చెప్పేస్తున్నాను అని కర్మ అంటే, అకర్మ అంటే ఏమిటో చెప్తున్నాడు.

కర్మలో ఎవరైతే అకర్మను చూస్తారో, అకర్మలో కర్మను చూస్తాడో, వాడు మహా పండితుడు.

ఇంతకీ ఏం చెప్పాడు?

అందుకే చిత్రగుప్తుడు అనేది. రాహువు, కేతువులకి రోజులు ఇవ్వబడలేదు. ఏడు గ్రహాలే మన జీవితాన్ని కంటిన్యూ చేస్తూవుంటాయి. ఏడు గ్రహాలే అలా అలా 52 వారాలుగా మారతాయి. 52 వారాలు సంవత్సరాలుగా మారతాయి. సంవత్సరాలు మళ్ళా యుగాలుగా మారుతూ వుంటాయి. కానీ మల్టిప్లికేషను ఈ ఏడు రోజులే. వీటి నుంచి రిపిటీషన్ ఆఫ్ దోజ్ 7 డేస్. మిగతావేం లేవుకదా! వీటి మధ్యన రాహువు, కేతువులు ఇరుక్కుంటారు.

ఈ రాహువు, కేతువు యొక్క విచిత్రమైనటువంటి పని ఏమిటో అర్థం చేసుకుందాం.

**ఇందాక మనం ప్రారబ్ధకర్మ అంటే ఏం చెప్పుకున్నాం?**

ప్రారబ్ధకర్మ అంటే మన జీవితాలను సూర్యుడుతో సమానంగా మార్చేసేటటువంటి కర్మ. అలాంటి కర్మనే తీసుకుని మానవజన్మ పుడతాడు. అలాంటి కర్మ లేనివాడు మానవజన్మలో పుట్టలేడు.

**మళ్ళా జాగ్రత్తగా అర్థం చేసుకోండి,**

మానవశరీరధారియై పుట్టాము, ఆ ప్రారబ్ధం మనకి ఉంది అంటేనే అర్థం ఏమిటి అంటే, మనం కచ్చితంగా సూర్యుడు యొక్క స్థితికి ఎదగగలము.

సూర్యుడు యొక్క స్థితికి ఎదగటానికి కావలసిన కర్మలు ఎలా చేయాలో, దానికి కావలసినటువంటి పరిస్థితులే మీకు ఇవ్వబడతాయి. అంచేత,

-- మీరు పరిస్థితుల్ని వెతుక్కుంటూ ఎక్కడికీ వెళ్ళక్కర్లేదు. మీరు ఎక్కడున్నారో అక్కడే ఈ ప్రారబ్ధకర్మను ఉపయోగించుకుని ఈ సూర్యవిద్యను నేర్చుకోవచ్చు.

**ఎలా నేర్చుకోవాలి అంటే,**

రెండు రకాలైనటువంటి కర్మలు ఉంటాయి.

చేయదగినటువంటి కర్మలు ఉంటాయి,

చేయకూడనటువంటి కర్మలు ఉంటాయి.

చేయవలసినటువంటి కర్మలు చేయాలి.

చేయకూడనటువంటి కర్మలు చేయకూడదు.

ఇది మళ్ళా మన శరీరంలో ఉన్నటువంటి గ్రహాలు, జాతక చక్రంలో ఉన్నటువంటి గ్రహాలు, ఇవంతా తెలిసినటువంటి పరమ పరమ మహా అద్భుతమైనటువంటి జ్యోతిశ్శాస్త్రవేత్తలు, వాళ్ళకి కూడా అర్థం కాదు. *గహనా కర్మణో గతిః* అది కూడా శ్రీకృష్ణుడే చెప్తున్నాడు. అది చెప్తూ ఒక సింపుల్ ట్రిక్ చెప్తున్నాడు.

*ఏమిటి ఆ సింపుల్ ట్రిక్కు?*

ఏది కర్మో, ఏది అకర్మో నువ్వు గందరగోళం పడక్క రలేదు. కర్మలో అకర్మని, అకర్మలో కర్మని చూడటం అంటే,

నువ్వు ఏం చేస్తున్నావో, దాని గురించి నువ్వు వర్రీ కాకు.

శ్రీకృష్ణుడు ఎంత సింపుల్‌గా సొల్యూషన్ ఇచ్చాడో చూడండి. దాన్నే మనం ఈ సాధనా శిబిరంలో ఎప్పుడూ ఏం చెప్పుకుంటాం అంటే,

నేచర్ ఈజ్ ఆల్వేస్ రైట్.

జరిగింది కరెక్ట్. అది ఏదైనా కావచ్చు. అది కర్మ కావచ్చు, అకర్మ కావచ్చు. వాడి కర్మ అది. అది మనకి అనవసరం. జరిగిందికదా అది. ఇట్ హేజ్ హేపెన్డ్. జరిగింది ఏదో జరిగింది. చేసింది ఏదో చేసేశాం.

*ఎక్కడ నువ్వు తప్పు చేస్తున్నావు?*

అది నేను చేశాను అనే భావన తెచ్చుకుంటున్నావు. ఆ భావన వదిలేయి అని రెండో అధ్యాయంలో చెప్పాడు, మూడవ అధ్యాయంలో చెప్పాడు.

*అంచేత మొత్తం జ్ఞానయోగంలో ఆయన చెప్పేది ఏమిటంటే,*

నువ్వు పనులు చెయ్. సాధ్యమైనంత వరకు నీకు అర్థమైనట్టు సూర్యవిజ్ఞానాన్ని ఉపయోగించుకో. గ్రహాలు యొక్క గతుల్ని తెలుసుకో. నీ శరీరంలో గ్రహాలు ఎక్కడు న్నాయో తెలుసుకో. పెద్ద పెద్ద పండితులకి ఇవంతా తెలిసినా కూడా వాళ్ళూ తప్పు చేయొచ్చు. ఏమీ తెలియని వాడు కరెక్టే చేసేస్తాడేమో ఒకొక్కసారి, తెలియదు.

కానీ ఏది జరిగినా, కర్మలో అకర్మని, అకర్మలో కర్మని ఎవడైతే చూడగలుగుతాడో,

*అంటే అక్కడ జ్ఞానయోగంలో శ్రీకృష్ణుడు ఏం చెప్తున్నాడు?*

నువ్వు చేసే ప్రతీ పని వెనకాతల ఒక విచిత్రమైన శక్తి పనిచేస్తూవుంటుంది. సూర్యుడు యొక్క శక్తి మాత్రమే కాకుండా మన శరీరంలో నిబిడీకృతమైనటువంటి ఒక శక్తి ఉంది. దాన్నే మనం కుండలినీ శక్తి అని పిలుస్తూవుంటాం. ఆ కుండలినీ శక్తి వైపు ఇండికేట్ చేస్తున్నాడు ఇక్కడ.

ఆ కుండలినీ శక్తి ఎలాగ ప్రారబ్ధకర్మ వైపు మనుష్యుల్ని తీసుకెళుతుందో తరవాత శ్లోకంలో చెప్తాడు.

ఈ శ్లోకంలో మాత్రం ఎంత వరకు చెప్తున్నాడో మీకు అర్థమయిందికదా! మన ఉద్దేశ్యం ఏమిటి? మన ప్రారబ్ధకర్మ మనల్ని సూర్యుడితో సమానంగా చేయగలదు. ఈ జన్మలోనే. సూర్యుడితో సమానంగా చేయగలిగే ప్రారబ్ధ కర్మ ఉన్న వ్యక్తే మానవ శరీరంలో పుడతాడు.

- బైచాన్స్ వాడు చేసుకున్నటువంటి కర్మలు ఈ ప్రారబ్ధ కర్మకి అనుకూలంగా లేకపోతే మళ్ళా వాడు క్రింద యోనులకు కూడా వెళ్ళవచ్చు.

*శిరిడీ సాయి చెప్తాడుకదా,*

నాతో పాటు ఒకే గురువు దగ్గర జీవించిన వాళ్ళు మేకలుగా పుట్టారు. మేకలుగా ఏముంది, కప్ప, బల్లి, పాము, రకరకాలైన యోనుల్లో పుట్టొచ్చు.

- కానీ మానవజన్మ ఎత్తాం అంటే, ఎంత అదృష్టమో ఊహించుకోండి. దీన్ని వేస్ట్ చేసుకోవద్దని చెప్పటానికి. అంతే తప్ప భయపెట్టటానికి కాదు ఇదంతా చెప్పేది.

అంచేత ఇంత అద్భుతమైన అవగాహనకి వచ్చి, ఇంత అద్భుతమైనటువంటి విద్య ఉంది అని తెలుసుకుని, ఆ విద్యని సాధించటానికే మీకు ఈ మానవ శరీరం లభించినది అని తెలుసుకున్న తరవాత, ఏది చెయ్యాలో, ఏది చెయ్యలేనో అని మీమాంశలో పడి ఆగిపోతే ఎలా?

నేను మీకు ఒక కథ చెప్పానుకదా, జెర్రి నడుస్తోం దిట. సెంటిపీట్, వంద కాళ్ళు ఉంటాయంటాం దానికి. తుంటరి కుర్రాళ్ళు ఉంటారుకదా, వాడు దాన్ని అడిగాట్ట. వాడు ఎలా అడిగాడు, ఎలా మాట్లాడాడు అని అడక్కండి నన్ను. కథ అంతే. వాడు అడిగాట్ట, "మాకు రెండు కాళ్ళే ఉన్నాయి. అయినా మేము నడక నేర్చుకోవటానికి ముందు కుడి కాలు వెయ్యాలా, ఎడం కాలు వెయ్యాలా అని ఎంత కష్టపడతామో! నీకు వంద కాళ్ళు ఉన్నాయి. ఇంతకీ నువ్వు ఏ కాలు ముందు వేసి నడిచావు?"

అది అక్కడే ఉందిట ఇంకా. ఏ కాలు ముందు వేసిందో అది ఆలోచిస్తూ ఉందట.

అంచేత కిం కర్మ కిమకర్మేతి, ఏది చెయ్యొచ్చు, ఏది చెయ్యకూడదు అనే ఆలోచనలో పడి ఆగిపోతావేమో, ఆగి పోకు. ఏమీ కంగారు పడకు.

నువ్వు ఏం చేస్తే అదే రైటు.

**ఎంచేత?**

మన చుట్టూరా ఉన్న గ్రహాల యొక్క శక్తి, ప్రకృతి యొక్క శక్తి ముందు మన శక్తి ఎంత?

- అంచేత నీకు ఇష్టమున్నా, లేకపోయినా చచ్చినట్టు నువ్వు చేసే పనిని అది మంచి వైపుకే తోస్తుంది.
- నువ్వు కూడా సహాయపడితే సహాయపడు. సహాయ పడకపోయినా అది నిన్ను మెడ వంచి మరీ తీసుకెళు తుంది అనే భావనని అర్థమయ్యేటట్టు చెప్పు,

స బుద్ధిమాన్ మనుష్యేషు - వాడు బుద్ధిమంతుడు అయినటువంటి మనిషి.

స యుక్తః కృత్స్నకర్మకృత్ - వాడు అన్ని రకాలైనటువంటి చేయవలసిన పనులు చేసిన వాడు అవుతాడు.

ఇక్కడ నుంచి భారతదేశంలో ఆధ్యాత్మిక సాంప్రదాయంలో ఎన్ని రకాలైన యోగాలు ఉన్నాయో అన్నిటినీ చెప్పుకుంటూ వస్తాడు. ఒక్క దాన్నీ శ్రీకృష్ణుడు మిస్ చేయడు. ఎంత అద్భుతంగా చెప్తాడో చూడండి.

యస్య సర్వే సమారమ్భాః కామసంకల్పవర్జితాః
జ్ఞానాగ్ని దగ్ధకర్మాణం తమాహుః పణ్డితం బుధాః. (4-19)

ఎవనియొక్క సమస్తకర్మలు కోరిక, సంకల్పము అనునవి లేకయుండునో, జ్ఞానమను అగ్నిచేత దహింపబడినకర్మలుగల అట్టివానిని పండితుడని విజ్ఞులు పేర్కొందురు.

నువ్వు పండితుడివి అవ్వదల్చుకుంటే, అంటే, శాస్త్రజ్ఞానంలో కాదు, ప్రారబ్ధ కర్మ, ఆగామీ కర్మ, సంచిత కర్మ, ఈ విషవలయంలోంచి బయటపడదల్చుకుంటే, నువ్వు చేయవలసినవి రెండే రెండు పనులు ఉన్నాయి.

1. సర్వారంభ పరిత్యాగి - దేన్నీ నీ అంతట నువ్వు మొదలెట్టకు. మనం ముహూర్తం చూసుకుని పని మొదలెడతాం. అది చెయ్యొద్దు అంటాడు.
2. కామసంకల్పవర్జితాః - ఏ కోరికలూ ఉంచుకోకు. ఏ సంకల్పమూ లేకుండా జీవించు.

దీన్నే ఈనాడు అచల యోగం అని, అమనస్క యోగం అని, రమణ మహర్షి మేన్ నో దై సెల్ఫ్, హూ యామ్ ఐ? నేను ఎవర్ని అనే యోగవిద్యతో స్టార్ట్ అయింది. ఎన్ని యోగాలు చెప్పుకొస్తాడో చూడండి. మొదటి శ్లోకంలో 3 యోగాలు చెప్తున్నాడు. అమనస్క యోగము.

**కోరికలు ఎక్కడ్నుంచి వస్తాయి?**

మనస్సు ద్వారా వస్తాయి. మనస్సులో వచ్చే కోరికలు వస్తూవుంటాయి అంతే. ఇప్పుడు గాలి వచ్చింది, ఆకు లేచింది. గాలి తగ్గింది, ఆకు నేల మీద పడిపోయింది. మళ్ళా గాలి వచ్చింది. ఇంకో దిశకు ఆకు వెళ్ళింది.

ఒక చెట్టు క్రింద ఒక 70 ఏళ్ళ ముదుసలి వ్యక్తి చైనాలో కూర్చున్నాడు. ఒక ఎండుటాకు రాలి క్రింద పడింది. ఆ ఆకు రాలి క్రింద పడటానికి టైమ్ ఎంత పడుతుందో మీరు ఊహించగలరుకదా. క్షణంలో అతనికి జ్ఞానోదయం అయింది. లావోట్సే అతని పేరు. ఈ అమనస్క యోగాన్ని విదేశాలలో కూడా తనదైన పంథాలో అతను చెప్పుకొచ్చాడు.

లావోట్సే చెప్పిన యోగంకాని, ఇక్కడ జ్ఞానాగ్ని అనే పేరుతో శ్రీకృష్ణుడు చెప్తోన్న విధానం కాని చాలా సింపులు. మీరు కొంచెం ప్రయత్నిస్తే సాధించేయగలుగుతారు.

- కోరికలు వస్తూవుంటాయి. కోరికలు వెళ్ళిపోతూ ఉంటాయి. వాటిని చూస్తూవుండండి. గమనిస్తూ ఉండండి. వాటి వైపుకు మీరు వెళ్ళకండి. స్థిరంగా కూర్చోండి. కామసంకల్పవర్జితాః

మరి అలా స్థిరంగా కూర్చుంటే మనకి తిండి ఎవడు పెడతాడు? అంచేత తరవాత కండిషన్ పెట్టాడు.

**ఏమని పెడతాడు కండిషను?**

నీ నిత్య జీవితయాత్రకి కావలసిన పనులు అయితే చేసుకో, నీ బాధ్యతలు నిర్వర్తించే పని అయితే చేసుకో. అభ్యంతరం లేదు.

న్యూస్ పేపర్ చదవాలని ఉంది. టీ త్రాగాలని ఉంది. సిగరెట్ త్రాగాలని ఉంది. పిల్లవాడు మట్టిలో ఆడుకుంటున్నాడు. వెధవ! ఆడుకోకు అని తిట్టాలని ఉంది. ఇవేం పనికిరావు.

ఆకలేసింది, అన్నం పెట్టమని అడగొచ్చు. లేకపోతే మీరు వెళ్ళి దాహం తీర్చుకోవచ్చు. ఆఫీసుకి టైమ్ అయింది. కామసంకల్పవర్జితాః అని శ్రీకృష్ణుడు చెప్పాడు కనుక నేను ఆఫీసుకు వెళ్ళను అంటే ఈ సాధనలో ఒప్పుకోడు.

*ఎంచేత?*

అది ప్రకృతిలోని భాగమే. ప్రకృతి యొక్క ఒక విశాల పరిణామక్రమంలో ఆ ఆఫీసులో పనిచేసే ఒక బాధ్యత నీకు ఉంది కనుక చేస్తున్నావు తప్ప, అక్కడేదో వస్తుందని కాదు. బాధ్యత, బాధ్యత, బాధ్యతను గుర్తుంచుకోండి. అమనస్క యోగము అని దీనికి పేరు.

అచల యోగము అని ఇక్కడ ఎక్కడో విజయవాడ వెనకాతల ఉందన్నారు. ఆ అచల యోగం కూడా ఇదే. చలించం దేనికీ. ఈ యోగం అర్థం చేసుకోండి.

యస్య సర్వే సమారమ్భాః - వాడంతట వాడు ఏ పనీ మొదలెట్టడు. దాన్నే మనం నేచర్ ఈజ్ ఆల్వేస్ రైట్ అని చెప్పుకున్నాం. ఎక్కడ ఏం జరిగితే అది జరుగుతుంది.

జ్ఞానాగ్ని దగ్ధకర్మాణం - ఈ విధమైన జ్ఞానం ఎప్పుడైతే వస్తుందో, మీ అన్ని కర్మలూ సమసిపోతాయి. అసలు ఆ కర్మలకి విలువ ఉండదు. అవి మిమ్మల్ని ఏమీ చేయలేవు. మీరు సహజంగానే జీవన్ముక్త స్థితిలో జనక మహారాజు వాళ్ళు ఎలా జీవించారో, అలా జీవిస్తారు.

ఈ స్థితి చేరుకోవటానికి మీరు ఎన్ని రోజులు, ఎన్ని గంటలు సాధన చెయ్యాలో ఆలోచించుకోండి. ఏమీ సాధన చెయ్యక్కర్లేదు. ఆ మూడ్‌లో ఉండాలి.

*కానీ ఏమిటా మూడ్?*

ఇంక మీరు కదలకూడదు.

"మరి దోమ కుట్టింది, గోక్కోవచ్చా?"

నేచురల్ అది. హాయిగా గోక్కోవచ్చు, దోమని చంపేయవచ్చు. చాలా సార్లు శిరిడీసాయి ఉదాహరణ చెప్తూవుంటానుకదా! ఈ ఇంట్లోనే జరిగింది ఆ సంఘటన.

ఒకరోజు నేను పాలు కాచుకోబోతున్నాను. ఈ లోపల మా స్నేహితుడు ఒకతను విజయవాడ నుంచి వచ్చాడు. ఏదో రెండు నిమిషాలు, మూడు నిమిషాలు మాట్లాడతాడుకదా అని నేను స్టవ్ ఆపేసి వచ్చేశాను. కానీ మన రెండు నిమిషాలు, మూడు నిమిషాలు సహజంగానే ఒక గంటా, రెండు గంటలు అయింది.

ఈ లోపల వంటింట్లో చప్పుడు అయింది. వెళ్ళి చూస్తే పిల్లి పాలు త్రాగేసింది.

"రామకృష్ణా! నువ్వు చాలా అదృష్టవంతుడివి, శిరిడీ సాయి వచ్చాడు, పాలు త్రాగాడు" అన్నాడు.

"అబ్బా, నా అదృష్టం!" అని చాలా ఆనందించాను.

"అయినా తలుపు ఎందుకు వేసుకోలేదు?" అన్నాడు.

అక్కడ బాధపడ్డాను. శిరిడీసాయి స్వయంగా వచ్చి పాలు త్రాగితే ఆనందించాలా? తలుపులు వేసుకోవాలా?

శ్రీ మాటలతో అలాంటి మోసాలు మనల్ని మనం చేసుకోవద్దు. మీరు నిజంగా పిల్లే శిరిడీసాయి అనుకుంటే ఆరతులు ఇవ్వండి, నాకేం అభ్యంతరం లేదు.

కానీ శిరిడీసాయి కనుక నా దగ్గరకి వస్తే, నేను మాత్రం ఒకటే చెప్తాను, "నాయనా నువ్వు పిల్లి వేషంలో రాకు. కుక్క వేషంలో రాకు. హాయిగా నిన్ను గుర్తించగలిగే వేషంలో రా. మేము అజ్ఞానులము అని నీకు తెలుసుకదా! మా అజ్ఞానాన్ని నువ్వు ఎందుకు టెస్ట్‌లో పెడతావు?"

*ఎందుకు ఈ ఉదాహరణ ఇస్తున్నాను అంటే,*

కథల్లో చదివి వాగాడంబరమే తప్ప, మనకి ఆ జంతువులలో సాయి ఉన్నాడనే అనుభూతి లేదు. అనుభూతి లేనప్పుడు నటన వద్దు. కుక్కలు అవీ వస్తే కొట్టండి.

శ్రీ గౌరవించవలసిన వాటిని గౌరవిస్తాం. గౌరవించకూడని వాళ్ళని గౌరవించం. ప్రశ్నే లేదు.

జ్ఞానాగ్ని దగ్ధకర్మాణం - జ్ఞానాన్ని ఉపయోగించుకోండి.

*జ్ఞానం ఎందుకు ఇచ్చాడు?*

శ్రీ కుక్కలో దేవుణ్ణి చూడమనికాని, కుక్కని సింహాసనం మీద కూర్చోపెట్టమని కాదు.

యస్య సర్వే సమారమ్భాః - ఏ యాక్టివిటీని మొదలెట్టడో,

కామసంకల్పవర్జితాః - ఏ విధమైనటువంటి కోరికలూ లేవు, ఏమీ సంకల్పించడు.

ఈ సంకల్పం యొక్క కొంప ముంచే లక్షణం మనకి మహాభారతంలోనే కనిపిస్తుంది. శ్రీకృష్ణుడు నేను అస్త్రాన్ని ముట్టను, యుద్ధం చేయను అని ప్రతిజ్ఞ చేశాడు. భీష్ముడూ ప్రతిజ్ఞ చేశాడు, నేను పెళ్ళి చేసుకోను.

ఏమిటి తేడా? భీష్ముడు ఎప్పుడైతే విజృంభించాడో, శ్రీకృష్ణులుంగారు ఆయన సంకల్పాన్ని మర్చిపోయారు.

ధన్‌మని చక్రాన్ని ఎత్తాడు. మళ్ళా అర్జునుడు వెళ్ళి కాళ్ళ మీద పడి "నాయనా, నా పేరు పోతుంది. నేను రక్షించు కోలేని వాడిని అయ్యాను అంటారు అందరూ. దయచేసి నువ్వు కాస్త శాంతించు" అంటే ఊరుకున్నాడు.

మరి భీష్ముడు? తండ్రి కోసం మాట ఇచ్చాడు. తల్లికి ఇచ్చిన మాటేకదా, సత్యవతికి ఇచ్చిన మాటే కదా! ఆ తల్లే మళ్ళా ఏం కోరింది? నువ్వు మళ్ళా పెళ్ళి చేసుకో.

అది చేసి ఉంటే, అసలు మహాభారతం వచ్చేదే కాదేమో! కామసంకల్పవర్జితాః నేను ఆ సంకల్పం తీసుకున్నా నుకదా, ఇంక అంతే మూర్ఖంగా నేను చేసే తీరతాను!

"ఇదేదో బాగుంది మాస్టారు! ఉపవాసం ఉందా మనుకున్నాను. మీరు చెప్పారుకదా, అంచేత ....."

శ్రీ ఆహాఁ, మళ్ళా మిమ్మల్ని మీరు మోసగించుకోకండి.

ఉ ఉపవాసాలు అవంతా కూడా ఒక విశేషమైనటువంటి ఆధ్యాత్మిక ఔషధాలు. రుచిగా లేదని మీరు ఔషధం తీసుకోను అంటే ఎట్లా?

జ్ఞానాగ్ని, జ్ఞానాన్ని ఉపయోగించుకోండి.

జాగ్రత్త! గబుక్కుని ఇష్టం వచ్చినట్టు అన్వయించు కోకండి. గహనా కర్మణోగతిః అని చెప్పింది అందుకే.

భీష్మ స్తవరాజమని మహాభారతంలో అద్భుతమైన శ్లోకాలు ఉన్నాయి. భీష్ముడు శ్రీకృష్ణుడ్ని స్తుతిస్తాడు. కానీ ఆ స్తుతింపుకి అర్థం ఉందా ఏమైనా? మీరు ఆలోచించండి.

నేను అర్జునుడి వైపు దెబ్బలాడుతున్నాను అని ఎదురుగుండా శ్రీకృష్ణుడు రథం మీద నించుని ఉన్నాడు. భీష్ముడు శ్రీకృష్ణుడి భక్తుడు.

### *భక్తుడు ఏం చేయాలి?*

సరెండర్ అయిపోవాలికదా! అయితే అసలు మహాభారతయుద్ధం అప్పుడే జరిగుండేది కాదేమో! అసలు ఏమైయ్యుండేదో! పరిస్థితి మనం ఊహించలేం.

అందుకే ఇందాకే చదువుకున్నాం, అకర్మలో కర్మ, కర్మలో అకర్మ. అంచేత ఏది జరిగిందో అది రైటే. అంత వరకూ ఓకె. కానీ కామసంకల్పవర్జితాః అనే పదాన్ని అర్థం చేసుకోవటంలో జాగ్రత్తగా ఉండండి.

శ్రీ కోరికలు ఉన్నాయి. ఆ కోరికలు ఇతరుల్ని బాధ పెట్టకుండా, మీ ఆరోగ్యానికి బాధ కలగకుండా, మీ జీవిత విధానానికి ఏ విధమైన అపశ్రుతి రాకుండా ఉంటే, ఏమీ పర్వాలేదు. ఆ జ్ఞానం ఉండాలి.

శ్రీ అలాగే సంకల్పం. మీరు ఏదో సంకల్పం తీసుకు న్నారు. ఆ సంకల్పానికి అనుగుణ్యమైనటువంటి వాతావరణం లేదు. జ్ఞానాన్ని ఉపయోగించుకుని ఆ సంకల్పాన్ని మీరు విడుదల చేసుకోవచ్చు.

అంచేత చూడటానికి ఈ యోగం చాలా సింపుల్‌గా కనిపించినా కొంచెం ప్రమాదకరమైనదే. అంచేత మళ్ళా దాన్ని జాగ్రత్తగా చూడండి.

*యస్య సర్వే సమారంభాః* - ఎవడైతే అన్ని సమారంభాలు, ఆల్ ఓపెనింగ్ సెర్మనీస్ చేయడో,


**కామసంకల్పవర్జితాః** - డిజైర్స్ లేవు, సంకల్పాలు లేవు.

**జ్ఞానాగ్ని దగ్ధకర్మాణం** - వాడి కర్మలు అన్నీ కూడా జ్ఞానాగ్ని లోంచి వెళుతూవుంటాయి. వాడు చేసే ముందు ఇది చెయ్యాలా, ఇది చెయ్యకూడదా అని జ్ఞానాన్ని ఉప యోగించి నిర్ణయించుకుంటాడు.

**తమాహుః పణ్డితం బుధాః** - అలాంటి వాడ్ని పండితుడు అని అంటారు.

ఈ అమనస్క యోగంతో, ఈ జ్ఞానాగ్నితో ఇవాళ మనం ఆపుదాం. రేపు తరవాత యోగాలు గురించి చర్చించుకుందాం. ఆ మానసికస్థితిలో కొంత సేపు ఉందాం.

స్వస్తి.



# భగవద్గీత ఉపన్యాసాలు - 27

## జ్ఞానయోగము

1998, నవంబరు 26 వ తారీఖున సుకృతవిల్లా, గుంటూరులో మాస్టరుగారు భగవద్గీతపై ఇచ్చిన ఉపన్యాసము



- చంద్రుడు, అగ్నిల కలయికే సూర్యుడు
- సూర్యుడి సహస్రకిరణాల వర్ణనే వివిధ దేవతా సహస్రనామాలు
- మనకి సంకల్పాలు లేవు, కోరికలే ఉన్నాయి
- బ్లూ కలర్ వైపు వెలుతోన్న మానవ జీవితం
- నాలుగు వర్ణాలూ కలిసిపోయే పరిస్థితి రావాలి
- నాలుగు యుగాలూ ఒకేసారి నడుస్తూవుంటాయి
- దేవతల భాష - రంగుల భాష
- 770 ప్లానెట్స్ - 770 జన్మలు
- చంద్రుడి నుంచి వచ్చే కిరణాలే నిత్యలు
- తిథి, వార, నక్షత్రాల కలయికతో అగ్ని ఉత్పత్తి అవుతుంది

ఆధ్యాత్మిక జగత్తులో యోగవిద్య గురించి మనం మాట్లాడుకుంటున్నాం. అందులో జ్ఞానయోగం గురించి, అంటే భగవద్గీత యొక్క నాలుగవ అధ్యాయం గురించి అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేస్తున్నాం.

యోగవిద్య అనేసరికల్లా అనేక యోగాల పేర్లు మనకి గుర్తొస్తూవుంటాయి. మంత్రయోగము, లయ యోగము, హంసయోగము, కుండలినీ యోగము, రక రకాల యోగాలు. కానీ యోగవిద్య అంటే పురాతన కాలంలో ఒకటే యోగవిద్య, అనేక యోగవిద్యలు లేవు.

కెమిస్ట్రీ అంటే ఒకటే కెమిస్ట్రీ ఉంటుంది. ఫిజిక్సు అంటే ఒకటే ఫిజిక్సు ఉంటుంది. అందులో సబ్ బ్రాంచెస్ ఉండొచ్చు, అది వేరే విషయం. కానీ ఆ విషయం యొక్క అవగాహన, దేని గురించి మనం మాట్లాడుకుంటున్నామో అది ఒక విషయం గురించే అయివుంటుంది.

యోగవిద్య కూడా ఒక విషయం గురించే చెప్తుంది. సూర్యుడు, సూర్యుడు యొక్క ప్రభావము. అంతే!

అది మర్చిపోయి ఈ రకరకాల దేవతల యొక్క ఉపాసనలు, రకరకాల సాధనలు ఏర్పడ్డాయి. ఎందుకు ఏర్పడ్డాయి, ఎలా ఏర్పడ్డాయి అన్నది క్రమక్రమంగా మనకి భగవద్గీతలోనే చెప్పుకొస్తాడు.

కానీ టెక్నాలజీ ఎంత డెవలప్ అయినా, అసలు దీన్ని టెక్నలాజికల్ ఏరా అని చెప్పొచ్చు మనం. కానీ ఇదంతా ఒక్క ఎలక్ట్రిసిటీ మీద ఆధారపడివుంది. ఎలక్ట్రిసిటీ లేకపోతే మొత్తం టెక్నాలజీ ఎగిరిపోతుంది.

❁ అలాగే సూర్యుడే లేకపోతే మొత్తం యోగవిద్య ఎగిరిపోతుంది. ఎలక్ట్రిసిటీ లేకుండా మీరు ఎంత అద్భుతమైన సెట్ తయారుచేసి పెట్టుకున్నా ఫలితం ఉండదు.

-- మన ఆధ్యాత్మిక జీవితంలో కూడా అదే జరుగుతోంది.

ఒక లలితా సహస్రనామాన్నికాని, ఒక విష్ణు సహస్ర నామాన్ని కాని, ఏ దేవత యొక్క సహస్రనామం గురించి అయినా మనం తీసి చూస్తే, ఎవరు ఏవి కోరుకుంటే, అది ఆ సహస్రనామ పారాయణ వల్ల కచ్చితంగా జరుగుతుంది అని వాళ్ళు అద్భుతమైనటువంటి ఫలితాలు వ్రాస్తారు.

ఇప్పుడు ఇక్కడ జ్ఞానయోగంలో మనం అర్థం చేసుకోవలసింది ఏమిటంటే, ఎవరు రైట్ అని?

ఋషులు రైటా? మనం రైటా?

మనం చదువుతున్నాం. కానీ ఆశించిన ఫలితాలు కచ్చితంగా లభించటం లేదు. కొంత వస్తున్నాయి, అది వేరే విషయం. కానీ ఈ సహస్రనామాల్లో కాని, స్తోత్రాలలో కాని, ఋషులు చెప్పిన మాటల్లోకాని, వాళ్ళు చెప్పిన ఫలితాలు మనకి లభించటం లేదు.

రామ్ అంటే అన్ని పాపాలూ నశించిపోతాయి అని చెప్తాం మనం. ఒక రాజుని మూడు సార్లు రామ్ అనమన్నాట్ట ఒక ఋషి కుమారుడు. పూర్వకాలంలో రాజులు ఋషులు మీద చాలా బాగా ఆధారపడివుండేవారు. ఏ ప్రాబ్లమ్ వచ్చినా సరే ఋషులు దగ్గరకి పరిగెట్టుకుని వెళ్ళిపోయేవారు.

ఆ దేశపు రాజు ఏదో చాలా భయంకరమైన పాపం చేశాడు. పంచ మహాపాతకాల్లో ఒకటి అని పుస్తకాల్లో వ్రాస్తారు. అది ఏమిటో మనకి తెలియదు. అంటే చాలా పెద్ద పాపం చేశాడు. చేశాను అని గమనించాడు.

❁ ఈనాడు అయితే పాపం చేశాం అన్న గమనికే లేదు.

-- త్రేతాయుగం కంటే ముందు సంగతి చెప్తున్నాను. అప్పటికి ఇంకా రామావతారం రాలేదు. రాముడు అవతరించక ముందు జరిగిన సంఘటన ఇది.

తప్పు చేశాన్నేను. దీనికి నివారణ ఏమిటి? అని రాజు ఋషి ఆశ్రమానికి పరిగెట్టాడు. ఋషి టూర్‌కి వెళ్ళాడు, కేంప్‌కి వెళ్ళాడు. అక్కడ ఋషి లేడు, ఋషి కుమారుడు ఉన్నాడు.

మీరు ఇక్కడ కూడా అబ్జర్వ్ చేస్తూవుంటారు, డాక్టర్‌కంటే కాంపౌండర్‌ని మనం ఎక్కువ సార్లు మందు అడుగుతాం. డాక్టరు వరకూ ఎందుకని ఒకొక్కసారి మెడికల్ షాప్ వాడినే అడిగేస్తాం. ఆ మందు పనిచేస్తుంది.

అలాగే ఋషి లేడు కదా అని అక్కడున్నటువంటి ఋషి పుత్రుడ్ని అడిగాడు. "నాయనా! ఈ తప్పు చేశాన్నేను. దీనికి ప్రాయశ్చిత్తం ఏమిటి?"

మీరు ఈ కథలో అంతరార్థం తెలుసుకోండి. నేను ఈ కథలు ఎందుకు చెప్తానంటే, కథ కోసం చెప్పను, ఆ మానసికస్థితి మనకి ఉంటే తప్ప ఆ ఫలితాలు రావు అని.

భౌతిక జగత్తులో రాజు యొక్క స్థితి చాలా గొప్పది అయివుండొచ్చు. కానీ ఋషి పుత్రుడు నాలుగేళ్ళవాడో, ఐదేళ్ళవాడో అయినా కూడా నిర్మోహమాటంగా వాళ్ళు అడిగే వారు. చెప్పింది ఆచరించేవారు. మనం అది చూసుకోవాలి.

మనం గురువుల్ని ఎలా కొలుస్తామో చెప్పానుకదా, "హైకోర్టు జడ్జి కూడా ఆయన శిష్యుడుట!" నిజం అవునో కాదో కూడా తెలియదు. "అంచేత ఆయన గొప్పవాడు!"

ఠీ తరవాత పట్టించుకోం. ఆయన గొప్పవాడు అని అనుకుని ఊరుకుంటాం. గొప్పవాడు అయితే మరి నువ్వు ఎందుకు ఉపయోగించుకోవటం లేదు?

-- ఈ కథలన్నీ కూడా ఈ జాఢ్యం పోవాలని చెప్పేది.

సరే, ఆ కుర్రాడు ఏం చెప్పాడు అంటే, మూడు సార్లు రామ్ అనుకో, పోతుంది అన్నాడు.

ఠీ అప్పటికి రామావతారం జరగలేదు. అది గుర్తుంచుకోండి. అందుకు ఇది చెప్పేది.

మూడు సార్లు రామ, రామ, రామ అనుకో అన్నాడు, అనుకున్నాడు, పోయింది. సరే కుర్రాడు కాలరు ఎగరేసి ఉంటాడు. ఈయన పాప నివృత్తి అయిపోయింది కదా అని వెళ్ళిపోయాడు.

తండ్రి వచ్చాడు. ఋషి పుత్రుడు గొప్పగా చెప్పాడు, "ఇలాగ రాజు వచ్చి నన్ను అడిగాడు. నేను చెప్పేశాను, క్యూర్ అయిపోయింది."

అంటే ఆ జ్ఞానయోగంలో మీకు ఏ విధమైన జ్ఞానం రావాలో మనం ముందు అర్థం చేసుకోవాలి.

మనం చేసేటటువంటి పనులలో పాపం ఏది? అది ముందు తెలియాలి. దాని తరవాత ఆ పాపానికి తగిన పరిహారం కావాలి. పరిహారం చేశాక తగ్గిందా, లేదా?

జ్వరం వచ్చింది, లక్షణాలు తెలుస్తున్నాయికదా, సుఖంగా లేదు. దానికి పరిహారంగా పేరాసిట్‌మాల్ వేసు కుంటే టెంపరేచరు తగ్గుతుంది. తగ్గకపోతే పనిచేయలేదు.

- అంటే పేరాసిట్‌మాల్ పనిచేయదు అనం మనం. మనకి వచ్చిన జ్వరం పేరాసిట్‌మాల్‌తో తగ్గేది కాదు.
- దాని పరిహారం కోసము వేరొక విధానాన్ని మనం పట్టుకోవాలి.

ఇది జ్ఞానయోగంలో మనం నేర్చుకుంటాం. ఇప్పటికే మీకు అవగాహన వచ్చివుండాలి. లేకపోతే ఈ అధ్యాయం పూర్తయ్యే లోపల వీటి మీద మీకు పరిపూర్ణ అధికారం రాకపోయినా, అవగాహన మాత్రం వచ్చేయాలి.

- ఏది పాపము, ఏ పాపానికి ఏ విధమైన పరిహారం చేసుకోవాలి? ఆ పరిహారం చేసుకున్న తరవాత పరిహారము సక్సెస్‌ఫుల్ అయిందా, లేదా?

చాలా సార్లు ఆపరేషన్ సక్సెస్‌ఫుల్, ...............

ఆధ్యాత్మిక జగత్తులో అలా కాకూడదు. ఆపరేషనూ సక్సెస్‌ఫుల్ అవ్వాలి, పేషెంటూ సుఖంగా ఉండాలి.

తండ్రి వచ్చాడు. తండ్రి వచ్చి "ఆ తప్పుకి నువ్వు మూడు సార్లు రామనామం చెప్పావు. రామనామం యొక్క విలువ నీకు అర్థం కాలేదు. ఆ పాపానికి ఒకసారి రామ అంటే చాలు. ఎక్కువగా నువ్వు రామనామాన్ని ఉపయోగించుకోమని చెప్పావు కనుక ......"

మందు ఓవర్ డోస్ ఇస్తే ఏమవుతుంది?

"...... అంచేత నువ్వు మ్లేచ్ఛుడిగా పుట్టు!"

పూర్వకాలంలో త్రేతాయుగంలో మ్లేచ్ఛుడిగా పుట్టటం కంటే ఘోరమైనటువంటి శాపం లేదు. అతనే నిషాదుడుగా పుడతాడు. రాముడ్ని నది దాటించిన గుహుడు.

మరి ఆ రామనామము అంత గొప్పది అయితే, ఒకసారి అంటేనే పంచ మహాపాతకాలులోని పాతకం పోతే, మనకి వచ్చే రోగాలు, ఎంత భయంకరమైనటువంటి రోగం అయినా మనం పంచ మహాపాతకాలకి పోల్చదగిన పాపాలు ఏం చేయలేం. గుర్తుంచుకోండి.

- కలియుగంలో మనం చాలా చాలా అదృష్టవంతులం. ఆ స్థాయి పాపాలు మనం చేయలేం.
- మరి మనం రామ అంటే మన బాధలు ఎందుకు పోవటం లేదు? ఒకసారి అంటేనే పోవాలికదా? మరి ఎందుకు పోవటం లేదు?

ఎందుకు పోవటం లేదు అనే కారణానికి నేను మీకు ఇంకొక కథ కూడా చెప్పాను.

ఒక యోగి దగ్గర పరుసవేది ఉంది అని ప్రతీతి. ఆయన దాన్ని ఇనప్పెట్టెలో పెట్టి తాళం వేశాడు.

"పరుసవేదిని ఒక్కసారి చూపించండి సార్!" అని చాలా మంది ఆయన దగ్గరకి వచ్చేవారు. "అదిగో ఆ ఇనప్పెట్టెలో ఉంది చూడండి" అనేవాడు. వాళ్ళు రెండు అడుగులు ఇనప్పెట్టె వైపు వేసేసరి కల్లా, "మీకు ఆ పరుసవేది చూసే అర్హత లేదు, వెళ్ళిపోండి" అనేవాడు.

చిన్న కుర్రాడు వచ్చాడు. "తాతా! ఏదో పరుసవేది అట. ఇనుముని బంగారం చేసేస్తుందిట, అది నీ దగ్గర ఉందిట!" "ఉందిరా అది నాయనా! అదిగో ఆ ఇనప్పెట్టెలో ఉంది చూడు" అన్నాడు. "అబద్ధం చెప్తున్నావు" అన్నాడు.

ఋషినే అబద్ధం చెప్తున్నావు అన్నాడు. చాలా మంది ముక్కు మీద వ్రేలు వేసుకున్నారు. ఆనందించాడు. "నీకు ఉంది అర్హత, వెళ్ళి చూడు" అన్నాడు.

***ఎందుకు అర్హత వచ్చింది?***

పరుసవేది ఇనప్పెట్టెలో పెట్టి ఉంటే, ఇనప్పెట్టె బంగారంగా మారిపోవాలి. అసలా అవగాహనే రావటం లేదు. జ్ఞానయోగం. ఈ కథలన్నీ మనం వినేస్తాంకాని ఆ పాయింట్ చెప్పేంత వరకు మనకే ఐడియా రాదు. మనకే ఎందుకు? నాకే రాలేదు. ఆ కథ విన్నాక నాకు ఎందుకు తట్టలేదు ఆ పాయింట్ అనుకున్నాను. అంటే జ్ఞానం లేదు. ఆ జ్ఞానము!

రామ అనే శబ్దానికి అనంతమైన సామర్థ్యం ఉందని అనేక రకాలుగా ప్రూవ్ చేసిన వాళ్ళు ఈ యుగం లోనే ఉన్నారుగా! వేరే యుగం వరకూ ఎందుకు?

"త్రేతాయుగం సంగతి ఎందుకు చెప్తారు మాస్టారు" అంటే, ఈ యుగంలో లేరా రామభక్తులు? అద్భుతమైన రామభక్తులు ఉన్నారు.

మొన్ననే కాబోలు ఒక మూడు, నాలుగు నెలల క్రిందట స్వాతీలో వేశారు. సునీల్‌దత్ కొడుకు సంజయ్‌దత్ ఏదో కేసులో ఇరుక్కుంటే కాశీలో రాంరమాపతి బ్యాంక్ అని ఉంది. నేను కాశీలో ఉన్నప్పుడు ఆయన బ్రతికుండే వాడు. ఇప్పుడు ఎవరున్నారో తెలియదు. ఆయనతో నేను కొంచెం బాగా చనువుగా తిరిగేవాడ్ని. అక్కడ నుంచి 6 కోట్ల రామనామమో ఎంతో అప్పు తీసుకున్నాట్ట. విడుదల అయిపోయాడు. ఈ 6 కోట్ల రామనామము మళ్ళా వ్రాసి తీర్చాలి. చేసేవాళ్ళకి ఇప్పటికీ ఆ ఫలితాలు కనిపిస్తున్నాయి.

అంచేత పరుసవేది అక్కడ ఉంది చూడు అని ఆ పిల్లవాడికి చెప్తే, తీశాడు. చూస్తే అక్కడ పరుసవేది ఉంది. గుడ్డలో చుట్టి ఉంది. వాసనలు!

- ఆ వాసనలలో ఉన్న ఆ నాలిక, నిరంతరం అబద్ధము చెప్పే నాలిక, నిరంతరము పరశ్ఛిద్రాన్వేషణ, ఇతరులలో తప్పు వెతికే నాలిక, రోగగ్రస్తమైన నాలిక అది. ఆ నాలిక ఏం ఉచ్చారణ చేసినా లాభంలేదు.

-- తప్పు అక్కడ ఉంది. నాలిక ప్యూర్‌గా లేదు. వాక్కు ప్యూర్‌గా లేదు.

అంచేత ఎంత అద్భుతమైన విషయం ఉన్నా, రోగగ్రస్తుడికి పంచదార నోట్లో వేస్తాం, చేదుగా ఉంటుంది. తీపిది వెయ్యండర్రా అని మొత్తుకుంటాడు. నేను తీపే వేశాను అంటావు. ఏది? రోగగ్రస్తమైనటువంటి నాలిక.

శ్రీ వాక్ సంయమనం.

అందుకు ఆ మౌనం, మౌనం, మౌనం అని చెప్పేది.

అంచేత ఆ పిల్లవాడు వెళ్ళి ఆ గుడ్డ ప్రక్కకు తీసేసే సరికి బంగారంగా మారిపోతుంది.

- మన వాక్కు తన ప్రభావాన్ని ఎందుకు చూపించలేక పోతోంది అంటే, తప్పు అక్కడ జరుగుతోంది.

***వివేకానంద అమెరికాలో ఒక చాలెంజ్ చేస్తాడు,***

12 ఏళ్ళు మీరు వాక్కు ద్వారా అబద్ధము ఉచ్చరించకుండా ఉంటే, జాగ్రత్తగా ఆ పాయింట్ అర్థం చేసుకోండి. ఉచ్చరించకుండా ఉంటే. మీరు మనస్సులో ఏమైనా అనుకోండి, అభ్యంతరం లేదు.

- కానీ మీ వాక్కు 12 ఏళ్ళ పాటు ఏ విధమైన అబద్ధము ఉచ్చరించకుండా ఉంటే, సూర్యుడు ఉదయించకూడదు అని మీరు అంటే, ఉదయించడు. గ్యారంటీ!

సత్యవ్రతం! ఆధ్యాత్మిక శక్తిసంపన్నతకి సాధనలు ఏం అక్కర్లేదు. చిన్న చిన్న పాయింట్స్, చిన్న చిన్న వ్యవహార జ్ఞానం చాలు.

స్నేహితులకి జోకీగా అబద్ధం చెప్తామాయె! వాడు ఏదో ఉత్తరం కోసం వెయిట్ చేస్తూవుంటాడు. పోస్ట్‌మేన్ వచ్చి ఉత్తరం ఇస్తాడు, తీసేసుకుంటాం. తీసేసుకుని ఏం చెప్తాం? ......... జోక్! ఎందుకది? అర్థంలేని జోక్!

అబద్ధం, అబద్ధం, అబద్ధం!

అంచేత ఈ జ్ఞానయోగములో మొట్టమొదట మనం అర్థం చేసుకోవాల్సిన విషయం ఇది. యోగము ఒకటే. సూర్యుడికి సంబంధించినటువంటి యోగము. ఇమం వివస్వతే యోగం. ఈ యోగవిద్య సూర్యుడు దగ్గర్నుంచి ఎలా వచ్చింది? ఏ విధంగా వచ్చింది?

- భగవద్గీతలోనే మనకి ఒక అద్భుతమైనటువంటి రహస్యం 15వ అధ్యాయంలో చెప్పబడుతుంది.

-- అగ్నిని, చంద్రుడ్ని కనుక కలిపితే సూర్యుడు ఉత్పత్తి అవుతాడు.

అందుకే దేవతలు గురించి చెప్పినప్పుడు కొంత మంది విశేషమైన దేవతలకి మూడు కళ్ళు ఉన్నాయి అని చెప్తాం. అందరు దేవతలకి మళ్ళా మూడు కళ్ళు ఉన్నాయి అని చెప్పం. విష్ణువుకి, బ్రహ్మకి మూడు కళ్ళు ఉన్నాయి అని చెప్పం. మళ్ళా శివుడికి మూడు కళ్ళు ఉన్నాయి. త్రినేత్రుడు అని చెప్తాం మనం.

ఈ రహస్యాన్ని, ఈ జ్ఞానాన్ని ఇవాళ కేవలం మీ మనస్సులో ఉంచుకోండి. దీన్ని ఆలోచిస్తూవుండండి.

***అగ్ని ఏం చేస్తుంది?***

వస్తువుల్ని కాల్చి పారేస్తుంది. నాశనం చేస్తుంది, దహించేస్తుంది. వస్తువుల్ని వృద్ధి చెందనివ్వదు. అగ్నిలో ఏదైనా బీజాలు వేస్తే, ఆ బీజాలు మరి ప్రోదిచెందవు.

సోమో భూత్వా రసాత్మకః , చంద్రుడు రస కిరణాలు సృష్టించి ఔషధుల యొక్క రసాన్ని సృష్టిస్తాడు.

*అంటే అగ్ని ఏం చేస్తుంది?*

నాశనం చేస్తుంది.

*చంద్రుడు ఏం చేస్తాడు?*

రసాన్ని ఇస్తాడు.

- ఈ రెండింటి యొక్క కలయిక సూర్యుడు.

లైఫ్! భూమి మీద ప్రాణిజగత్తు ఉత్పత్తి అవటానికి కారణం సూర్యుడే అని ఈనాడు ఆధునిక వైజ్ఞానికులు కూడా ఒప్పుకుంటున్నారుకదా! కామన్‌సెన్స్ కూడా అంతే. సూర్యుడు లేకపోతే జీవి లేదు.

ఈ జ్ఞానాన్ని ఆధారంగా ఉంచుకుని వేదాలు జోలికి, గాయత్రీ మంత్రం జోలికి వెళ్ళాలి. ఇది మనం జాగ్రత్తగా ఉంచుకోకుండా, ఈ విషయాన్ని మర్చిపోయి మనం ఎంత చర్చించుకున్నా మళ్ళా గంగలో దిగిపోతాం.

మొత్తము ఆధ్యాత్మిక జగత్తులో, జ్ఞానయోగం అని చెప్తాన్నా, అర్జున విషాదయోగం అని చెప్తాన్నా, మనం 18 రకాలైన చేతనత్వాలు ఉంటాయని చెప్పుకుంటున్నాం. ఆ చేతనత్వాలు యొక్క మార్పు కూడా మీరు అర్థం చేసుకోండి.

''నాకు చేతనత్వంలోని మార్పు అర్థంకాదు.''

ఎందుకు అర్థంకాదు? తండ్రిగా మీరు ప్రవర్తిస్తున్నారు. భర్తగా మీరు ప్రవర్తిస్తున్నారు. క్లర్కుగా ప్రవర్తిస్తున్నారు. డైరెక్టరుగా పనిచేస్తున్నారు. మీకు తెలుసుకదా ఛేంజెస్.

- ఒకే వ్యక్తి రకరకాలైన రోల్స్ ప్లే చేస్తున్నప్పుడు, ఏం మారుతోంది? వాడి మానసిక స్థితే కదా మారుతోంది.

భార్యతో మాట్లాడుతున్నప్పుడు ఒక యాంగిల్‌తో మాట్లాడుతూవుంటాడు. వాడే అప్పుడే కొడుకుతో మాట్లాడతాడు. అప్పుడే తండ్రితో మాట్లాడతాడు, అప్పుడే ఫాదరిన్ లాతో మాట్లాడతాడు, అప్పుడే స్నేహితుడు ఎవడో వస్తాడు.

మరి క్షణక్షణానికి మీరు ఏం చేయగలుగుతున్నారు? మీ చేతనత్వం పరిధి మారిపోవటం లేదా? ఒకళ్ళతో భర్తగా మాట్లాడతారు, అదే క్షణంలో ఇంకొకళ్ళతో తండ్రిగా మాట్లాడుతున్నారు, ఇంకొకళ్ళతో కొడుకుగా మాట్లాడతారు.

ఈ 18 యోగస్థితులూ కూడా ముఖ్యంగా మొదటి 6 స్థితులు ప్రతీ మనిషికీ కామన్‌గా ఉన్నాయి. దాన్ని మీరు వేరుగా ఏం చేసుకోవక్కర్లేదు. అవగాహన లోపం అంతే.

*ఆ అవగాహన లోపం ఎక్కడొచ్చింది?*

- ఆధ్యాత్మికతను మనం భౌతిక జగత్తుతో కలుపుతున్నాం. దయచేసి కలపకండి. అది నిరంతరం మీరు గుర్తుచేసుకోండి.
- ఈ క్లాసెస్‌లోకాని, ఎక్కడ మీరు ఆధ్యాత్మికత గురించి మాట్లాడుకున్నా, దీని వల్ల నాకు ఈ భౌతిక లాభాలు వచ్చాయి అని ఎప్పుడైతే మీరు మాట వేశారో, అది ఆధ్యాత్మికత కాదు. కృత్రిమం అయిపోయింది.

అది సైడ్ ఎఫెక్ట్. ఫ్యాక్టరీ పెడతాం, యూరియా ఫ్యాక్టరీ అంటాడు. యూరియా ప్రొడక్షన్ ఇంపార్టెంట్. ప్రతీ ఫ్యాక్టరీలోనూ ఈ లోపల అనేక సైడ్ ప్రోడక్ట్స్ వస్తూవుంటాయి. నైట్రిక్ యాసిడ్ రావచ్చు, ఇంకో యాసిడ్ రావచ్చు. కానీ వాటన్నిటినీ ప్రొడక్ట్స్ క్రింద లిస్ట్ చెయ్యం. వాటి యొక్క లాభాలు ఉంటాయి. వాటిని ఉపయోగించుకుంటాం

అలాగే ఆధ్యాత్మిక జగత్తులో సూర్యవిజ్ఞానాన్ని అర్థము చేసుకోవటం ముఖ్యం. సూర్యవిజ్ఞానాన్ని అర్థము చేసుకుని మీ లక్ష్యం ఏమిటి? మీరు ఏ స్థితికి వెళ్ళాలి?

పాల్‌బ్రంటన్ అనే ఒక విదేశీ జర్నలిస్ట్ భారతదేశానికి వచ్చాడు. అతను ఇండియాలో అన్నీ తిరగటానికి అయ్యే ఖర్చులకి అతను పనిచేసే పేపరు స్పాన్సర్ చేసింది.

*అతనికి ఇచ్చినటువంటి ప్రాజెక్ట్ ఏమిటి అంటే,*

భారతదేశంలో యోగులు ఉన్నారా? ఉంటే, ఆ యోగులు యొక్క శక్తి గురించి మనం వినేవి నిజమైనవా?

- ఏ సెర్చ్ ఇన్ సీక్రెట్ ఇండియా అని వ్రాశాడు.
- -- యోగులు ఉన్నారు. యోగశక్తి కరెక్టే! కానీ యోగులు అవటానికి కావలసిన మానసికస్థితి మాత్రము విదేశీయులకు రాదు అని వ్రాసుకున్నాడాయన.

విదేశీయులు అంటే, మనం కూడా విదేశీయులమే.

*ఎందుకు విదేశీయులము అంటే,*

మనకి ఉన్న 18 పురాణాల పేర్లు గబ గబా చెప్పమంటే, నేనే చెప్పలేను.

మనం విదేశీయులమా, భారతీయులమా?

పంచాంగం ఉంది. పంచాంగం అనే పేరు దానికి ఎందుకొచ్చింది? చాలా మంది చెప్పలేరు. ఒకవేళ కొంత మంది చెప్పినా, తిథి, వార, నక్షత్రాల వరకూ చెప్పగలరేమో! పంచాంగంలో కరణము, యోగము అని మిగతా రెండు ఉన్నాయి. అవి ఎందుకు ఉపయోగపడతాయో తెలియదు.

మరి మనం భారతీయులమా, విదేశీయులమా?

దేముడికి తెలియాలి మనం ఎవరమో!

సరే వేదాలు! అసలు ఏమీ తెలియదుకదా!

☹ అంచేత విదేశీయులకి అది తెలియదంటే, మనమూ విదేశీయులమే. పరిపూర్ణమైన విదేశీయులం.

విదేశీయులకి ఇంకా కాస్త తెలుసని చాలా మంది చెప్తూవుంటారు. గురువుల యొక్క యాంగిలు ఏమిటో నాకు తెలియదు. కానీ ఇ.కె.గారు వాళ్ళు ఏం చెప్తారు అంటే, మనం చెప్పలేని చాలా విషయాలు విదేశీయులు ఠక, ఠక, ఠకా చెప్పేస్తారు.

పేరిస్ నగర శివార్లలో గత 15 ఏళ్ళగా ప్రపంచ శాంతి కోసము నిరంతరం రుద్రాభిషేకము జరుగుతోందిట.

మనలో ఎంత మంది ప్రపంచశాంతి కోసం ఒక రోజైనా వినియోగిస్తాం?

అంచేత ఎవరు విదేశీయులు?
ఎవరు ఆధ్యాత్మికవేత్తలు?

మన ఆధ్యాత్మికత అంతా దేని మీద ఆధారపడి వుంటుంది? నాకేం లాభం?
ఎక్కడ ఆ లాభం? భౌతిక జగత్తులో.

కాదది. ఆధ్యాత్మికత మాత్రం కాదు. జ్ఞానయోగంలో మనం అది బాగా గుర్తుంచుకుందాం.

***మరి ఆధ్యాత్మికత ఏమిటి?***

సూర్యుడు యొక్క విభిన్న కిరణాల ప్రభావాన్ని అర్థం చేసుకోవటం.

సూర్యుడు నుంచి వెయ్యి కిరణాలు భూమి మీదకి పడతాయి. 999 కాదు, 1001 కాదు. మూడు ఋతువులలో కరెక్ట్‌గా 1000 కిరణాలు భూమి మీదకి పడతాయి.

ఒక ఋతువులో 400 కిరణాలు,
మిగతా రెండు ఋతువులలో 300, 300.

ఆ సహస్రకిరణాలు ఎలాగ ప్రవర్తిస్తూవుంటాయి? ఎలాగ మన మీద ప్రభావం చూపిస్తాయి అన్నది ఏ దేవతకి అయినా చెప్పబడే సహస్రనామాలు.

మనం సహస్రనామాలు అలా చదువుతున్నామా? మరి ఫలితాలు ఇవ్వలేదు అంటే ఎక్కడ్నుంచి ఇస్తాయవి?

కానీ మరి ఇవంతా తెలుసుకోవటం చాలా కష్టం కదా! ఎన్ని జన్మలు ఎత్తాలో, ఎన్ని సహస్రకిరణాలు ఉన్నాయో అంటే,

***సాంఖ్యయోగంలో డైరెక్ట్‌గా చెప్తాడు,***

నువ్వేమీ చేయక్కరలేదు, నీ ప్రజ్ఞకి కనుక స్థిత ప్రజ్ఞత్వము ఆపాదిస్తే చాలు.

సూర్యుడి కిరణం రావాలి, భూమి మీద పడాలి. ఆ సూర్యకిరణం గులాబి చెట్టుకి ఒకలాగ ప్రభావం చూపించాలి, వేప చెట్టుకి ఇంకొకలాగ చూపించాలి. గడ్డిపోచకి ఇంకొకలాగ చూపించాలి. ఓరి నాయనోయ్! ఇన్ని రకాలైన బీజాలు నేను నాటుకుని ఆ సూర్యకిరణాల్ని ఎలా నేను పంపించేది అని మనమేం ఆలోచించం.

ఏం చేస్తాం? మాట్లాడకుండా విత్తనం వేస్తాం. తరవాత జరిగేదేదో సూర్యుడే చూసుకుంటాడు.

అంతేకదా! మనమేం చేసుకోవక్కరలేదు. స్థిత ప్రజ్ఞత్వము, నీ మనస్సులో ఉన్న ఆలోచనలని ఆపేయ్. కామసంకల్పవర్జితాః లాస్ట్ టైమ్ అక్కడ్నుంచి మొదలెట్టాం కదా! అది బేసిస్. కామము వద్దు. అంటే ఏమిటి?

ఏ విధమైనటువంటి కోరికలూ వద్దు.
ఏ విధమైనటువంటి సంకల్పాలూ వద్దు.

కోరికలకి, సంకల్పాలకి తేడా అర్థం చేసుకుందాం.

సంకల్పం అనే పదం ఎలాంటి వాటికి వాడతామంటే, ఐడియా వచ్చాక అది పూర్తయ్యేంత వరకు నిద్రపోం.

ఆ విధంగా మనలో ఎవరిలోనూ సంకల్పం లేదు.

ఫస్ట్ క్లాస్ రావాలి అనేది స్టూడెంట్ సంకల్పమా, కోరికా? సంకల్పం అయితే గ్యారంటీగా ఫస్ట్ క్లాస్ వస్తుంది.

మనకి సంకల్పాలు లేవు,
కామాలే ఉన్నాయి.

అంటే, దానంతట అది వచ్చేస్తే ఓకె. డిజైర్, కోరికలు అన్నమాట. అది రాకపోతే దాని గురించి మనమేం పట్టించుకోం. పట్టించుకోకుండా కారణం ఏం చెప్తాం, అది రాకపోవటానికి ఇంకొకడు కారణం. ఇవి రెండూ వద్దు.

ఈ విధమైనటువంటి రెండు ఆలోచనలూ వద్దు మీకు. కోరికలూ వద్దు, సంకల్పాలూ వద్దు.

*ఏం చేయాలి?*

సూర్యుడ్ని మీ మీద పనిచెయ్యనివ్వండి.

పని చెయ్యనివ్వకపోయినా సూర్యుడే పనిచేస్తు న్నాడు. మీరు ఆ పాయింట్ అర్థం చేసుకోండి.

***ఋషులు మీకు అందించే జ్ఞానం ఏమిటి అంటే,***

మీకు తెలిసినా, తెలియకపోయినా ఎందుకు జీవించి ఉన్నారంటే, సూర్యుడు ఉన్నాడు కనుక. బాహ్య జగత్తులో సూర్యుడు ఉన్నాడు, మీ అనాహత చక్రం దగ్గర సూర్యుడు ఉన్నాడు. ఆయన ఉన్నంత వరకు మీరు జీవించి ఉంటారు. ఆయన ఊహూ అంటే మీరు జీవించి ఉండరు.

శ్రీ అంచేత ఈ కోరికల యొక్క ప్రాబల్యంకాని, ఈ సంకల్పాలు యొక్క ప్రాబల్యంకాని మన మనస్సులో ఉంచుకోకుండా, సూర్యుడు ఏ విధంగా మనల్ని ముందుకు తోస్తున్నాడు అన్నది గమనించండి.

చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోండి. సూర్యుడు అంటే ఏమిటో కూడా నేను చెప్పాను.

సూర్యుడు అనగానే మీ మనస్సులో పాజిటివ్, నెగెటివ్ రెండూ రావాలి. చంద్రుడు, అగ్ని. ఇంకొకలాగ చూసుకుంటే వాటినే ఇడా, పింగళా అంటాం.

కానీ ఇడా, పింగళాలో, ఒకటి సూర్యుడు, ఒకటి చంద్రుడు. అగ్నిని నడిపించే విధానం ఇంకా మనం అర్థం చేసుకోలేదు. అగ్ని అంటే కుండలినీ శక్తి. అగ్నివిద్య.

ఈ మూడూ మాత్రం బాగా రిపీటెడ్‌గా మధ్య మధ్యలో నేను ఇరికిస్తూవుంటాను. దాన్ని మీ మనస్సులో త్రిప్పుకుంటూ ఉండండి.

అగ్ని, వుయ్ ఆర్ నాట్ యూజింగ్ ఇట్. కానీ అగ్ని నాశనం చేస్తూవుంటుంది. కాలాగ్ని. కాలం మనల్ని నాశనం చేసేస్తూవుంటుంది. అగ్ని ప్రతీదీ కాల్చుస్తూనే ఉంటుంది కదా! ద్వేషాగ్ని. ద్వేషం వల్ల కూడా నాశనమైపోతూవుంటాం.

అలా ఆధ్యాత్మిక జగత్తులో ఎక్కడెక్కడ అగ్ని అనే పదం వాడుతూవుంటామో, అక్కడక్కడ నాశనం.

-- ఎక్కడెక్కడ చంద్ర అనే పదం వాడుతూవుంటామో, అక్కడక్కడ పుష్టి, రసము, పెరుగుదల.

మరి సూర్యుడు? సూర్యుడు ఉంటే అన్నీ కనిపిస్తాయి. సూర్యుడు లేకపోతే చంద్రుడు ఉన్నా ఏం కనిపించదు.

అంచేత సూర్యుడు జ్ఞానం యొక్క ప్రతీక. నాలెడ్జ్, అండర్‌స్టాండింగ్, అవగాహన.

ఈ మూడూ అర్థం చేసుకుంటూ, ఆధ్యాత్మిక జగత్తులో ఉన్నటువంటి సూర్యుడు యొక్క విజ్ఞానాన్ని నాలుగు రకాలుగా మాత్రమే అర్థం చేసుకోగలము అని కూడా ఈ జ్ఞానయోగంలోనే చదువుకున్నాం మనం.

*చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మ విభాగశః*

అంచేత ఎప్పుడైతే సూర్యుడు దగ్గర నుంచి మనకి జ్ఞానం కావాలి అని మనం అనుకుంటున్నామో, సూర్యుడు మీదకి వెళ్ళి పడతాంకదా! అంచేత ఆ సూర్యుడు దగ్గర నుంచి వచ్చే కిరణాలను మనం గమనించుకుంటే, అనుక్షణం సూర్యుడు నుంచి మన మీదకు వచ్చేటటువంటి కిరణాలు ఏడు రంగుల్లో వస్తూవుంటాయి.

ఈ ఏడు రంగుల్లో విబ్జ్యార్, ఇంద్రధనస్సు యొక్క ఏడు రంగుల్లో మొదటి మూడు రంగులు, అంటే, వైలెట్, ఇండిగో, బ్లూ మనిషి ఉపయోగించుకోలేడు. వాడి యొక్క మానసికస్థితికి అతీతమైనవి.

ఆకాశం కూడా నీలంగా కనిపిస్తుంది. మనం ఏం అందుకుంటాం? అందుకోలేం.

④ దాని తరవాత వచ్చేటటువంటి గ్రీన్, చెట్ల ఆకులు వాటిని కాస్త చేతులు పైకెత్తితే అందుకోగలం.

③ దాని తరవాత ఎల్లో. పళ్ళు! ఏదైనా పరిపక్వ దశకి వస్తే సాధారణంగా అవి ఏ రంగులో ఉంటాయి? పసుపు పచ్చ రంగులో ఉంటాయి.

② ఇంకాస్త క్రిందకి దిగుతాం మనం. ఆరంజ్.

① ఇంకాస్త క్రిందకి దిగుతాం. ఎర్త్, రెడ్ కలర్.

ఏడు రంగులలో రెడ్, ఆరంజ్, ఎల్లో, గ్రీన్, వీటిని మనం ఉపయోగించుకోగలం. ఈ నాలుగూ ఎక్కడ్నుంచి వస్తున్నాయి? సూర్యుడు నుంచి వస్తున్నాయి.

సూర్యుడు నుంచి వచ్చే ఈ నాలుగు కిరణాలే నాలుగు వేదాలు. ఐదవ వేదం రాబోతున్నది. చాలా మంది మహా భారతాన్ని ఐదవ వేదం క్రింద కూడా చెప్తూవుంటారు.

అంచేత ఆ మహాభారతం ఐదవ వేదం అంటే ఏం కలర్ రావాలి? బ్లూ కలర్. దాని సారథి కూడా బ్లూ కలరే, కృష్ణుడు. అది వ్రాసిన వేదవ్యాసుడు కూడా బ్లూ కలరే. బ్లూ ఆర్ డార్క్. వేదవ్యాసుడు, కృష్ణ ద్వైపాయనుడు.

- అంచేత స్లోగా బ్లూ కలర్ వైపు వెళుతోన్న ఈ జీవితం ఎప్పుడైతే మొదలవుతుందో, మిగతా నాలుగు రంగుల యొక్క ప్రభావం సహజంగానే తగ్గుతుందికదా!

-- అందువల్ల ప్రకృతిలో కూడా మనం చూస్తే, నాలుగు వర్ణాల ప్రభావం బాగా తగ్గిపోయింది.

ఇప్పుడు వర్ణాలు ఏవి? ఉన్నాయి, కేస్ట్ సిస్టమ్ పెట్టుకుంటాం, వర్ణాలు చెప్పుకుంటాం, బ్రాహ్మణుడు, క్షత్రియుడు, వైశ్యుడు అంటూవుంటాం. కానీ వాటికి తగిన గుణాలుకాని, వాటికి సంబంధించిన కర్మలుకాని లేకపోవ టానికి కారణము, నాశనము కాదు, ఆ జ్ఞానము అర్థం చేసుకోవాలి మనం.

జ్ఞానయోగం మనకి అద్భుతమైన ఇన్‌సైట్స్ ఇస్తుంది. ప్రకృతిలో ఎందుకు అలా జరుగుతోంది?

- కులవ్యవస్థ నాశనం అయిపోవటం వల్ల కాదు. సూర్యుడు నుంచి వచ్చే ఆ ఐదవ కిరణం వల్ల. బ్లూ కలర్ కిరణం వల్ల. దాన్నే కృష్ణా కాన్షస్‌నెస్ అంటాం.

అరవిందో దాన్ని సుప్రామెంటల్ అన్నాడు. సత్య సాయిబాబా దాన్ని సాయి కిరణం అంటాడు. దానికి పేరు ఏదైనా పెట్టుకోండి. పేర్లలో గొడవేం లేదు. ఒకడు బ్లూ అంటాడు, ఒకడు నీలం అంటాడు. బ్లూ అన్నా, నీలం అన్నా కిరణం అదే. అంచేత ఆ కిరణం ఏం చేస్తోందో అర్థం చేసుకోండి.

***మనం ఇప్పుడు చేస్తోన్నటువంటిది ఏమిటంటే,***

వర్ణవ్యవస్థను వేరు చేసుకుంటున్నాం.

- లేకపోతే వర్ణరహితమైనటువంటి పరిస్థితి వస్తోంది. అది అర్థరహితమైనటువంటి పరిస్థితి.

***ఎలాంటి పరిస్థితి రావాలి?***

నాలుగూ కలిసిపోయేటటువంటి పరిస్థితి రావాలి.

ఆ పరిస్థితి రావటానికి లాస్ట్ టైమ్ నేను భీష్ముడు యొక్క ఉదాహరణ చెప్పాను. భీష్ముడు ఎక్కడ తప్పు చేశాడు? లేకపోతే ఆ పరిస్థితి అప్పుడు వచ్చేసేదేమో!

***మీరు ఒకటి గుర్తుంచుకోండి,***

"ఇంకా కోట్ల కోట్ల కోట్ల సంవత్సరాలు జరగాలి, అప్పుడు అయిన తరవాత కదా కలియుగం అవ్వాలి. కలి యుగం అయిపోయిన తరవాత కదా మళ్ళా సత్యయుగం రావాలి." అలాంటి గందరగోళం పెట్టుకోకండి.

మీ మానసికస్థితి మారితే యుగం మారిపోతుంది.

చదువురాని వాళ్ళూ ఉన్నారు, పిహెచ్‌డీలు ఇక్కడే ఉన్నారు. నాగార్జునా యూనివర్సిటీకి వెళ్ళిపోయారనుకోండి, అందరూ పోస్ట్ గ్రాడ్యుయేట్స్, పిహెచ్‌డీలు.

అంటే భారతదేశంలో ఉన్న వాళ్ళందరూ గ్రాడ్యు యేట్స్, పోస్ట్ గ్రాడ్యుయేట్స్ అనా మీ ఉద్దేశ్యం?

అక్షరజ్ఞానం గురించి పెర్సంటేజ్ చూసుకుంటేనే, మొన్న ఎప్పుడో చూసినట్టు గుర్తు, 18%. అంటే వందలో 18 మందికే అక్షరాలు గుర్తించే స్తోమత ఉంది ఇండియాలో. మరి యూనివర్సిటీస్‌కి వెళ్ళి చూస్తే అందరూ పిహెచ్‌డీసే.

మరి సత్యయుగం ఎక్కడున్నట్టు? మీ మనస్సు కనుక మారితే, మీ స్టేట్ కనుక మారితే, ఆలోచించే విధానం కనుక మారితే, అది సత్యయుగం.

- నాలుగు యుగాలు ఒకేసారి నడుస్తూవుంటాయి.

ఎక్కడ ఆ భ్రమ వచ్చిందో, నాకు చాలా గందర గోళంగా ఉంటుంది.

## సత్యయుగంలో రాక్షసులు లేరూ?

హిరణ్యకశిపుడు, హిరణ్యాక్షుడు ఏ యుగం వాళ్ళు? రాక్షసులు అప్పుడూ ఉన్నారు.

☺ ఇప్పుడు అంత పెద్ద రాక్షసులు లేరు. దానితో కనుక పోల్చి చూస్తే అసలు ఇదే బెటర్ ఏమో!

త్రేతాయుగం, ద్వాపరయుగాల్లోని రాక్షసులతో పోల్చిచూస్తే అది కరెక్టే అనిపిస్తుంది కూడా. హిరణ్యాక్షుడు, హిరణ్యకశిపుడు కంటే పాపం రావణాసురుడు అంత గ్రేట్ కాదు. ఎంచేతంటే, వాడు వేదాలను చుట్టబెట్టేశాడు, పృథ్విని చుట్టబెట్టేసి నీళ్ళల్లో దాచి పారేశాడు. రావణాసురుడు అలాంటి పనులేం చేయలేదు.

రావణాసురుడు లెవెల్ రాక్షసులు అసలు ద్వాపర యుగంలో లేనేలేరు. ఇంద్రుడ్ని ఎదిరించిన రాక్షసులు ఎవరున్నారు ద్వాపరయుగంలో? కలియుగంలో అసలు రాక్షసులు ఎవరూ కనిపించటం లేదు మనకి.

☹ అంటే, ఆ అంశ అందరిలోనూ ఉండొచ్చు, అది వేరే విషయం.

మనం రాక్షసత్వము అంటే ఏమని చెప్పుకున్నాం? మూడవ అధ్యాయంలో చెప్పుకున్నాంకదా, యజ్ఞీయ కర్మ చేయలేనటువంటి వాళ్ళు అందరూ కూడా రాక్షసులే. ఆ విధంగా మనలో రాక్షసత్వం ఉండొచ్చు.

***ఎంచేతంటే,***

యజ్ఞకర్మ ఏమిటో మనకి తెలియదు కనుక.

కానీ రావణాసురుడు, కంసుడు లెవెల్లో పోల్చి చూస్తే, నాకు తెలిసున్నంత వరకు పిల్లల్ని అంత డైరెక్ట్‌గా చంపేయ్ అని ఆర్డరిచ్చే కఠోర హృదయులు ఇప్పుడు లేరు.

అంచేత ఈ జ్ఞానము! సాధనా జగత్తులో సూర్యుడు యొక్క కిరణాలు, రెడ్, ఆరంజ్, ఎల్లో, గ్రీన్ కలర్స్ దాటాలి. చాతుర్వర్ణ్యం మయా సృష్టం, ఈ నాలుగు రకాలైన వర్ణాలు నా ద్వారానే సృష్టింపబడ్డాయి అని ద్వాపరయుగంలో వ్రాశాడు. మిగతావి భూమి మీదకి అప్పుడు దిగలేదు.

- కానీ 1924, 25 ప్రాంతాల్లో బ్లూ కలరు చాలా బాగా దిగిపోయింది.

బ్లూ కలరు అంటే ఏమిటి?

చాలా మందికి ఈ కలర్ భాష రాదు. రాదు అనటంలో ఉద్దేశ్యం ఏమిటంటే, ఈ యోగవిద్యలో, జ్ఞానయోగ విద్యలో మనం అర్థం చేసుకోవాల్సింది ఏమిటంటే,

- దేవతలు మాట్లాడేటటువంటి భాష - రంగులు.
  మనము మాట్లాడేటటువంటి భాష - వాక్కు.

రెండూ వర్ణాలే. "వర్ణక్రమము" అని చెప్పుకుంటాం కదా! అక్షరాలే.

- కానీ అక్షరాలు శబ్దరూపంలో కనుక బయటకి వస్తే, మనిషి ఉపయోగించేటటువంటి భాష, మానవభాష.
- శబ్దాలు బయటకి రాకుండా రంగులు కనుక బయటకి వస్తే దేవతల భాష.

రంగులు ఉచ్చారణ చెయ్యంకదా, రంగుల్ని ఏం చేస్తాం? చూస్తాం, దర్శిస్తాం. మంత్రద్రష్టా ఋషులు.

***మంత్రం అంటే మనకి తెలుసుకదా,***

ఒక విశేషమైన ఫలితాన్ని ఇచ్చే "శబ్ద సమూహం."

- ఆ విశేషమైన ఫలితాన్ని ఇచ్చే శబ్దసమూహాన్ని మీరు జపం చేస్తూ, చేస్తూ ఆ వర్ణాన్ని చూడగలిగేటటువంటి స్థితికి వెళ్ళాలి. అప్పుడు మీరు మంత్రద్రష్ట అవుతారు.

అది మర్చిపోయి, "ఋషులు మంత్రాన్ని దర్శించారు అంటే, వాళ్ళకి అక్షరాలు కనిపించాయేమో!"

అవగాహనా లోపం. జ్ఞానయోగంలో మనం ఆ చిన్న చిన్న విషయాలు అర్థం చేసుకోవాలి.

సూర్యుడు నుంచి వస్తోన్న ఆ కిరణాలలో, ఎరుపు రంగు సూర్యుడు సంధ్యాకాలంలో వస్తాడుకదా! ఎరుపు రంగుగల సూర్యుడు అంటే, పృథ్వీతత్వం, మూలాధార చక్రం, ఎరుపు రంగు. అంచేత,

- ఎరుపురంగుగల సూర్యుడు నుంచి వచ్చే కిరణాలు ఎక్కువగా తన సందేశాన్ని పృథ్వీగ్రహానికి పంపిస్తాయి.

మిగతా టైమప్పుడు? మన ఒక్కడికే కాదుకదా సూర్యుడు ఉదయించేది? అన్ని గ్రహాలకీ ఉదయిస్తాడు. సోలార్ సిస్టమ్‌లో భగవంతుడికి తెలియాలి ఎన్ని ఉన్నాయో! 770 ప్లానెట్స్ ఉన్నాయట. మనకి 770 ప్లానెట్స్ తెలియవు. డబ్బయ్యో ఎన్నో తెలుసు. మిగతా వాటిని గుర్తించలేదు.

- సీక్రెట్ డాక్ట్రిన్‌లో బ్లావెట్స్కీ చెప్తుంది, 770 ప్లానెట్స్ ఉన్నాయట. ప్రతీ ప్లానెట్ మీదా మనం ఒక్కసారి అయినా పుట్టాలిట. అంటే కనీసం 770 జన్మలు.

కానీ ఇది 770వ జన్మ కాదని మనకి గ్యారంటీ ఏమిటి? ఏమో, ఇది 770 వ జన్మ ఏమో?
ఇది లాస్ట్ ప్లానెట్ ఏమో!

కానీ, ఆ అవగాహనా లోపం.

ఎఱ్ఱ రంగు వచ్చినప్పుడే మీరు సంధ్యావందనము, గాయత్రీ మంత్రం చెయ్యాలి.

"అప్పుడు నాకు టైమ్ దొరకదు, పది గంటలకు చేసుకోవచ్చా?" చేసుకో.

మొన్న రాత్రి ఆకాశంలో ఏదో కనిస్తుందని చెప్పారు కదా, "నేను ప్రొద్దున్న 10 గంటలకు చూస్తాను" అంటే, చూడు, అది అక్కడ ఉండదు. అది వచ్చినప్పుడు నువ్వు చూడాలికాని, నీ ఇష్టం వచ్చినప్పుడు అది రాదు.

ఆ సూర్యోదయం టైమప్పుడు సంధ్యావందనం చేస్తే ఆ రంగులో పృథ్వీగ్రహానికి వచ్చినటువంటి ఆ సూర్యుడి సందేశ శక్తిని మీరు మంత్రద్రష్టగా దర్శించి, దాన్ని వాక్కు రూపంలోకి మార్చుకోవచ్చు.

అతని హృదయంలో నేనే ఉండి ప్రతీ వాడికీ సందేశం ఇస్తాను అని 18 వ అధ్యాయంలో మనం చదువుతాం. సాధకుడి హృదయంలో నేనే ఉండి, ఆ యంత్రాన్ని త్రిప్పుతూ ఉంటాను. నేనే అంటే ఎవడు? ఆ సూర్యుడే.

ఈశ్వరస్సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి
భ్రామయన్ సర్వభూతాని యన్త్రారూఢాని మాయయా .

(18-61)

ఓ అర్జునా! జగన్నియామకుడు, పరమేశ్వరుడు (అంతర్యామి) మాయచేత సమస్తప్రాణులను యంత్రము నారోహించిన వారినివలె (కీలుబొమ్మలనువలె) త్రిప్పుచు సమస్త ప్రాణులయొక్క హృదయమున వెలయుచున్నాడు.

అంచేత ఎఱ్ఱరంగు గల సూర్యుడు ఉన్నప్పుడు మాత్రమే మీరు సాధన చేస్తే ఫలితాలు వస్తాయి.

"మరి మిగతా అప్పుడు చేస్తే రావా?"

వస్తాయి. అప్పుడు వచ్చేవి వస్తాయి. ఆ టైమప్పుడు వచ్చే ప్రొగ్రామ్ మాత్రం మీకు గ్యారంటీగా రాదు.

గాయత్రీ మంత్రం, మిగతా వాటి వల్ల మీకు వచ్చే ఫలితాలు ఎందుకు రావటం లేదు అంటే, సంధ్యావందనం చేయటం లేదు. సంధ్యాకాలంలో మనం చేయటం లేదు.

### ఏం జరుగుతుంది సంధ్యాకాలంలో?

సంధ్యాకాలంలో అటు చంద్రుడు, ఇటు అగ్ని, ఇవి రెండూ ఉంటాయి. సూర్యుడు ఉదయిస్తూవుంటాడు. అక్కడ మూడూ ఉంటాయి.

### మిగతా డే టైమ్‌లో ఏమవుతుంది?

సూర్యుడు ఉంటాడు. ఆకాశంలో చంద్రుడు, నక్షత్రాలు ఉన్నా మనకి ఉపయోగపడవు. ఆ కిరణాల యొక్క ప్రభావం మనకి ఎందుకూ ఉపయోగపడవు.

మళ్ళా సాయంత్రం? అటు సూర్యుడు ఎఱ్ఱరంగులో ఉంటాడు. అగ్ని, దీపం వెలిగిస్తాం. సంధ్యాదీపో నమోస్తుతే అనేది అందుకు. సాయంకాలం దీపం వెలిగించమనేది అందుకు. మర్చిపోయాం. కానీ ఇంకా మంత్రాలు మిగిలిపోయాయి. ఆ ఆచారం మిగిలిపోయింది.

అది భారతదేశం యొక్క గొప్పతనం. సంస్కారాలు ఉన్నాయి. ఎప్పుడైనా దాన్ని పట్టుకుని మనం అంకురింపచేసుకోవచ్చు, డెవలప్ చేసుకోవచ్చు.

అంచేత అగ్ని, చంద్రుడు, సూర్యుడు. ఈ మూడూ ఉండే టైము సంధ్యాకాలం. అంచేత "నేను అప్పుడు చేయను, ఎప్పుడో చేస్తాను" అంటే, ఈ మూడూ కలవవు.

త్రైవిద్యా మాం సోమపాః పూతపాపా
యజ్ఞైరిష్ట్వా స్వర్గతిం ప్రార్థయన్తే
తే పుణ్యమాసాద్య సురేన్ద్రలోక
మశ్నన్తి దివ్యాన్దివి దేవభోగాన్ . (భ.గీ. 9-20)

మూడువేదముల నధ్యయనముచేసినవారును, కర్మకాండను సకామభావముతో నాచరించువారును, సోమపానము గావించినవారును, పాపకల్మషముతొలగినవారునగు మనుజులు యజ్ఞములచే నన్ను పూజించి స్వర్గముకొఱకై ప్రార్థించుచున్నారు. వారు పుణ్యఫలమగు దేవేంద్రలోకమును బొంది, అచ్చి స్వర్గమందు దివ్యములగు దేవభోగముల ననుభవించుచున్నారు.

ఈ త్రయీ విద్య, ఈ మూడూ, సూర్యచంద్రాగ్ని విద్యలు కేవలము మీరు ఆ టైమప్పుడే చేయగలరు. మరి మిగతా టైమప్పుడు చేస్తాం అంటే, చేసుకో, రిజల్ట్స్ రావు. రిజల్ట్ రాకపోతే ఏమంటారు? అది తప్పు అంటారు.

బుధవారం సాయంత్రం ఎనిమిదిన్నరకి చూడు టీవీలో మంచి ప్రోగ్రామ్ అన్వేషిత వస్తోంది అంటాం. నేను ఇంకొక రోజు పెడతాను, రాదు. ఇంకొకటేదో వస్తుంది. దాన్ని ఎంజాయ్ చేస్తాం. కానీ అన్వేషిత మాత్రం రాదు.

అంచేత ఆ కాలాన్ని, ఆ కరెక్ట్ టైమ్‌ని ఉపయోగించుకోవటం నేర్చుకోవాలి.

యోగవిద్యలో సూర్యుడు దగ్గర్నుంచి మనం నేర్చుకునే జ్ఞానము, నాలుగవ అధ్యాయంలో మనకి అందించే ఈ జ్ఞానాన్ని మీరు చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోండి.

సూర్యుడు ఉన్నాడు.

సూర్యుడు నుంచి ఏడు రంగులు వస్తాయి.

సూర్యుడు నుంచి వచ్చే ఏడు రంగులే దేవతల భాష. దేవతలకి ఇంకొక భాష లేదు. వాళ్ళది రంగుల భాష.

అందుకే దేవత్వానికి దగ్గరకి వెళ్ళిన వాళ్ళు, తేజోవలయం, ఆరా అంటూవుంటాంకదా! శరీరంలో ఉండే ఆ రంగుల్ని చూసి వాళ్ళు మన భూత భవిష్యత్ వర్తమాన కాలాల్ని దర్శించగలరు. ఆ రంగుల భాష తెలుసుకోవటమే.

"మరి ఆ ఏడు రంగుల్లోనే అన్నీ తెలుస్తాయా?"

సంగీతంలో ఉన్నవి ఏడు స్వరాలేగా! మరి ఏడు స్వరాలతో ఎన్ని పాటలు మీరు వ్రాస్తున్నారు? పాటలు మీద పాటలు వ్రాసేస్తున్నారు కదా! ఆ ఏడు స్వరాలేకదా!

అంచేత సూర్యుడు యొక్క ఆ ఏడు వర్ణాలతో, రంగులతో, ఇన్ని రకాలైన మానుష శరీరాలు, ఇన్ని రకాలైన ప్రాణి కోటులు, ఇవన్నీ ఎలా డెవలప్ అవుతున్నాయి అన్నది మనం దర్శించటం నేర్చుకోవాలి.

చాతుర్వర్ణ్యం మయా సృష్టం

*ఎలా తెలుసుకుంటాం దాన్ని?*

గుణకర్మ విభాగశః

గురువు ఎప్పుడూ కూడా క్లూ ఇస్తాడు.

"నీ ఖర్మ నువ్వు చదువుకో ఫో!" అనడు. "నీకు అర్థం కాలేదా? నేను చెప్తాను" అంటాడు.

ఎరుపు రంగు, దాని గుణాలు ఇవి. దాని యాక్టివిటీ ఇది. కర్మ అంటే యాక్టివిటీ.

ఎరుపు అనే సరికల్లా మనకి కోపం అదీ గుర్తొస్తుంది తప్ప, శాంతి గుర్తురాదు. అది దాని యాక్టివిటీ.

"రంగుల విజ్ఞానం మాకు రాదు" అని ఎందుకు అబద్ధం చెప్పుకోవటం?

హీ టర్న్‌డ్ గ్రీన్ విత్ జెలసీ. తెలుగులో ఏమంటారో నాకు తెలియదు కాని, వాడు ఏమైపోయాట్ట? ఈర్ష్యతో ఆకుపచ్చగా మారిపోయాట్ట. నిజంగా మారతాడో, మారడో.

కానీ ఈర్ష్య ఉంటే ఎక్కడో పచ్చుతనం ఉంటుంది. ఎదుటివాడు పచ్చగా ఉన్నాడంటే, మనం ఆకుపచ్చగా మారిపోతాం. ఈర్ష్య, జెలసీ.

అంచేత ఈ పదాలు మనం వాడుతూనే ఉంటాం. కోపంతో మొహం ఎర్రబడింది. పసుపు - ప్లెంటీ.

అంచేత ఆ రంగుల యొక్క మిశ్రమాలు ఇక్కడ ఉన్నా కూడా, ఆ భాష మనకి తెలియటం లేదు కనుక ఈ పరిస్థితులు మనం ఉపయోగించుకోలేకపోతున్నాం. లేకపోతే ఇక్కడున్నటువంటి ఈ రంగుల్నే గ్యారంటీగా మనం ఉపయోగించుకోవచ్చు.

భగవద్గీత నాలుగవ అధ్యాయానికి జ్ఞానయోగం అని వాళ్ళు ఉత్తినే పేరు పెట్టలేదు. దేవతలతో సంభాషణ చేయగలిగే సామర్థ్యాన్ని ఇచ్చే అధ్యాయం.

*కానీ, ఆ డెప్త్ ఆఫ్ అండర్‌స్టాండింగ్ ఎప్పుడొస్తుంది?*

పారాయణ చేస్తే రాదు. ఒకొక్క శ్లోకాన్నీ పట్టుకుని, ఆ ఒకొక్క శ్లోకాన్నీ మనం విడమర్చుకోవాలి. ఎప్పుడు?

సూర్యోదయ, సూర్యాస్తమయ కాలములోనే.

అందుకోసమే ఎస్.ఎస్.వై. వాళ్ళు ఒక అద్భుతమైన సేవ చేస్తున్నారు. ప్రతీరోజు కరెక్ట్‌గా సూర్యాస్తమయం, సూర్యోదయం ఎప్పుడౌతుందో, అప్పుడు రెండే రెండు ఆహుతులు వేయమంటారు.

ఆ విద్య ఆర్య సమాజం వాళ్ళది. ఇందాకనే చెప్పానుకదా, విద్య ఒకటే. నాగార్జునా యూనివర్సిటీలో చదివితేనేం, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో చదివితేనేం? కానీ వుయ్ ఆర్ నాగార్జునా యూనివర్సిటీ ప్రొడక్ట్సు, వాళ్ళు ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రొడక్ట్సు. అంతే తేడా.

అంచేత ఆ టైమప్పుడు మీరు కాస్త మనస్సుని శాంతంగా ఉంచుకోగలిగి, కామసంకల్పవర్జితాః. దాని గురించి చెప్తున్నాను. ఎప్పుడు పడితే అప్పుడు ఉండక్కర్లేదు.

క్లాసులో మీరు కాన్‌సన్‌ట్రేటెడ్‌గా వినాలికాని, సినిమాలో కూర్చుని కాలేజీ గురించి ఆలోచించక్కర్లేదు. సినిమాలు చూస్తున్నప్పుడు సినిమాలు చూడండి. మీ నిత్య కర్మలు చేస్తున్నప్పుడు నిత్యకర్మలు చేయండి.

"ఆ టైమప్పుడు చాలా బిజీగా ఉంటాం."

నేనేం చేయలేను దానికి. ఆ టైమప్పుడే సూర్యుడు పాపం ఉదయిస్తాడు. లేకపోతే సూర్యుడ్ని మార్చమనండి. నేనేం చేసేది? మనమేం చేయలేం. డోన్ట్ ఆస్క్ మీ దట్.

ఆ టైమప్పుడు మాత్రమే. అది ఎంతసేపు ఉంటాడు? ఒక 10, 15 నిమిషాలు అంతే.

- మీరు ఎంత బిజీగా ఉన్నా, ఆ టైమప్పుడు ఒక 10 నిమిషాలు నేను వేరు చేసుకోలేను అంటే, దీని మీద మీకు ఇంట్రస్ట్ లేదు అని అర్థం.

మొన్న టీవీలో ఆ ఇన్సిడెంట్ వస్తుంది అంటే, చాలా మంది మెలకువగా కూర్చుని చూశారు. అలాంటిది, దేవతలతో సంభాషణ చేసే ఈ విద్య మీకు అలవడుతుంది.

**కేవలము మీరు ఏం చేయాలి అంటే,**

ఆ సూర్యోదయ, సూర్యాస్తమయకాలంలో రెడ్‌గా సూర్యుడు ఉన్నప్పుడు, వీలైతే సూర్యుడ్ని చూస్తూవుండి, వీలైతే. సిటీస్‌లో చాలా కష్టం. వీలైతే ఓకె. కిటికీ దగ్గరో, ఎక్కడో కూర్చుని, కామసంకల్పవర్జితాః

- అప్పుడు మీకు ఏ డిజైరూ వద్దు. ఏమీ కోరకండి. ఏ సంకల్పమూ చేసుకోకండి. లెట్ ద నేచర్ స్పీక్. ఆ సూర్యుడి కిరణాల్ని మీతో మాట్లాడనివ్వండి.

అందుకని ఆ ఋషులు వాళ్ళు ఆ నదీ ప్రవాహం దగ్గర సూర్యోదయం టైమ్‌కి కూర్చుంటే వాళ్ళకి డైరెక్ట్ దేవతా సాన్నిధ్యం వచ్చేది. దేవతా సాన్నిధ్యం ఇప్పుడూ ఉందక్కడ. మనం ఆ భాష మర్చిపోయాం. ఆ భాషని మనం ఉపయోగించుకోం. లేకపోతే మాకు వీలున్నప్పుడు చేసుకుంటాం అంటాం. మాకు వీలు అనేది మాత్రం దయచేసి ఇక్కడ మనం మానేద్దాం.

- మనకి వీలుని బట్టి కాదు, ప్రకృతికి ఎప్పుడు వీలుగా ఉంటుందో, అప్పుడు మనం చేద్దాం.

కామసంకల్పవర్జితాః అనే శ్లోకాన్ని ఈ భావాన్ని మనస్సులో ఉంచుకుని చదవండి.

యస్య సర్వే సమారమ్భాః కామసంకల్పవర్జితాః
జ్ఞానాగ్ని దగ్ధకర్మాణం తమాహుః పణ్డితం బుధాః. (4-19)

ఎవరైతే ఏ విధమైన ఇనీషియేషనూ చేయడో, మొదలెట్టడో! మీరు సాధనకి కూర్చున్నారు. కూర్చున్నారు అంతే. ఇంకేం మొదలెట్టగలడు అప్పుడు?

"గాయత్రీ మంత్రజపం చేస్తాను, శ్రీవిద్య జపం చేస్తాను. లేకపోతే శ్రీచక్రం గురించి ఆలోచిస్తాను, ఫలానా యంత్రం గురించి ఆలోచిస్తాను!"

మీరు అసలు ఏమీ ఆలోచించకూడదు. యస్య సర్వే సమారమ్భాః కామసంకల్పవర్జితాః , దాని గురించేకదా ఇంత సేపు చెప్పుకున్నాం.

జ్ఞానాగ్ని దగ్ధకర్మాణం, అప్పుడు ఏమవుతుందిట, ఆ జ్ఞానాగ్ని, సూర్యుడు నుంచి వచ్చే ఆ కిరణాలు, కేవలం సూర్యుడు నుంచే వస్తున్నాయా అప్పుడు? సూర్యుడు నుంచి మాత్రమే కాదు, చంద్రుడు నుంచి కూడా వస్తున్నాయి.

- చంద్రుడు నుంచి వచ్చే కిరణాలను నిత్యలు అంటాం మనం. నిత్యలు అంటే రెగ్యులర్‌గా వచ్చేవి అని.

ప్రతీ పాడ్యమినాడూ, ప్రతీ విదియనాడూ అదే కళ వస్తుంది. అలాగ 14 తిథుల్లోనూ వస్తుంది. మళ్ళా పూర్ణిమ, అమావాస్యకి అదే కళలు వస్తూవుంటాయి, నిత్యము అవే తిరుగుతూ ఉంటాయి. అవి అప్పుడు వస్తూవుంటాయి.

- అవి అన్నీ కాకుండా, నక్షత్రాలు నుంచి స్పెషల్ కిరణాలు వస్తూవుంటాయి.

పంచాంగం అందుకు చూసుకోవాలి. తిథి, అంటే సూర్యుడు, చంద్రుడుకి మధ్య ఉన్న కోణం, తిథి తెలిస్తే, ఆ రోజు ఉన్న నిత్య తెలుస్తుంది.

- తరవాత ఏం వస్తోంది? వారము - గ్రహాలు. ఆ రోజు ఏ గ్రహం ఉందో అది. సూర్యోదయం అప్పుడు కేవలము ఆ గ్రహం యొక్క కిరణమే వస్తుంది.

శ్రీ తిథి, వార, నక్షత్రాలు. ఈ జ్ఞానము కనుక మీకు వస్తే, ఎప్పుడైతే ఈ మూడూ కలుస్తాయో, అగ్ని ఉత్పత్తి అవుతుంది. శివుడి యొక్క మూడవ కన్ను,

-- మామూలు రెండు కళ్ళు, మామూలుగానే ఉన్నాయి. కానీ మూడవ కన్ను కూడా తెరిస్తేనే కామసంకల్ప వర్జితాః మన్మథుడ్ని కాల్చగలడు.

శ్రీ మామూలు ఈ రెండు కళ్ళతో మన్మథుడ్ని మనం కాల్చలేం. మన్మథుడ్ని కాల్చాలి అంటే, మూడవ కన్ను కూడా తెలియాలి. తిథి, వార, నక్షత్రము.

తిథి అంటే ఏమిటో అర్థమయిందికదా, సూర్యుడు, చంద్రుడుకి మధ్య ఉండే కోణము. దృష్టికోణము. మళ్ళా కోణాలు పట్టుకుని 13 డిగ్రీస్, 12 సెకండ్స్ ఎంతో ఉంది అని మెజర్ చేస్తూ కూర్చోకండి. దాని గురించి మనం మాట్లా డటం లేదు. దృష్టికోణము, దృష్టికోణము మారుతుంది.

ఇందిరాగాంధీకి ఒక మంచి అలవాటు ఉండేది. షీ కుడ్ సాల్వ్ ఎనీ ప్రొబ్లమ్ బై నాట్ సాల్వింగ్ ఇట్. ఆవిడ కాలానికి వదిలేసేది. తిథి, వార, నక్షత్రాలకి ఎప్పుడు అనుగుణ్యంగా ఉంటే అప్పుడు అవి సాల్వ్ అయిపోతూ ఉండేవి. ఆవిడ ఏవీ సాల్వ్ చేసేది కాదు.

నాకు సరిగ్గా తెలియదది. ఇప్పుడు గబుక్కున నా మీద ఎవడైనా కేసు వేస్తే కష్టం. అంచేత ఇప్పుడే చెప్పేస్తే సరిపోతుందికదా! నేను ఇది ఎక్కడో చదివాను.

అంచేత ఈ పాయింట్ అర్థం చేసుకోండి. తిథి, వార, నక్షత్రాలు రెండు సంధ్యా సమయాల్లోనూ ఇంపార్టెంట్. అందుకే సంధ్యావందనం చేసుకుంటున్నప్పుడు, యజ్ఞం చేసుకుంటున్నప్పుడు మనం తిథి, వార, నక్షత్రాలు చెప్పు కుంటాం. ఎందుకు చెప్పుకుంటాం అంటే, ఇది తెలియాలి.

కానీ, తిథి, వార, నక్షత్రాలు ఇప్పటికీ చెప్పుకుంటు న్నాంకాని, ఈ జ్ఞానం లేదు. మర్చిపోయాం. మళ్ళీ తెచ్చుకుందాం, గుర్తుచేసుకుందాం. అప్పుడు ఏమవుతుంది ఈ జ్ఞానాగ్ని వల్ల? జ్ఞానాగ్ని దగ్ధకర్మాణం.

సంధ్యావందనంలో ఒక అద్భుతమైన శ్లోకం చదు వుతారు. మేము ప్రొద్దున్న చేసిన పాపాలన్నీ సాయంత్రం చేస్తున్న సంధ్యావందనంతో నాశనం అయిపోతాయి.

ప్రొద్దున్న సంధ్యావందనంలో ఏం చదువుతారు? రాత్రి చేసిన పాపాలన్నీ కూడా నాశనం అయిపోతాయి.

శ్రీ అంటే నాశనం అవ్వవు. జ్ఞానాగ్ని దగ్ధకర్మాణం, ఈ జ్ఞానాన్ని, తిథి, వార, నక్షత్రాలను ఉపయోగించు కుంటే మీరు మార్చేసుకోవచ్చు, దానికేముంది?

చెప్పానుకదా, ఏదో తప్పు చేశాం, జ్వరం వచ్చింది. పేరాసిట్‌మాల్ వేసుకుంటే పోతుంది. జ్ఞానాగ్ని దగ్ధకర్మాణం, ఈ జ్ఞానాన్ని ఉపయోగించుకుంటే వాటిని మార్చేసుకోవచ్చు.

ఇంకొక రెండు వస్తాయి, కరణము, యోగము. పంచాంగం గురించి చెప్తున్నానుకదా!

శ్రీ కరణము అంటే ఆపరేటస్, ఇంద్రియాలు. ఉప- కరణాలు.

అప్పుడు సూర్యుడు దగ్గర నుంచి, తిథి దగ్గర నుంచి, గ్రహం దగ్గర నుంచి వచ్చిన జ్ఞానాన్ని మీరు ఎనలైజ్ చేసుకోవాలి. దాన్నే శ్రీవిద్యలో మహా త్రికోణం అని చెప్తాం.

రకరకాల పేర్లు చెప్తాం, ఏది చెప్పినా ఒకటే. పాయింట్ ఏమిటంటే, మనకి మూడు అర్థమవ్వాలి. సూర్యుడు, చంద్రుడికి మధ్య ఉన్న కోణం అర్థమవ్వాలి. చంద్రుడు అర్థమవ్వాలి. దాని తరవాత ఆ రోజు ఉన్న గ్రహము. తిథి, వార, నక్షత్రం, ఇవి మనకి అర్థమయితే,

శ్రీ కరణము, దాన్ని నిత్యజీవితంలో ఉపయోగించు కోండి. ఉపకరణము.

శ్రీ దేని కోసము? యోగము కొరకు.

కరణము, యోగము. మరి యోగము కొరకు అని వేరు వేరుగా ఎందుకు చెప్పాడు? రకరకాలైన యోగాల్ని ఇప్పుడే మనం చెప్పుకున్నాంకదా! మీ యోగం ఏమిటో? ఆ రోజు ఏ యోగం రాబోతోందో! ఆ వర్ణాలు మీకు ఏం చెప్పాయో, మీరు ఏం దర్శనం చేసుకున్నారో!

ఇది మనకి ఎంత అద్భుతంగా పంచాంగం రూపం లో ఋషులు అందజేసిపారేశారో! మనం మర్చిపోయినా పర్వాలేదు. పంచాంగం ఉంటుంది.

శ్రీ పంచాంగం ఉంది కనుక ఈ విద్యని రేపు కాకపోతే ఎల్లుండి, ఎవడో ఒకడు డెవలప్ చేసుకుంటాడు. మీలోనే ఎవరో డెవలప్ చేసుకోవచ్చు, దానికేముంది?

**కండిషన్ ఏమిటి?**

ఒక సంవత్సరం పాటు మీరు సూర్యోదయ, సూర్యాస్తమయ కాలాలు మానకూడదు. ఆ టైమప్పుడు మీరు శాంతంగా కూర్చోవాలి.

"మాకు ఆఫీసు వర్కు ఉంటుంది మాస్టారు!"

నన్నేం చేయమంటారు మాస్టారు? నేనేం చేయలేను.

"నిద్ర వస్తోంది మాస్టారు!"

ఏం చేస్తారు మాస్టారు? ఆ టైమ్‌కి మాస్టారూ నిద్రపోతారు. మీకు ఇది చెప్తున్నానుకాని, నేను మాత్రం ఎప్పుడు కూర్చుంటున్నాను?

అంచేత రాంగ్ రిజల్ట్. మనకి పంచాంగంలో చెప్పే టటువంటి జ్ఞానం రాదు.

అంచేత జ్ఞానయోగంలో చెప్పే ఒకొక్క శ్లోకము అద్భుతమైన సాధనా రహస్యాలు మీకు వివరిస్తుంది.

యస్య సర్వే సమారమ్భాః కామసంకల్పవర్జితాః
జ్ఞానాగ్ని దగ్ధకర్మాణం తమాహుః పణ్డితం బుధాః. (4-19)

వాళ్ళని పండితుడు అని, బుధుడు అనేటటువంటి మాట వేశాడు అక్కడ.

భగవద్గీతలో ఏదైనా ఒక పదం వాడితే, ఆ పదం వెనకాతల అత్యద్భుతమైనటువంటి ఆధ్యాత్మిక రహస్యాలు ఉంటాయి. సరే, ఆ బుధాః అనే పదానికి రేపు ఆలోచిద్దాం.

**కానీ నా కోరిక ఏమిటంటే,**

ఎలాగూ మనం మొదలెట్టాం కనుక, రోజుకి రెండు 10 నిమిషాలు సూర్యబింబం ఎర్రగా ఉన్నప్పుడు కూర్చుని చూడండి ఏమౌతుందో.

శాంతంగా కూర్చోండి.
మీరేమీ చేయొద్దు. మీరు చేసేది కాదక్కడ.
మీరు ఏమీ చేయరు, మీరు దర్శిస్తారు.

"ఏమొస్తుంది దర్శనం?"

ఊహూ, మీరు ముందు ఊహించారు అంటే, అది తప్పయిపోతుంది. మీరు ఊహాలోకంలో కూడా ఏమీ వద్దు. ఎందుకంటే, యస్య సర్వే సమారమ్భాః, మీరు ఆలోచనన్ని కూడా ఇనీషియేట్ చేయకండి. సైలెంట్‌గా కూర్చోండి.

ప్రొద్దున్న, సాయంత్రం కూర్చోవటానికి ప్రయత్నం చేయండి. అదే టైమ్‌కి ఇక్కడ యజ్ఞం పెట్టటానికి కారణం అది. అగ్ని కూడా ప్రజ్వరిల్లుతూవుంటుందికదా! అంచేత ప్రొద్దున్న, సాయంత్రం చేసేటటువంటి యజ్ఞం కూడా సూర్యుడు ఎర్రగా ఉన్నప్పుడే చేస్తాం.

"మరి సూర్యుడ్ని చూస్తేనే వస్తుందా?"

సూర్యుడు యొక్క ఎఫెక్ట్, ఆ దర్శనం, సూర్యుడ్ని చూస్తే కాదు వచ్చేది, అది మీ మానసికస్థితి. అది మళ్ళా గుర్తుంచుకోండి.

"ఇవాళ సూర్యుడు నాకు కనిపించలేదు మాస్టారు! అంచేత నేను చేయను."

సూర్యుడు కాదు కనిపించాల్సింది. ఆ నిత్య కళ యొక్క ప్రభావము, ఆ తిథి యొక్క ప్రభావము, ఆ వారము యొక్క ప్రభావము, మీరు పడుకున్నా పనిచేస్తూనే ఉంటుంది. అది మీకు పనిచేస్తోంది అని తెలియకపోయినా పనిచేస్తూనే ఉంటుంది.

**కానీ సైన్స్ అంటే ఏమిటి అంటే,**

తెలుసుకొని ఉపయోగించుకోవటం.

దాన్ని మనం మనస్సులో ఉంచుకొని ఒక్క నిమిషం ఆ మానసికస్థితిలోకి వెళదాం.

స్వస్తి



# భగవద్గీత ఉపన్యాసాలు - 28

## జ్ఞానయోగము

1998, నవంబరు 27 వ తారీఖున సుకృతవిల్లా, గుంటూరులో
మాస్టరుగారు భగవద్గీతపై ఇచ్చిన ఉపన్యాసము



- ఏ క్షణంలో అయినా ఎకానమిక్ ఎమెర్జెన్సీ డిక్లేర్ చెయ్యొచ్చు
- నిజమైనటువంటి ధనం ప్రకృతిలో ఉంది
- స-ముద్ర, ముద్రలతో కూడిన శరీరం
- ఒకానొక స్థితిలో చిన్నవాడివి అయిపో! - సురస
- ప్రారబ్ధకర్మ నీడని పోగొట్టుకోవటానికి తీవ్రమైన ప్రయత్నం చేయండి - సింహిక
- గురువులకి మీ శరీరాలు ఇవ్వగలరా? - వాకిన్స్
- శ్వాసలో ఆశ్రయం పొందండి
- రాహువు - చేటతో కర్మలను చెరగటం
- మనలోని నిత్యలను గమనించటం - నిత్యతృప్తో
- నువ్వు చెయ్యవు - నీ ద్వారా జరుగుతుంది

భగవద్గీత యొక్క జ్ఞానయోగములో నిన్న మనము అన్ని రకాలైన కోరికలను, సంకల్పాలను విసర్జించి, సూర్యోదయ, సూర్యాస్తమయ కాలములో, ఆ సంధ్యాకాలములో సూర్యుడు ఇస్తోన్న, ఎటువంటి సూర్యుడు? యోగానికి మూలపురుషుడు అయిన సూర్యుడు ఇస్తోన్న జ్ఞానాన్ని మనం ఉపయోగించుకుంటే ఏ విధంగా ఆ జ్ఞానాగ్ని మన ప్రారబ్ధకర్మలను భస్మం చేస్తుందో తెలుసుకున్నాం.

భగవద్గీత యొక్క ఈ నాలుగవ అధ్యాయం మొత్తం కూడా ఒక అవగాహనా విధానమే. అంచేత ఇవాళ ఇంకొక శ్లోకంలో ఏ విధమైనటువంటి సాధనావిధానం ఆ జగద్గురువు మనకి అందజేస్తున్నాడో అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేద్దాం. శ్లోకం ఏమిటంటే,

త్యక్త్వా కర్మఫలాసఙ్గం నిత్యతృప్తో నిరాశ్రయః
కర్మణ్యభిప్రవృత్తోఽపి నైవ కించిత్కరోతి సః. (4-20)

ఎవడు కర్మఫలములందాసక్తిని విడనాడి నిరంతరము సంతృప్తిగలవాడై దేనిని ఆశ్రయించకనుండునో, అట్టివాడు కర్మము లందుప్రవర్తించినను ఒకింతైనను చేయనివాడేయగును.

**సింపుల్‌గా ఫార్ములా ఏమని చెప్పాడు అంటే,**

త్యక్త్వా కర్మఫలాసఙ్గం - కర్మఫలం మీద ఆశ వదిలేసి, కర్మఫలం మీద అభిరుచి, కర్మఫలంతో ఉన్నటువంటి సంగము, కర్మఫలము యొక్క ప్రాప్తి కొరకు మాత్రమే పనిచేస్తున్నాను అనేటటువంటి భావన వదిలేసి,

త్యక్త్వా కర్మఫలాసఙ్గం నిత్యతృప్తో నిరాశ్రయః

నిత్యతృప్తో - నిరంతరము సేటిస్ఫైడ్ కండిషన్.

కోరికలు ఏం లేవు. ఫ్లడ్స్ వచ్చినప్పుడు నదులన్నీ కూడా సముద్రంలోకి వెళ్ళిపోతూ వుంటాయి. అయినా సముద్రము పొంగదు.

నిత్యతృప్తో - కోరికలు అన్నిటినీ ఎవడైతే స్పాంజ్‌లాగ పీల్చేసుకుని ఉన్న దానితో సంతుష్టుడు అవుతాడో,

నిరాశ్రయః - ఏ విధమైనటువంటి ఆశ్రయమూ కోరడు.

***ఆశ్రయము అంటే ఏమిటి?***

మనం సెక్యూరిటీ చూస్తాం. ప్రైవేట్ జాబ్ కంటే గవర్నమెంట్ జాబ్ మనకి ఎక్కువ ఇష్టం. ప్రైవేట్ జాబ్‌లో నిజంగా ఎక్కువ సేలరీ ఉంటుంది. కానీ గవర్నమెంటు జాబు, ప్రైవేటు జాబు, రెండిట్లో కంపారిజన్ చేసుకుంటే మనం గవర్నమెంట్ జాబ్ ప్రిఫర్ చేస్తాం. ఎంచేత? ఆశ్రయం ఉంది కనుక. ఆశ్రయం అంటే సెక్యూరిటీ ఉంది మనకి.

నిరాశ్రయః - ఏ సెక్యూరిటీ కాంక్షించకుండా ఉండే మానసికస్థితి.

కర్మణ్యభిప్రవృత్తోఽపి - ప్రవృత్తి, ద వే అఫ్ మూవ్‌మెంట్ కర్మల మీద ఉన్నప్పటికీ కూడా,

నైవ కించిత్కరోతి సః - అతను ఏమీ చేయుట లేదు.

ఇది ఒక అద్భుతమైనటువంటి ఫార్ములా సాధనలో. శిరిడీసాయి, సత్యసాయి, ఈ దత్తాత్రేయ కల్ట్ అంతా ఈ సాధననే ప్రాక్టీస్ చేస్తుంది. ఇంకొక సాధన వాళ్ళేం చెప్పరు. అంచేత చాలా మంది "సాయి ఏ మంత్రం చెప్పలేదు చేయమని" అని అనుకుంటూవుంటారు.

చెప్పకేం? చాలా చెప్పాడు. విష్ణు సహస్రనామం చదువుకోమన్నాడు, భాగవతం చదువుకోమన్నాడు.

నువ్వు ఏది అనుకుంటే, దానికి విరుద్ధం చెప్తాడు. నేను ఉపవాసం చేస్తాను అంటే, ఉపవాసం చెయ్యొద్దంటాడు. తింటాను అంటే, మానేయమంటాడు.

***ఎంచేత?***

ఆశ్రయం లేకుండా ఉండటానికి. *నిరాశ్రయః*

అంచేత ఈ శ్లోకంలోని ఫార్ములాని ఒక విధంగా మనం దత్తాత్రేయ సాంప్రదాయము, లేకపోతే సాయి సాంప్రదాయము అని కూడా అనుకోవచ్చు.

రాబోయేటటువంటి మిగతా రెండు శ్లోకాలలో కూడా ఈ సాంప్రదాయమే వస్తుంది. ఈ సాంప్రదాయాన్ని అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేద్దాం.

త్యక్త్వా కర్మఫలాసఙ్గం నిత్యతృప్తో నిరాశ్రయః
కర్మణ్యభిప్రవృత్తోఽపి నైవ కించిత్కరోతి సః. (4-20)

మనిషి ఉన్నాడు. మనిషి పనిచేస్తున్నాడు. నేను పనిచేస్తున్నాను అని మనం అనుకుంటూవుంటాం. ఏమేం పనులు చేస్తున్నాం మనం? ఆలోచిద్దాం.

ఆకలేస్తోంది. అన్నం తింటాం. కడుపు నిండిన వాళ్ళని తినమన్నా తినలేరు. దాహం వేస్తోంది, మంచినీళ్ళు త్రాగుతాం. దాహం వేయకుండా మంచి నీళ్ళు త్రాగమంటే, తీసుకొచ్చి పెట్టినా త్రాగం. అంతేకదా!

ఈ రెండిటిలో మీరు పనిచేస్తున్నారా? రియాక్ట్ అవుతున్నారా? అది ఆలోచించుకోండి.

మనంతట మనం ఆహారం తీసుకోవటం లేదు. మనం తినమన్నా ఆహారం తినలేం. ఆహారం మనం ఎలా తీసుకోగలుగుతున్నాం? ప్రకృతి మనల్ని తీసుకోనిస్తే. మన శరీరం ఆహారం తీసుకోవచ్చు అని చెప్తే తీసుకొంటున్నాం.

నిద్రపోయాం. మనం ఏం అనుకుంటున్నాం? నిద్రపోగలమని. పోగలమా? నిద్ర కూడా మన చేతిలో లేదు. "వీడెప్పుడూ నిద్రపోతూవుంటాడు" అంటే వాడెంత అదృష్టవంతుడో మనకి అసలు తెలియటం లేదు పాపం. నిద్రపోతున్న వాళ్ళని నిద్రపోనివ్వకుండా లేపేస్తాం మనం. ఏ వెరీ లక్కీ మ్యాన్ ఇన్ ద వరల్డ్.

కానీ ఆ నిద్ర కూడా నిజంగా వాడి చేతిలో లేదు. మీరు వాడు నిద్రపోతున్నాడు అంటారు. పాపం వాడికి అది తప్ప ఇంకొక పని చేతకాదు. ప్రవృత్తి. మీరు నిద్రపోండి చూద్దాం వాడిలాగ. నిద్రపోలేం. నిద్ర మీ చేతిలో లేదు.

మరి లేవటం? ఇటీజ్ ద అవర్ దట్ గాడ్స్ అవేక్ అని అరవిందో సావిత్రిని మొదలెడతాడు.

మనల్ని నిద్రలేపే వాళ్ళకి జాగ్రతస్థితి అభిమాని దేవతలు అని పేరు. వాళ్ళ వసతి మన శరీరంలో ఉదానవాయువు దగ్గర, కంఠం దగ్గర ఉంటారు. అవి కనుక పనిచేయకపోతే మనం నిద్రలేవలేం.

కానీ అవి గ్యారంటీగా పనిచేస్తాయి కనుక మనం నిద్రలేస్తాం. కానీ మనమేం అంటాం? నేను నిద్రపోతున్నాను, నేను నిద్రలేస్తున్నాను.

ఇందులో మీరు చేసేదేంటట?
నిజంగా మీరు చేయగలుగుతున్నారా?

కర్మణ్యభిప్రవృత్తోఽపి నైవ కించిత్కరోతి సః

కర్మలో చేస్తున్నాం అనిపిస్తోంది. ఆ ప్రవృత్తి ఉంది మీ శరీరంలో. కానీ ఏం జరుగుతోంది అది? నైవ కించిత్కరోతి సః, వాడేం చేయటం లేదు. జరుగుతోంది అంతే వాడి శరీరంలో. ఆ విధంగా రావలసిన మార్పులు జరుగుతున్నాయి. ఆహారము, నిద్ర, దాహము.

ఉద్యోగం ఎందుకు చేస్తున్నారు?

- కడుపు నిండుతూవుండి, మీకు ఆకలి లేకపోతే ఎంత మంది ఉద్యోగం చేస్తారు అన్నది క్వశ్చను మార్కే!

**ఉద్యోగం మనకు ఎందుకు కావాలి అంటే,**

మనకి ఆకలేసినప్పుడు ఆహారం కావాలి కనుక ఆ ఆహారాన్ని సంపాదించుకునేందుకు ఇదొక విధానం.

లేకపోతే మనం ఉద్యోగం చెయ్యం.

అంచేత ఉద్యోగం మీద మనకి ఉన్న ప్రవృత్తి, నేను ఇంజనీర్‌ని అయిపోవాలి, నేను డాక్టర్‌ని అయిపోవాలి, నేను పండితుడ్ని అయిపోవాలి, నేను ఇది అయిపోవాలి, అది అయిపోవాలి అనే ఈ కర్మలు అన్నీ దేని మీద ప్రేరేపణ అయివున్నాయి? ఆకలి మీద ప్రేరేపణ అయివున్నాయి.

తాజ్‌మహల్ కట్టిన కూలీలకి ఆకలి లేకపోతే తాజమహల్ ఉండేదా? అని ఎక్కడో నేను చదివాను.

కచ్చితంగా తాజ్‌మహల్ ఉండేది, అది వేరే విషయం. అది ఏ విధంగా వస్తుందో తరవాత ఆలోచిద్దాం.

కానీ ఇక్కడ నైవ కించిత్కరోతి సః మనం చేస్తున్న పనులు ఏవీ కూడా మనం చేయటం లేదు అనేటటువంటి అవగాహనకి వచ్చే సాధన. అదీ దత్త సాంప్రదాయం. మనమేం చేయటం లేదు.

''మరి పూజ?'' ఆ పూజా మీరు చేయటం లేదు. మీ ద్వారా అది జరుగుతోంది.

తేషాం సతతయుక్తానాం భజతాం ప్రీతిపూర్వకమ్
దదామి బుద్ధియోగం తం యేన మాముపయాన్తి తే. (10-10)

ఎల్లప్పుడు నాయందు మనస్సుగలవారై, ప్రీతితో నన్ను భజించునట్టి వారికి - దేనిచే వారు నన్ను పొందగలరో - అట్టి జ్ఞాన యోగమును (ఆత్మానాత్మ వివేచనాశక్తిని) ప్రసాదించుచున్నాను.

వాడికి పూజ చెయ్యాలి అనే భావన కూడా నేనే ఇస్తాను. లోపల ఉన్నటువంటి ఆ అంతర్యామి మిమ్మల్ని పూజ చెయ్యాలి అని అనకపోతే, మీరేం చేయలేరు.

ఈ అవగాహన! ఈ అవగాహన ఎప్పుడైతే వచ్చిందో మీరు ఏ స్థితిలోకి వెళ్ళిపోతున్నారు? శరీరం యొక్క అభిమానం పోయింది, మనస్సు యొక్క అభిమానం పోయింది, జరుగుతోన్న దాని మీద మీకు పెద్ద గందరగోళం ఏం లేదు. ఎంచేతంటే, మీరు చేయటం లేదు కనుక.

చాలా మంది అడుగుతూ ఉంటారు, "మాస్టారు, హీరో ఎన్ని కష్టాలు పడిపోతున్నాడో సినిమాలో" అని. కళ్ళమ్మట నీళ్ళు కూడా కార్చేస్తారు. ఎవరో ఎందుకు? నేను కూడా కారుస్తాను. సినిమాహాల్లో చాలా మందికి ఆ ఎమోషనల్ ఫీలింగ్ వస్తుంది.

- వాడు కష్టాలు పడ్డాడు కనుక హీరో అయ్యాడు. లేకపోతే వాడు హీరో అవ్వడు. హీరో అవ్వాలి అంటే, అనేక కష్టాలు అధిగమించి, మిగతా వాళ్ళు చెయ్యలేని పనులు చేశాడు కనుకనే వాడ్ని హీరో అన్నాం.

"గోల్డ్ మెడల్ వచ్చిన వాడ్నే హీరోగా చూపిస్తారు మాస్టారు!"

వచ్చింది కనుకే వాడు హీరో అయ్యాడు. లేకపోతే వాడ్ని మనం హీరోగా చూపించం. కానీ ఈ గోల్డ్ మెడల్స్ రావటం, ఈ కష్టాలు పడటం దేని వల్ల జరుగుతోంది?

ఆ దేని వల్ల జరుగుతోంది అనేది కనుక మనం అర్థం చేసుకుంటే, ఏ విధమైనటువంటి ఆశ్రయమూ మనము కోరము. ఆ కాన్ఫిడెన్స్! సెక్యూరిటీ మనం కోరం.

ఎంచేతంటే, ఇప్పుడున్న సెక్యూరిటీలంతా కూడా చాలా తమాషా అయినటువంటి సెక్యూరిటీలు.

- ఇప్పుడున్న ఎకానమిక్ క్రైసిస్‌లో అన్ని గవర్నమెంట్సు ఏ క్షణంలో అయినా ఎకానమిక్ ఎమెర్జెన్సీ డిక్లేర్ చెయ్యొచ్చు.

- మన గవర్నమెంటే అని మనం ఏం అనుకోవక్కర లేదు. ఇంకా మన గవర్నమెంటు ప్రిడిక్షన్స్ ప్రకారం, భవిష్య పురాణం అదీ కరెక్ట్ అయితే, ఎకనామికల్లీ ఇంకా మోర్ స్టేబుల్ అవుతుంది.

కానీ మిగతా గవర్నమెంట్స్‌లో ఎకానమిక్ క్రైసిస్ వచ్చి వాళ్ళు ఎమెర్జెన్సీ డిక్లేర్ చేస్తే 20,000 డాలర్లు జీతం ఉండొచ్చుగాక, కానీ వాడు ఏం అంటాడు అంటే, ఎమర్జెన్సీ వచ్చింది కనుక నేను నీకు ఒక డాలరే ఇస్తాను అంటాడు.

- ఇంక గవర్నమెంట్ జాబ్‌లో సెక్యూరిటీ ఏం ఉంది? మనం అనుకుంటున్నాం సెక్యూరిటీ ఉందని.

ఆ సెక్యూరిటీ కూడా దేని మీద ఆధారపడివుంది? ప్రకృతి మీదే ఆధారపడివుంది.

- ప్రకృతి యొక్క వనరుల్ని వదిలేసి ఎప్పుడైతే మనం మానవుడు సంపాదించుకొనేటటువంటి కాయితం ముక్కలు మీద ఆశ్రయం సంపాదించుకున్నామో, గందరగోళం పడుతున్నాం.

ఈ కాయితం ముక్కలకి ప్రకృతిలో విలువ లేదు. కానీ కాయకూరలకి విలువ ఉంది. గాలికి విలువ ఉంది, నీరుకి విలువ ఉంది. పంచభూతాలకి విలువ ఉంది. అది నిజమైనటువంటి ధనం.

- ఆ ధనాన్ని మనం ఎమాస్ చేసుకోవక్కర్లేదు, కూడబెట్టుకోవక్కరలేదు.

గాలిని కూడబెట్టుకోవాలా? మీకు ఎప్పుడైనా టెన్షన్ ఉందా? రేపు నిద్రలేస్తే గాలి ఉండకపోతే ఎట్లా? ఈ గాలి అంతా ఒక బ్యాంక్‌లో బంధించేద్దాం మనం, ఒక ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో వేసి పారేద్దాం ఈ గాలిని అనుకోం మనం.

భూమిని? మీరేం చేయలేరు. ఉత్తినే ఒక పట్టా అయితే పెట్టుకుంటారుకాని, ఈ కాలంలో అవీ చెల్లవేమో, ఎవడో ఒక ఆక్యుపై చేసిపారేస్తున్నాడు.

నిజమైనటువంటి ధనం ప్రకృతిలో ఉంది.

***ఎక్కడుంది ప్రకృతిలో ఉన్నటువంటి ధనం?***

- 9 కిరణాలు ద్వారా ప్రకృతిలో ఉన్నటువంటి ధనం మన భూమి మీదకి వస్తోంది.

7 కిరణాలు మనం చెప్పుకున్నాంకదా! సూర్యుడు నుంచి వచ్చే ఏడు కిరణాలు ఏడు గ్రహాలుగా ఏర్పడతాయి. ఇవి రెండూ కాకుండా ఇంకో రెండు గ్రహాలు గురించి మనం చెప్పుకుంటాం. రాహువు, కేతువు.

ఈ *నిరాశ్రయః*, ఎవరి మీద ఆధారపడాలి? మనం వ్యక్తి మీద, ఒక కుటుంబం మీద ఆధారపడతాం. లేకపోతే ఒక పోలీస్ ఇన్‌స్పెక్టర్ మీద, ఒక చీఫ్ మినిస్టర్ మీద ఆధారపడతాం. తండ్రి మీద ఆధారపడతాం, తల్లి మీద ఆధారపడతాం, డాక్టర్ మీద ఆధారపడతాం.

ఇది మీకు అర్థమయితే వీళ్ళు ఎవరి మీదా మీరు ఆధారపడక్కరలేదు.

మనము కాలాన్ని లెక్కిస్తోన్నప్పుడు సోమవారం, మంగళవారం, ..... ఆదివారం. మళ్ళా సోమవారం, మంగళ వారం, ...... ఆదివారం. ఇలాగే ఏడు గ్రహాలు చుట్టూ మన కాలం తిరుగుతూవుంటుంది.

- కాలం మీద ఉన్నంత వరకూ కూడా మనం ఎవరో ఒకళ్ళ మీద ఆధారపడాల్సి వస్తుంది.
- కాలాతీత స్థితికి కనుక మనం వెళ్ళగలిగితే, *నిరాశ్రయః* వాడు ఎవరినీ ఆశ్రయం కోరడు. కానీ వాడు మాత్రం అందరికీ ఆశ్రయం ఇవ్వగలిగే వాడుగా వెళ్ళిపోతాడు.

మనం ఇక్కడ వేస్తోన్న దుర్గాదేవి యొక్క ఆహుతుల్లో ఒక స్తోత్రం చెప్తాం. ఆ శ్లోకం యొక్క అర్థం ఏమిటి అంటే, ఎవరైతే నీ ఆశ్రయాన్ని పొందాడో, వాడు అందరికీ ఆశ్రయం ఇవ్వగలిగే సామర్థ్యాన్ని పెంచుకుంటాడు అని.

- ఆ సామర్థ్యాన్ని ఎలా పెంచుకుంటాం అనేది అర్థం చేసుకోవటానికి ఈ శ్లోకంలో చెప్పబడే యోగవిద్యను రాహువు, కేతువు యొక్క విద్యగా కూడా మనం గమనించుకోవచ్చు.

***సాధారణంగా మనం ఏం అనుకుంటాం అంటే,***

రాహువు, కేతువు, అసలు పేర్లే మనకి నచ్చవు. రాహువు, కేతువు. కానీ ఆ రాహువు, కేతువు యొక్క ఉత్పత్తి ఎలా అయింది? ఏ విధంగా అయింది అన్నది కనుక మీరు ఆలోచిస్తే, ఒక అద్భుతమైనటువంటి సాధనా రహస్యం బోధపడుతుంది.

ఆ సాధనా రహస్యము నిరాశ్రయః అనే మాటలో ఆ జగద్గురువు సంధించి పెట్టాడు.

ఏమిటి కథ అక్కడ? అమృతాన్ని సాధించాలి. సముద్ర మంథనం చెయ్యాలి. ఏ సముద్రమంథనం?

ముద్ర - అంటే సీల్.

స - అంటే కూడినది.

స-ముద్ర - ముద్రలతో కూడినటువంటి శరీరము.

- మన శరీరానికి ఒక స్పెసిఫిక్ సీల్ ఉంది. దాన్నే జీన్స్ అంటాం.

చెయ్యి చెయ్యిలాగే ఉంటుంది. అది దాని ముద్ర. కాళ్ళు కాళ్ళలాగే ఉంటాయి, కళ్ళు కళ్ళలాగే ఉంటాయి. రెండే కళ్ళు ఉంటాయి, రెండే చెవులు ఉంటాయి. 32 పళ్ళే ఉంటాయి. ఇవంతా ఏంటక్కడ? ముద్రలు.

- ఆ సముద్రమును కనుక మనం మథించగలిగితే, 14 రత్నాలు బయటపడతాయి అని చెప్తాం.

ఎక్కడో సముద్ర మంథనం చేయక్కర్లేదు. మన శరీరంలో ఉన్నటువంటి సముద్ర మంథన, మనలో ఉన్న టువంటి సీల్స్, మనలో ఉన్నటువంటి భావాలు, మనలో ఉన్నటువంటి సీల్స్ ఎలా ఉన్నాయి? వాటిని మథించాలి.

ఒక దేశ, కాల పరిస్థితుల్లో పుట్టిన మనం, రామా అనే శబ్దం వినేసరికి పులకరించిపోతాం. ఇంకొక దేశకాల పరిస్థితుల్లో పుట్టిన వాళ్ళకి రామా అనే శబ్దం వినిపిస్తే, వాడికి నచ్చదది. ఇంకొక మాట అనాలి. కానీ ఇది ముద్రలే.

- ఆ రామా అనే శబ్దంలో ఉండే ముద్ర కనుక మనకి లేకపోతే, ముద్ర అంటే అర్థమవుతోందికదా, ద సీల్ ఆఫ్ అథారిటీ. ఆ మాట మీకు ఇచ్చే అనుభూతే కనుక మీకు లేకపోతే, అది మీకు ఏ భావము చేయదు.

రామా అనే పదం భావం లేనటువంటి చిన్న పిల్లలకి చెప్తే, రామా అనే పదం చెప్పినా, అల్లా అనే పదం చెప్పినా, గాడ్ అనే పదం చెప్పినా, వాళ్ళకేమీ తేడా రాదు.

***మెల్లిమెల్లిగా మనం వాళ్ళ మీద ఏం వేస్తాం?***

ముద్రలు వేస్తూ పోతాం.

ఇంక ఈ స-ముద్ర, దీన్ని దాటాలి.

- ఈ ముద్రలను ఎలా దాటతాం అనేది సుందరకాండ యొక్క అద్భుతమైనటువంటి సాధనావిధానం.

-- రామాయణంలో సుందరకాండ మొత్తము కూడా ఈ నిరాశ్రయః, కుండలినీ సాధన యొక్క ఒక సాధనా విధానాన్ని మనకి తెలుపుతుంది.

హనుమంతుడు ముందు ఉత్తరం నుంచి దక్షిణం వైపుకి వెళతాడు.

- ఈ ఉత్తరం వైపు నుంచి దక్షిణం వైపు వెళ్ళే ప్రక్రియ అంతా కూడా ముద్రలను దాటటమే.

3 రకాల ముద్రలు సాధారణంగా మన శరీరంలో ఉంటాయి. మొట్టమొదటి ముద్ర, సాధన మొదలెడతాం. ఫస్ట్ మైనాకుడు సముద్రంలోంచి బయటకి లేస్తాడు.

***ఇంతా చేస్తే అక్కడ జరిగింది ఏమిటి? :***

హనుమంతులుంగారు సీతను వెతకటానికి హీ హేజ్ జస్ట్ స్టార్టెడ్. హీ కమెన్స్‌డ్ హిజ్ జర్నీ. యాత్ర మొదలెట్టాడు. సాధకుడు తన జ్ఞానయోగ యాత్రని మొదలెట్టాడు.

జ్ఞానయోగ యాత్రని మొదలెట్టగానే మైనాకుడు వచ్చి, "నాయనా! నువ్వు అద్భుతమైన సాధన చేయబోతు న్నావు. నీది చాలా తీవ్రమైన, కఠోరరమైన యాత్ర. దీన్ని అందరూ సవ్యంగా పూర్తి చేసుకోలేరు. చాలా అలసట, శ్రమతో కూడిన సాధన కనుక నువ్వు నా మీద రెస్ట్ పుచ్చుకో!"

అసలు ఇంకా మొదలెట్టలేదు.

ఊహే, "నేను చాలా కష్టపడిపోవాలి!"

☺ 1000 సార్లు గాయత్రీ చెయ్యాలి. గంట టైమ్ పడు తుంది కనుక ప్రక్కన ఫ్లాస్కు, కొబ్బరి నీళ్ళు!

ఇంకా ఏం మొదలెట్టలేదు. ముందు అన్నీ ప్రక్కన రెడీగా ఉంటాయి. ఎందుకు అంటే, "ఏమో, నేను మంత్ర జపం చేస్తున్నప్పుడు దాహం వేస్తే?"

పెట్టుకోవద్దు అని నేను అనటం లేదు. ఆ మానసిక స్థితి ఎలా ఉంటుందో, ఆ ముద్రలు మన మీద, శరీరం మీద ఎలా ఉంటాయో చెప్తున్నాను.

ఏంటిట మైనాకుడికి హనుమంతుడి మీద ప్రేమ? అది ఎక్కడ్నుంచి వస్తోందో ఆ ప్రేమని అర్థం చేసుకోండి.

త్రేతాయుగంలో కొండలు ఎగురుతూవుండేవిట. వాటికి మూడ్ వచ్చినప్పుడు క్రిందకి దిగేవి. కొండ బేస్ చాలా విశాలంగా ఉంటుందికదా! అది దిగిన చోట, బై ఛాన్స్ ఏదైనా విలేజ్ ఉందనుకోండి, ఆ విలేజ్ మొత్తం ఫినిష్! అంచేత విలేజెస్‌లో ఉన్న వ్యక్తులు అందరూ వెళ్ళి ఇంద్రుడికి మొరపెట్టుకుంటే, అలాగ అని చెప్పి ఆయన ఆ కొండలకి ఉన్న రెక్కల్ని కొట్టేయటం మొదలెట్టాడు.

అన్ని కొండలకీ రెక్కలు కొట్టేస్తూవుంటే, రెక్కలతో మైనాకుడు పారిపోతున్నాడు. వాయుదేవుడు మైనాకుడికి ఫ్రండ్. అంచేత ఆయన కూడా సహాయం చేసి, ఈయన్ని సముద్రంలో పడేస్తే, మైనాకుడు అక్కడ దాక్కుని ఉన్నాట్ట.

హనుమంతుడు ఎప్పుడైతే బయలుదేరటం మొదలెట్టాడో, ఈయన వాయుదేవుడి యొక్క పుత్రుడుకదా, "నా స్నేహితుడి కొడుకువు నువ్వు. అంచేత నీకు సహాయం చేయటానికి వచ్చాను. నువ్వు ఇంత పెద్ద పని చేయబోతున్నావు కనుక నా మీద రెస్ట్ తీసుకుని వెళ్ళు!"

***ఇక్కడ చెప్తోన్న సాధన యొక్క రహస్యం ఏమిటి?***

మీరు ఎప్పుడైతే ఈ సాధన మొదలెట్టారో, తక్షణం మీరు "నాకేం అయింది?" అని గమనించుకోవటం మొదలెడతారు. మీకు రెండు కనిపిస్తాయి. లాభాలైనా కనిపిస్తాయి, నష్టాలైనా కనిపిస్తాయి.

***ఇమ్మీడియెట్‌గా మనం దేనికి దాన్ని అట్రిబ్యూట్ చేసేస్తాం?***

నేను గాయత్రీ చేయటం మొదలెట్టాను కనుక, లేకపోతే రామనామం చేయటం మొదలెట్టాను కనుక, లేకపోతే ఏదో చేయటం మొదలెట్టాను కనుక నాకు ఈ సుఖం వచ్చేసింది. అంచేత నేను గాయత్రీ చేసుకుంటాను.

***అంటే ఏం చేశావు నువ్వు!***

దాని మీద ఆశ్రయం అయ్యావు. ఆ *నిరాశ్రయః* అనే పదానికి వివరణ ఇవ్వటానికి ఇది చెప్తున్నాను.

- ఇమ్మీడియెట్‌గా మనకి దాని మీద భక్తి పెరిగిపోతుంది. ఎంచేత? మంచి జరిగింది.

సాధకుడు ఎప్పుడైతే తను సాధన చేయటం మొదలెడతాడో, ఇది వరకు మన శరీరంలో ఉన్నటువంటి ఆ మంచి బయటకి వస్తుంది.

- మంచి బయటకి రాగానే చాలా ఆనందంగా ఉండి దానికి ఆశ్రయం అవుతాడు. అంటే ఇంక ఎప్పుడూ నాకు మంచే జరుగుతుంది అనుకుంటాడు.

భౌతిక జగత్తు సంగతి చెప్తున్నాను.

- సాధకుడికి ఎప్పుడూ మంచే జరుగుతుంది. అందులో డౌటేం లేదు. కానీ భౌతిక జగత్తులో ఏం జరుగుతుంది అనేది మనం చెప్పలేం.

అంచేత భౌతిక జగత్తులో నాకు ఎప్పుడూ మంచి జరుగుతుంది అనే ఆశ్రయానికి రాగానే ఏమవుతుంది?

***నేను ఎప్పుడూ చెప్తానుకదా,***

సుఖం ఉందంటే జాగ్రత్త, ప్రక్కనే గ్యారంటీగా దుఃఖం వస్తుంది. దుఃఖం ఉందంటే మీరేమీ కంగారు పడక్కర్లేదు, గ్యారంటీగా సుఖం ఉంటుంది.

- అంచేత యోగికి ఎప్పుడూ శీర్షాసనం వేసిన భౌతిక జగత్తు కనిపిస్తుంది. అందరూ సుఖంగా ఉంటే వీడికి రాబోయే కష్టాలు కనిపిస్తాయి. కష్టాల్లో ఉంటే, వీడికి రాబోయే సుఖాలు కనిపిస్తాయి.

కానీ ఏ విధంగా చూసుకున్నా, మీరు ఆశ్రయంలో ఉన్నారు. అంతేగా! అంచేత ఆ ఆశ్రయం వద్దు. సాధన మొదలెట్టావు. జరిగేదేదో జరుగుతుంది. కానీ అది ఏం జరుగుతోంది, ఎలా జరుగుతోంది, ఎందుకు జరుగుతోంది, దాని గురించి సాధకుడు ఆలోచించడు.

ఫస్ట్ స్టెప్, మంచి. రెండవది, సురస.

సురస యాక్చువల్‌గా దేవతలకి ప్రతినిధి. కానీ మనకేం అనిపిస్తుంది? హనుమంతుడికి ఏమనిపించి ఉంటుంది? రాక్షసుల యొక్క ప్రతినిధి.

- అలాగే సాధకుడు సాధన చేస్తున్నప్పుడు వచ్చే కష్టాలు సురసలాగ మన సాధన యొక్క తీవ్రతని టెస్ట్ చేయటానికి వస్తాయి.

మనకి బియ్యే డిగ్రీ రావాలన్నా, బియ్యెస్సీ డిగ్రీ రావాలన్నా, మనకి ఏ విధమైన డిగ్రీ రావాలన్నా టెస్ట్ ఫేస్ చేయాల్సిందేకదా! నేను టెస్ట్ వ్రాయను అంటే, డిగ్రీ రాదు.

మరి టెస్ట్ అంటే, సురస ఆయె!

ఇష్టమే మనకి. సు-రస, డిగ్రీ ఇష్టమే. కానీ టెస్ట్ వ్రాయటం ఇష్టంలేదు. టెస్ట్ చేసి మామూలుగా మార్కులు ఇచ్చేస్తే ఓకె. టెస్ట్‌లో పడవలసిన కష్టం నచ్చదు.

*అంచేత ఏమవుతుంది?*

నోరు తెరుస్తుంది. ఒక కష్టం వస్తుంది.

*సాధకుడు ఏం చేస్తాడు?*

దాన్ని అధిగమిస్తాడు, ఇంకా పెద్దవాడు అవుతాడు.

*అప్పుడు టెస్ట్ ఏమవుతుంది?*

బియ్యెస్సీ పరీక్షకంటే నేచురల్గీ ఎమ్మెస్సీ పరీక్ష ఇంకా పెద్దదవుతుంది. ఇంకా పెద్ద టెస్ట్‌లు వస్తాయి.

*అప్పుడు ఏడేం చేయాలి?*

ఇంకా పెద్ద టెస్ట్, ఇంకా పెద్ద టెస్ట్, అలా చేసుకుంటూ పొమ్మనా చెప్పింది సాధకుడు? కాదు.

- చివరికి ఒకానొక స్థితిలో యూ స్టాప్ టెస్టింగ్ యువర్ సెల్ఫ్. చిన్నవాడివి అయిపో!
  కష్టాలు గురించి నువ్వు పట్టించుకోకు!

*ఏం చేయమన్నాడు?*

- దాని నోట్లోకి దూరిపో. యూ బికమ్ ఒన్ విత్ ఇట్. ఆ కష్టము కూడా ప్రకృతి మనకి ఇచ్చినటువంటి అద్భుతమైనటువంటి వరమే.

భగవద్గీత యొక్క ఈ శ్లోకం, రాబోయే మిగతా రెండు శ్లోకాలూ కూడా దత్తాత్రేయ సాంప్రదాయానికి సంబంధించినవే. అంటే, మన భాషలో చెప్పుకోవటానికి.

అర్థమయిందికదా! అంచేత సాధకుడు దేని మీద ఆశ్రయం పడటం లేదు. మంచి జరిగినా ఓకె. చెడు జరిగినా ఓకె. ఎక్కడ? భౌతిక జగత్తులో.

- ఈ మంచి, చెడు అనేది కేవలం భౌతిక జగత్తులోనే. సూక్ష్మజగత్తులోకి వెళ్ళిన మరుక్షణం మంచీ లేదు, చెడూ లేదు.

భయంకరమైనటువంటి కల చూస్తూవుంటాడు. సడన్‌గా నిద్ర లేస్తాడు. ఏముందక్కడ? ఏమీ లేదు. అంచేత ఈ మంచీ, చెడూ అనే ద్వంద్వము మనకి సూక్ష్మజగత్తులోకి వెళ్ళిన దగ్గర్నుంచి తగ్గటం మొదలెడుతుంది.

- అంచేత సుఖాలు, ఈ డివైన్ ఎక్స్‌పీరియెన్సెస్ అని సాధనలో చెప్పుకుంటూవుంటాంకదా, ఇవి ఒక రకమైన ఆశ్రయాలు. వీటి మీద మీరు ఆధారపడకండి.

"నేను సాధన చేస్తున్నప్పుడు మొదట ఎంత అద్భుతమైన అనుభవాలు వచ్చాయో మాస్టారు! ఇప్పుడేం అనుభవం రావటంలేదు. అంచేత నేను సాధన చెయ్యను!"

- అంటే, అనుభవాలు కోసం సాధన చేస్తున్నాడు. లక్ష్య సిద్ధి కోసం కాదు. ఆ తేడా అర్థమవుతోందికదా!

ఆ జ్ఞానయోగంలో మనం ఈ విధమైన జ్ఞానాన్ని ఉపయోగించుకోవాలి, కష్టాలు వచ్చినా, సుఖాలు వచ్చినా, ఈ రెండింటి మీదా కూడా వాడు ఆశ్రయం చూపించడు.

కానీ సాధకుడికి ఇంకొక రకమైన ప్రోబ్లెమ్ వస్తుంది. ఎటు వైపు నుంచి ఎటు వెళుతున్నాడో చూడండి. ఉత్తరం వైపు నుంచి దక్షిణం వైపు హనుమంతుడు గెంతుతున్నాడు. అక్కడేం వచ్చింది? సింహిక.

*సింహిక ఏం చేస్తుంది?*

నీడను చూచి లాగుతుంది. నీడ అంటే, "నేను చాలా మంచి వాడ్ని. నేను తెలిసి ఎవరికీ ఏం తప్పు చేయలేదు. అయినా నాకు ఈ కష్టాలు ఎందుకు వస్తున్నాయి?"

- ఎక్కడో నీడలు ఉన్నాయి. ఏ జన్మలోనో, ఎక్కడో చేసుకున్నటువంటి ప్రారబ్ధకర్మ యొక్క నీడ ఈ జన్మలో పడుతోంది. పడనివ్వండి, పోతుంది.

*కానీ అప్పుడు ఏం చేయాలి?*

- ఆ నీడని పోగొట్టుకోవటానికి మాత్రం మీరు చాలా తీవ్రమైనటువంటి ప్రయత్నం చేయాలి.
  మీరు సముద్రంలోకి దిగాలి.

దాన్నే అరవిందో ఇన్ కాన్సియంట్ అన్నాడు. కాన్సియంట్ అంటే కాన్స్యస్‌నెస్. ఇన్, లోపలికి దిగాలి మీరు. చేతనత్వంలోకి దిగాలి, సముద్రం లోపలికి దిగాలి. ఎక్కడ ఉందది? ఎక్కడ్నుంచి ఆ ఫాల్ట్ వస్తోంది. ఎక్కడ్నుంచి నీడ పడుతోంది మన మీద అని మీరు వెతకాలి. ఆ నీడని పెకిలించుకోవాలి. సింహిక అని పేరు పెట్టాడు దానికి.

- సింహిక అనేటటువంటి రాక్షసి సముద్రంలో ఉండి మనల్ని పీకుతూ ఉంటుంది.

మన మోడరన్ భాషలో చెప్పుకోవాలి అంటే, మన జెనెటిక్ ఫాల్ట్స్. ఇది వరకు పూర్వజన్మలో వచ్చిన మన ఈ జీన్స్‌లో ఉన్నటువంటి లిమిటేషన్స్. "మనం ఇంతే చేయగలం, అంతే చేయగలం!"

కాదు, మీరు దాన్ని దాటగలరు.

అంచేత ఈ మూడు రకాలైన ఆశ్రయాలు ఎప్పుడైతే లేవో, దాన్ని ఆధ్యాత్మిక జగత్తులో నిరాశ్రయః అంటాం.

భౌతికమైన ఆశ్రయం, వర్షం కురుస్తూవుంటే గొడుగు పట్టుకోవద్దు అదీ ఏం చెప్పటం లేదు.

శ్రీ సాధన చేస్తున్నప్పుడు సుఖాలు వస్తే, మీ సాధన వల్ల ఆ సుఖాలు వచ్చాయి అనుకోకండి. మీరు ఆల్‌రెడీ ప్రపంచాన్ని శాసించే అంత గొప్ప సాధకులు అవలేదు.

"మాస్టారు! నేను సాధన చేశాను, కళ్ళు మూసుకున్నాను. వర్షం కురవాలి అనుకున్నాను, వర్షం కురిసింది."

నిజంగా మనం అంత గొప్పవాళ్ళం అయితే, రాజస్తాన్ ఎడారిలోకి వెళ్ళిపోయి వర్షం కురిపించగలమా?

మళ్ళా మనం ఆశ్రయం పడతాం. మనం చేశాం కనుక అది వచ్చింది అంటాం.

నువ్వు చేయటం వల్ల రాలేదు.
నువ్వు చేయటం వల్ల కూడా వచ్చింది.

లోప్‌సాంగ్ రంపా అనే ఒక అద్భుతమైనటువంటి యోగసాధకుడు, అతని పుస్తకాలు దొరికితే, ఆ సెట్ ఇంట్లో పెట్టేసుకోండి, 13 పుస్తకాలు వ్రాశాడతను.

ఎలాగ వ్రాశాడు ఆ పుస్తకాలు? సెకండ్ వరల్డ్ వార్‌లో అతనొక డాక్టర్‌గా పనిచేస్తూవుండేవాడు. హీ ఈజ్ ఏ టిబెటన్ బై బర్త్. ఆ వార్‌లో చావు దెబ్బలు తిని, హిమాలయాలు యొక్క కందరాలలో, ఆ రష్యన్ బోర్డర్‌లో పడిపోయి ఉన్నాడు. ఇతని శరీరానికి ఇంగ్లాండ్‌లో ఉన్న ఒక ఆర్టిస్ట్ శరీరానికి చాలా సారూప్యత, సిమిలారిటీ ఉంది. ఇక్కడేమో ఇతను చావు బ్రతుకుల మధ్య ఉన్నాడు.

ఇంగ్లాండులోని ఆ పెయింటర్ దగ్గరకి గురువులు వెళ్ళి రిక్వెస్ట్ చేశారు, "నీ శరీరాన్ని మాకు ఇచ్చేస్తావా?"

అలాంటివి ఇప్పటికీ కూడా చాలా జరుగుతాయి.

అమెరికాలో అయితే ఇప్పుడు చాలా కీ ప్లేసెస్‌లో ఉన్న వాళ్ళల్లో చాలా మంది వాళ్ళ శరీరాలు మహాత్ములకి ఇచ్చేశారు. వాళ్ళు వాళ్ళ బయోగ్రఫీస్‌లో వ్రాసుకుంటున్నారు. ఓపెన్‌గా చెప్తున్నారు.

గురువులు ఉన్నారని, ఆ గురువులకి మన శరీరాన్ని ఇవ్వవచ్చు అని దురదృష్టవశాస్తూ అది మన భారతదేశంలో ఇంకా రావటం లేదు. డొనేషన్ అన్నమాట.

అసలు మనకి ఆ కాన్సెప్ట్ లేదుగా! మనకి కావలసింది ఏమిటంటే, ఏవైనా భౌతిక సుఖాలు వచ్చాయా, లేవా? భౌతిక సుఖాలు వస్తేనే శిరిడీ సాయి.

శిరిడీ సాయి గుళ్ళు పెరిగిపోయాయి అంటే భక్తి పెరిగిందని మాత్రం నేను అనుకోవటం లేదు. ఈజీగా పనులు జరిగిపోతాయి. ఎమ్మెల్యేలు, ఎంపీలు వాళ్ళ దగ్గరకి వెళ్ళక్కర్లేదు. పాపం ఈయనకి ఒక కొబ్బరికాయ కొట్టేస్తేనో, ఒక కొబ్బరి ముక్క ధునీలో వేసేస్తేనో ఒప్పేసుకుంటాడు.

అంచేత గురువులకి శరీరాన్ని ఇచ్చేయటం అనేది జరుగుతున్నాయి. అమెరికాలో అయితే కనీసం మోర్ దేన్ 200 రికార్డెడ్ కేసెస్ ఉన్నాయి.

-- వాళ్ళకి వాకిన్స్ అని పేరు పెట్టారు.

వాకిన్ అంటే తెలుసుకదా, షాపుల్లో దగ్గరకి వచ్చి కొనేసి తీసుకెళ్ళిపోవటం. అలా వాళ్ళు వాళ్ళ శరీరాన్ని వదిలేశారు. అందులో నిక్సన్ యొక్క ప్రైవేట్ సెక్రటరీ ఒకడు.

అంటే ఆ హై ప్లేసెస్‌లో ఉన్నవాళ్ళు కూడా ఈ ఆధ్యాత్మికతను ఇంత ఓపెన్‌గా, పబ్లిక్‌గా స్టేట్‌మెంట్ ఇస్తూవుంటే, ఈ మాట మనలో ఎవడైనా అంటే, "అది ఎలా సంభవం?" అని ఆధ్యాత్మికవేత్తలు అయిన మనం ముందు నవ్వుతాం వాళ్ళను చూసి. మిగతా వాళ్ళ సంగతి ఎందుకు?

అంచేత, ఆ నిరాశ్రయః అనే పదాన్ని చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోండి. మీరు దేని మీదా ఆశ్రయం కావద్దు.

సాధన వల్ల ఫలితాలు వచ్చే స్థితికి మనం రాలేదు.

ఇప్పుడు ఒకడు బియ్యెస్సీ డిగ్రీ సంపాదించుకుంటాడు. కష్టపడి సంపాదించుకుంటాను అంటాడు. కానీ గవర్నమెంటు లాబ్స్‌కి, దానికి కొన్ని లక్షలు ఖర్చు పెడుతుంది. అది ఖర్చు పెట్టకపోతే వీడికి డిగ్రీ వస్తుందా? అది

వీడు అబ్జర్వ్ చేసుకోడు. నేను చదివాను కనుక వచ్చింది అంటాడు. తండ్రి వాడికి ఫీజు కట్టకపోతే వస్తుందా? తల్లి వాడికి అన్నం పెట్టకపోతే వస్తుందా?

ఇప్పుడు ఈ విధంగా ఆలోచిస్తే, ఇంతా చేస్తే వీడికి డిగ్రీ ఎందుకు వచ్చిందో నాకు అర్థంకాలేదు.

వాడు చదవటం వల్ల ఏం రాలేదు. వాడి కంటే చాలా అద్భుతమైన, అతీతమైనటువంటి శక్తి, గవర్నమెంటు ఒక కాలేజీ పెట్టింది. దాంట్లో సైన్స్ ఇన్‌స్టిట్యూషన్ పెట్టింది. యూనివర్సిటీ దానికి పెర్మిషన్ ఇచ్చింది. పెర్మిషన్ ఇచ్చాక లాబ్స్ ఉన్నాయి, కెమికల్స్ వచ్చాయి. ఆ కెమికల్సుని మేము ఎక్స్‌పెరిమెంట్ పేరుతో ఆ సింకుల్లో పారబోయాలి. ఆ కెమికల్స్ పారబోయాలి అంటే, కెమికల్ కంపెనీస్ వాటిని మాన్యుఫాక్చర్ చేయాలి. ఇదంతా చేస్తే, వీడు ఒక రెండు గంటలు చదివి, బియ్యెస్సీ డిగ్రీ "నేను చదవటం వల్ల వచ్చింది" అంటాడు. ఆ ఆలోచనా విధానం.

ఇంక నువ్వు దేని మీద ఆధారపడతావు?

నువ్వు ఎవరి మీదా ఆధారపడక్కర్లేదు.

అంచేత ఈ రాహువు, కేతువు యొక్క కాన్సెప్ట్ మీరు అర్థం చేసుకోండి. దాని గురించి ఇదంతా చెప్తున్నాను.

రాక్షసులు సముద్రాన్ని మథించారు. మన సాధనా జగత్తులో రాక్షసులు అంటే ఆధ్యాత్మిక జగత్తుకి ఆధారమైన యజ్ఞకర్మను తెలియని వాళ్ళు రాక్షసులు. డెఫినిషన్ అంతే. బాహ్యజగత్తులో మన సమాజం ఎవర్ని రాక్షసులు అనుకుంటోందో, దాని గురించి మనం మాట్లాడుకోవద్దు.

ప్రకృతిలో ఒక యజ్ఞీయ కర్మ జరుగుతోంది.

*సహ యజ్ఞాః ప్రజాస్సృష్ట్వా పురోవాచ ప్రజాపతిః*
*అనేన ప్రసవిష్యధ్వ మేషవోఽస్త్విష్ట కామధుక్.* (3-10)

పూర్వము బ్రహ్మదేవుడు యజ్ఞములతోగూడ ప్రజలను సృష్టించి 'ఈ యజ్ఞములచే మీరభివృద్ధినిబొందుడు. ఇది మీ యభీష్టములను నెరవేర్చుగాక!' అని వారితో బలికెను.

మనిషితో పాటే యజ్ఞకర్మ సృష్టింపబడింది.

మనిషితో పాటే యజ్ఞకర్మ సృష్టింపబడినది అనేది మనం కొంచెం సవరించుకుందాం, అసలు యజ్ఞకర్మలు లేకపోతే మనిషి పుట్టలేదు.

సూర్యుడు నుంచి వచ్చే అనేక కిరణాలలో జరిగే చక్రీయ గమనాలు, కార్బన్ డైయాక్సైడ్ సైకిలు, నైట్రోజన్ ఫిగ్జేషను, రకరకాలైన చక్రాల్ని మన సైన్సు తెలుపుతోంది. ఇవి కాకుండా మనం మూడవ అధ్యాయంలో అనేక రకాలైనటువంటి సైకిల్స్ చదువుకున్నాం. ఈ యజ్ఞకర్మ తెలుసుకున్నటువంటి వాడు చాలా సుఖంగా జీవించవచ్చు.

కానీ ఈ యజ్ఞకర్మ అంటే ఈ సైక్లిక్ ప్రొసెసని మనం నిర్ణయించలేదు. ఇది మన చేతిలో లేదు.

- ఊపిరి పీల్చుకుంటున్నాం, వదులుతున్నాం. ఒక చక్రీయ క్రమం. ఇది మీ చేతిలో ఏం ఉంది?
-- కనురెప్పలు పడుతూవుంటాయి, లేస్తూవుంటాయి. ఇందులో మీ చేతిలో ఏం ఉంది?
-- గుండె కొట్టుకొంటూవుంది. మీరు చేసేదేం ఉంది?
-- అన్నం అరుగుతోంది, బయటకి వెళ్ళిపోతోంది. మళ్ళా ఆహారం వేశాం, అరుగుతోంది. బయటకి వెళ్ళిపోయింది. ఇందులో మీరు చేసేదేం ఉంది?
-- మనం చేసేటటువంటిది ఏం లేదు.

- కానీ ఈ ప్రక్రియని అర్థం చేసుకోలేకపోవటం వల్ల మనం చేసేటటువంటి ప్రతీ పనీ ఏమౌతోంది?
-- ఈ సైక్లిక్ ప్రొసెసెస్‌కి విఘ్నం కలిగించే పని అవుతోంది. దాని వల్ల మనకి బాధలు, రోగాలు, అవీ వస్తున్నాయి.

- ఈ చక్రీయ క్రమం ఎప్పుడైతే వాడికి అర్థమవుతుందో, ఇంక వాడు ఎవరి మీదా ఆధారపడడు.
-- జస్ట్ హీ ఫ్లోస్ ఇన్టు ఇట్. ఆ సైక్లిక్ ప్రొసెస్‌లో వాడు ఒక భాగంగా మారిపోతాడు.

- ఆ ఒక భాగంగా మారిపోయే దానికి కావలసిన ఒక అద్భుతమైన సాధనా విధానం - "శ్వాస".

శ్వాస పీల్చుకుంటున్నాం, వదులుతున్నాం. దాన్ని మనం గమనించుకోవటం లేదు.

- నిరంతరము శ్వాస మీద ఆధారపడివుండటము కూడా నిరాశ్రయః వ్రతము.

నిరాశ్రయః అనే పదము, ప్రకృతిలో ఇంక నేను దేని మీదా ఆధారపడను. శ్వాస మీద ఆధారపడతాను. శ్వాస ఉంటే నేను ఉన్నాను. శ్వాస లేకపోతే నేను లేను.

శ్రీ అంచేత మీరు ఎవరి మీద అయినా పూర్తిగా ఆధార పడదల్చుకుంటే, శ్వాస మీద ఆధారపడొచ్చు.

- కానీ శ్వాస మీద మీరు ఎప్పుడైతే ఆధారపడతారో, సముద్ర మంథనం జరుగుతుంది.

-- రాహువు, కేతువు యొక్క ఉత్పత్తి జరుగుతుంది.

ఇడా శ్వాస, పింగళా శ్వాస అని యోగ పరిభాషలో అంటాం. మనం మామూలుగా ఎడం ముక్కు, కుడి ముక్కులోంచి వచ్చే శ్వాస అంటాం.

- ఈ ఎడం ముక్కు, కుడి ముక్కు దాంట్లోంచి వచ్చే శ్వాస, మెల్లిగా మన మూలాధార చక్రం దగ్గర ఉన్న మేరు పర్వతాన్ని మంథన చేస్తుంది.

*మంథన చేసి ఏం చేస్తుంది?*

దాంట్లో ఉండే అనేక సీల్స్‌ని బయటకి తీస్తుంది.

- ఏ సీల్ బయటకి తీస్తే ఆ విధమైనటువంటి యాక్షన్ మనం చేస్తాం.

--- కోపమూ మనది కాదు,
ప్రేమా మనది కాదు. ఏదీ మనది కాదు.

-- మన శరీరాలలో ఆ శ్వాస కంపిస్తూవుంటే, ఏ విధమైన రత్నాలు బయటకి వస్తాయో, ఆ రత్నాలు యొక్క ప్రభావం వల్ల మన జీవితాలు నడుస్తూవుంటాయి.

ఆ రత్నాలు కొన్ని మంచివి, కొన్ని చెడువి ఉన్నాయి.

హాలాహలం వచ్చిందిట. ఇంక దాన్ని ఎవడు పుచ్చు కుంటాడు? రత్నాలు కోసం అయితే వీళ్ళు మొదలెట్టారు.

*అమృతం కోసం ప్రయత్నం చేస్తే ఏం వచ్చింది?*

- ద ఎగ్జాట్ ఆపోజిట్, మృత్యువుకి కారణమైనటువంటి అద్భుతమైనటువంటి విషం, బ్రహ్మాండమైనటువంటి విషం బయటకి వచ్చింది.

మనం మంథన చేస్తున్నప్పుడు కూడా ఇప్పుడు కార్బన్ డైయాక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్, విషాలు బయటకి వస్తూనే ఉంటాయి. మనం దాన్ని విషం అనుకోం. అసలు మనం దాన్ని గమనిస్తేకదా!

కానీ మనం శ్వాసని వదిలినప్పుడు విషమే బయ టకి వచ్చేది, హాలాహలమే బయటకి వచ్చేది.

- దాన్ని అమృతమయంగా మార్చటానికి కావలసిన సాధన, అమృతాన్ని పొందే సాధనే సముద్ర మంథనం, లేకపోతే రాహువు, కేతువు యొక్క జంట.

*ఏం జరుగుతోంది అక్కడ?*

హాలాహలం వచ్చాక ఏం జరిగిందో మీకు తెలుసు కదా, శివుడు దాన్ని త్రాగేసి గొంతుక దగ్గర ఆపేశాడు.

*గొంతుక దగ్గర ఆపేయటం అంటే నేను ఏం చేస్తాను?*

- విశుద్ధి చక్రము. మీలో వచ్చే విషాన్ని మీరు బయటకి కక్కకుండా ఉంటే, మీ యొక్క వాక్కు ద్వారా ఎవరికీ హాని కలగజేయకుండా ఉంటే, మీ నోటిలోంచి ఏది వస్తే అది కరెక్ట్ అవుతుంది. హాలాహల సాధన.

*అందుకే శివుడు ఏం చేశాడు?*

దాన్ని మింగేసి గొంతుక దగ్గర ఆపేశాడు. ఆ విషాన్ని బయటకి రానివ్వలేదు. బయటకి వస్తేకదా ప్రాబ్లమ్!

సరే తరవాత అమృతం వచ్చింది. అమృతం వచ్చిన తరవాత ఏం జరిగిందో తెలుసుకదా, ఒక వైపు రాక్షసులు, ఇంకొక వైపు దేవతలు కూర్చున్నారు. మళ్ళా ప్రాబ్లమ్ అదే.

- రాక్షసులకి కనుక అమృతము వెళితే ఏమౌతుంది? ఆ రాక్షసత్వాన్ని మనం రూపుమాపలేము.

రాక్షసత్వాన్ని మనం రూపుమాపలేకపోతే జరిగే ప్రాబ్లమ్స్ మనందరికీ తెలుసు కనుక, మళ్ళా ఆ జగన్మోహిని అవతారము, దానితో కావలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

కానీ ఒక రాక్షసుడు మాత్రం మన దగ్గరకి అమృతం రాలేదు అని గమనించాడు.

- వాళ్ళే మనం. మనమందరము ఆ రాక్షసులు యొక్క అంశ వాళ్ళమే. పాజిటివ్ అంశ.

*మన దృష్టి ఎవరి మీద ఉంది?*

అమృతం వైపు ఉన్నటువంటి వాళ్ళ మీద. అంచేత మనం రాక్షసులమే. రాక్షసులమే అంటే, మళ్ళీ ఆ రాక్షసులు అనుకోవద్దు. రావణాసురుడు, హిరణ్యకశిపుడు, వాళ్ళు కాదు. చక్రీయ క్రమాన్ని గమనించుకోలేని రాక్షసులం.

చక్రీయ క్రమం జరుగుతోంది. శ్వాస వస్తోంది. కానీ శ్వాస గురించి ఎంత అద్భుతమైన లిటరేచర్స్ ఉన్నాయి?

స్వరయోగం ఉంది. వీరబ్రహ్మంగారి మొత్తం కాలజ్ఞానం అంతా శ్వాస మీద ఆధారపడే ప్రాశాడాయన.

- శ్వాసను గమనించుకుంటే మొత్తం భవిష్యత్తును తెలుసుకోవచ్చు.

కానీ అది మనం మర్చిపోయాం కనుక రాక్షసులం. ఆ యాంగిల్లో రాక్షసులం. మంచి వైపు వెళ్ళని రాక్షసులం.

అది గమనించాం మనం. అమృతత్వం కావాలి.

మరి విష్ణువు ఏం చేశాడు? నీకు ఇవ్వను అన్నాడు. ఎందుకు ఇవ్వనన్నాడు? ఒక కథ చెప్తూవుంటారు.

ఒకడు అమృతత్వాన్ని సాధించటానికి ప్రయత్నం చేశాట్ట. ఇది గ్రీక్ కథ. సరే, అమృతం వాడికి లభించింది. వాడు దాన్ని త్రాగబోతూవుంటే, ఒక వాణి వినిపించింది.

"నువ్వు త్రాగుతావు సరే, త్రాగిన తరవాత నీ పరిస్థితి ఏమౌతుందో చూసుకో. నీ చుట్టుప్రక్కల వాళ్ళందరూ చచ్చి పోతారు. నువ్వు ఉంటావు. ఎప్పుడో అప్పుడు శత్రువుల చేతిలో నువ్వు చిక్కుతావు. చిక్కితే నిన్ను వాళ్ళు పొడుస్తారు. నువ్వు అమృత్వం త్రాగావు. వాళ్ళు పొడుస్తూవుంటారు...."

గ్రీక్ కథకదా, ఆ కాలపు భాషలో ఉంటుంది.

".... వాళ్ళు మంటల్లో పడేస్తూవుంటారు, ఏదో చేస్తూవుంటారు. అమృతం త్రాగితే ఏమౌతుందో నువ్వు ఊహించుకో నాయనా! మరి నీకు దమ్ముంటే త్రాగు, లేకపోతే మానేయ్!" అంటే, వాడు త్రాగలేదట. లేకపోతే ఈ పాటికి అందరికీ అమృతం వచ్చేసేదిట.

- అమృతతత్వం అయితే కోరతాంకాని, అమృతత్వం కోరేటటువంటి మీ జీవిత లక్ష్యం ఏమిటి? అనేది స్పష్టంగా లేదు కనుక, సాధకుడికి ఇమ్మీడియెట్‌గా అమృతత్వాన్ని భగవంతుడు ప్రసాదించడు.

ఎంచేత? మన అమృతత్వం ఏమిటి? మనం ఎప్పుడూ సుఖంగా ఉండాలి. మనకి ఏ రోగమూ రాకూడదు.

ఇటీజ్ ఇంపాజిబుల్. అసంభవం అది.

ఎంచేతంటే, ప్రకృతిలో రాత్రి తరవాత పగలు, పగలు తరవాత రాత్రి రావలసిందే. ఈ ద్వంద్వాలు ఉండా ల్సిందే. సుఖమూ, దుఃఖమూ రెండూ ఉండాల్సిందే.

ఆకలే నాకు లేకూడదు అనుకున్నారు అనుకోండి, మొదట మీకు చాలా బాగా ఉంటుంది. తరవాత మీ జీవితం ఎలా ఉంటుందో ఊహించుకోండి. అందరూ అన్నీ తింటూ వుంటారు, మీకు తినటానికి ఏం ఉండదు.

కానీ మీకు ఆ నాలిక మీద వ్యామోహం పోయింది అనుకోండి, అప్పుడు మీకు అసలు ఆకలి పోవాలి అనే కోరికే ఉండదుకదా! ఆ రేషనీర్ అర్థం చేసుకోండి.

అంచేత అలాంటి సాధకుడ్ని, అంటే ఏమిటి? ఇలాంటి కోరికలు కోరే సాధకుడు, నాకు కష్టాలు రాకూడదు, దుఃఖాలు రాకూడదు, నాకు ఎప్పుడూ మంచే జరగాలి, ఏ మంచి? భౌతిక జగత్తులో మనం ఏది మంచి అనుకుంటు న్నామో అది. అదే జరగాలి అనే సాధకుడ్ని గమనించారు.

**ఎవరు గమనించారో మళ్ళా చూసుకోండి,**

ఆ కథలోనే చెప్తున్నాడు. సూర్యుడు, చంద్రుడు. వీళ్ళు విష్ణువుకి చూపిస్తారు.

"అదిగో వాడు మన వరసలో కూర్చున్నాడు. వాడిలో మాత్రం కచ్చితంగా దేవత్వం లేదు. మన పార్టీలో జాయిన య్యాడుకాని, మన పార్టీవాడు కాదు" అని చెప్పారు.

విష్ణువు కనుక ఇమ్మీడియెట్‌గా సుదర్శన చక్రం ఉంది, వేసి పారేశాడు. కానీ అన్‌ఫార్చునేట్ అప్పటికే ఇటీజ్ టూ లేట్. ఏమైపోయింది? అమృతము గొంతుక దిగింది.

డ్రాగన్స్ హెడ్ అండ్ డ్రాగన్స్ టైల్.
రాహువు, కేతువు. ఒకటి శిరస్సు, ఒకటి తోక.
ఆ తోకే వెన్నుపూస.

- సాధనాత్మకమైన జీవితంలో మన వెన్నుపూసకి క్రిందన రాహువు, వెన్నుపూస పైన కేతువు ఉంటారు.

నవగ్రహ సాధన, నవగ్రహాలకి పూజ చేసేవాళ్ళు కనుక కాస్త జాగ్రత్తగా అబ్జర్వ్ చేస్తే,

- రాహువు నైరుతి దిశలో చేట ఆకృతి కలిగివుంటాడు.

**చేట ఏం చేస్తుంది?**

చేటతో ఎగరేస్తూవుంటే షిఫ్టింగ్, మంచివి అన్నీ వస్తాయి, చెడువి మనం వదిలేసుకుంటాం. అంచేత మొట్ట మొదట సాధకుడు చేయవలసింది ఆ సాధన.

ఈ నిరాశ్రయః, ఏ విధమైన ఆశ్రయమూ కోరనటు వంటి సాధకుడు శ్వాస యొక్క ఆశ్రయం కోరాడు. ఈ శ్వాస యొక్క ఆశ్రయం ఎప్పుడైతే కోరాడో, ఇడా, పింగళా, సూర్యుడు, చంద్రుడు రాహువు గ్రహంగా మన మూలాధార చక్రంలో వాడికి సహాయపడతారు.

18 ఏళ్ళు పాటు రాహువు యొక్క దశ ఉంటుంది. 18 మళ్ళా భగవద్గీతకి సంకేతం. అది తరవాత ఆలోచించు కుందాం. అంచేత షిఫ్టింగ్, మనలో ఉన్నటువంటి మంచి సంస్కారాలు, మనలో ఉన్న మంచి ప్రారబ్దకర్మలు, అన్నీ ఒకచోట చేరటానికి ట్రై చేస్తూవుంటాయి.

అవి ఒకచోట చేరటానికి ట్రై చేస్తూవుంటే మన జీవితం ఏమౌతుంది? టప్ టప్ అని ఎగురుతూవుంటుంది, క్రింద పడుతూవుంటుంది. ఎగిరినప్పుడు సుఖము, క్రింద పడినప్పుడు దుఃఖము.

- సుఖం వస్తే, "ఆహాహాఁ నేను గాయత్రీ చేశాను, యజ్ఞాలు చేశాను, దాని వల్ల ఇదంతా వస్తోంది."
- కష్టాలు వస్తే, "బెడిసి కొట్టింది!"

ఇంక ఇదే పని భగవంతుడికి. ఎవడు చేస్తున్నాడో చూసుకుని, వాడ్నీ మొట్టికాయలు వేస్తూవుండటమే పాపం. ఆయనకి ఇంకొక పని ఏం లేదు.

మనం చాలా ముఖ్యం అనుకుంటాం. ప్రకృతిలో మనం ఒక డస్ట్ కణం కూడా కాదు. దానికి ఆయన పేరు తలుచుకుంటే మొట్టికాయ మొట్టటం ఎందుకు? ఇంకా ఆనందిస్తాడుకాని. కానీ, మన యొక్క అహంకారం! "నేను చేశాను!" అంచేత బెడిసి కొట్టిందది.

క్రింద పడుతూవుంటుంది, లేస్తూవుంటుంది.
చేట, రాహువు.

### ఇది దేని వల్ల జరుగుతోంది?

శ్వాస పై నుంచి ముక్కులోంచి క్రిందకి, ఆజ్ఞా చక్రము నుంచి మూలాధార చక్రము వరకు వస్తోందికదా!

సన్‌డే వదిలేసి, మన్‌డే, ట్యూజ్‌డే, వెన్స్‌డే, థర్స్‌డే, ఫ్రైడే, సాటర్‌డే, ఈ ఆరు రోజులలో మనలో సముద్రంలో ఉన్న సీల్స్, ఇవన్నీ కూడా బాహ్యజగత్తులో ఉన్నటువంటి గ్రహాలు వల్ల మన మీద పనిచేస్తాయి.

ఈ పాయింట్ ఇప్పుడు ఇంత డీటైల్డ్‌గా ఎందుకు చెప్తున్నాను అంటే, నిన్న నేను ఒకచోట ఆపాను.

**యస్య సర్వే సమారమ్భాః కామసంకల్పవర్జితాః**
**జ్ఞానాగ్ని దగ్ధకర్మాణం తమాహుః పణ్డితం బుధాః. (4-19)**

ఎవనియొక్క సమస్తకర్మలు కోరిక, సంకల్పము అనునవి లేకయుండునో, జ్ఞానమను అగ్నిచేత దహింపబడినకర్మలుగల అట్టివానిని పండితుడని విజ్ఞులు పేర్కొందురు.

**తమాహుః పణ్డితం బుధాః**

- బుధగ్రహము నుంచి వచ్చే కిరణాలు సూర్యుడు కంటే ఏడు రెట్లు పవర్‌ఫుల్ అలజడులు మనలో కలగ జేస్తాయి అని గుప్తవిద్య తెలుపుతోంది.

అది ఏడు రెట్లు ఎందుకు, ఏ విధంగా ఉంటుంది అనేది ఏకాదశోధ్యాయం మనకి చాలా డీటైల్డ్‌గా తెలుపు తుంది. కానీ ఇప్పటికి ఈ పాయింట్ అర్థం చేసుకోండి.

మనకి వచ్చే ఏ విధమైన నాలెడ్జ్ అయినా ఏడు తలాలుగా వస్తుంది. బాహ్యజగత్తులో అన్నీ మల్టిప్లికేషన్ బై సెవెన్ ఉంటాయి. సప్త సముద్రాలు, సప్త ద్వీపాలు, ఏడు వారాలు, సప్త ఋషులు, ఇలా అన్నీ కూడా మనం ఏడు ఏడుగా మన జ్ఞానాన్ని డివైడ్ చేస్తూవున్నాం.

అంచేత రాహువు మనల్ని ఎప్పుడైతే పైకి, క్రిందకి, పైకి క్రిందకి, పైకి క్రిందకీ వేస్తూవుంటాడో, ఏం జరుగుతూ వుంటాయి? ఈ ఏడు గ్రహాలులోంచి వచ్చే కిరణాలు మనలో ఉన్నటువంటి కేంద్రాలు, మనలో ఉన్నటువంటి సీల్స్‌ని ప్రభావితం చేస్తాయి.

ఇది చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోండి.

- చంద్రుడు నుంచి ఒక కిరణం వచ్చింది. మీ మీద ఒకలాగ పనిచేస్తుంది, నా మీద ఒకలాగ పనిచేస్తుంది. నాలో ఉన్న సీల్ వేరు, మీలో ఉన్న సీల్ వేరు.

ఈ సీల్స్‌ని అర్థం చేసుకునే జ్ఞానం వచ్చిన వాడిని బుధజనులు అన్నాడు. అది మనం నిన్న చదువుకున్నాం.

అది మనకి ఎక్కడ్నుంచి వచ్చిందో గుర్తుందికదా, సూర్యుడు ఎర్రగా ఉన్నప్పుడు సంధ్యాకాలంలో కామ సంకల్పవర్జితాః అనే స్థితిలో పొందిన జ్ఞానాన్ని ఈ శ్లోకంలో మనం ఉపయోగించుకుంటున్నాం.

కానీ మనం రకరకాలుగా చెప్పుకున్నా, ఇన్ని ట్విస్టింగులు ఇచ్చుకున్నా, చివరికి తేలింది ఏమిటి?

- ప్రకృతిలో ఏమి జరుగుతున్నదో, అది రైటు. ఏ విధంగా జరగవలసివుందో, అలా జరుగుతోంది.
- -- మంచి జరిగినా ప్రకృతి యొక్క నియమానుసారమే జరుగుతోంది. చెడు జరిగినా ప్రకృతి యొక్క నియమానుసారమే జరుగుతోంది అనే కాన్సెప్ట్ కనుక వచ్చేస్తే, ఇంక వాడు ఎవడి ఆశ్రయాన్ని కోరక్కరలేదు. వాడు ప్రకృతిలో తేలుతూవుంటాడు.
- శ్రీ కానీ ఈ శ్లోకం చెప్పే సాధనలో తేలుతూవుంటే సరిపోదు. నాకు అర్థమైపోయింది, ప్రకృతి ఏం చేస్తే అది చేస్తుంది, నేను కేవలం తేలుతూవుంటాను అంటే,
- -- రాళ్ళూ అలాగే జీవిస్తున్నాయి, చెట్లూ అలాగే జీవిస్తున్నాయి, మిగతా జంతువులు కూడా అంతేకదా! వాటికి అసలు ఈ విధమైన అవగాహన కూడా లేదుకదా!

### మరి మనం ఏ విధంగా జీవించాలి?

దానికి ఇంకొక ఎడ్జెక్టివ్ ఇచ్చాడు, నిత్యతృప్తో.

త్యక్త్వా కర్మఫలాసఙ్గం నిత్యతృప్తో నిరాశ్రయః
కర్మణ్యభిప్రవృత్తోఽపి నైవ కించిత్కరోతి సః. (4-20)

పాయింట్‌వైజ్‌గా అర్థం చేసుకుంటున్నాంకదా! మనం ఏమీ చేయటం లేదు. ప్రకృతి మనల్ని ఏ విధంగా ప్రేరేపిస్తే ఆ విధంగా చేస్తున్నాం.

### ప్రకృతి మనల్ని ఏ విధంగా ప్రేరేపిస్తోంది?

- ఏ విధమైనటువంటి సీల్స్‌ని మనం వేసుకున్నామో, ఆ విధమైనటువంటి ముద్రలు బట్టి.

కొంత మందికి కొన్ని జంతువుల్ని చూస్తే భయం. కొంత మందికి బొద్దింకల్ని చూస్తే భయం. కొంత మందికి బల్లుల్ని చూస్తే భయం. బల్లుల్ని చూస్తే భయపడేవాడు బొద్దింకల్ని చూస్తే భయపడడు.

లార్డ్ కిచెనర్ అని సెకండ్ వరల్డ్ వార్‌లో ఒక బ్రిటీష్ కమాండర్ ఉండేవాట్ట. చాలా పెద్ద హీరో ఆయన. కానీ ఆయనకి పిల్లిని చూస్తే భయం. ఇంక ఆయన్ని ఓడించటం చాలా సులభంకదా! ఏం చేయక్కర్లేదు, అంత పెద్ద హీరోని, వాడు యుద్ధానికి రాగానే ఒక పిల్లి బొమ్మ ముందు పెట్టుకున్నా చాలు, భయపడిపోతాడు. అది వాడి ముద్ర. కారణం ఏదైనా కావచ్చు. ఆ పూర్వజన్మ సంస్కారాలు ఏవి ఉన్నాయో, దేని వల్ల వాడికి ఆ బాధలు వచ్చాయో!

- అంటే, ఈ కాంప్లెక్సెస్, ఈ ఫోబియాస్, ఈ భయాలు, ఈ ఆనందాలు, ఈ సుఖాలు, ఈ దుఃఖాలు, ఇవంతా కూడా మీవేం కావవి. ప్రకృతి మీ మీద వేసిన సీల్స్.

అవి వాటి పని అవి చేసుకుంటున్నాయి అనే భావన చేసుకున్న తరవాత ఏ విధమైన ఆశ్రయాన్నీ కోరకుండా శ్వాసని గమనించుకుంటూ, శ్వాస ద్వారా అమృతత్వ యోగానికి వెళ్ళే భావనలో, శ్వాస పీల్చుకుంటూ, వదులుకుంటూ, ప్రతీ రోజూ ఈ సాధన చేసుకుంటున్నాం.

సోమవారం, మంగళవారం, ఇలా ఏడు వారాలు, ఏడు గ్రహాలూ వస్తూవుంటాయి. ఈ ఏడు గ్రహాలూ వస్తూవున్నప్పుడు మనలో ఉన్న ఏ గ్రహము, ఏ విధమైనటువంటి సంవేదన, భావన మనలో కలగజేస్తోంది అనేది గమనించుకుంటూ, బీ హేపీ విత్ ఇట్. నిత్యతృప్తో.

### ఎందుకు నిత్యతృప్తో?

ఈ సృష్టిని నేను సృష్టించలేదు. భగవంతుడు సృష్టించాడు. ఆ భగవంతుడు ఏం ఇచ్చాడు? నాకు ఈ బాధ్యతలు ఇచ్చాడు. ఈ రోల్ ఇచ్చాడు.

చాలా పెద్ద పెద్ద యాక్టర్స్‌కి కూడా గెస్ట్ రోల్ అని ఇస్తూవుంటాం. గెస్ట్ రోల్‌లో వాడికి ఏదో చాలా చిన్న పాత్ర ఇస్తాం. ఆ చిన్న పాత్రని కూడా వాడు సీరియస్‌గానే పోషిస్తాడు. లేకపోతే అంత పెద్ద యాక్టర్ ఇంత చెత్తగా ఎలా చేశాడని మనకి నవ్వొస్తుంది. దేవదత్తము.

మనం మొదట విషాదయోగంలో శంఖారావాల్ని చదువుకున్నాంకదా! అంచేత పాంచజన్యం హృషీకేశో, ఈ పంచభూతాత్మకమైనటువంటి ఈ శరీరము భగవంతుడు నాకు ఇచ్చాడు. ఎందుకు ఇచ్చాడు అనేది గమనించుకోండి. కండిషన్ అది. యూ హేవ్ ఏ రోల్ టూ ప్లే. సాధకుడు అర్థం చేసుకోవలసినటువంటి విషయము అది.

ఎక్కడ భారతీయ ఆధ్యాత్మికత దెబ్బతింటోంది అంటే, వాళ్ళు ఈ సాధనలు అన్నీ చేస్తారు. ఎందుకు చేస్తున్నారో మర్చిపోతాం.

mission RK SSS-Hyderabad Phone: 23832477

గాయత్రీ మంత్రజపం చేశాం. ఎందుకు చేస్తున్నాం?
యజ్ఞం చేశాం, ఎందుకు చేస్తున్నాం?
రామాయణం చదువుతున్నాం, ఎందుకు చదువుతున్నాం?
మహాభారతం చదువుతున్నాం, ఎందుకు చదువుతున్నాం?

- దయచేసి అంతా ఒకటి అని మాత్రం అనుకోకండి. అంతా ఒకటే అయితే, రామా అనుకుంటే నిజంగానే సరిపోతుంది అనుకుంటే, ఇంత మనకి అందించటానికి ఋషులు ఏమైనా మూర్ఖులా?

మా గురుదేవులు, శ్రీరామశర్మ ఆచార్య 3,621 పుస్తకాలు వ్రాశారు. అది కాకుండా ప్రతీ నెలా మూడు మ్యాగజైన్స్. ప్రతీ మ్యాగ్‌జైన్‌లో పేజ కంటెంట్స్ 64 పేజీలు.

- ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్ అనుకుంటే సరిపోతుంది అన్నప్పుడు ఈ 3,621 పుస్తకాలు ఎందుకు వ్రాశాడాయన? అన్న అవగాహన సాధకుడికి రావాలి.

గాయత్రీ మంత్రం చేశాను కనుక నేను సాధకుడిని, ప్రాణాయామం చేస్తున్నాను కనుక నేను సాధకుడిని.

*నిత్యతృప్తో నిరాశ్రయః*, నిత్య అనే పదానికి మనం ఏం అర్థం చేసుకుంటాం? ఎప్పుడూ తృప్తిగా ఉండాలి అని.

**కానీ నిత్య అనే పదం అంటే నేను ఏం చెప్తాను?**

సూర్యుడు నుంచి చంద్రుడు వైపు వెళ్ళే ఒక స్పెసిఫిక్ డైరెక్షనల్ కరెంట్. అమావాస్య నుంచి పౌర్ణమికి, పౌర్ణమి నుంచి అమావాస్యకి కిరణాలు వెలుతూవుంటాయి.

- అమావాస్య నుంచి పౌర్ణమి వైపు వస్తోన్నప్పుడు ఈ 16 కళలు సూర్యుడు నుంచి చంద్రుడికి వస్తూవుంటాయి. కృష్ణపక్షంలో అవి మళ్ళా చంద్రుడు నుంచి సూర్యుడికి వెళ్ళిపోతూవుంటాయి.

అవే కళలు రివర్స్ అవుతూవుంటాయి. అక్కడ మళ్ళీ ఒక సైకిల్, ఒక చక్రం ఫార్మ్ అయిపోతుంది.

- సూర్యుడు, చంద్రుడు మధ్య బాహ్యజగత్తులో ఉన్న కిరణాలులాగే మన శరీరంలో ఏర్పడే వాటిని నిత్యలు అంటాం. కోణాలు కాదు, కిరణాలు. మనలో ఉన్న ఇడా - పింగళా, సూర్యుడు - చంద్రుడే కదా!

మరి బాహ్యజగత్తులో సూర్యుడు, చంద్రుడు యొక్క కలయిక వల్ల 16 నిత్యలు ఏర్పడుతూవుంటే, అదే సూర్యుడు, చంద్రుడు, మన కుడి ముక్కు, ఎడం ముక్కు అని చెప్పుకుంటూవుంటాంకదా! మరి ఆ నిత్యలు ఏర్పడినప్పుడు ఏమవ్వాలి?

- బాహ్యజగత్తులో ఆ నిత్యలు ఏ విధంగా పనిచేస్తున్నాయో, మన శరీరంలో పనిచేస్తున్న నిత్యలు కూడా అదే ఫలితాన్ని ఇవ్వాలికదా! అది గమనించుకోండి ప్రతీరోజూ. *నిత్యతృప్తో*.

ఈ 16 కళల్ని అర్థం చేసుకుంటే, మీరు శ్రీకృష్ణుడే. శ్రీకృష్ణుడికి పేరు ఏమిటి? షోడశ కళా ప్రపూర్ణుడు. ఈ నిత్యకళల్ని అర్థం చేసుకోవాలి. అంతే తప్ప *నిత్యతృప్తో* అంటే "ఉన్న దానితో సేటిస్ఫై అయిపో!" అనికాదు.

- ఉన్న దానితో సేటిస్ఫై అయిపో అని చెప్పటానికి ఆధ్యాత్మికత ఎందుకు, ఇన్ని పుస్తకాలు ఎందుకు, ఇంత గందరగోళం ఎందుకు?

-- ఉన్న దానితో ఆనందంగానే జీవించొచ్చు.

- ఉన్న దానితో తృప్తి పడితే, ఇంక అక్కడ్నుంచి నెక్స్‌ట్ స్టెప్‌కి వెళతాం.

**ఏమిటా నెక్స్‌ట్ స్టెప్?**

*త్యక్త్వా కర్మఫలాసఙ్గం* - పని చేస్తున్నాం. నేను సాధన చేశాను కనుక సుఖం వచ్చింది. నేను సాధన చేశాను కనుక దుఃఖం వచ్చింది. ముందు ఆ కర్మఫలాన్ని వదిలేయండి.

- మీ సాధన వల్ల మీరు ప్రపంచాన్ని మార్చలేరు. మీరు అంత అద్భుతమైనటువంటి శక్తివంతులు కారు.

**కానీ మీరు ఏం చేయగలరు?**

- ప్రకృతి నియమాలను మీరు అర్థం చేసుకుంటే, ఆ ప్రకృతి నియమాలకు అనుగుణ్యంగా కచ్చితంగా మీకు కావలసినట్టు ఫలితాలను పొందగలరు.

మళ్ళీ దాన్ని అర్థం చేసుకోండి. ఇక్కడ కూడా భారతీయులు చాలా తప్పుడు త్రోవలో వెళ్ళిపోయారు. *త్యక్త్వా కర్మఫలాసఙ్గం* అంటే, "నేను పనిచేసేస్తూవుంటాను, ఏం జరిగితే అది జరుగుతుంది. దాని గురించి మనం వర్రీ కావక్కరలేదు." ఆయన అది అనటం లేదు.

కర్మ యొక్క ఫలం దేని వల్ల వస్తుంది?

ఇప్పుడు కరెంట్ ఉంది. లైట్ వెలిగింది. దేని వల్ల వస్తోంది? లైటు వెలగాలి అని బల్బ్ పెట్టేసి, బల్బ్ మీద ఒక సహస్ర నామావళి స్తోత్రం చదివితే లైటు వెలగదు.

***లైటు వెలగాలి అంటే ఏం చేయాలి?***

ముందు మీరు వైర్ కనెక్షన్స్ ఇచ్చుకోవాలి. మీరు వైర్ కనెక్షన్స్ ఇచ్చుకున్నంత మాత్రాన సరిపోదు. మళ్ళా గవర్నమెంట్ వేసినటువంటి ఆ కనెక్షన్ తెచ్చుకోవాలి. కనెక్షన్ తెచ్చుకున్న తరవాత మీకు ఇష్టమున్నా లేకపోయినా, ఎవడు స్విచ్ వేసినా లైట్ వెలుగుతుంది. అది అర్థం చేసుకోండి.

శ్రీ భగవంతుడి ద్వారా ఇవ్వబడిన మన ఈ శరీరంలో ఆ కరెంట్, ఆ కుండలినీ శక్తి, ఆ ఆత్మశక్తి ప్రచోదన చెందాలి అంటే, జ్ఞానయోగములో ఇప్పుడు చెప్పిన ఈ ఆధ్యాత్మిక సాధనని మూడు పాయింట్స్‌గా మీరు అర్థం చేసుకోండి.

① *కర్మణ్యభిప్రవృత్తో౽పి నైవ కించిత్కరోతి సః* - మీరు పనులు చేసుకుంటూ ఉండండి. పనులు ఎందుకు చేస్తున్నారు అంటే, అవి జరుగుతున్నాయి కనుక.

మెలకువ వచ్చింది, మెలకువగా ఉన్నారు. నిద్ర వస్తోంది, మీరు చదవండి చూస్తాను? పరీక్షలు రోజులు. రేపు పరీక్ష వ్రాయాలి. గాఢంగా నిద్ర వచ్చేస్తోంది? పాపం వీడు ఏం చేయగలడు? తరవాత మళ్ళా అలారం పెట్టుకుని లేవాలే తప్ప, కచ్చితంగా నిద్రపోవలసిందే. కదా!

*నైవ కించిత్కరోతి సః* - ఇది బాగా అర్థం చేసుకోండి. మీరు ఏమి చేస్తోన్నా, మీరు ఏమీ చేయటం లేదు.

ఇలా కూర్చుని ఉన్నాను. కాలు తిమ్మిరెక్కింది. ఇప్పుడు నన్ను లేవమనండి! ఆగాల్సిందే. ఆ తిమ్మిరి వదిలాక లేవాలి. అంచేత మీరు ఏదో చేసేస్తున్నారు కనుక, మీరు ఏదో చేస్తున్నారు అని మాత్రం అనుకోకండి.

② *నిరాశ్రయః* - ఏ విధమైన ఆశ్రయాన్నీ మీరు కోరకండి.

***ఏవరి ఆశ్రయాన్ని కోరాలి?***

శ్వాస యొక్క ఆశ్రయాన్ని కోరండి. శ్వాస మీదే మీ దృష్టిని ఉంచుకోండి. శ్వాస ఎటు వెళితే అటు. మళ్ళా మర్చిపోతాం. ఇన్ని సార్లు మనం చెప్పుకున్నా, ఈ మాటలు వింటోన్నప్పుడు నేను ఊపిరి పీలుస్తున్నాను అనే గమనం మీకు లేదుకదా! మీకు ఎందుకు, నాకూ లేదు. కానీ ఆ గమనం ఉండాలి. *నిరాశ్రయః* అంటే అర్థం అది.

బాహ్యజగత్తులో మీరు ఎవరి మీదా ఆధారపడ కండి. ఈ శరీరము కేవలము శ్వాస మీదే ఆధారపడివుంది. ఆ శ్వాసని మీరు నిరంతరము గమనించుకోండి. యూ షుడ్ బీ ఎవేర్ ఆఫ్ ఇట్.

ఒక ప్రొఫెసర్‌గారికి కాలేజీకి వెళ్ళే టైమ్ అయిపో యింది, కళ్ళజోడు మర్చిపోయారాయన. ప్రొఫెసర్ అంటేనే మతి మరుపు అనికదా! అసలు ఎందుకో వాళ్ళిద్దరికీ అది అవినాభావ సంబంధం. మరి వాళ్ళు సబ్జెక్ట్ ఎలా చెప్తారో ఏమిటో! సరే, అందర్నీ గడ గడ లాడించేస్తున్నాడు, అది పీకుతున్నాడు, ఇది పీకుతున్నాడు, అంతా పీకుతున్నాడు. కళ్ళజోడు కనిపించటం లేదు.

ఎప్పుడూ ఆయన భార్య వచ్చి కళ్ళజోడు వెతికేది, ఇచ్చేది. ఆ రోజు ఆయన భార్య ఏ కూరగాయలకో, దేనికో వెళ్ళిందేమో! సరే, ఇల్లు పీకి పందిరేస్తున్నాడు, కాలేజీ టైమ్ అయిపోతోంది అని అరుస్తున్నాడు. ఈ లోపల భార్య వచ్చి చెప్పింది, "మీ ముక్కు మీదే ఉందికదా, మీరు పెట్టుకునే ఉన్నారు, డైరెక్ట్‌గా వెళ్ళిపోండి" అని.

శ్వాస! శ్వాస గురించి మీరేం చేయక్కర్లేదు, గమనం ఉంటే చాలు. *నిరాశ్రయః* దాని మీద మీరు ఆధారపడక్కర లేదు. కానీ దాని మీద మనకి దృష్టి ఉండటం లేదు.

ఈ ఆధ్యాత్మిక జ్ఞానయోగంలో ఉన్న ఈ సాధనలో మీరు ఆశ్రయం తీసుకోవాలి అంటే దేన్నీ ఆశ్రయించకండి, శ్వాసని మాత్రమే ఆశ్రయించండి.

శ్వాసని ఆశ్రయించాం. మరి ఏం చేయాలి?

③ *నిత్యతృప్తో* - శ్వాస లోపలికి వెళుతోంది, బయటకి వస్తోంది. బాగానే ఉంది. కానీ ఈ శ్వాస లోపలికి బయటకి వచ్చేది 16 రకాలుగానే రాగలదు.

ఎంచేత? సూర్యుడికి, చంద్రుడికి మధ్య 16 రకాలైన కోణాలే ఏర్పడగలవు.

సూర్యుడికి చంద్రుడికి మధ్య అవి కలిసిపోతే, పూర్తిగా ఒకచోటే ఉంటే, దాన్ని "అమావాస్య" అంటాం.

ఒకదానికి ఒకటి కరెక్ట్‌గా ఎదురెదురు, ఋజుకోణం ఉంటే, 180 డిగ్రీస్‌లో ఉంటే, దాన్ని "పూర్ణిమ" అంటాం.

ఋజు కోణాన్ని ఋషి అంటాం. అంటే ఈ రెండు నాసికాల్ని పూర్తిగా లాగేసి, 180 డిగ్రీల కోణంలో దాన్ని ఉంచగలిగే వాడికి ఋషిత్వం వస్తుంది. అదొక నిత్యకళ. ఆ నిత్య యొక్క పేరు చిత్ర. ఈ శ్రీవిద్యోపాసన చేస్తోన్న వాళ్ళకి ఇది చాలా సులభంగా అర్థమవుతుంది.

నిత్య అనే పేరు మీకు నచ్చకపోతే 16 సంఖ్యలు పెట్టుకోండి. 1, 2, 3, 4, 5, 6, ...16. అమావాస్య ఒకటి అయితే, పూర్ణిమ 16. ఈ 16 నిత్యలు మీకు ఎప్పుడైతే అర్థమయిపోతుందో, నిత్యతృప్తో.

***అప్పుడేం చేయాలి మీరు?***

త్యక్త్వా కర్మఫలాసఙ్గం - ఈ భావన ఎప్పుడైతే అవుతుందో, అప్పుడు అద్భుతమైన శక్తి మీ దగ్గరకి వస్తుంది.

***అప్పుడు మీరు ఏం చేయటానికి ట్రై చేస్తారు?***

"నేను ఇది చేసేస్తాను, అది చేసేస్తాను, నేను ప్రపంచాన్ని మార్చేయాలి, నేను యుగాన్ని మార్చేయాలి, నేను యుగనిర్మాణం చేసేస్తాను." రకరకాలైన భావాలు వస్తాయి.

నువ్వు చెయ్యవు, నీ ద్వారా జరుగుతుంది.

మొత్తం మహాభారత యుద్ధం ద్వారానే జరిగింది. వీళ్ళు ఎవరూ లేకపోయినా మహాభారత యుద్ధం జరిగేది.

అర్జునుడు మహాభారత యుద్ధానికి కీ ఫిగరు. అంతటి కీ ఫిగర్ని కూడా శ్రీకృష్ణుడు ఏమన్నాడు?

యథేచ్ఛసి తథా కురు. నీకు ఇష్టమయితే చెయ్, లేకపోతే మానేయవయ్యా అన్నాడు. ఒకవేళ నువ్వు యుద్ధం చేస్తే మాత్రం ఏంటిట నీ గొప్ప అన్నాడు.

నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్, నువ్వు నిమిత్త మాత్రుడివి. ఇంతా చేస్తే నువ్వు యుద్ధం చేసేశానని ఏమీ నువ్వు మీసాలేం త్రిప్పుకోవక్కర్లేదు. నీ ద్వారా జరిగింది అంతే. నువ్వు కాకపోతే ఇంకొకడు.

***పండితులు ఏం చెప్తారు అంటే,***

శ్రీకృష్ణుడు ఐదుగుర్ని రెడీగా ఉంచుకున్నాట్ట. మనిషి యొక్క మూడ్ తెలుసుకదా! ఇది చేసేస్తాను, అది చేసేస్తాను అంటాడు. తరవాత ఏం అంటాడు, "సారీ సర్, తలనొప్పి వచ్చింది. లేకపోతే చేసేసుండేవాడిని, దానికే ముంది!" అంటాడు.

అంచేత మనుష్యులకి తలనొప్పులు వస్తాయి అని శ్రీకృష్ణుడికి తెలుసు. అంచేత ఏం చెప్పాడు? ఇంకొకళ్ళని నేను రెడీగా ఉంచుకున్నాను. నువ్వు చేస్తే చెయ్, నీకు పేరు వస్తుంది. నువ్వు చెయ్యవు, ఇంకొకళ్ళకి వస్తుంది.

కానీ పేరు రావటం వల్ల వాడు చేశాడు అనుకుంటారేమో, అలా అనుకోవద్దు అనేదే జ్ఞానయోగం యొక్క ఈ శ్లోకం యొక్క అర్థము.

ఈ శ్లోకాన్ని మళ్ళీ జాగ్రత్తగా ఈ భావంతో అర్థం చేసుకుంటూ చదువుకుందాం.

*త్యక్త్వా కర్మఫలాసఙ్గం నిత్యతృప్తో నిరాశ్రయః*
*కర్మణ్యభిప్రవృత్తోఽపి నైవ కించిత్కరోతి సః.*

ఆ భావన, కళ్ళు మూసుకుని ఆ శ్వాస యొక్క ఆశ్రయంలోకి వెళ్ళిపోదాం.


స్వస్తి



# భగవద్గీత ఉపన్యాసాలు - 29

## జ్ఞానయోగము

1998, నవంబరు 28 వ తారీఖున సుకృతవిల్లా, గుంటూరులో
మాస్టరుగారు భగవద్గీతపై ఇచ్చిన ఉపన్యాసము



- "ఊరికే ఉండబ్బా!" - రమణ మహర్షి సాధన
- పరిగ్రహము - రిసీవింగ్ యాటిట్యూడ్
- రాగద్వేషాలు లేని పనిని నేర్పేదే కర్మయోగం
- 6,000 సంవత్సరాల పురాతన సంస్థ
- పాఠ్యపుస్తకంగా సీక్రెట్ డాక్ట్రిన్
- మొత్తం కాగితం ముక్కలు అవుట్!
- ఆకాశంలో ఉన్న వనరులు - ధునీవాలా బాబా
- ఆశ్రమానికి అందరూ చందాలు ఇచ్చేయాలి, ఆశ్రమం మాత్రం ఎవరికీ ఏమీ ఇవ్వదు
- సెంటిమెంట్స్‌కి బానిసలు కాకండి
- మాత్సర్యము అంటే ఇది నాది అనే భావన

---

జ్ఞానయోగంలో నిన్న నిరాశ్రయః అనేటటువంటి పదాన్ని వివరంగా చెప్పుకుంటూ, ఒక విచిత్రమైనటువంటి సాధన గురించి మనం చెప్పుకుంటున్నాం. ఏ సాధనా చేయకుండా ఉండేటటువంటి సాధన.

ఈ కాలంలో ఆ విధమైనటువంటి సాధనలు చేసిన వాళ్ళల్లో ఈ సాయి కల్టే కాకుండా, రమణ మహర్షి పేరు కూడా మనం చెప్పుకోవచ్చు.

ఏం చేయాలని ఆయన్ని అడిగితే, "ఊరికే ఉండబ్బా!" అనేవాడు. ఏం చేయకుండా ఉండటమే.

కానీ ఏం చేయకుండా ఉండటమే అంటే మీరు ఏదో ఒకటి చేస్తూనే ఉన్నారు. అది మీరు అబ్జర్వ్ చేసుకోవాలి. మీ యొక్క ప్రమేయము లేకుండా జీవితంలో అనేక పరిస్థితులు జరుగుతూవుంటాయి. అంచేత ఇవాళ చదువుకోబోయే శ్లోకంలో ఆ వివరణ వస్తుంది. నిన్న

త్యక్త్వా కర్మఫలాసఙ్గం నిత్యతృప్తో నిరాశ్రయః
కర్మణ్యభిప్రవృత్తోఽపి నైవ కించిత్కరోతి సః. (4-20)

అని చదువుకున్నాం. ఇవాళ శ్లోకము,

నిరాశీర్యతచిత్తాత్మా త్యక్తసర్వపరిగ్రహః
శారీరం కేవలం కర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషమ్. (4-21)

ఆశలేనివాడును, ఇంద్రియమనంబులను నిగ్రహించిన వాడును, ఏ వస్తువును పరిగ్రహింపనివాడునగు మనుజుడు శరీర మాత్రముచేత (దేహధారణాది) కర్మను చేసినను పాపమునొందడు.

పైకి చూస్తే రెండు శ్లోకాలూ ఒకేలా ఉన్నట్లు అన్పిస్తాయి. నిన్న ఏం చదువుకున్నాం మనం?

ఏ మనుజుడు అయితే కర్మఫలాపేక్షను వదిలి సదా సంతృప్తి నొందినవాడై నిరాశ్రయుడైయుండునో, అట్టి వాడు కర్మల యందు చరించు చున్నను, ఏమీ చేయనివాడే అయివున్నాడు.

వాడేం చేయటం లేదు. అన్నీ ప్రకృతి యొక్క నియమానుసారం జరుగుతున్నాయి.

*మరి వాడేం చేస్తున్నాడు?*

సాక్షిగా ఉన్నాడు. ద్రష్టగా ఉన్నాడు.

*దాన్నే శిరిడీసాయి ఏం చెప్పాడు?*

నేను 12 ఏళ్ళు నా గురువు యొక్క ముఖాన్నే చూస్తూవున్నాను అన్నాడు. ఆయన చేసిన సాధన అంతే అన్నాడు. అంటే ఆయనకి అది పరిపక్వ స్థితి రావటానికి 12 ఏళ్ళు పట్టింది. అది అర్థం చేసుకోండి.

మనం ఇక్కడ బీజాలు వేసుకుంటున్నాం. ఆ బీజాలతో మనం నిరంతరము ముఖ్యంగా చాలా యాక్టివ్‌గా పనిచేస్తున్నప్పుడు మనకి నచ్చని పరిస్థితులు ఏర్పడినప్పుడు, నచ్చిన పరిస్థితులు ఏర్పడినప్పుడు, సుఖంగా ఉన్నప్పుడు, దుఃఖంగా ఉన్నప్పుడు కూడా దర్శకుడుగా, అబ్జర్వర్‌గా, నిరాశ్రయః ఏ విధమైనటువంటి ఆశ్రయము లేనివాడిగా ఉన్నాము అని చదువుకున్నాం మనం.

*దాని తరవాత శ్లోకంలో ఇప్పుడేమంటున్నాడు,*

నిరాశీర్ - ఆశ లేనటువంటి వాడై,

యతచిత్తాత్మా - అంతఃకరణమును, దేహమును జయించిన వాడివై. రెండిటిని జయించమని చెప్తున్నాడు.

① అంతఃకరణము

② దేహము.

త్యక్తసర్వపరిగ్రహః - ఏ విధమైనటువంటి పరిగ్రహము లేకుండా ఉన్నటువంటి వాడివై.

*పరిగ్రహము అంటే మీకు తెలుసుకదా,*

తీసుకునే వాడు, రిసీవింగ్ యాటిట్యూడ్.

"ఇది చేస్తే నాకేం లాభం?"

"ఇది నేను ఎందుకు చేస్తున్నాను?" అనేటటు వంటి భావనలో పరిగ్రహం ఉంది.

పాతంజలి యోగసూత్రాలు దీని గురించి ఒక అద్భుతమైనటువంటి సిద్ధిని చెప్తాయి.

- మీరు ఏమీ పరిగ్రహించకుండా ఉంటే, మీరు ఏమీ తీసుకోకుండా ఉంటే పూర్వజన్మ స్మృతులు మీకు వాటంతట అవే లభించటం మొదలెడతాయి.

మీరు ఏ సాధనలూ చేయక్కరలేదు. కోట్ల కోట్ల మంత్రజపాలూ చేయక్కరలేదు. ఇది నాది అని మీరు అనుకోకుండా ఉంటే, నాకు ఇది కావాలి అని అనుకోకుండా ఉంటే, ఆ మానసికస్థితిని తెచ్చుకోగలిగితే, మీరు అనుకున్నా, అనుకోకపోయినా అవి మీ దగ్గరకి వస్తూవుంటాయి.

- ప్రకృతిలో మన దగ్గరకి వచ్చేటటువంటివి మీరు అనుకోవటం వల్ల రావటం లేదు.

మనం అనుకోవటం వల్ల వస్తున్నాయి అని మీకు అనిపిస్తుంది. కానీ మీరు అనుకున్నా, అనుకోకపోయినా ఆ పరిస్థితులు మీ దగ్గరకి వస్తాయి.

ఆరోగ్యకరమైన పరిస్థితులకీ, అనారోగ్యమైన పరిస్థితులకీ కూడా ప్రకృతే కారణం. ఆనందానికి, దుఃఖానికీ ప్రకృతే కారణం అనేటటువంటి భావన.

అంటే ఇప్పుడు వాడు ఏం చేస్తాడు? ఆ ఆనందాన్నీ తీసుకోడు, ఆ దుఃఖాన్నీ తీసుకోడు. త్యక్తసర్వపరిగ్రహః

శారీరం కేవలం కర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషమ్

ద్రష్టగా ఉన్నాడు. మంచి జరుగుతోన్నా చూసుకోమన్నాడు. దుఃఖం ఉన్నా చూడమన్నాడు. మరి చూస్తూ ఊరుకుంటే మనం ఏం చేయాలి?

ద్రష్టగా ఉండిపోవటమేనా?
లేకపోతే మనం ఏదైనా చేయవచ్చా?

శారీరం కేవలం కర్మ - శరీరాన్ని మీరు ఉపయోగించుకోవచ్చు.

- ☺ నిప్పులో చెయ్యి పెట్టాం, చెయ్యి కాలింది. ద్రష్టగా ఉన్నాను, చూస్తూవున్నాను అనుకోవక్కరలేదు. చెయ్యి కాలగానే మీరు శారీరం కేవలం కర్మ, శరీరానికి దానికి కావలసిన రియాక్షన్స్ తీసుకోవచ్చు. చలి వేస్తోంది, కప్పుకోండి. ఎండగా ఉంది, గొడుగు వేసుకోండి.

కుర్వన్నాప్నోతి కిల్బిషమ్ - ఇటువంటి పనులు మీరు చేస్తే పాపం అంటుకోదు.

ఆ పాపము అనే భావాన్ని జ్ఞానయోగ పరంగా, ఇది వరకు మనం చెప్పుకున్నటువంటి భావనల పరంగా ముందు మనం చాలా జాగ్రత్తగా అవగాహన చేసుకుందాం.

భౌతిక జగత్తులో పుణ్యము, పాపము అనేది మనం చాలా విచిత్రంగా చెప్పుకుంటూవుంటాం. ఎవర్నయినా చంపితే, ఎవరికైనా హాని కలగజేస్తే పాపం. మరి యుద్ధంలో కొన్ని వేల మందిని చంపేస్తే, అది పుణ్యమా, పాపమా? సమాజం ప్రకారం మాత్రం అది చాలా గొప్ప పనే. పరమ వీర చక్ర ఇస్తాం. కోపంతో ఎవర్నయినా చంపితే? ఒప్పుకోం. అక్కడ ఏం జరిగిందో చూడండి.

యుద్ధంలో మీరు చంపుతోన్నప్పుడు సంగం త్యక్త్వా, చంపుతున్నాను అనే దాని మీద మీకు ఆసక్తి లేదు.

మీరు ఎందుకు చంపుతున్నారు?

చంపవలసి వచ్చింది కనుక, పరిస్థితులు అలా వచ్చాయి కనుక. అది *ఐరోశీర్* అంటే.

మీరు యుద్ధం చేస్తున్నారు. కానీ ఆ యుద్ధంలో మీరు చంపుతోన్న వ్యక్తుల మీద మీకు ఏ విధమైనటువంటి రాగము లేదు, ద్వేషమూ లేదు, ఏమీ లేదు మీకు. అంచేత అది పుణ్యము అయింది. కోపం వచ్చి చంపుతాం. ఉరిశిక్ష వేస్తారు. పాపం అయింది.

***ఇంతకీ పాపం, పుణ్యం అనే ప్రసక్తి ఎప్పుడొస్తోంది?***

మీకు రాగం అయినా ఉండాలి,

ద్వేషం అయినా ఉండాలి.

భగవద్గీత చదువుతోన్నప్పుడు మనం ముందు దీని ఫలశ్రుతి చదివాం. భూమి విష్ణుదేవుడ్ని అడుగుతుంది,

*భగవన్ పరమేశాన భక్తి రవ్యభిచారిణీ*
*ప్రారబ్ధం భుజ్యమానస్య కథం భవతి హే ప్రభో*. (గీ.మ.-1)

ఓ భగవంతుడా! పరమేశ్వరా! ప్రభూ! ప్రారబ్ధము అను భవించువానికి అచంచలమైన భక్తి ఎట్లు కలుగగలదు?

"ప్రారబ్ధకర్మ ప్రకారం మాకు ఈ శరీరం వచ్చింది. ఈ శరీరం వచ్చింది కనుక మేము ఈ పనులే చేయాల్సి వస్తుంది. ఈ పనులే చేస్తూవుంటే మాకు జ్ఞానం ఎక్కడ్నుంచి వస్తుంది, ముక్తి ఎక్కడ్నుంచి వస్తుంది?" అంటే భగవద్గీతను వింటే చాలు మీకు ముక్తి వస్తుంది అన్నాడు.

***వింటే చాలు అంటే అర్థమేంటి?***

విని ఊరుకోమని కాదు.

విని దాన్ని ప్రాక్టీస్ చేయమని.

ఏమని ప్రాక్టీస్ చేయమంటున్నామో మీకు ఇప్పుడు అర్థమయిందికదా, పాపము, పుణ్యానికి ఒకే గీత ఉంది.

- రాగముతోకాని, ద్వేషముతోకాని మీరు ఏదైనా పని చేస్తే అది పాపము. ఏ పని చేసినా సరే.
- పుణ్యం వస్తుంది అని గాయత్రీ మంత్రం చేస్తాం. రాగం ఉందికదా, భగవద్గీత దృష్టిలో అది తప్పే!

అంచేతే భగవద్గీత చాలా మందికి అర్థంకాదు. ఆ అవగాహన. అది ఒక మానసికస్థితి అని ఎప్పుడూ గుర్తు చేసుకోండి. భగవద్గీతలో మీరు ఏమీ చేయక్కరలేదు.

***అందుకే నేను చెప్తాను,***

మీరు ఇక్కడకి వచ్చి వింటోన్నప్పుడు జాగ్రత్తగా విని, ఆ మానసికస్థితుల్లో మీరు ఇంటికెళ్ళిపోతే మీరు సిద్ధ పురుషులే. ఈ క్షణంలో మీరు సిద్ధపురుషులే.

రాగము, ద్వేషము లేకపోతే ఇంక ఉన్నది ఏముంది అక్కడ? అంతా పుణ్యమే. నెగెటివ్ ఏం లేదు.

- కానీ ఈ రాగము, ద్వేషము లేకుండా ఉన్నప్పుడు మనం ఏ పనీ చేయలేం.
- మనం ఏదైనా పని చేయాలంటే మనకి ప్రేమయినా ఉండాలి, లేకపోతే కోపం అయినా ఉండాలి.
- ఈ రెండూ లేకుండా చేసేటటువంటి పనిని మనం నేర్చుకునేదే కర్మయోగం.

ఈ జ్ఞానయోగంలో చెప్తోన్నది ఇదే. కోరికలూ లేవు, సంకల్పాలూ లేవు. వాడికి నేను ఈ స్థాయికి వెళ్ళాలని, ఇది పొందాలనీ లేదు. ఇంక ఏం పని చేస్తాడు వాడు?

***ఏం చేస్తాడక్కడ?***

నువ్వు పని చెయ్. పని ఎలా చేయాలి? నీకు ఏదో పెద్ద లక్ష్యం ఉన్నట్టు, ఇదేదో సాధించేయాలి అన్నట్టు నువ్వు పనిచేయ్. పని చేశాక ఆ ఫలితం గురించి పట్టించుకోకు.

ఆ మానసికస్థితి అవగాహన చేసుకోండి. అంటే ఆ మానసికస్థితి వస్తే మీరు జ్ఞానయోగులే.

జ్ఞాని అంటే నాకు చాలా ఇష్టం అంటాడు. ఏడవ అధ్యాయంలో చెప్తాడు, నాకు నాలుగు విధాలైనటువంటి భక్తులు ఉన్నారు. అందులో జ్ఞాని నాకు చాలా ఇష్టం.

చతుర్విధా భజన్తే మాం జనాస్సుకృతినోఽర్జున
ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ. (7-16)

భరతవంశ శ్రేష్ఠుడవగు ఓ అర్జునా! ఆపత్తునందున్నవాడు, (భగవంతుని) తెలిసికొనగోరువాడు, ధనము (సంపత్తు) నభిలషించువాడు, (ఆత్మ) జ్ఞానముకలవాడు, అను నీ నాలుగువిధములైన పుణ్యాత్ములగు జనులు నన్ను సేవించుచున్నారు (భజించుచున్నారు).

తేషాం జ్ఞానీ నిత్యయుక్త ఏకభక్తిర్విశిష్యతే
ప్రియో హి జ్ఞానినోఽత్యర్థమహం స చ మమ ప్రియః. (7-17)

వారి (నలుగురి)లో నిత్యము పరమాత్మతో గూడియుండువాడును, ఒక్క పరమాత్మయందే భక్తిగలవాడునగు జ్ఞాని శ్రేష్ఠుడగుచున్నాడు. అట్టిజ్ఞానికి నేను మిక్కిలి ఇష్టమైనవాడను, అతడున్ను నాకు మిగుల ఇష్టుడే.

ఈ విధమైనటువంటి మానసికస్థితి, మీరు ఎక్కడున్నారో, అక్కడే ఉండండి. మీరు ఎక్కడికీ వెళ్ళిపోవక్కరలేదు. మీరు ఏమీ మార్చుకోవక్కరలేదు.

మీ జీవిత విధానాల్లో మార్పు వచ్చిందని బయటి వాళ్ళకి తెలియాల్సిన పని కూడా లేదు. బయటి వాళ్ళకే కాదు, అసలు కుటుంబ సభ్యులకి కూడా తెలియదు.

- తెలియకుండా జీవించమంటాడు.

తొమ్మిదవ అధ్యాయంలో రాజవిద్యా రాజగుహ్యం అని చెప్తాడు. ఇప్పుడు కూడా మీరు టీవీలో వాటిల్లో చూచి ఉంటారుకదా, ఏదైనా ఒక మంత్రి పదవి తీసుకుంటున్నప్పుడు ఏం చెప్తారు, నాకు తెలిసిన రహస్యాలను నేను ఎవరికీ చెప్పను అని. మంత్రిగారికి తప్ప మిగతా అందరికీ రహస్యాలు తెలిసిపోతాయి, అది వేరే విషయం.

- అదే విధంగా ఈ రాజవిద్యా రాజగుహ్యాయోగంలో కూడా మీరు సాధకులు అని ఎవరికీ తెలియకూడదు.
- శ్రీకృష్ణుడు భగవద్గీత చెప్పిన దానికంటే 1000 సంవత్సరాలు ముందు నుంచీ కూడా ఒక అతి రహస్యమైన సంస్థ ప్రపంచంలో పనిచేస్తూవుంది.
- -- శ్రీకృష్ణుడిది రఫ్‌గా 5,000 సంవత్సరాలు అనుకుంటే 6,000 సంవత్సరాలు నుంచి ఆ సంస్థ పనిచేస్తోంది.
- 6,000 సంవత్సరాల పురాతనంగా ఉన్నటువంటి ఆ అత్యంత రహస్యమైనటువంటి సంస్థలో మెంబర్స్‌గా గుంటూరులో ఉన్న వాళ్ళు కొన్ని వందల మంది ఉన్నారు. కానీ వాళ్ళు మనకి తెలియదు.

కానీ ఆ సంస్థ ఏమిటో, ఆ సంస్థ పేరు ఏమిటో, ఆ సంస్థ కార్యకలాపాలు ఏమిటో ఎవడికీ తెలియదు. ఆ సంస్థలో మెంబరు అయిన వాళ్ళకి మాత్రమే తెలుస్తుంది.

- అక్కడున్న కండిషన్ ఏమిటంటే, దాని గురించి ఏ మెంబర్ అయినా ఎవరికైనా చెప్తే, సముద్రగర్భంలో ఒక మైలు లోతులో గుంట త్రవ్వి, వీడి శిరస్సు శరీరం నుంచి వేరు చేసేసి, వీడ్ని అందులో పాతి పెట్టేస్తారు.

ఇప్పటికీ ఉంది ఆ సంస్థ. కానీ ఎక్కడుందో ఎవడికీ తెలియదు.

"మీకు ఎలా తెలుసు మాస్టారు?"

ఎలా తెలుసు అనేది అది వదిలేయండి. ఇప్పటికీ అది ఉంది. దానికి సర్టిఫికెట్స్ ఉంటుంది. ఆ సర్టిఫికెట్టు మీద డేటు వేస్తారు. 6,176 ఏదో ఉంది. అన్ని సంవత్సరాల క్రిందట నుంచీ వస్తూవున్నటువంటి ఈ సంస్థ యొక్క, ఆది గురువు యొక్క ఆదేశములో అని వస్తుందది.

**ఇది నేను ఎందుకు చెప్తాను,**

అలాంటి రహస్యమైన మానసిక స్థితి ఉండాలి.

"నేను ఏమీ పట్టించుకోవటం లేదు. మీ ఖర్మరా! చదువుకుంటే చదువు. నేను భగవద్గీత చదువుకుని వచ్చాను, ఏమీ పట్టించుకోను. ఫీజు కట్టాలా, ఏమో నాకేం తెలుసు, నేను ఎందుకు కడతాను?'' అలా ఉండకూడదు.

- మీరు ఈ విధమైనటువంటి మానసికస్థితిలో ఉండి రాగము, ద్వేషము, రెండూ ఉన్నట్టు జీవించాలి.
- అందుకే రాముడు ఈజీగా అర్థమవుతాడుకాని, కృష్ణుడు ఈజీగా అర్థంకాడు.

**ఎందుకు అర్థంకాడు అంటే,**

కృష్ణుడికి చాలా రాగం ఉంది అని అనిపిస్తుంది. ఎంచేత? ప్రకృతికి అనుగుణ్యంగా జీవిస్తోన్నవాడు అందులో జీవించేస్తాడు. నియమబద్ధంగా జీవించేవాడు అయితే

అంటే ముట్టకుండా ఉండటం, నన్ను ముట్టుకోకండి అనటం, దూరంగా ఉండటం, కాస్త గడ్డాలు పెంచేయటం, కాషాయ బట్టలు వేసుకోవటం, అవంతా చేస్తాడు.

కానీ ఈ జ్ఞానయోగతత్త్వం వాడు, వాడేమీ చేయడు.

*మరి వాడు ఏం చేస్తాడు?*

- జరుగుతోన్న దాన్ని చూస్తూవుంటాడు. చూస్తూవుండి, తను చేయవలసినటువంటి బాధ్యతను ఎంత వరకూ చేయాలో, అంత వరకు మాత్రమే చేస్తాడు.

తను చేయవలసిన బాధ్యతను ఎంత వరకూ చేయాలి? ఈ గీత ఎక్కడ గీసుకోవాలి అనే దానికి సీక్రెట్ డాక్ట్రిన్ అని ఒక అద్భుతమైనటువంటి పుస్తకం ఉంది.

- కచ్చితంగా నాకు నమ్మకం ఏమిటంటే, ఇంకొక ఐదారు సంవత్సరాలలో స్కూల్స్ అండ్ కాలేజెస్‌లో అది టెక్స్ట్ బుక్‌గా వస్తుంది అని.

ఇప్పుడు జరుగుతోన్న మార్పులు చూస్తూవుంటే, ఐదారు సంవత్సరాలకంటే ఎక్కువ పడుతుందని అనుకోను. మొదట ఇంకొక 100 సంవత్సరాలు పడుతుంది ఏమో, అప్పటికి కానీ రాదని అనుకునే వాడిని.

- ఐదారు ఏళ్ళల్లో మేడమ్ బ్లావెట్స్కీ, అనే ఒక రష్యన్ వనిత వ్రాసిన గుప్తవిద్య అనే పుస్తకం స్కూల్స్ అండ్ కాలేజెస్‌లో ఆధారభూతమైన పుస్తకం అవుతుంది.

ముందు ఆ పుస్తకం చదువుతారు, తరవాత మిగతా సబ్జెక్ట్స్ అన్నీ కూడా. ఆ పుస్తకంలో ఈ విధమైనటువంటి జ్ఞానం గురించి చెప్పివుంటుంది.

*ఏమిటా జ్ఞానము?*

సైన్సు, ఫిలాసఫీ, రెలిజియను అని 3 పదాలు వాడతాం. సైన్సు అంటే విజ్ఞానం. ఫిలాసఫీ అంటే దర్శనం. రిలిజియన్ అంటే ధర్మం. మనలో చాలా మందికి ఫిలాసఫీకి, ధర్మానికి మధ్య తేడా తెలియదు. దర్శనము అన్నా, ధర్మము అన్నా ఒకటే అనుకుంటాం.

*మళ్ళీ మళ్ళీ నేను ఈ క్లాసెస్‌లో మీకు చెప్తూవుంటాను,*

ధర్మము అనేది శాశ్వతమైనది, సనాతనమైనది, నిత్యనూతనమైనది, మార్పు లేనిది, అవ్యయమైనది. దాన్ని మీరు మార్చలేరు.

ఉప్పు ఉప్పగా ఉండును. కుజగ్రహానికి వెళ్ళిపోయినా ఉప్పు ఉప్పగానే ఉంటుంది, శ్రీకృష్ణుడు వేసుకునే ఉప్పు కూడా ఉప్పగానే ఉంటుంది. హిమాలయాలలో గురువులు, మరి వాళ్ళు ఉప్పు తింటారో, తినరో నాకు తెలియదు. ఒకవేళ వాళ్ళు ఉప్పు తింటే, వాళ్ళకి కూడా ఉప్పు ఉప్పగానే ఉంటుంది. మనకి కూడా ఉప్పు ఉప్పగానే ఉంటుంది. ఉప్పు అని తెలియని వాళ్ళు కూడా ఉప్పుని నోటి మీద వేసుకుంటే ఉప్పగానే ఉంటుంది. అదీ ధర్మం. ఆ సనాతనమైనటువంటి ధర్మాన్ని పట్టుకోవటానికి మనం భగవద్గీతను ఆధారం చేసుకుంటున్నాం.

*ఆ ధర్మం ఎక్కడ్నుంచి వస్తుంది?*

సూర్యుడు నుంచి వస్తుంది. దీన్ని మర్చిపోకండి. సూర్యుడు నుంచి వచ్చే ఆ సనాతనమైనటువంటి ధర్మాన్ని మనం పట్టుకుంటాం.

పట్టుకున్నాం, మనం చూశాం.

మైక్‌ని నేను ముందు వైపు నుంచి చూస్తే, నాకు ఇది రౌండ్‌గా కనిపిస్తుంది. మీరు అటు వైపు నుంచి చూస్తే, ముందు కోలగా ఉండి తరవాత రౌండ్‌గా ఉంది.

- మైక్‌ది ధర్మం అదే. నేను చెప్పినటువంటి వాక్కుని మాగ్నిపై చేసేటటువంటి ధర్మమే దీనికి ఉంది.
- -- కానీ దర్శనం వచ్చేసరికల్లా మారింది.
- -- నా వైపు నుంచి చూస్తే, దీని ధర్మం అదే అయినప్పటికీ కూడా దర్శనం వేరేలాగ ఉంది. అటు వైపు నుంచి చూస్తే దాని ధర్మం అదే. కానీ దర్శనం మారింది.

- ధర్మము - దర్శనము.
  అందువల్ల ఒకే ధర్మము ఉన్నప్పటికీ కూడా ఇన్ని మతాలు వచ్చాయి.

*ఈ మతాలు అన్నీ కూడా ఏమిటి?*

దర్శనాలు. ఆ సత్యాన్ని ఒకడు ఒకలా దర్శించాడు. ఇంకొకడు ఇంకొకలాగ దర్శించాడు. అది చూసేటటువంటి దృష్టికోణమే అంతే.

- ఆ దృష్టికోణం నుంచి మనం ఒక అడుగు పైకి వెళ్ళగలిగితే, జాగ్రత్తగా గమనించుకోగలిగితే, అన్ని మతాలు ఒకే సత్యాన్ని తెలుపుతాయి.

- కానీ ఈ ఒకే సత్యాన్ని తెలుపుతాయి అనే దాన్ని విజ్ఞానంతో కలపమంటాడు. ఇప్పుడు జరుగుతోన్న ప్రసక్తి అది.

***విజ్ఞానము అంటే ఏమిటి?***

మనకి వచ్చే జ్ఞానము ఐదు ఇంద్రియాలు ద్వారా లభిస్తోంది. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలు. ఇది కాక ఇంకొకటేదైనా ఉంటే మన ఇంద్రియాలు దాన్ని పట్టుకోలేవు.

మనం దేన్నయినా వాసన ద్వారా తెలుసుకోగలం.
రుచి ద్వారా తెలుసుకోగలం.
రూపము, కన్ను ద్వారా తెలుసుకోగలం.
స్పర్శ ద్వారా తెలుసుకోగలం.
వినికిడి, చెవుల ద్వారా తెలుసుకోగలం.

- యోగము, సూర్యవిద్య, వేదాలు మనకి ఏం తెలుపుతున్నాయి అంటే, మన చుట్టూ ఉన్న ఆకాశంలో అనంతమైనటువంటి వనరులు ఉన్నాయి.

చాలా జాగ్రత్తగా వీటిని అవగాహన చేసుకోండి. మనం ఆకాశంలోనే కూర్చుని ఉన్నాంకదా! వనరులు, బంగారంకాని, వెండికాని, మట్టికాని, గాలికాని, మీకు ఏది కావాలి అంటే అది. అదంతా ఆకాశంలోనే ఉంటాయి.

- ఆకాశంలో అవి లేకపోతే భూమి మీదకి అవి రావు. దాన్నే మనం పర్జన్యః అంటాం.

భగవద్గీత మూడవ అధ్యాయంలో దీని గురించి మనం కొంచెం అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేశాం. ఇవాళ ఇంకొంచెం జాగ్రత్తగా దీన్ని అర్థం చేసుకోండి.

***ఎందుకు ఇదంతా చెప్పాల్సి వస్తోంది అంటే,***

- *త్యక్తసర్వపరిగ్రహః* దేన్నీ నేను పరిగ్రహించను అనే వాడికే ఈ రహస్యం బోధపడుతుంది.

ఆకాశంలో ఉందికదా, అదంతా తీసుకొచ్చి నా బ్యాంక్‌లో పెట్టేసుకుంటాను అనే వాడికి రాదు. పరిగ్రహించటానికి వీల్లేదు. ప్రకృతిలో ఉన్న ఆ జ్ఞానాన్ని, ప్రకృతిలో ఉన్నటువంటి ఆ సంపదను ప్రకృతిలోనే ఉంచాలి.

- ఆ వనరుల్ని ప్రకృతి ఎంత తీసుకోమంటే అంత మాత్రమే మనం తీసుకుంటాం.

***అందుకే మనం ఏం చెప్పుకుంటాం అంటే,***

సృష్టిలో 84 లక్షల జీవకోట్లు ఉన్నాయి. అందులో మనిషి ఒకడు. మిగతావి 83,99,999 జీవకోట్లు ఉన్నాయి. కానీ ఒక పోలీస్ ఫోర్సుకాని, ఒక మిలట్రీ ఫోర్సుకాని, ఒక న్యాయవ్యవస్థకాని, మనిషికి తప్ప మిగతా జీవాలకి లేవు.

మరి అవంతా సుఖంగానే ఉన్నాయికదా! అవన్నీ జీవిస్తూనే ఉన్నాయికదా! అవన్నీ పరిణామక్రమంలో అవి జేరవలసిన స్థలానికి జేరుతూనే ఉన్నాయి. మనిషి మాత్రం ఇన్ని పెట్టుకున్నాడు.

*పరిగ్రహః* - అన్నీ నాకే. ప్రకృతిలో ఉన్నటువంటి అన్ని వనరులూ కూడా వీడి కోసమే.

సూర్యుడు ఎందుకు ఉదయిస్తున్నాడు? వీడిని నిద్రలేపటానికి. సూర్యుడు ఎందుకు అస్తమిస్తున్నాడు? వీడు నిద్రపోవటానికి. పెట్రోలు ఎందుకుంది? వీడి మోటర్ సైకిల్సుని, వీడి లూనాలని, వీడి ఏరోప్లేన్స్‌ని నడపటానికి. భూమిలో ఇనుము ఎందుకుంది? ఫ్యాన్లకి వాటికి మరి లోహాలు కావాలికదా, దాని కోసం ఉంది.

- ప్రకృతిలో ఏ సంపద అయినా సరే మనిషి కేవలము తన కోసమే ఉపయోగించుకుంటున్నాడు.
- కానీ మీరు ఒక్క నిమిషం ఆలోచించండి. ప్రకృతిలో పృథ్వి మీద ఉన్న ఈ వనరులు, ఇనుము కావచ్చు, కర్రలు కావచ్చు, బొగ్గులు కావచ్చు, ధాన్యం కావచ్చు, ఏదైనా కావచ్చు. కేవలం మనిషి కోసం మాత్రమేనా?
- -- లేకపోతే వాటికి మిగతా ఉపయోగాలు ఏవైనా ఉన్నాయా? మనకి తెలియదు.
- -- పెట్రోలు మనిషికి మాత్రమేనా? మిగతా ప్రాణులు 83,99,999 ఉన్నాయి. వాటికి పెట్రోలు అవసరం ఏమో! వాటికి, మనం ఎలాగ మంచినీళ్ళు త్రాగుతున్నామో, అవి పెట్రోలు త్రాగుతాయేమో!

మనకి తెలియదు. నాకూ తెలియదు, ఒక ఉదాహరణ చెప్తున్నాను అంతే.

- మరి మీరు పెట్రోలు మీ బండీ కోసం పోసేసుకుంటే, మీరు ఏం చేశారు? ...........

అంచేత మీకు గ్రౌండ్ వాటరు లేకుండా పోతోంది.

గ్రౌండ్ నుంచి పెట్రోలు తీసేస్తున్నాం అని మీకు అర్థమవుతోంది తప్ప, ఆ జలతత్వాన్ని మీరు అంతరింపజేసుకుంటున్నారు, అంచేత భూమిలో నీరు ఇంకిపోతోంది అనేది తెలియటంలేదు.

క్రమక్రమంగా రాయలసీమ నుంచి ఆ జాఢ్యం మెల్లిమెల్లిగా మన వైపుకి కూడా ప్రాకుతోంది. గ్రౌండు వాటరు యొక్క మట్టం పోతోంది. పోయిన తరవాత ఏమౌతుంది?

*అపరిగ్రహః*, ఇదంతా ఈ *త్యక్తసర్వపరిగ్రహః* అనే దాంట్లో ఎంత విశాలమైనటువంటి దృష్టికోణంతో సాధకుడు ఈ జ్ఞానాన్ని ఉపయోగించుకోమని ఆ జగద్గురువు చెప్తున్నాడో! నీకు ఎందుకయ్యా ఇదంతా?

భూమిలో ఉన్న ఇనుముని ప్రకృతి ఎందుకసలు అక్కడకి జేర్చింది? మీరు ముందు అది ఆలోచించాలి.

ఇనుము అంతా కూడా ఒకచోట జేరిందికదా! దాన్నే కదా ఓర్స్ అంటాం. రాగి అంతా ఒకచోట జేరుతుంది. బంగారం అంతా ఒకచోట జేరుతుంది. వెండి అంతా ఒక చోట జేరుతుంది. బొగ్గు అంతా ఒకచోట జేరుతుంది, పృథ్వీ తన శరీరంలో, లేకపోతే తన గర్భంలో, పేరు మీరు ఏదైనా చెప్పుకోండి. ఇలాంటి వనరుల్ని ఒకచోటకి జేర్చింది.

*మనిషి ఏం చేస్తున్నాడు?*

దాన్ని పీకుతున్నాడు.

మన శరీరంలో ఐరన్ ఉంది. బ్లడ్‌లో ఆ హిమోగ్లోబిన్‌లో ఉన్న ఐరన్‌ని వేరుచేసి తీసే టెక్నిక్ ఎవడైనా ఒకడు కనిపెట్టాడు అనుకుందాం. ఇంక వాడు మనల్ని మంచం మీద పడుకోబెట్టేయటం, ఏమో ఆ ప్రాసెస్ ఏంటో!

పోనీ ఒక ఆకర్షించే యంత్రం ఉందనుకుందాం. అది పెట్టాడు. మన శరీరంలో ఉన్న ఐరను ఆకర్షింపబడిపోతుంది. వాడు ఆ ఐరన్‌తో ఏదో చేసుకుంటాడు.

కానీ మన పరిస్థితి ఏమౌతుంది?

శరీరంలో ఐరన్ లెస్ దేన్ 50% అయితే అసలు మనిషి బ్రతకడు. అంతకంటే తక్కువ అవటానికి వీల్లేదు.

మరి భూమిలో ఉన్నటువంటి వనరుల్ని మీరు పీకేస్తూవుంటే, అసలు మామూలుగా పీకుతున్నారా మీరు? రోజుకి టన్నులు టన్నులు పీకుతున్నారాయే! మళ్ళా ఒకరోజు రెండు రోజులు కాదు.

మీరు పీకేసి పారేశారు. ఆ పీకేసిన ఇనుముని ఆ పృథ్వీ మళ్ళా ఏ ఇంజెక్షన్ను, ఏ బి-కాంప్లెక్సు, ఐరన్ టాబ్లెట్స్ మ్రింగి తెచ్చుకుంటుందని?

మీకు ఆ అవగాహన, ఆ జ్ఞానయోగం!

మీకు అంత విశాలమైనటువంటి ఆ మానసికమైన ఎక్స్‌పాన్షన్ ఉంటే తప్ప దీనిలో ఉన్నటువంటి లోతులు మీకు అర్థం కావు. మీరు అయితే ఏంటిట అంటారు.

కానీ పృథ్వీ భగవంతుడి దగ్గరకి వెళ్ళి "బాబోయ్! నేను భరించలేకుండా ఉన్నాను. ఏ దుర్ముహూర్తానో, ఏ సుముహూర్తానో మనుష్యులు అనేటటువంటి వాళ్ళని నేను నా శరీరం మీదకి రానిచ్చాను" అని మొత్తుకుంటుంది.

మనం సీక్రెట్ డాక్ట్రిన్ చదివితే, మనం అందరం కూడా చంద్రమండలం నుంచి వచ్చాము అని చెప్తుంది. చంద్రమా మనసో జాతః. చంద్రమండలం నుంచి భూమి మీదకి గెస్టులుగా వచ్చాం.

మీ ఇంటికి ఎవడైనా గెస్ట్ వచ్చాడనుకోండి. మీ టీవీ బాగుంది, తీసుకెళ్ళిపోతాను అన్నాడు. మీ మంచం బాగుంది, తీసుకెళ్ళిపోతాను. మీ ట్యూబ్‌లైట్ ఏదో బాగుంది, తీసుకెళ్ళిపోతాను అన్నాడనుకోండి, ఏం చేస్తాం?

☺ మన ఓపిక, మన సామర్థ్యాన్ని బట్టి ఉంటుంది.

కానీ గెస్ట్ గ్యారంటీగా అలా అనడు. గెస్ట్ ఏం చేస్తాడు? ఉన్న వనరుల్ని ఉపయోగించుకుంటాడు. లేనివి కోరడు. వాడింట్లో ఎలాగైనా ఉండొచ్చు, అది వేరే విషయం. కానీ ఇంకొకళ్ళ ఇంటికి గెస్ట్‌గా వచ్చినప్పుడు అక్కడున్న టైమ్ టేబుల్ ప్రకారం, అక్కడున్న వనరులు ప్రకారం మనం ఎడ్జెస్ట్ అయిపోతాం.

అదీ ఫీలింగ్ ఇక్కడ. *త్యక్తసర్వపరిగ్రహః* వాడు ఏమీ కోరడు, ఏమీ తీసుకోడు.

***కానీ భూమి మీద ఉన్నటువంటి మనం ఏం చేశాం?***

భూమి యొక్క వనరులు అన్నిటినీ పీల్చి చెండాడేసి, భూమి లోపల ఉన్న అనేక ఖనిజాలను పీకేశాం.

శ్రీ కానీ ఆధ్యాత్మిక జగుత్తులో ఒక ఫార్ములా ఎప్పుడూ గుర్తుంచుకోండి, యాజ్ ఎబౌ సో బిలో. బాహ్యజగత్తులో ఏం ఉన్నదో అంతర్ జగత్తులో కూడా అదే ఉన్నది.

-- అంచేత బాహ్యజగత్తులో మీరు ఇనుము, రాగి, బంగారము, పెట్రోలు, అవంతా పీకేస్తూవుంటే, మీ శరీరంలో ఏం అవుతుంది?

-- అందువల్లనే ఇన్ని విటమిన్ టాబ్లెట్స్ ఉన్నా, ఇన్ని రకాలైన వైద్యాలు ఉన్నప్పటికీ కూడా శరీరాలు అన్నీ నీరసంగా ఉండటానికి కారణం అదే.

మిగతా వాళ్ళ సంగతి నాకు తెలియదుకాని, నా కంటే మా నాన్నగారికి చాలా ఓపిక ఎక్కువ అని నాకు ఇప్పటికీ నమ్మకం. ఆయనకి 74 ఏళ్ళు. ఆయనకి ఉన్న ఓపికలో పదవ వంతు నా దగ్గర లేదు.

మా అత్తయ్య, అంటే మా నాన్నగారికి అక్కయ్య. ఆవిడ ఓపికతో చూస్తే మా నాన్నగారికి తక్కువ అనిపిస్తుంది.

మరి వాళ్ళేం విటమిన్స్ తిన్నారని?

పరిగ్రహం, సంపూర్ణ మానవజాతి చేస్తోన్నటువంటి ఒక దుర్మార్గం ఇది. జ్ఞానయోగం చదువుకున్నటువంటి వ్యక్తులుగా మనం దీన్ని ఖండించాల్సి ఉంది.

శ్రీ దేన్నీ కూడా మీరు నా కోసం కావాలి అనే మానసికస్థితి ఉంచుకోకండి.

కానీ మనం ఏం చేస్తాం?

ఫిక్స్‌డ్ డిపాజిట్స్. అన్నీ ఒకచోట జేర్చేస్తాం. జేర్చేస్తే ఏమవుతుంది?

శ్రీ **నేను చెప్తున్నాను, మీకు వార్నింగ్ ఇస్తున్నాను,** గ్యారంటీగా ఎకానమిక్ ఎమర్జెన్సీ వస్తుంది, మొత్తం ఫ్రీజ్ అయిపోతాయి.

తరవాత మీరు మొర్రో మొర్రో అంటే లాభం లేదు.

శ్రీ చాలా జాగ్రత్తగా ఉండండి. కచ్చితంగా ఆ పరిస్థితి వస్తుంది. ఎందుకంటే దేర్ ఈజ్ నో అదర్ వే.

-- మీరు నాది పోతోంది అనే భయం లేకుండా పరిస్థితిని మీరు కాస్త జాగ్రత్తగా ఆలోచించగలిగితే, కచ్చితంగా అలాంటి పరిస్థితిలోనే ఉన్నాం.

ఎందుకో ఆ ఎకానమిక్ ఎమెర్జెన్సీని డిక్లేర్ చేసే సాహసం ఎవరికీ రావటం లేదు. అటు అమెరికాలో రావటంలేదు, ఇంగ్లాండులో రావటం లేదు. కానీ ఎవడో ఒకడు చేస్తాడు. చేసిన మరుక్షణం ప్రతీ చోటా వచ్చేస్తుంది.

శ్రీ మొత్తం కాగితం ముక్కలు అవుట్.

కానీ, ఆకాశంలో ఉన్న వనరుల్ని పట్టుకోగలిగే వాడికి ఏ విధమైనటువంటి ఇబ్బందీ ఉండదు.

"ఆకాశంలో ఉన్నటువంటి వనరుల్ని పట్టుకోగలిగే వ్యక్తులు ఉన్నారా?"

చాలా విచిత్రమైన వ్యక్తులు ఉన్నారు. 1890 ఆ ప్రాంతంలో నర్మదానది ఒడ్డున ధునీవాలా బాబా అని ఒక వ్యక్తి ఉండేవాడు. బ్రిటీష్ కాలం అది. ఇప్పుడు నేను చెప్తోన్న సంఘటనలు బ్రిటీష్ కలెక్టరు స్వయంగా చూసి గెజిట్‌లో వేసినటువంటివి.

ఈ ధునీవాలా బాబాకి ఒక విచిత్రమైన అలవాటు ఉండేది. ఆయనకి మూడ్ వచ్చేస్తే చచ్చిపోతూవుండేవాడు. ధునీవాలా బాబా కదా, అందులో మామూలు బాబా కాదని మీకు తెలుస్తూనే ఉందికదా! అంచేత ఆయనకి సమాధి కట్టేవారు. సమాధి కట్టిన మూడవ రోజో, నాలుగవ రోజో ఆ చుట్టుప్రక్కల పల్లెటూర్లో ప్రత్యక్షం అయిపోయేవాడు.

ఇలా ఐదు సార్లో, ఆరు సార్లో జరిగింది. ధునీవాలా బాబా. ఒక గోనె పట్టా కట్టుకునేవాడు. ధునీ అంటే మీకు తెలుసుకదా, శిరిడీసాయి దగ్గర ఉంటుంది.

ఒకసారి నర్మదానది ఒడ్డున ఆయన కూర్చుని ఉన్నాడు. ఒక్కడు ఏకాంతంలో ఉండేవాడు. ఎవడైనా వస్తే రాళ్ళు విసురుతూవుండేవాడు. అంచేత ఆయన దగ్గరకి ఎవడూ వెళ్ళేవాడు కాదు.

ఆ నర్మదానది ఒడ్డున ఉన్న ఇంకొక గురువుగారి ఆశ్రమంలో సడన్‌గా రెండు మూడు బస్సుల్లో సుమారు 700 మంది దిగారు. ఆ గురువుగారు, ధునీవాలా బాబా మంచి స్నేహితులులాగా వ్యవహరిస్తూవుండేవారు కనుక, ఆ గురువు ఏం చేశాడు? ఆయన శిష్యుడ్ని ధునీవాలా బాబా దగ్గరకి పంపించాడు. అర్ధరాత్రి 12 గంటలకి సడన్‌గా ఏడు వందల మంది వస్తే, ఆ భోజనాలు అవీ ఎలా పెడతాం?

సరే శిష్యుడు ధునీవాలా బాబా దగ్గరకి వెళ్ళి "బాబా ఇలా బస్సుల్లో చాలా మంది వచ్చారు. మా గురువుగారు మీ దగ్గరకి పంపించారు."

ఆయన ఏమన్నాడు? "అదిగో అక్కడున్న ఇసుకని త్రవ్వుకుని ఆ మూటలు మోసుకుపొండి" అన్నాడు.

ఆ ఇసుకని తీసుకుని పోయి వాళ్ళు ఆశ్రమంలో విప్పితే, అక్కడ వాళ్ళకి కావలసిన ఆహార పదార్థాలు అన్నీ ఉన్నాయి. కూరలు, బియ్యం, అన్నీ ఉన్నాయి.

ఈ లోపల ఈయన గురించి ఇదంతా తెలిసి ఒక జమీందారు వచ్చాట్ట ఆయన దగ్గరకి. జమీందారు వచ్చి, ధునీవాలా బాబాకి ఒక మంచి శాలువా కప్పాలి అని చెప్పి, మంచి ఎంబ్రాయిడరీ అదీ చేసిన చాలా కాస్ట్లీ శాలువా తీసుకొచ్చి కప్పాడాయన. ఆ మహానుభావుడు ఏ మూడ్‌లో ఉన్నాడో, దాన్ని తీసుకెళ్ళి ధునీలో పడేశాడు.

శిల్కు శాలువాని ధునీలో పడేస్తే ఏమవుతుంది? అంటుకు పోతుంది. ఈయన గొణుక్కుంటూ దిగుతున్నాడు. "ఈయనేదో గొప్పవాడు అనుకున్నాను. నేను ఇచ్చాను. రాగం. నేను ఇచ్చాను. ఆయనేమో నిప్పులో పడేశాడు."

వెనక్కి పిలిచాడు. "ఇలా రా!" అన్నాడు. నిప్పులో చెయ్యి పెట్టి తీశాడు. ఆ షాల్ ఇచ్చేశాడు.

- ఆకాశంలో ఇవన్నీ ఉన్నాయి. ఆకాశంలో వనరులు ఉన్నాయి కనుకే భూమి లోంచి మీరు ఇంత ఐరన్ టన్నులు టన్నులు తీసి పారేస్తున్నా కూడా పాపం భూమికి ఎనీమిక్ కండిషన్ రావటం లేదు.

*ఎంచేతంటే,*

పృథ్వికి కావలసిన ఐరను మళ్ళీ విశాలమైన అంతరిక్షాల నుండి నార్త్ పోల్ ద్వారా వస్తూవుంటుంది.

- కానీ ఇప్పుడు మనం ఏం చేస్తున్నాం అంటే, అసలు అది స్వీకరించగలిగేటటువంటి దానికంటే కూడా ఎక్కువ స్పీడ్‌లో తీసేస్తున్నాం.

కానీ వనరులు ఎప్పుడూ నాశనం అవ్వవు. మళ్ళీ అంతరిక్షంలోంచి ఆ వనరుల్ని తీసుకోగలదు. అంచేత ఈ ధునీవాలా బాబా ఎగ్జాంపుల్ మీకు ఏం చెప్తోంది? మీరేం కంగారు పడక్కరలేదు. మీరు కనుక కరెక్ట్ మానసికస్థితిలో కనుక ఉంటే, ఇసుకలోనే మీకు కావలసినటువంటి పదార్థాలు, అవన్నీ కూడా జరిగిపోతాయి.

బీదవాళ్ళు ఎవరైనా ఆ ధునీవాలా బాబా దగ్గరకి వెళ్ళి నా కూతురికి పెళ్ళి చేయాలి, డబ్బు లేదు అంటే, ఇసుక తీసి అలా ఇచ్చేవాడు. బంగారంగా మారిపోయేది.

ఇప్పుడు ఆయన ఉంటే ఈ క్షణమే ఆయన దగ్గరకి పారిపోయేవాళ్ళం. కానీ ఆ మూడ్‌లో వెళ్ళిన వాళ్ళకి ఇవ్వడు. వచ్చిన పెద్ద గొడవ అది.

వద్దంటే డబ్బు అన్న ఆ సినిమా ఎవడు తీశాడో కాని, చాలా కరెక్ట్‌గా తీశాడు. కరెక్ట్ కూడా అది.

ఇంక బస్సు రాదులే అని అప్పుడే మీరు ఏ ఆటోనో, రిక్షానో మాట్లాడతారు. మీరు రిక్షా మీద కాలు పెడతారు, బస్సు వస్తుంది. కాలు పెట్టక ముందు వచ్చినా ఓరేయ్ బస్సు వచ్చిందిరా అనేద్దురు. కూర్చున్నాక ఇంక కుదరదు కదా! ఇది మీకు అందరికీ అనుభవంలోకి ఉండుంటుంది.

*నిరాశీరపరిగ్రహః*: దేనికీ మీరు ఆశ చెందవద్దు. ఆ మానసిక స్థితిని అర్థం చేసుకోండి.

ఇంత సేపు చెప్పటంలో నా ఉద్దేశ్యం ఏమిటంటే, ఆ మానసికస్థితి మీకు అర్థమయితే చాలు. ఆ మానసిక స్థితిని తెలపటానికి మనవాళ్ళు అనేక కథలు చెప్తారు.

ఒక వృద్ధ దంపతులు వానప్రస్థాశ్రమం చేసుకుంటూ అడవిలో ఉన్నారు. నదిలో స్నానం చేసి వస్తూ భర్త ముందు వెళుతున్నాడు, వెనకాతల భార్య బిందెతో నీళ్ళు తీసుకొని వస్తోంది. భర్తకి చెట్టు ప్రక్కన బంగారు కాసుల మూట ఎదురుగుండా కనిపించింది.

వెనకాతల భార్య వస్తోందికదా, బంగారం చూసి ఎక్కడ ఆకర్షింపబడుతుందో అని, ఈయన గబ గబ దాని మీద మట్టి వేసేస్తున్నాడు. భార్య రానే వచ్చింది.

"ఏం చేస్తున్నారు?" అంది. మరి వానప్రస్థ ఆశ్రమంలో ఉన్నవాళ్ళు అబద్ధం చెప్పకూడదుకదా! "ఇక్కడ బంగారం ఉంది. నువ్వు ఎక్కడ దాని మీద ...."

"మట్టి మీద మట్టి ఎందుకయ్యా వెయ్యటం" అంది. వెళ్ళిపోయింది. ఆ మానసికస్థితి తెచ్చుకోండి.

- కానీ ఆ మానసికస్థితి తెచ్చుకుని భారతీయులు అకర్మణ్యంగా కూర్చుండిపోయారు.
- -- భారతజాతి మొత్తం నాశనం అయిపోయింది.
- ఏ యోగీ, అఖరికి ఇప్పుడు నేను చెప్పిన ధునీవాలా బాబా కూడా ఖాళీగా కూర్చోలేదు. ఆయన దగ్గరకి వచ్చిన వాళ్ళందరికీ ఎంత సేవ చేశాడో!

700 మందికి ఒకరోజు ఒక రాత్రి భోజనం పెట్టాలి అంటే, ఆయనకి ఎంత శక్తి ఖర్చయివుంటుంది? అడగగానే ఇచ్చేశాడుకదా! అంచేత శక్తివంతుడైన యోగి ఎవడయినా మానవజాతికి సహాయపడకుండా లేడు.

మరి మన ఆధ్యాత్మికత ఎందుకు ఇలాగ తప్పుడు దారులు త్రొక్కుతోందో?

- ☹ అందరూ ఆధ్యాత్మికవేత్తకి ఇచ్చేయాలి, ఆధ్యాత్మికవేత్త మాత్రం అసలేం ఇవ్వడు.
- -- ఆశ్రమానికి అందరూ చందాలు ఇచ్చేయాలి. ఆశ్రమం మాత్రం ఎవడికీ ఏదీ ఇవ్వదు.

త్యక్తసర్వపరిగ్రహః, నేను ఏమీ ముట్టుకోను. నాకు ఏమీ అక్కర్లేదు. ఆ మానసికస్థితి!

- ☺ మళ్ళా మీరు ఇంటికెళ్ళిపోయి, "నాకేం అక్కర్లేదు" అని ఉన్నది విసిరి పారేయకండి.

ఏం చెప్తున్నామో, ఆ భావన అర్థం చేసుకోండి. ఆ భావన మీకు అర్థమయిపోతే ఈ శ్లోకం యొక్క అర్థం మీకు పరిపూర్ణంగా అర్థమయిపోతుంది.

ఇటీజ్ ఏ ఫీలింగ్, ఏ మెంటల్ స్టేట్.

ఎక్విజిషన్, ఇది నాకు కావాలి, ఇదంతా నాదే, నాకు తప్ప ఇంకొకళ్ళు ఎవరికీ అక్కర్లేదు.

దీని గురించి మహాభారతంలో అద్భుతమైనటువంటి కథలు ఉన్నాయి. కర్ణుడికి దానకర్ణుడు అని పేరు. దానకర్ణుడు అని శ్రీకృష్ణుడికి కూడా చాలా ప్రేమ ఉండేది. దానం గురించి ఎప్పుడైనా ప్రస్తావన వస్తే, "ఆహా! కర్ణుడు" అంటే, నేను కూడా దానం చేయగలనుకదా, మేమూ దానం చేస్తున్నాం. దానకర్ణుడేనా ఏమిటి దానం చేయటం అని అర్జునుడికి పాపం బాధ వేసేది.

సరే, శ్రీకృష్ణుడికి అర్థమయింది. మరి రోగం కుదర్చాలికదా! అంచేత ఒకరోజు ప్రొద్దున్నే యమునానదికి స్నానానికి వెళుతూ, ఇలాగే మాటలు వచ్చాయి. "నేనూ దానం చేయగలను బావా! పెద్ద కర్ణుడేనా ఏంటి?" అన్నాడు. సరే నాయనా అన్నాడు, ఇలా చెయ్యి త్రిప్పాడు.

- మనమూ అలా చెయ్యి త్రిప్పితే బంగారం వచ్చే పరిస్థితి ఎప్పుడొస్తుందో మరి? వస్తుంది ఎప్పుడో! ఏమిటంటే, త్యక్తసర్వపరిగ్రహః స్థితికి వెళ్ళాలి.

సరే అక్కడ ఒక బంగారపు ముద్ద పడేశాడు. దానం చెయ్ అన్నాడు. "ఎంతసేపు, నువ్వు స్నానం చేస్తూవుండు, దానం చేసి ఇప్పుడే వచ్చేస్తాను" అన్నాడు.

దానం చేయబోతూ, "వీడికి చెయ్యాలా, అక్కర్లేదా? వీడు సద్బ్రాహ్మడు అవునా, కాదా? వీడికి చేస్తే, వీడు త్రాగుడు త్రాగేస్తాడేమో!" అని ఆలోచిస్తూ, కొంత మందికి ఇవ్వడు, కొంత మందికి ఇస్తూ, ఏదో అలాగ అవస్థ పడి ఇస్తున్నాడు. కానీ అక్కడ ఆ ముద్ద తయారుచేసింది ఎవడు? శ్రీకృష్ణుడు. అర్జునుడు తీస్తూవుంటే, నిండిపోతోంది.

బంగారం చాలా బరువుగా ఉంటుంది. సినిమాల్లో చూపించినంత ఈజీగా బ్యాగ్ ఎత్తుకుని పారిపోలేం మనం. నిజంగా సినిమాలో చూపించినంత బంగారం బ్యాగ్‌లో ఉంటే, అసలు పదిమంది కూడా ఎత్తలేరు. అంచేత నిజంగా ఆ బ్యాగ్‌లో బంగారం ఉండదు. పాపం నిజమైన బంగారం డైరెక్టర్లు, ప్రొడ్యూసర్లు కూడా చూడలేదేమో! లేకపోతే బంగారం బరువు ఎంత ఉంటుందో వాళ్ళకి ఐడియా వచ్చుండేది. చాలా బరువుగా ఉంటుంది.

సరే, ఇస్తున్నాడు, అలసిపోయాడు. ఈ లోపల శ్రీకృష్ణుడు తన సంధ్యావందనం అదంతా ముగించుకుని రిటర్న్ అయి, "ఏం బావా, ఎంత వరకు వచ్చింది?"

"ఇస్తున్నా, ఇస్తున్నా!" అన్నాడు. సరే, వెళ్ళిపోయాడు. సరే, మధ్యాహ్నం. భోజనానికి రాలేదు అర్జునుడు. ఏం చేస్తున్నాడు? దానం చేస్తున్నాడు. సాయంత్రం మళ్ళా సంధ్య చేసుకోవటానికి వచ్చాడు.

"ఏం అర్జునా! ఎంత వరకు వచ్చింది?"

"దానం చేస్తున్నాను బావా, ఉండు!" అన్నాడు.

ఈ లోపల కర్ణుడు అక్కడ్నుంచి రానే వచ్చాడు. "కర్ణా! ఇదీ ప్రాబ్లెమ్!" అన్నాడు.

"ఓస్, అదెంత సేపు!" అన్నాడు.

అర్జునుడు అనుకున్నాడు, "ఇప్పుడు కర్ణుడి సత్తా తెలుస్తుంది, చూస్తాను ఎలా దానం చేస్తాడో!"

ఒక చిన్న కుర్రాడు ఎవడో అటు నుంచి వెళుతూ వుంటే, "ఇలా రా అబ్బాయి!" అన్నాడు. "ఈ బంగారం కుప్ప చూశావా! ఇదంతా నీది, ఎత్తుకు పో!" అన్నాడు.

అంచేత ఆ మానసిక స్థితి. నువ్వు దానం చేస్తోన్నా రాగం ఉండక్కడ. నేను ఎవడికి దానం చేస్తున్నాను, నేను దానం చేస్తున్నది సదుపయోగం అవుతుందా?

సదుపయోగం అవుతుందో, అవదో నిర్ణయించు కోవటానికి నువ్వు ఎవడివి? హూ ఆర్ యూ టూ జడ్జ్? క్రైస్ట్ ఎంత అద్భుతమైనటువంటి మాట అన్నాడో, "నువ్వు ఇంకొకళ్ళని జడ్జి చేస్తున్నావు, వాళ్ళ యోగ్యతని తెలుసు కోవటానికి ప్రయత్నిస్తున్నావు. నీకు ఆ హక్కు ఉందా?"

ఎంత విచిత్రమైన మానసిక స్థితో? ఒక ఎమ్.డి. డాక్టర్ ఏదైనా చెప్తే, అది మన కామన్‌సెన్స్‌కి ఎంత రాంగ్‌గా ఉన్నా ఒప్పేసుకుంటాం. ఎంచేత? వాడు ఆ విషయంలో నిష్ణాతుడు కనుక, వాడు ఆ విషయంలో చాలా కృషి చేశాడు కనుక వాడు చెప్పింది మనం ఒప్పేసుకుంటాం.

ఆధ్యాత్మిక జగత్తులోకి వచ్చేసరికి ఎంత గందర గోళమో! అందరూ చెప్పే వాళ్ళే, అందరూ రూల్స్ మాట్లాడే వాళ్ళే! అందరూ గురువుల్ని ఎసెస్ చేసేవాళ్ళే. ఈ గురువు గొప్పా, ఆ గురువు గొప్పా? కొలబద్ద ఏమిటి మీకు? ఏ కొల బద్దతో మీరు గురువుల్ని కొలవగలుగుతున్నారు? మీ దగ్గర ఏదైనా ఉందా? మనం చేసే తప్పు అక్కడ. భారతీయ ఆధ్యాత్మికత నాశనం అయిపోవటానికి కారణం అది.

అంచేత ఆ మానసికస్థితిని గుర్తుంచుకోండి. త్యక్త సర్వపరిగ్రహః, దేన్నీ కూడా వాడు ఆశించడు. తీసుకోడు.

ప్రకృతి ఈ నియమాన్ని కచ్చితంగా పాటిస్తుంది. మీకు ఆకలేసింది, భోజనం చేస్తారు. ఎంత తినగలరు? త్యక్తసర్వపరిగ్రహః, మీకు కావలసినంతే తినగలరు. అంత కంటే ఎక్కువ మీరు తినాలనుకున్నా తినలేరు.

మీకు ఎంత కావాలో అంత తీసుకుంటే, దాన్ని ఆధ్యాత్మిక విద్య వద్దు అనదు. మీకు కావలసిన దాని కంటే ఎక్కువ తీసుకోకుండా ఉండండి.

***దాని కోసం ఏం చెప్తుంది?***

***శారీరం కేవలం కర్మ*** - మన శరీరయాత్ర జరగటానికి సమాజంలో మన జీవితవిధానం నడవటానికి కావలసిన కర్మలో స్వీకరించవలసింది ఏదైనా ఉంటే, మీరు కచ్చితంగా దాన్ని స్వీకరించండి.

దాన్ని స్వీకరించను! నేను భగవద్గీత జ్ఞానయోగం చదువుకున్నాను కనుక ఏం జరిగితే అది జరుగుతుంది అనేటటువంటి మానసికస్థితిని మాత్రం రానివ్వకండి.

***కుర్వన్నాప్నోతి కిల్బిషమ్*** - అలాంటి పనులు కనుక మీరు చేస్తే, మీకు ఏ విధమైనటువంటి పాపమూ అంటదు. ఏ విధమైనటువంటి ప్రారబ్ధకర్మ మీకు రాదు.

ప్రారబ్ధకర్మ అంటే మీకు తెలిసిందికదా! ఈ మూడు రకాలైన కర్మల్ని ఎప్పుడూ మనస్సులో గుర్తుంచుకోండి. సంచిత కర్మ, ప్రారబ్ధకర్మ, ఆగామి కర్మ. ఈ మూడు కర్మ లలో ఏ కర్మ ఉన్నా కూడా మీరు ఇరుక్కుపోతారు.

అందుకే వివేకానంద సే సన్యాసిన్ బోల్డ్, ఓమ్ తత్ సత్ అని ఒక పాట వ్రాశాడు. థౌజండ్ ఐలాండ్ పార్కులో మీటింగుకి వెళుతూ స్నానం చేయటానికి వెళ్ళి, స్నానం చేసి వచ్చే లోపల ఈ సాంగ్‌ని ఇంగ్లీష్‌లో వ్రాశాడు.

***అందులో ఆయన ఏం చెప్తాడు అంటే,***

సంకెళ్ళు బంగారంతో చేస్తే ఏముంది, ఇనుముతో చేస్తే ఏముంది? సంకెళ్ళు సంకెళ్ళే కదా!

కానీ ఇనుముతో చేసిన సంకెళ్ళు అయితే మనం ఈజీగా వదిలేస్తాం. మరి బంగారంతో చేసిన చైన్ అయితే కచ్చితంగా పడేయం. లాకర్లో పెడతాం.

***ఒక ఉదాహరణ నేను మీకు చాలా సార్లు చెప్తాను,***

ఒక వ్యక్తి ఒక ఆవుని కొని తీసుకెళుతున్నాట్ట. ఒక తుంటరివాడు ఆ వ్యక్తిని ఆపి,

"సార్! నాకొక చిన్న అనుమానం వచ్చింది, మీరు ఆవుని కట్టేశారా, ఆవు మిమ్మల్ని కట్టేసిందా?" అన్నాడు.

వీడికి వళ్ళు మండిపోయింది, "కళ్ళు లేవా, చూడు! ఆవు మెడలో తాడు కట్టాను. నేను ఆ త్రాడు పట్టుకున్నాను. అంచేత నేనే ఆవుని కట్టేశాను, తీసుకెళుతున్నాను" అన్నాడు.

"సరే సార్! బాగానే ఉంది" అని త్రాడు పీకేశాడు. ఇప్పుడు ఆవు వెనక్కి తిరిగి పారిపోయింది. ఇప్పుడు ఈ మహానుభావుడు ఏం చేశాడు? ఆవు వెంటపడ్డాడు.

ఇప్పుడు ఎవరు ఎవరి చేత బంధింపబడ్డారు?

✍ అంచేత ఈ రాగద్వేషాలు చాలా తమాషాగా మనల్ని గందరగోళం చేస్తాయి.

మామూలుగా ఉండే కామన్‌సెన్స్ అంటే ఇంగిత జ్ఞానాన్ని ఆధ్యాత్మిక జగత్తులోకి వచ్చేసరికి మిస్సయిపోతాం.

రెండు ఉదాహరణల విషయంలో నాకు చాలా గందరగోళం ఉంటుంది. ఆ రెండు ఉదాహరణలు చాలా మంది చెప్తూవుంటారుకాని, అది జరిగివుండదు అని నా కామన్‌సెన్స్ చెప్తూవుంటుంది.

రామకృష్ణ పరమహంస తన యొక్క సాధనలో గంగానది ఒడ్డున కూర్చుని ఒక ప్రక్క కాసులు పెట్టుకునే వాట్ట, ఒక ప్రక్క మట్టి పెట్టుకునేవాట్ట. సమలోష్టాశ్మ కాంచనః, నాణెం ఒకసారి విసిరేసేవాట్ట. మట్టి ఒకసారి విసిరేసి, ఇవి రెండూ సమానమే అని సాధన చేసేవాట్ట. సాధన యొక్క శైశవ అవస్థలో ఈ సాధన చేశాడాయన. వివేకానందకి ఈ విషయం చెప్పారు. రామకృష్ణ పరమ హంస దగ్గరకి వివేకానంద చాలా లేట్‌గా వచ్చాడు.

పుస్తకాల్లో తరవాత కథ ఏం వ్రాస్తారంటే, చాలా చోట్ల నేను చదివిన సంఘటన ఏమిటి అంటే, రామకృష్ణ పరమహంసకి బంగారము కూడా మట్టే అనే సాధన ఎంత పరిపక్వం అయిందో తెలుసుకోవటానికి వివేకానంద ఆయన పడుకునే పరుపు క్రింద ఒక నాణెం పెట్టాట్ట.

సరే, రామకృష్ణ పరమహంస పరుపు మీద కూర్చు న్నాడు. మంట, మంట, మంట అని అరిచాడు. వివేకానందకి కళ్ళమ్మట నీళ్ళు వచ్చేశాయట, ఆనందించేశాట్ట, ఒళ్ళు గగుర్పొడిచేసిందిట. "ఆహాహా, మా గురువుగారు ఎంత గొప్పవారో? ఈయనకి కచ్చితంగా తేడా తెలియదు" అని.

మీరు ఏమంటారు?

✍ సమలోష్టాశ్మకాంచనః, బంగారము, మట్టి ఒకటే అను కున్నటువంటి వాడికి ఒంటికి బంగారం తగిలితేనేం, మట్టి తగిలితేనేం? తేడా తెలుస్తుందా?

-- మరి తేడా తెలిసింది అంటే అర్థమేంటి? కథ తప్పు. అలా జరిగివుండదు.

ఇంకొక ఉదాహరణ నేను ఎప్పుడూ చెప్తూవుండేది, భక్త జయదేవ్ సినిమాలోది. "పాతివ్రత్య మహిమ, అబ్బో, ఎంత అద్భుతంగా తీశాడో! నిజంగా ఒళ్ళు పులకిస్తుంది."

**ఏంటిట?**

జయదేవుడు భార్య పద్మావతి చాలా పతివ్రత. రాజుగారు కూడా ఆవిడ్ని పొగిడేవాడు. మరి నేచురల్‌గా రాణీగారికి కోపం వస్తుంది. రాజుగారికి బుద్ధి ఉండాలికదా, అసలు ఆ పని చేయటం ఎందుకు? సరే, రాజుగారు రాజు గారు కనుక, ఆయన తప్పుని మనం పట్టుకోలేం.

సరే, ఒకరోజు రాజుగారు, జయదేవ్ అడవిలోకి ఏదో వేటకో దేనికో వెళితే జయదేవుడ్ని కూడా తీసుకెళ్ళారు. రాణీగారికి ఛాన్స్ దొరికింది. పరిచారికతో చెప్పింది, "నేను జయదేవుడు భార్యతో మాట్లాడుతూవుంటాను. నువ్వేమో వచ్చి జయదేవుడు గతించేశాడు అని చెప్పు. చూద్దాం, ఏమౌతుందో!" సినిమాలో సంఘటన చాలా డ్రామెటిక్‌గా తీస్తాడు. పరిచారిక భయపడుతూ రావటం, చెప్పననటం, రాణీగారు చెప్పు చెప్పు అని కనుబొమ్మలు ఎగరేయటం, మీరు ఈ సీను అంతా ఊహించుకోవచ్చుకదా! సరే చెప్తుంది.

చెప్పగానే "హా, నాథా!" అంది. ఎవరు? పద్మావతి. ఠప్ ఎగిరిపోయింది. ఇంక హాలులో చప్పట్లు, కళ్ళమ్మట నీళ్ళు, "ఆహాః ఏం పాతివ్రత్యం!" సరే, బాగానే ఉంది.

తరవాత ఏమైంది? జయదేవుడు రానే వచ్చాడు. వచ్చి "లే పద్మావతి!" అన్నాడు. ఠప్ మని లేచి కూర్చుంది. పాతివ్రత్య మహిమ అని అందరూ కొనియాడతారు.

ఇంగితజ్ఞానం ఉన్న వాళ్ళెవరికైనా ఈ సీన్‌లో తప్పు తెలుస్తుంది. పతివ్రత అంటే ఏంటి అర్థం? భర్త చనిపోగానే చనిపోవాలి. అంతేనా? లేకపోతే చనిపోయాడు అనే కబురు విన్నాక చనిపోతేనా? ఊహించండి!

నిజమైన పాతివ్రత్యం అంటే ఏమిటి?

అంటే ఆవిడ పాతివ్రత్యం అంత గొప్పది అన్నమాట ఆవిడకి వింటే చాలు.

- తప్పు అది. మనకి ఆ సాధనాత్మకమైనటువంటి డెప్త్ లేక ఈ కథలన్నీ ప్రచారంలోకి వస్తాయి.

మాట వింటే ఎలా అయిపోతుంది? నిజంగా ఆవిడ పతివ్రత అయితే రాణీని చాచి లెంపకాయ కొట్టాల్సింది. "నా భర్త బ్రతికే ఉన్నాడు. ఎందుకు బ్రతికి ఉన్నాడు? నేను బ్రతికి ఉన్నాను కనుక. ఆయనే చనిపోయి ఉంటే నేను అసలు చనిపోయి ఉండేదాన్ని. కబురు వచ్చేంత వరకు ఆగుతానా ఏమిటి?"

కబురు రావాలి అంటే ఆయన అక్కడ చనిపోవాలి. చనిపోయాక పూర్వకాలంలో ఈ ఇంటర్నెట్ కనెక్షన్స్, ఈ పేజింగ్ సిస్టము అవీ గ్యారంటీగా లేవని నా నమ్మకం. అంచేత అక్కడ్నుంచి ఎవడో గుర్రం మీద వచ్చి చెప్పాలి. చెప్పాక ఇంత వరకూ వచ్చాక నేను చచ్చిపోతానా ఏమిటి? అని చెప్పుంటే ఇంకా బాగుండేదేమో అని నా నమ్మకం.

***ఇదంతా ఎందుకు చెప్తున్నానో అర్థమయిందికదా,***

- ఆధ్యాత్మిక జగత్తుకి వచ్చేసరికల్లా సెంటిమెంట్స్‌కి మనం బానిసలం అయిపోతాం తప్ప, వాస్తవికతను, వాస్తవికతగా చూసే పరిస్థితి రాదు.
- -- అప్పుడు కానీ ఈ శారీరం కేవలం కర్మ అనే పదానికి మనం కరెక్ట్ అయినటువంటి ప్రాక్టీస్‌లో పెట్టుకోలేం.

***ఎంచేత?***

సెంటిమెంట్స్‌కి మీరు లోనయ్యారు అనుకోండి, గురువుగారు ఇచ్చిన పెన్ను లేకపోతే పుస్తకం మనం ఇంకొకళ్ళకి ఇవ్వం. మళ్ళా రాగం వచ్చేసింది.

కర్ణుడు చెప్పింది అయితే మనం చాలా ఈజీగా చెప్పేసి ఆనందించాం. కానీ అది మనం చేయం. మనది కాని వస్తువు, ఎవరో ప్రజెంట్ చేసినవి కూడా ఇవ్వలేం.

నా అనుభవం అది. మిగతా వాళ్ళ సంగతి నాకు తెలియదు. ఒక పెన్నో ఏదో ఇస్తూ, మళ్ళా వాళ్ళు నాకు చెప్తారు కూడా, "మాస్టారు, మీకు చాలా చెడ్డ అలవాటు ఉంది, ఎవరైనా ఇది బావుంది అంటే మీరు ఇచ్చేస్తారు. ఇది మాత్రం మీరు ఇవ్వకండి."

ఇస్తానంటే వాళ్ళు ఇవ్వరేమో అని నా భయం. అంచేత తీసేసుకుంటాను. తీసేసుకున్నాక నాకు డౌట్ వచ్చి అడుగుతాను, "ఇది మీదా, నాదా?"

నాది అయితే నేను ఏదైనా చెయ్యొచ్చుకదా!

ఆ జ్ఞానయోగం అర్థమవుతోందికదా, ఎన్ని రకాలుగా మనల్ని మనం మోసం చేసుకుంటామో! ఎన్ని రకాలుగా మనల్ని మనం గందరగోళం పడతామో!

ఈ గందరగోళం అంతా కూడా త్యక్తసర్వపరిగ్రహః, దేన్నీ పరిగ్రహించకుండా ఉండే అద్భుతమైనటువంటి మానసికస్థితి కనుక మనం తెచ్చుకోగలిగితే పోతుంది.

***ఆ మానసికస్థితి తెచ్చుకున్నాక ఏం చేయాలి?***

తెచ్చుకున్నాక అయితే మరి తింటం మానేస్తామా?

- ఉపవాసాలు చేస్తాం, ఎవడైనా నా నోట్లో పెడితేనే తింటాను అంటే, నీ చేత్తో తీసుకుంటే ఏమైంది? ఇంకొకడి చేత్తో పెడితే ఏమైంది?
- -- మనల్ని మనం మోసం చేసుకోకుండా, శరీరయాత్రకు, మనం జీవించటానికి దేశకాల పరిస్థితుల్లో మనం చేసుకున్నటువంటి ప్రారబ్ధం, మన అదృష్టం వల్ల ఏదైనా లభిస్తే దాన్ని స్వీకరిస్తాం.

చాలా మంది నన్ను అడుగుతూవుంటారు, "మా పిల్లలు నేను చెప్పినట్టు వినటం లేదు మాస్టారు! వాళ్ళకి నేను డబ్బు ఎందుకు ఇస్తాను? నా డబ్బు ఇవ్వను"

"వాళ్ళ అదృష్టమయ్యా బాబూ! నువ్వు ఇచ్చినా ఇవ్వకపోయినా వాళ్ళకి వెళుతుంది."

నేను మీకు హెన్రీ ఫోర్డ్ కథ చెప్తూవుంటానుకదా, హెన్రీ ఫోర్డ్ సినిమాకి వెళితే, లోయస్ట్ క్లాసుకి వెళ్ళేవాట్ట. హెన్రీ ఫోర్డ్ కొడుకు హయ్యస్ట్ క్లాస్‌కి వెళ్ళేవాట్ట.

ఒకసారి ఆ సినిమాకి ఇద్దర్నీ తెలిసున్నటువంటి వాళ్ళు వచ్చి, హెన్రీ ఫోర్డ్‌ని కలుసుకుని "అదేంటి సార్! మీ అబ్బాయి ఏమో హయ్యస్ట్ క్లాస్‌లో కూర్చుంటున్నాడు, మీరేమో లోయస్ట్ క్లాస్‌లో కూర్చుంటున్నారు" అంటే,

"నా ఖర్మ బాబూ! నా తండ్రి హెన్రీ ఫోర్డ్ కాదు, నేనేం చేసేది?" అన్నాడు.

అంచేత "నేను సంపాదించాను కనుక, వాళ్ళకి నేను ఇస్తున్నాను!" ఆ అహంకారం వద్దు!

ఎంచేతంటే, నా అనుభవంలోకి వచ్చిన ఉదాహరణలు చెప్తున్నాను. అక్కడ మనం తప్పు చేస్తాం.

శ్రీ నువ్వేంటి ఇచ్చేది, వాళ్ళ అదృష్టం అది.

-- ఆ ప్రారబ్ధం ఉంది కనుక మీకు పిల్లలుగా పుట్టారు. వాళ్ళకి ఆ ప్రారబ్ధమే లేదనుకోండి, ఏ గుడిసెలోనో పుట్టుండేవాడు. అప్పుడు వాళ్ళ మీద మనకి ఆ కోపమూ రాదు.

శ్రీ కోపం లేదు కనుక అభిమానాన్ని పోగొట్టుకోవద్దు.

-- ప్రేమ ఉండొచ్చు. ప్రేమ బంధము కాకూడదు.

శారీరం కేవలం కర్మ, శరీరం ఉంది. ఈ శరీరం మీద ఇన్ని రకాలైన బంధాలు మనం సూపర్ ఇంపోజ్ చేస్తున్నాం. ఈ బంధాలు కేవలము తాత్కాలికమే.

పూర్వకాలంలో ఆ బ్రాహ్మణులకి, ఆ బ్రాహ్మణ సమాజానికి ఎందుకు అంత క్రెడిట్ ఇచ్చేవారంటే, రాత్రి అతని భోజనం అయిపోయాక వంటిల్లు అలికేసేవారు. వంటిల్లుకి వెళ్ళి చూస్తే ఒక బియ్యం గింజ, ఒక పప్పు ఉండదు, ఏం ఉండదు, మొత్తం క్లీన్.

### మళ్ళా రేప్రొద్దున్న ఏం తినాలి?

భగవంతుడికి తెలియాలి. వస్తే ఓ.కె. లేకపోతే భగవంతుడికి తెలియాలి ఏం అవుతుందో! సుధాముడి కథ చూశారుకదా! ఏమైంది సుధాముడికి? ఆయన పేరు మీద ఊరు వెలిసిపోయింది.

ఇది మొత్తము మీరు అవగాహన చేసుకుని ఈ మానసికస్థితిలో ఉండి ఈ శ్లోకాన్ని వినండి. ఈ శ్లోకం యొక్క అర్థమే ఇంత సేపూ నేను మీకు వివరించాను.

నిరాశీః - ఏ విధమైనటువంటి ఆశా లేకుండా,

యతచిత్తాత్మా - అంతఃకరణమును, దేహమును కలిపేసి, ఈ మానసికస్థితిలో ఉంచుకుని,

త్యక్తసర్వపరిగ్రహః - ఇంత సేపూ నేను చెప్పింది, పరిగ్రహం అనే పదంలో ఎన్ని రకాల గందరగోళాలు చేసుకుంటాం అనేది. ఆ గందరగోళాలు చేసుకోకుండా,

శారీరం కేవలం కర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషమ్ - ఈ విధమైన మానసికస్థితిలో ఉన్నటువంటి వాడు కచ్చితంగా భగవత్స్వరూపుడే. వాడిలో ఉన్న ఆ భగవతత్త్వం బయటకి రావటానికి టైమ్ పట్టొచ్చు. కానీ ఈ లోపల మళ్ళా మనం స్టేజి దిగిపోకూడదు.

నిరంతరము మనం దీన్ని గుర్తుచేసుకుంటూ ఉండాలి. చేసుకుంటూవున్నాక, నెక్స్ట్ శ్లోకం దీని యొక్క కమెంట్రీయే. అంచేత దాన్ని కొంచెం స్పీడ్‌గా లాగించేద్దాం.

యదృచ్ఛాలాభసన్తుష్టో ద్వన్ద్వాతీతో విమత్సరః
సమః సిద్ధావసిద్ధౌ చ కృత్వాపి న నిబధ్యతే. (4-22)

అప్రయత్నముగ లభించినదానితో సంతుష్టిని బొందువాడును, సుఖదుఃఖాదిద్వంద్వములను దాటినవాడును, మాత్సర్యములేనివాడును, ఫలముయొక్క ప్రాప్తాప్రాప్తములందు సమబుద్ధి గలవాడు (లేక కార్యము సిద్ధించినను, సిద్ధింపకున్నను సమభావముతో నుండువాడు) నగు మనుజుడు కర్మముచేసినను బంధింపబడడు.

యదృచ్ఛాలాభసన్తుష్టో - ఏది ఆ రోజు లభిస్తే, దానితో సంతృప్తి చెంతుతాడు.

సుధాముడి యొక్క జీవితం ఎలా ఉంటుందో ఇందాక నేను చెప్పానుకదా! రాత్రి అలికేస్తాడు, పిల్లలకి కూడా ఏం ఉంచడు. ఏమీ లేదు, నథింగ్ డూయింగ్. రేప్రొద్దున్న మళ్ళా ఎవడైనా ఏదైనా ఇస్తే ఓ.కె.

యదృచ్ఛాలాభసన్తుష్టో ఆ రోజు ఎంత వస్తే అంత. 5 ఇళ్ళు మాత్రమే అడుక్కోవటం. ఐదిళ్ళల్లో ఎవడూ ఏమీ ఇవ్వలేదు, ఆరో ఇంటికి వెళ్ళొచ్చుకదా! కుదరదు.

యదృచ్ఛాలాభసన్తుష్టో - ఆ రోజు మనకి ఎంత లాభమో, ఎంత మనకి పరిపక్వమో.

ఇప్పుడు అర్హత ఉన్నా లేకపోయినా, రికమెండేషన్స్ మీద ప్రమోషన్స్ కావాలి.

రికమెండేషన్స్ మీద ప్రమోషన్స్ వచ్చి, అర్హత ఉన్నవాడికి రాకపోతే మొత్తం వ్యవస్థ నాశనం అయిపోతుంది.

ద్వన్ద్వాతీతో -ద్వంద్వాలంటే మీకు తెలుసుకదా, సుఖము - దుఃఖము, రాత్రి - పగలు, మానము - అవమానము, వీటిని దాటేసి,

విమత్సరః - మాత్సర్యము లేనివాడు.

మాత్సర్యము అంటే ఇది నాది అనే భావం కలిగి ఉండటం. అహంకారంలో నేను గొప్పవాడిని అనే భావం ఉంటుంది. మాత్సర్యం అంటే ఇది నాది. అంటే అహంకారం కంటే ఒక చిన్న మెట్టు క్రిందన.

సమః సిద్ధావసిద్ధౌ చ - ఒక పని చేస్తాడు. పని జరిగితే నేను చేశాను. పని జరక్కపోతే, నీ ఖర్మ! అలా ఉండడు.

ఇప్పుడు డాక్టర్లు అదే కదా చెప్తారు, తగ్గించేస్తే "చూశావా నా మందు ఎంత బాగా పనిచేసిందో!" తగ్గలేదు, "ఏం చేస్తాంసార్, ఖర్మ అలా ఉంది, సర్దుకోండి."

కానీ డాక్టరు దగ్గరకి వెళ్ళాక కూడా వాడి మందులు పనిచేయక చనిపోయినప్పుడు నీ ఖర్మ అన్నప్పుడు, వాడి మందులు పనిచేసి వాడు బాగుపడినప్పుడు అది కూడా వాడి కర్మే. ఆ రోగికి బాగుపడే కర్మ ఉంది కనుక బాగు పడ్డాడుకాని, నా మందులు అని ఎందుకు అనటం?

సమః సిద్ధావసిద్ధౌ చ - వెళ్ళాం, ఒక పని జరుగుతుంది అనుకున్నాం. మనస్ఫూర్తిగా ప్రయత్నం చేశాం.

కండిషన్ అది. ఆ పదాన్ని మనస్ఫూ....ర్తిగా లాగాలి మీరు. అంతే తప్ప నేను యోగిని, చేశాను, జరగలేదు, వదిలేయ్ అనికాదు. మామూలు వ్యక్తులు కంటే మీరు ఎక్కువ తీవ్రతతో పనిచేయాలి.

కృత్వాపి న నిబధ్యతే - ఈ విధంగా కనుక మీరు పనిచేస్తే, ఏ విధమైన బంధనాల్లో కూడా మీరు బంధింపబడరు.

ఈ కాలంలో ఇలాంటి సాధనలు చాలా బాగా పరిపక్వ స్థితికి తీసుకొచ్చినటువంటిది దత్తాత్రేయ కల్ట్ అని చెప్తున్నాను కదా! అంచేత ఈ మూడు శ్లోకాలు మళ్ళా మనం చదువుకుందాం. ఇవి ఒక విధంగా ఆ శిరిడీసాయి, ఆ సాయి కల్ట్, ఆ దత్తాత్రేయ కల్ట్ యొక్క సాధనారహస్యాన్ని మనకి తెలుపుతున్నాయి.

త్యక్త్వా కర్మఫలాసఙ్గం నిత్యతృప్తో నిరాశ్రయః
కర్మణ్యభిప్రవృత్తోఽపి నైవ కించిత్కరోతి సః. (4-20)

వాడు ఏమీ చేయటం లేదు.

నిరాశీర్యతచిత్తాత్మా త్యక్తసర్వపరిగ్రహః
శారీరం కేవలం కర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషమ్. (4-21)

ఒకవేళ శరీరము చేసినా, ఆ చేసిన కర్మ వల్ల వాడికి ఏ విధమైన బంధము ఏర్పడదు. పాపము ఏర్పడదు.

యదృచ్ఛాలాభసన్తుష్టో ద్వన్ద్వాతీతో విమత్సరః
సమః సిద్ధావసిద్ధౌ చ కృత్వాపి న నిబధ్యతే. (4-22)

ఒక వేళ వాడు ఏదైనా పనిచేసినా, ఆ పని వాడికి ఎట్టి పరిస్థితులలోనూ బంధనానికి కారణము కాదు.


ఈ మూడు శ్లోకాలూ మననం చేసుకుంటూ కళ్ళు మూసుకోండి. ఆ మానసికస్థితి!

నిత్యతృప్తమైనటువంటి స్థితి,
నిరాశ్రయమైనటువంటి స్థితి,
సర్వ పరిగ్రహాన్ని వదిలేసినటువంటి స్థితి,
ఏది దొరికితే దానితో సంతుష్టంగా ఉండే స్థితి,
ద్వంద్వాలకు అతీతముగా ఉన్నటువంటి స్థితి,
సిద్ధి, అసిద్ధి, ఈ రెండిటిని సమానంగా చూడగలిగే స్థితి,

ఆ మానసికస్థితిని ఆ జగద్గురువు మనకి అందరికీ
ఈనాడు అనుగ్రహించుగాక!

ఓం శాంతిః శాంతిః శాంతిః

స్వస్తి.



# భగవద్గీత ఉపన్యాసాలు - 30

## జ్ఞానయోగము

1998, నవంబరు 29 వ తారీఖున సుకృతవిల్లా, గుంటూరులో
మాస్టరుగారు భగవద్గీతపై ఇచ్చిన ఉపన్యాసము



- సూర్యుడు కూడా ఒక మాయే
- మన మేరుదండము సూర్యుడికి ప్రతీక
- సూర్యుడిలో ఉన్న వేడి అగ్నిలోను, వెలుతురు చంద్రుడిలోనూ ఉన్నాయి
- వేడి ఉన్న పదార్థాలు అగ్ని సంపర్కంలో అగ్నిగా మారతాయి
- అగ్నిగా మారని వాహక పదార్థమే విభూతి
- వేదాల మొదటి సూక్తము అగ్నిసూక్తము
- సంగము జానార్జనకు అడ్డు తగులుతుంది
- ఆహారం రూపంలో అగ్నినే తింటున్నాం
- ప్రతీ పదార్థంలోనూ అగ్ని ఉంది
- 4 తత్వాలను అగ్ని రూపాంతరం చెందిస్తుంది

---

జ్ఞానయోగంలో తరవాత శ్లోకానికి చూద్దాం.

*గత సఙ్గస్య ముక్తస్య జ్ఞానావస్థితచేతసః*
*యజ్ఞాయాచరతః కర్మ సమగ్రం ప్రవిలీయతే. (4-23)*

దేనియందును సంగము (ఆసక్తి) లేనివాడును, రాగద్వేష కామక్రోధాది రూపసంసారబంధములనుండి విముక్తుడును. ఆత్మ జ్ఞానమందే మనస్సు నిలుకడ కలవాడును, భగవత్ప్రీత్యర్థము (లేక పరప్రాణిహితార్థము లేక, ధర్మము నిమిత్తము) కర్మము నాచరించు వాడునగు మనుజుని యొక్క కర్మ యావత్తు విలీనమైపోవుచున్నది (జన్మ, బంధాదులను గలిగింపక నశించుచున్నది.)

ఇంకొక సాధన గురించి చెప్తున్నాడు. మనం ఈ జ్ఞానయోగాన్ని ఎన్ని రకాలుగా అనుష్టించవచ్చో చూడండి.

దేనితోనూ ఏ విధమైన సంబంధమూ లేకుండా, ఫ్రీగా, ముక్తస్థితిలో ఉన్నటువంటి వాడును, జ్ఞానమునందు నిలిపిన చిత్తము కలవాడును యజ్ఞము కొరకు ఆచరించు వాని యొక్క కర్మ సంపూర్ణము గను నశించుపోవుచున్నది.

మొత్తము యోగసాధనకి ఆధారం ఏమిటి అనేది భగవద్గీత నాలుగవ అధ్యాయం మనకి ఏం చెప్తోంది అంటే,

సూర్యుడ్ని మీరు గురువుగా తీసుకోండి.

సూర్యుడ్ని మనం గురువుగా తీసుకొంటూవుంటే, ఆ సూర్యుడు ఎన్ని రకాలుగా గురువుగా పనిచేస్తాడో మనం అర్థం చేసుకుంటే చాలా ఆశ్చర్యం వేస్తుంది.

సంపూర్ణ వేదాలు సూర్యుడు యొక్క వివరణే.

- వేద పద్ధతి కాకుండా, తంత్రోక్త పద్ధతి ఉంది. అదీ వేద పద్ధతిలోని భాగమేకాని, అందులో కర్మ ఎక్కువ. రకరకాలైన ఆచరణ యొక్క రూల్స్ ఎక్కువ.

అది కూడా ఏ విధంగా జ్ఞానయోగానికి దారి తీస్తుందో తెలిపేటటువంటి శ్లోకం ఇది.

జ్ఞానావస్థితచేతసః - ఇక్కడ సాధకుడు అర్థం చేసుకోవలసిన కీ వర్డ్ ఏమిటంటే, జ్ఞానావస్థితచేతసః, జ్ఞానము.

- ఒక వ్యక్తికి జ్ఞానము కావాలి అంటే రెండు విషయాలు ఉండాలి. సబ్జెక్టు, ఆబ్జెక్టు ఉంటే జ్ఞానం ఉంటుంది.
- -- ఒకడు చూసేవాడు ఉండాలి, ఇంకొకడు చూడబడేది ఉండాలి. ఈ రెండిటికి మధ్య సంబంధం జ్ఞానం.

*నిన్న మనం చదువుకున్న మూడు శ్లోకాలలో ఏం చేస్తున్నాం?*

నేను ద్రష్టగా ఉంటాను. జరుగుతోన్నది ఏదో జరుగుతోంది. దాన్ని గమనిస్తున్నాను. మంచి జరిగినా, చెడు జరిగినా నిరాశీః ఏ విధమైన ఆశా లేని స్థితిలో ఉన్నాను.

ఏ విధమైన ఆశా లేని స్థితిలో ఉన్నప్పటికీ కూడా ప్రకృతి తనకి కావలసిన పనులు తను చేసుకుంటూ ఉంటోంది. ఆకలేస్తోంది, భోంచేస్తున్నాను. నిద్రొస్తోంది, నిద్ర పోతున్నాను. అలాగే సమాజంలో నేను చేస్తోన్నటువంటి ప్రతీ పనీ కూడా ఆ దృష్టితోనే చేస్తున్నాను.

ఏ విధంగా? నిద్ర వచ్చినప్పుడు మీరు నిద్రపోతే, మాటల్లో "నేను నిద్రపోతున్నాను" అంటారు. కానీ మీకూ తెలుసు, అందరికీ తెలుసు, నిద్ర మీ చేతిలో లేదు. ఆకలేసింది, "అన్నం తింటున్నాను." అదీ మీకు తెలుసు, ఆకలేయటం మీ చేతిలో లేదు. ప్రకృతి యొక్క చేతిలో ఉంది.

ఈ విధమైనటువంటి సబ్జెక్ట్, వ్యక్తి తనని తాను గమనించుకోవటంలో మనం జ్ఞానయోగంలోకి వెళ్ళాం.

*అంటే ఏమిటి?*

సబ్జెక్ట్, నేను అనే భావనలో లీనమైపోయి, జరిగే దాన్ని దర్శిస్తున్నాడు.

- ఇప్పుడు చెప్పేది నేను మీద లేదు, జ్ఞానావస్థితచేతసః, జ్ఞానము మీద తన చేతసః అంటే కాన్స్యస్‌నెస్, చేతనత్వమును జ్ఞానము మీద పెట్టాడు.

*ఇక్కడ ఇందాకానే చెప్పానుకదా,*

మీరు కాస్త రిసీవ్ చేసుకునే మూడ్‌లో ఉండాలి. జ్ఞానయోగంలో ఇప్పుడు చెప్పే ఈ శ్లోకాలన్నీ కూడా అనేక అద్భుతమైన సాధనా ప్రక్రియల్ని వివరిస్తాయి.

ఆ సాధనా ప్రక్రియల్ని వివరించటానికి అర్జునుడికి అయితే తక తక చెప్పేశాడు. ఏ ఉద్దేశ్యంతో చెప్పాడు? అర్జునుడికి ఇవంతా తెలుసు కనుక. అతను అప్పుడు ఋషుల యొక్క జీవితాలు, ఋషుల యొక్క ఆదర్శాలు, వాళ్ళ మధ్యనే ఉన్నాడు. అప్పుడు వ్యాసుడు ఇంకా బ్రతికే ఉన్నాడు. అందరితోనూ కలుస్తూవుండేవాడు.

ఎవరికైనా కాస్త అవసరం వస్తే వ్యాసాశ్రమానికి వెళ్ళిపోతూ వుండేవారు. ప్రొద్దున్నా, సాయంత్రము సూర్యోదయ, సూర్యాస్తమయ కాలాలలో వ్యాసాశ్రమంలో యజ్ఞం జరుగుతూవుండేది. ఆ కర్మ చేయటం వల్ల వ్యాసుడి ఆశ్రమంలో అనేక రోగాలు నయమైపోతూవుండేవి. మాటలు లేని వాళ్ళకి మాటలు వచ్చేస్తూవుండేవి. అప్పటికి అప్పుడే. ఎప్పుడో కాదు. నడవలేని వాళ్ళకి నడక వచ్చేస్తూ ఉండేది. ఆ స్థితి ఉన్నప్పుడు చెప్పిన శ్లోకం అది.

అంచేత చాలా విషయాలు వినే వాడికి అర్థమవుతాయి అనుకుంటున్నాడు. కానీ ఆయనకి తెలియదు, కలియుగంలో అందులో చెప్పేటటువంటి చాలా మాటలకి అవగాహన ఉండదు అని.

- జ్ఞానము. ఈ జ్ఞానము అనే పదము తంత్రభాషలో సూర్యుడు గురించి మనం ఉపయోగిస్తాం.

చంద్రుడు, అగ్ని, సూర్యుడు. ఇవి మూడు కళ్ళు. చంద్ర సూర్యాగ్ని లోచన. రిపీటెడ్‌గా మొట్టమొదట రెండు మూడు రోజుల ముందు నుంచే తరవాత రాబోయే శ్లోకాలు గురించి నేను మీకు హింట్స్ ఇస్తూవుంటాను. ఇది కూడా మీకు చెప్పాను, చంద్రుడు, సూర్యుడు, అగ్ని.

- మీరు చాలా జాగ్రత్తగా గుర్తుంచుకోవలసింది ఏమిటి అంటే, చంద్రుడు, సూర్యుడు, అగ్ని, ఇందులో సూర్యుడికి స్వతంత్రమైన ఉనికి లేదు.
- -- సూర్యుడు కూడా ఒక మాయే.
- -- సూర్యుడికి తనంతట తనకి ఉండే ఉనికి ఏం లేదు. చంద్రుడు, అగ్ని కలిస్తే సూర్యుడు ఏర్పడతాడు.

- ఒక పదార్థం ఉంది - అగ్ని.

  చూసేవాడు ఉన్నాడు - చంద్రుడు.

  ఈ రెండిటికి మధ్య లింక్ జ్ఞానము. అది సూర్యుడు.

జ్ఞానము, జ్ఞేయము, జ్ఞాత.

"జ్ఞాత" అంటే చూసేవాడు.

"జ్ఞేయము" అంటే చూడబడేది.

"జ్ఞానము" అంటే ద ప్రాసెస్, ఈ ప్రక్రియ.

అది నిరంతరం ఇక్కడ జరుగుతూనే ఉంది.

చూసేవాడు చంద్రుడు.

చూడబడేది అగ్ని.

నేను ఈ విషయాన్ని చూస్తున్నాను అనే జ్ఞానం మీకు వస్తోందికదా, అది సూర్యుడు.

అంచేత సూర్యుడు రెండు వస్తువుల కాంబినేషను. ఒకటి పదార్థము, ఇంకొకటి శక్తి, ఏదైతే చూస్తోందో అది.

ఒకవేళ అగ్ని చూస్తూవుంటే చంద్రుడు ఏమవుతాడు?

నేను మిమ్మల్ని చూస్తున్నప్పుడు మీరు నాకు ఆబ్జెక్ట్ అయితే, ఎదుటి వాడికి నేను ఆబ్జెక్ట్ అవుతాను. అంతేకదా!

పరస్పరం ఉండే ఈ లింక్‌తో ఏర్పడేదే సూర్యుడు, చంద్రుడు, అగ్ని మధ్య ఉండే త్రికోణం.

శ్వాసను గమనించుకోమని చెప్పానుకదా!

- ఈ త్రికోణాన్ని మనం కనుక నిరంతరము మనస్సులో పెట్టుకుని ఈ శ్వాస గమనించుకున్నప్పుడు మన శరీరంలో ఏం జరుగుతుంది అంటే,
- మన శిరస్సులో ఉన్న చంద్రుడు, మన మూలాధారంలో ఉన్న అగ్ని, శ్వాస ద్వారా లింక్ అవుతాయి. లింక్ అయినప్పుడు సూర్యుడు ఏర్పడతాడు.

మన మేరుదండము సూర్యుడికి ప్రతీక.

ఇది మీరు మనస్సులో పెట్టుకుంటే, ఇప్పుడు మనం చదివిన శ్లోకాన్ని సాధనాత్మకంగా అర్థం చేసుకోవచ్చు. జాగ్రత్తగా మళ్ళీ వినండి.

అందుకే శివుడి శిరస్సు మీద మనం చంద్రవంకను పెడతాం. చంద్రవంక నుంచి, శివుడి నెత్తి మీద నుంచి గంగ భూమి మీదకి జాలువారుతుంది.

- శ్వాస శిరస్సులోంచి ఒక విచిత్రమైన ప్రక్రియ ద్వారా సహస్రారం నుంచి విశుద్ధి చక్రంలోకి ప్రవేశిస్తుంది. మధ్యన ఆజ్ఞాచక్రము ద్రష్టగా ఉంటుంది.

ఆ ప్రక్రియ గురించి ఇప్పుడు మనం చర్చ చేసుకోవక్కరలేదుకాని, రెండు విషయాలు మీకు గుర్తుంటే, ఇప్పుడు నేను చెప్పింది దానంతట అదే మీకు జరిగిపోతుంది.

ఏం చెప్పానో మళ్ళా అర్థం చేసుకోండి. దురూహం అనను, కష్టం అనను కాని, కొంచెం ఆ పరిభాష మనకి తెలియదు, అలవాటు లేని భాష. అంతకంటే ఏం లేదు.

ఇవాళ నుంచి మైక్‌ని స్పీకరు అంటాము, స్పీకర్‌ని మైక్ అంటాము అనుకుని మొదలెట్టాం అనుకోండి,

మీరు "స్పీకర్ ముందు కూర్చోండి మాస్టారు, మైక్‌లోంచి వినిపిస్తుంది" అని ఏదో మాట్లాడితే, క్రొత్త వాడికి ఎలా ఉంటుంది? కన్‌ఫ్యూజ్ అవుతారు.

**అక్కడ మనం ఏం చేశాం?**

పదాలకి ఉండే అర్థాన్ని మనం మార్చేశాం.

"అన్నంలో కంచం పెట్టుకుని తింటాము."

తప్పేం లేదందులో. కానీ అక్కడ మనం ఇచ్చే అర్థం ఏమిటి అంటే, అన్నం అంటే కంచం అనుకుంటున్నాం, కంచం అంటే అన్నం అనుకుంటున్నాం అంతే.

ఆ భావన కనుక మీకు అర్థమయితే విషయం గందరగోళం ఏం అవదుకదా! కానీ ఆ భావన మీకు అర్థం కాలేదు అనుకోండి, అప్పుడు గందరగోళం అవుతుంది. "వీడేం మాట్లాడుతున్నాడు, వీడిని ఏదో హాస్పిటల్‌కి తీసుకెళ్ళాలి. అన్నంలో కంచం పెట్టుకుంటాట్ట!"

తంత్రా కూడా అదే అయింది.

చంద్రుడు, సూర్యుడు, అగ్ని, ఇవంతా మనం నిత్య జీవితంలో అనుభూతి చెందుతోన్నటువంటి వస్తువులే. కానీ యోగసాధనలో ఈ వస్తువులకి అర్థాలు మారిపోయాయి.

కానీ ఇది ఒక యోగసాధనలోనే వస్తువులకి అర్థాలు మారతాయా అనుకోవక్కరలేదు. మనం కూడా అర్థాలు మార్చుకుంటూనే ఉంటాం.

NO నిరంతరం నేను మీకు చెప్పే ఉదాహరణ ఇది. N అనేది ఇంగ్లీషులో ఒక లెటరు. O అనేది ఇంగ్లీషులో ఇంకొక లెటరు. అందరికీ తెలిసున్నదే. NO అని బోర్డ్ మీద వ్రాశాను. నో అని చదువుతాం మనం.

అదే కెమిస్ట్రీవాడు అయితే వాడూ NO నో అనే చదువుతాడు. చదవటం ఎన్.ఓ. అంటాడు. కానీ వాడికి అది నో కాదది, నైట్రస్ ఆక్సైడ్ అవుతుంది.

- అలాగే తంత్రాలో కూడా ఈ అగ్ని, ఈ చంద్రుడు, ప్రకృతిలో ఉన్నవే, కానీ దానికి వాళ్ళు ఒక విశేషమైన అర్థాన్ని ఇచ్చుకున్నారు.

ఆ విశేషమైన అర్థాన్ని మనం తెలుసుకోనంత వరకు జ్ఞానైకస్థితచేతసః జ్ఞానములోనే మన చేతనత్వాన్ని ఉంచుకోమని శ్రీకృష్ణుడు చెప్పిన ఆ భావాన్ని మనం అర్థం చేసుకోవటానికి కొంచెం కష్టం అవుతుంది.

అంచేత మళ్ళీ ఇంకొక విధంగా దీన్ని అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేద్దాం.

అగ్ని, చంద్రుడు, సూర్యుడు.

- సూర్యుడులో ఉన్నటువంటి 'వేడి' అగ్నిలో ఉంది.
- సూర్యుడులో ఉండే 'వెలుతురు' చంద్రుడిలో ఉంది.

చంద్రుడిలో వేడి లేదు, వెలుతురు ఉంది. అగ్నిలో వెలుతురు పెద్దగా లేదు. కానీ వేడి ఉంది.

- సూర్యుడులో వేడీ ఉంది, వెలుతురూ ఉంది.
- అంచేత సూర్యుడు అంటే, చంద్రుడు, అగ్ని యొక్క కలయిక అంటే అవగాహన చేసుకోవటంలో మనకి కష్టం ఏముంది? ఆ అవగాహన!

ఏ భావనతో మనం అక్కడ చెప్తున్నాం? వేడి!

వేడి లేనిదే మనం బ్రతకలేం. 98.4 డిగ్రీస్ మన శరీరం యొక్క వేడి లేకపోతే, ఒళ్ళు చల్లబడిపోతే భయపడతాం. ఒళ్ళు వేడెక్కినా భయపడతాం. అంతగా భయపడం. కానీ అది ఒక లిమిట్ దాటి వేడెక్కితే, జ్వరం తగ్గటం లేదు, ఏం చేయాలి? అని మళ్ళా భయపడతాం.

అంచేత ఆ వేడి అనే పదం అర్థమవుతోందికదా!

- ప్రకృతిలో ఏ పదార్థాన్ని మీరు చూసినా, ప్రతీ దానికీ అంతర్గతంగా ఎంతో కొంత వేడి ఉంటుంది. కొన్నిటిలో ఎక్కువ, కొన్నిటిలో తక్కువ ఉండొచ్చు.
- వేడి ఉన్నటువంటి పదార్థాలు అగ్ని సంపర్కంలో అగ్నిగా మారతాయి.

దాన్ని కొంచెం జాగ్రత్తగా అర్థం చేసుకోండి.

కర్రని నిప్పులో వేస్తే అగ్నిగా మారుతుంది. రబ్బరుని నిప్పులో వేస్తే ముందు కరిగి తరవాత అంటుకుంటుంది.

- కానీ కొన్ని పదార్థాలు ఉన్నాయి, అవి అగ్నిగా మారవు.

ఇనుము, అందులో మంట రాదు. ఎర్రగా మారుతుంది. దాన్ని బయటకి తీసేసే సరికి మళ్ళా మామూలుగా మారిపోతుంది. అదే కర్రని కనుక ఎర్రగా అయిపోయిన తరవాత నేను బయటకి తీసి, మళ్ళా దాన్ని చల్లారిస్తే, ముందు ఉన్నటువంటి కర్ర నాకు కావాలి అంటే రాదు.

***అంటే అర్థం ఏమిటి,***

కర్రలో అగ్ని ఉంది.
ఇనుములో అగ్ని లేదు.

ఇనుము అగ్ని దగ్గర ఉన్నప్పుడు అగ్ని వలె ప్రవర్తించింది. ఉపాసన వల్ల, దగ్గర కూర్చోవటం వల్ల.

- కానీ ఎప్పుడైతే అది అగ్నికి దూరం అయిపోయిందో, ఇనుము మళ్ళా ఇనుముగానే ఉండిపోయింది.
- అది బూడిదగా మారదు, భస్మముగా మారదు.
- తంత్రవిద్యలో, యోగవిద్యలో ఈ భస్మాన్నే మనము విభూతి అంటాం. విభూతి అన్నా, భస్మము అన్నా ఒకటే. కానీ తంత్రవిద్యలో ఉన్నటువంటి విభూతికి, మామూలు బూడిదకి చాలా తేడా ఉంది.

ఒక యోగి ఇచ్చిన విభూతి అనేక రకాలైనటువంటి విభూతుల్ని ప్రదర్శిస్తుంది. రోగాల్ని నయం చేస్తుంది, ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుంది. మానసిక శాంతిని ఇస్తుంది.

ఆ విభూతి దేని సంపర్కం వల్ల వచ్చింది? అగ్ని యొక్క సంపర్కం వల్ల వచ్చింది.

అగ్ని యొక్క సంపర్కం వల్ల వచ్చిన విభూతి ఎలా వచ్చిందో కొంచెం జాగ్రత్తగా అర్థం చేసుకోండి.

- ఏ పదార్థములో అయితే ముందే నిబిడీకృతముగా అగ్ని ఉన్నదో, ఆ అగ్ని, అగ్ని యొక్క సంపర్కంలోకి వస్తే అది అగ్నిగా మారిపోతుంది.
- అగ్నిగా మారనటువంటి పదార్థము విభూతిగా మిగిలిపోతుంది.

మళ్ళీ చెప్తున్నాను, దాన్ని జాగ్రత్తగా అర్థం చేసుకోవటానికి ట్రై చేయండి. ఈ మూడు పదాలు బాగా అవగాహన చేసుకుంటే, తంత్రవిద్యా బాగా అర్థమవుతుంది, ఇప్పుడు చదువుతోన్న శ్లోకంలో శ్రీకృష్ణుడు మనల్ని ఏ విధమైన చేతనత్వంలో జీవించమంటున్నాడో అర్థమవుతుంది.

లైక్ ఎట్రాక్ట్స్ లైక్, ఒకే జాతి పక్షులు ఒకే చోట జేరతారు అన్నది మనకి అర్థమవుతోందికదా!

రైల్ ఎక్కుతాం, పేకాటరాయుళ్ళు అందరూ ఒక చోట జేరిపోతారు. ఇంక వాళ్ళు ప్రక్కవాళ్ళకి ఎలా ఉంది, వీలుగా ఉందా లేదా, ఏం చూసుకోరు. తపామని వాళ్ళు ఒక సూట్‌కేసు అక్కడ పెట్టేస్తారు. ఆటోమాటిక్‌గా ఒక టేబుల్ తయారయిపోతుంది. పేకలు పంచేస్తారు.

వీళ్ళు పేకాడుతున్నారు అని చూసి ఆ ఇంట్రస్ట్ ఉన్నవాళ్ళు మళ్ళా అక్కడికి ఆకర్షింపబడతారు. వాళ్ళు మళ్ళా ఇంకొక నలుగురు తయారయ్యారనుకోండి, ఇంకొక సూట్‌కేస్ రెడీ. మళ్ళా ఇంకొక క్లబ్ రెడీ.

- ఆధ్యాత్మిక జగత్తులో కనుక ఈ నియమాన్ని మీరు అప్లయి చేస్తే, అగ్ని అనే పదార్థంలోకి అగ్ని ఉన్న పదార్థం వేసేస్తే, ఆ పదార్థంలో ఉన్నటువంటి అగ్ని అగ్నిలో జేరిపోతుంది.
- -- అగ్నికి వాహకముగా పనిచేసినటువంటి పదార్థము భస్మముగా మిగిలిపోతుంది.

బి కాంప్లెక్స్ వేసుకోవాలి, కేప్స్యూల్ ఉంది. కేప్స్యూల్‌లో బి కాంప్లెక్స్ లేదు. బి కాంప్లెక్స్‌ని కేప్స్యూల్‌లో కూరతారు. బి కాంప్లెక్స్ బదులు రకరకాల పదార్థాలు కూరుతున్నారు ఈ కాలంలో. అసలు మందు తప్ప మిగతావన్నీ ఉంటున్నాయి. పై కవరు మాత్రం బి కాంప్లెక్స్‌దే ఉంటుంది.

- ఆ కవరు మీకు బి కాంప్లెక్స్ యొక్క రిజల్ట్ ఇవ్వదు. లోపల ఉన్న మందు బి కాంప్లెక్స్ పదార్థాన్ని ఇస్తుంది.
- -- కానీ ఆ బి కాంప్లెక్స్ పదార్థము కేప్స్యూల్ లేకుండా మీ గొంతుకలోకి వెళ్ళదు. కంపెనీ వాడు మీకు సప్లయి చేయలేడు. అంచేత కేప్స్యూల్ కావాలి.
- -- కానీ కేప్స్యూల్ బి కాంప్లెక్స్ కాదు.

అలాగే యజ్ఞం చేస్తున్నప్పుడు మనం సమిధలు వేస్తాం. యజ్ఞం చేయటానికి మనకి అగ్ని కావాలి. కానీ అగ్ని దానంతట దాన్ని మనం ఎక్కడ్నుంచి పట్టుకుంటాం?

గాలిని పట్టుకోలేం కదా! కానీ ఒక కంటైనర్ తీసుకొచ్చి మూత పెట్టేస్తే, ఆ లోపల ఉన్నది గాలే. దాన్ని మనం ఎక్కడికి పడితే అక్కడికి తీసుకెళ్ళిపోవచ్చు. మళ్ళా మూత తీస్తే ఎక్కడున్నటువంటి గాలి అక్కడే ఉంటుంది.

అంచేత సమిధలో ఉన్నటువంటి అగ్నిని మనము ఉపయోగించుకుంటున్నాం. ఈ యజ్ఞం చేస్తున్నప్పుడు, వంట చేస్తున్నప్పుడు మీరు ఎంత అద్భుతమైన సాధనాత్మక ప్రక్రియ చేస్తున్నారో మీకు అవగాహనలో లేదు. దాన్నే ద కాన్స్యస్‌నెస్ ఆఫ్ నాలెడ్జ్, జ్ఞానము మీరుగా మారారు.

నిప్పుని వెలిగించాం.

***నిప్పు దేన్ని ఆధారం చేసుకొని వెలుగుతోంది?***

ఒక బొగ్గునో, ఒక కర్ర పుల్లనో, లేకపోతే మండేటటువంటి ఏదైనా ఒక పదార్థాన్ని ఆధారముగా చేసుకుంటే కాని అది వెలగలేదు.

వెలుగుతోంది, చిన్న కర్ర పుల్ల పెట్టాం, కాలుతోంది. దానికి ఇంకొక కర్రపుల్ల పెట్టలేదు అనుకోండి మీరు, ఏమౌతుందది? కాలుతుంది, కాలుతుంది, కాలుతుంది, తరవాత బూడిద మిగిలి పోతుంది, భస్మం మిగిలిపోతుంది.

***అంటే ఏం జరిగిందో అర్థమవుతోందికదా,***

ఆ కర్రపుల్లలో ఉన్న అగ్నిని మనం ఉపయోగించుకున్నాం. అగ్నికి వాహకంగా ఉన్నటువంటి పదార్థం ఉందే, ఆ తోలు క్రింద బూడిదగా మిగిలిపోయింది.

మీరు ఆరిపోక ముందే ఇంకొక సమిధ వేశారు.

***ఏమైంది మళ్ళా?***

మీరు అగ్నినే వేశారు. కర్ర పుల్ల వేయలేదు, సమిధ వేయలేదు. అగ్నినే వేశారు. కానీ అగ్నిని పట్టుకోవటానికి ఏదో ఒక మీడియమ్ కావాలి కనుక, కర్రపుల్ల వేశాం.

- ఆ అగ్ని ఉన్న పదార్థములను మనం సమిధ అన్నాం.

ఇప్పుడు మీకు కొంచెం అవగాహన వచ్చిందా?

మనం యజ్ఞం చేస్తున్నాం. యజ్ఞం చేయటానికి మనం అగ్ని రగిల్చాం, అగ్ని ఉత్పత్తి అయింది. ఒక సమిధ

మాత్రమే, ఒక పుల్ల మాత్రమే పెట్టాం. వెలుగుతోంది. కొంత సేపటికి అగ్ని వెళ్ళిపోతుంది, బూడిద మిగిలిపోతుంది.

***అంటే ఏమైంది అక్కడ?***

కర్ర పుల్లలో, సమిధలో ఉన్న అగ్ని వెళ్ళిపోయింది.

***ఏం మిగిలిపోయింది?***

అగ్నికి వాహకంగా ఉపయోగపడినటువంటి,
ప్యాకేజిగా ఉపయోగపడినటువంటి,
కంటైనర్‌గా ఉపయోగపడినటువంటి,
కేప్స్యూల్‌గా ఉపయోగపడినటువంటి పదార్థము శేషంగా మిగిలిపోయింది.

***ఆ శేషాన్ని మనం ఏమంటున్నాం?***

"భస్మము" అంటున్నాం.

దాని లోపల ఉన్న అగ్ని వెళ్ళిపోయింది. అది వెళ్ళి పోక ముందే ఇంకొక కంటైనర్‌తో తీసుకొచ్చి అగ్నిని వేశాం.

***ఇంకొక కర్రపుల్ల వేశాం అంటే అర్థం ఏమిటి?***

కంటైనర్‌లో అగ్నే తెచ్చాం మనం.

మళ్ళా అందులో భస్మం మిగిలిపోతోంది.

- అంచేత అగ్నికి అనుగుణ్యంగా ఉన్న ఈ పదార్థాలు అన్నీ కూడా అగ్నే.

***కానీ అది ఎలాంటి అగ్ని?***

మూత పెట్టబడిన అగ్ని. అగ్ని సంపర్కంలోకి అవి ఎప్పుడైతే వచ్చాయో, అవి అగ్నిగా మారిపోతున్నాయి. వాహకం మిగిలిపోతోంది.

- భారతీయ ఆధ్యాత్మికత షోడశ సంస్కారాల రూపులో ఈ రహస్యాన్ని నిరంతరము మనకి అందజేసింది.

యజ్ఞం లేకుండా తంత్రవిద్య లేదు. గర్భాదాన సంస్కారం నుంచి అంత్యేష్టి సంస్కారం వరకు నిరంతరం మనం అగ్నినే ఉపయోగించుకుంటాం. అంతే కాకుండా,

- వేదాలు యొక్క మొదటి సూక్తము అగ్ని సూక్తమే.

అలాగ అగ్నికి సంబంధించిన చాలా సూక్తాలు వేదాలలో ఉన్నాయి. అగ్ని వేదాలలో దేనికి ప్రతీకగా వాడ తాం అంటే, ముందు ఉండి మనల్ని నడిపించేది. అగ్రే తిష్ఠతి నయతి.

లీడర్ ముందు ఉంటాడు. ఒకొక్కసారి ఇంకొక చోట కూడా ఉంటాడు, అది వేరే విషయం.

పేరిస్ నగరంలో రినైసెన్స్ కాలంలో చాలా పెద్ద పెద్ద స్ట్రయిక్స్ అవీ జరుగుతూవుండేవి. అసలు మొత్తం దేశం దేశం స్ట్రయిక్‌లో పాల్గొనేది. ఒక న్యూస్ పేపర్ రిపోర్టర్ ఒక లీడర్‌ని కలిసి "నువ్వు స్ట్రయిక్ చేస్తున్నావుకదా, చాలా పెద్ద లీడర్‌వి. ఏ విధంగా లీడ్ చేస్తున్నావు, ఏం చేస్తున్నావు?" అని ఇంటర్వ్యూ చేస్తున్నాడు.

వాళ్ళు ఇలా మాట్లాడుకుంటున్నారు, ఈ లోపల ఫ్రెంచ్ భాషలో జిందాబాద్, జిందాబాద్ అనేటటువంటి కేకలు పెట్టుకుంటూ ఒక పెద్ద సమూహం అలా వెళ్ళిపోతోంది, వీళ్ళు మాట్లాడుకుంటున్నారు.

రోడ్డు మీద ఏమౌతుందో మాటల్లో చాలా సార్లు మనం గమనించం. ఒక పెద్ద ప్రొసెషను ఒక అరగంట, గంట అలా రోడ్డు మీద వెళుతోంది. ఈ లోపల బేరరు చూసి ఎంత పెద్ద సమూహమో! అన్నాడు. గబుక్కున ఈ ప్రెస్ రిపోర్టరు, లీడరు తల పైకి ఎత్తి చూశారు. లీడరు కంగారుగా లేచి "అరే ఇది నేను లీడ్ చేయవలసినటువంటి ప్రొసెషను. నేను ముందు ఉండాలి" అని పరిగెట్టాట్ట.

ఇప్పుడున్న లీడర్‌షిప్ అది. ప్రజల అభిప్రాయం ఏమిటో, దానికి అనుగుణ్యంగా జీవించటం.

అసలు లీడరు ఏమిటి? అగ్రే నయతి.

- మన ఋషి సాంప్రదాయంలో, వేద సాంప్రదాయంలో లీడర్ అనేవాడు ప్రజాభిప్రాయాన్ని గౌరవించడు.
- ప్రజలకు ఒక నూతనమైనటువంటి లీడర్‌షిప్ ఇస్తాడు. ఒక క్రొత్త అవగాహన ఇస్తాడు, ఒక క్రొత్త ఐడియా ఇస్తాడు. వాళ్ళనే మనం సంస్కర్తలు అంటాం.
- వాళ్ళు అంత వరకు ప్రచారంలో ఉన్న ఐడియాస్‌ని తప్పు అని ఖండిస్తారు.

ఒకొక్కసారి వాళ్ళ జీవితకాలంలోనే వాళ్ళకి గుర్తింపురావచ్చు. లేదూ, తరవాత తరవాత వాళ్ళు ఏ ఆదర్శాన్ని అయితే, ఏ జ్ఞానాన్ని అయితే ప్రజలకి అర్థమయ్యేటట్టు చెప్పటానికి ట్రైచేశారో, అది మెల్లిమెల్లిగా ఏమౌతుంది? కామన్ అయిపోతుంది.

ఒకప్పుడు స్త్రీలు చదువుకోవటానికి ఒప్పుకునేవారు కాదు. ఇప్పుడు చదువుకోకపోతే ఒప్పుకోవటం లేదు. ఒకప్పుడు ఇంట్లోంచి బయటకి రావటానికి ఒప్పుకునేవారు కాదు. ఇప్పుడు బయటకి వెళ్ళికపోతే జ్ఞానం ఏం వస్తుంది అంటారు. అలాగే వేదాలు, గాయత్రీ. ఇప్పటికి కూడా చాలా చోట్ల స్త్రీలు చేయకూడదు అనుకుంటారు. ఇంకొన్నాళ్ళు పోయాక అసలు వాళ్ళే ముందు వస్తారేమో!

- భవిష్యత్ పురాణంలో వాటిల్లో 21 సెంచరీ కూడా స్త్రీ శక్తి యొక్క సెంచరీ అని చెప్పబడుతోంది.

అగ్రే నయతి ఇతి అగ్నిః తను ముందు ఉండి, మనకి ఏదైతే జ్ఞానాన్ని, మార్గాన్ని చూపిస్తాడో, వాడు అగ్ని.

మరి మనం చేస్తున్న ఈ యజ్ఞంలో అగ్ని మనల్ని ఏం లీడ్ చేస్తున్నాడు? మనల్ని ఎక్కడికి తీసుకెళుతున్నాడు? అనే అవగాహన లేకుండా చేసే అగ్నివిద్య సిగరెట్ కాల్చటం లాంటిదే. అంతకంటే పెద్ద గొప్పగా ఏం లేదు.

ఈ భావనని మనస్సులో పెట్టుకుని, ఇప్పుడు ఈ శ్లోకాన్ని అర్థం చేసుకోండి. నేను మళ్ళీ ఎక్స్ప్లెయిన్ చేస్తాను.

గత సఙ్గస్య ముక్తస్య - సంగము, అంటే ఏం సంగం గురించి చెప్తున్నాడు? ఇది వరకు నిరాశీర్, ఏ విధమైన ఆశా లేదు, మౌనిగా ఉండి, సుఖదుఃఖాలను సమానంగా చేసుకుని ఉండే స్థితి గురించి మాట్లాడు కున్నాంకదా!

మరి ఇక్కడ సంగము వదిలేసి అంటే, ఏ సంగాన్ని వదిలేయమంటున్నాడు? సుఖాలు, దుఃఖాలు, దాని గురించి మాట్లాడటంలేదు.

జ్ఞానావస్థితచేతసః - మీ జ్ఞానాన్ని ముందు వదిలేయండి.

-- ఇది చెయ్యొచ్చా, చేయకూడదా? ఇది మంచిదా, ఇది చెడ్డదా? ఇది చెయ్యాలా, అలా చెయ్యాలా? ఈ ప్రీ కన్సీవ్డ్ నోషన్స్ వదిలేయండి.

వదిలేశాం. వదిలేశాక మీరు ఫ్రీగా ఉన్నారు. ఇది ఇలాగే ఉండాలి, ఇది ఇలాగే చెయ్యాలి అనే ఏ విధమైన పూర్వాగ్రహమూ లేదు.

"సత్యసాయిబాబా మంచివాడే మాస్టారు! కానీ ఆయన బంగాళదుంపల్లో ఉల్లిపాయలు వేసిన కూర తింటారు మాస్టారు!"

పూర్వాగ్రహం! ఒక ఆధ్యాత్మికవాది, ఒక గురువు ఇలాగే ఉండాలి అనే పూర్వాగ్రహం (ప్రీ కన్సీవ్డ్ నోషన్).

కానీ ప్రతీ గురువూ ఏదో ఒక గందరగోళం చేస్తాడు.

**ఎందుకు ఆ గందరగోళం చేస్తాడు అంటే,**

గత సఙ్గస్య ముక్తస్య, మీరు ఒక దానికి ఎటాచ్ అయిపోతారు. వచ్చిన పెద్ద గొడవ అది.

అది మంచిది, చెడ్డది కూడా.

**మన యొక్క వీక్‌నెస్ ఏమిటి అంటే,**

మనం ఒక విధమైనటువంటి ఆచార సంహితకి, అంటే ఒక విధమైనటువంటి ఆచార వ్యవహారాలకి, ఒక విధంగా ప్రవర్తించటానికి మనం అలవాటు అయిపోతాం.

తెల్లటి లుంగీ వేసుకుని, తెల్లటి బుష్ షర్ట్ వేసుకుని రేపు నేను కాలేజీకి వెళ్ళాననుకోండి, ఇంక క్లాసులు జరగవు. ఎందుకు జరగవు? లుంగీ వేసుకుని ఎవడూ కాలేజీకి వెళ్ళడు. కానీ మీరు కేరళాకి వెళితే, మీకు ప్యాంటు వేసు కున్నవాడు కనిపించడు. మరి ఇప్పుడు ప్యాంట్ వేసుకుని కాలేజీకి వెళ్ళాలా, లుంగీ వేసుకుని కాలేజీకి వెళ్ళాలా?

సినిమాలో రౌడీని చూపించాడు అనుకోండి, వాడు కచ్చితంగా గళ్ళ లుంగీ వేసుకుంటాడు. కచ్చితంగా వాడికి మీసాలు ఉండాలి.

గత సఙ్గస్య ముక్తస్య - ఈ సంగం ఉందే, జ్ఞానావస్థితచేతసః జ్ఞానాన్ని పొందటానికి మీకు అడ్డు తగులుతుంది.

కానీ గురువులకి ఉండే సంగం వేరు. రామకృష్ణ పరమహంసకి ఒక విచిత్రమైనటువంటి జబ్బు ఉందిట. ఆకలేసింది అనుకోండి, ఆగలేకపోయేవాడు. ఇంక త్వరగా తీసుకురా అని గందరగోళం చేసేసేవాట్ట.

ఈయన ఇంత పెద్ద గురువు, ఈయన తిండికి ఆగలేకుండా ఉన్నాడు అని శారదామాతకి సిగ్గుగా ఉండే దిట. అంచేత పాపం చెప్తూవుండేదిట, "మీరు ఇలా చేయ టం బావుండదు, నలుగురూ ఏమనుకుంటారు! సరే, ఆకలే సింది. లేకపోతే మీకు ఏం కావాలో నాకు ముందే చెప్పే యండి" అంటే, ఆవిడతో చెప్పేట్ట,

"నీకు తెలియదు, అదొక్కటే నన్ను భూమి మీద

ఉంచగలిగేటటువంటి శక్తి. ఏ రోజైతే నాకు ఆహారం మీద మోహం పోతుందో, కచ్చితంగా అక్కడ్నుంచి మూడవ రోజు నేను శరీరాన్ని వదిలేస్తాను!"

- గురువులు రకరకాలైనటువంటి కండిషన్స్ పెట్టుకుని భూమి మీద లింక్ పెట్టుకుంటారు.

లేకపోతే *గత సఙ్గస్య ముక్తస్య*, వాళ్ళకి సంగం ఏం లేదు. సంగం అంటే తెలుస్తోందికదా, ఆకర్షణ ఏం లేదు, ఆసక్తి ఏం లేదు ఇక్కడ. కానీ ఇక్కడ ఉండకపోతే చెప్పే వాళ్ళు లేరు. అంచేత వాళ్ళు ఏదో ఒకటి ఆసక్తి పెట్టుకుం టారు. ఎవరు? గురువులు.

- గురువులు ఆసక్తి పెట్టుకున్నారు కదా అని శిష్యులు ఆసక్తి పెట్టుకోవటంలో గురువుని ఇమిటేట్ చేయ కూడదు. *గత సఙ్గస్య ముక్తస్య* - ఆసక్తి, ఆ సంగం మాత్రం ఉండకూడదు.
- జ్ఞానావస్థితచేతసః, గురువు ఏ జ్ఞానాన్ని మీకు అంద జేయటానికి ట్రై చేస్తున్నాడో గమనించుకోండి.

### ఏ జ్ఞానాన్ని అందజేయటానికి ట్రై చేస్తున్నాడు?

జ్ఞానాగ్ని దగ్ధకర్మాణం, జ్ఞానాన్ని మనం అగ్నితో పోల్చాం. అగ్ని అనే పదాన్ని మళ్ళీ అర్థం చేసుకోండి.

వేదాలలో ఉపయోగించే పదమే ఇక్కడ కూడా మనం ప్రజ్వలిస్తున్నాం, ఈ దీపంలో కూడా మనకి కనిపి స్తోంది. ఏదైనా ఒక మంచి పని చేయటానికి ప్రారంభం చేసేటప్పుడు కూడా మనం జ్యోతిని వెలిగిస్తాం. అగ్నిని వెలిగిస్తాం. ఎందుకు వెలిగిస్తామో తెలియదు మనకి.

### ఎందుకు వెలిగిస్తాను అంటే,

అగ్నే ప్రథమ పురోహితుడు. మొట్టమొదట పురోహితుడు. పురోహితుడు అంటే పిలక పెట్టుకుని, విభూతి వ్రాసుకుని, పురోహితుడు అంటే ఇలా ఉండాలి అని మళ్ళా మనం సంగం.

- పురోహితుడు అంటే పురానికి హితము కోరేవాడు. పురము అంటే ఏమిటి? శరీరము. మన శరీరానికి హితము కోరేవాడు పురోహితుడు.

భగవద్గీతలో ఉన్నటువంటి పదాలకు, వేదాలలో వేసేటటువంటి పదాలకు సవ్యమైనటువంటి అవగాహన లేక పురోహితుడు అనేదానికి మానవశరీరధారి అయిన పురోహితుడు అనుకుంటున్నాం.

మీరు 15 వ అధ్యాయంలో

*అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః*
*ప్రాణాపానసమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్.* (15-14)

నేను 'వైశ్వానరుడను జఠరాగ్నిగానయి ప్రాణులయొక్క శరీరమును ఆశ్రయించి, ప్రాణాపానవాయువులతో గూడుకొని నాలుగువిధములగు అన్నమును పచనముచేయుచున్నాను.

నేనే వైశ్వానరః అనే అగ్నిగా అయి నాలుగు రకా లైనటువంటి ఆహారాన్ని నేను జీర్ణం చేస్తాను అంటే ఏమిటి? ఇందాక నేను చెప్పిన ఉదాహరణని మనస్సులోకి తెచ్చు కుంటే, ఆహారం అంటే మీరు అగ్నినే తింటున్నారు.

- మీరు తిన్నటువంటి ఆహారంలో అగ్నే ఉంది.
  ఎలా ఉంది అగ్ని? బి కాంప్లెక్స్ కాప్స్యూల్ లోపల బి కాంప్లెక్స్ అనే మందు ఉన్నట్టు.

ఆ మందు యొక్క చేదుతనంకాని, ఆ మందు యొక్క వెగటు పుట్టించేటటువంటి వాసన, అదంతా కూడా నాలికకి తగలకుండా వాడు బి కాంప్లెక్స్ మీద ఆ ఎరుపు, నలుపు కేప్స్యూలు మూత పెట్టేస్తున్నాడు. కానీ ఆ కేప్స్యూల్ ద్వారా లోపలికి బి కాంప్లెక్స్ మందు వెళుతోంది.

### అలాగే ఆహార రూపంలో మీ లోపలికి ఏం వెళుతోంది?

అగ్ని వెళుతోంది.

ఆ అగ్ని మీ శరీరంలో ఆల్‌రెడీ ఉంది.

ముందు ఒక చిన్న అగ్ని ఇక్కడ మండుతూవుంటే, దానిలో సమిధలు మీద సమిధలు వేసుకుని మీరు ఎంత సేపయినా, ఎన్ని సంవత్సరాలు అయినా అగ్నిని రగిలించు కోవచ్చు కదా! సమిధలు యొక్క ప్రవాహాన్ని కనుక మీరు నిరంతరము ఉంచుకోగలిగితే ఏమవుతుంది? ఈ అగ్ని ఆరదు. మీరు అలాగ దాన్ని మండించుకుంటూ ఉండొచ్చు.

శరీరంలో ఉన్న వైశ్వానర అగ్నినే ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమాన, పంచ ప్రాణాగ్నులు అంటాం.

- మన శరీరంలో ఆ అగ్నులు ఉన్నాయి కనుక ఆహారం రూపంలో ఉన్న అగ్నులు మనం వేస్తూవున్నంత వరకు ఆ అగ్ని ప్రజ్వరిల్లుతూవుంటుంది.

-- శరీరము జీవిస్తూ వుంటుంది.

ఈ పురము జీవిస్తూవుంటుంది.

-- నవద్వారే పురేదేహీ, ఈ శరీరము అనేటటువంటి పురము జీవిస్తూవుంటుంది.

***ఈ పురానికి హితము కోరేటటువంటి వాడు ఎవడు?***

అగ్ని.

లోపల ఆ వైశ్వానర అగ్ని లేకపోతే, దాన్నే మందాగ్ని అంటాం. అజీర్ణానికి ఒక పేరు, మందగించింది అంటాం. ఏది మందగించింది? అగ్ని మందగించింది.

అగ్ని మందగించే సరికల్లా ఏమైంది?

పురోహితుడు శ్లోకాలు మర్చిపోయాడు. అంతేగా!

జ్ఞానచేతసః , ఈ జ్ఞానము, ఈ కాన్ష్యస్‌నెస్, ఈ భావన అర్థం చేసుకోండి.

- ప్రపంచంలో మీరు దేన్ని ముట్టుకున్నా అందులో అగ్ని ఉంది. ప్రతీ దాంట్లోనూ అగ్ని ఉంది.

***ఏ రూపంలో అగ్ని ఉంది?***

జ్ఞానాగ్ని.

***ఎంచేత?***

ఒక పదార్థాన్ని చూస్తే అది ఇనుము అని మనకి తెలుస్తోంది. ఇంకొక పదార్థాన్ని చూస్తే అది కర్ర ముక్క అని తెలుస్తోంది. ఇంకొక పదార్థాన్ని చూస్తే అది బట్ట అని తెలుస్తోంది. ఇంకొక పదార్థాన్ని చూస్తే అది సూర్యుడు అని తెలుస్తోంది. ఇంకొక పదార్థాన్ని చూస్తే నక్షత్రం అంటున్నాం. ఇంకొక పదార్థాన్ని చూస్తే పుస్తకం అంటున్నాం.

- ఈ పదార్థాలు అన్నీ కూడా వేరు వేరుగా మనకి కనిపించటానికి కారణం అందులో ఉన్నటువంటి అగ్ని వేరు వేరుగా మారుతోంది.

జ్ఞానావస్థితచేతసః ఈ కాన్ష్యస్‌నెస్, ఈ అగ్ని విద్య.

- రాబోయేటటువంటి యుగంలో ఈ అగ్నివిద్యే చాలా ప్రాచుర్యం పొందుతుంది అని చెప్తున్నారు.

కానీ ఇందాక నేను చెప్పిన అన్నంలో కంచం వడ్డించుకుని తినటం ఉదాహరణని గుర్తుంచుకోండి.

మీకు అగ్ని అనే సరికల్లా ఈ అగ్ని గుర్తొస్తోంది. అది అగ్ని యొక్క బాహ్య స్వరూపము మాత్రమే. బయటకి కనిపించేటటువంటి స్వరూపము మాత్రమే.

- అగ్ని యొక్క లోపల ఉన్నటువంటి స్వరూపాన్ని విశదీకరించటానికి వేదాలు వ్రాశారు.

అగ్ని, మంట యొక్క ఆకారం కనిపిస్తోంది మనకి.

***యోగులు ఏం చెప్తారు అంటే,***

అసలు ఈ ఆకారాలు కనిపించటానికి, ఫలానా వాడు ఇలా ఉన్నాడు, ఫలానా వాడు ఇలా ఉన్నాడు అని కన్ను ఇన్ని రూపాలను గ్రహించటానికి కారణము కూడా అగ్నే, తేజస్సే. అందుకే కంటిని అగ్ని యొక్క జ్ఞానేంద్రియం అని, కాళ్ళను అగ్ని యొక్క కర్మేంద్రియం అని అంటారు.

ఇక్కడ మళ్ళా మీకు కొంచెం కన్‌ఫ్యూజన్ వచ్చినట్టు ఉంది. కొంచెం డీప్‌గానే వెళదాం.

మన శరీరము పంచతత్వాలతో ఆధారపడి ఉన్నది. ఇంత వరకు అందరికీ తెలుసుకదా! ఎవరి శరీరం అయినా సరే అందులో ఐదు తత్వాలు ఉన్నాయి. శరీరం అంటే మనకి చాలా గొప్ప, మనకే శరీరం ఉందని. మనకే కాదు, దోమకీ ఉంది, మైకుకీ ఉంది, ప్రతీ దానికీ ఉంది.

- ఎక్కడ ఎక్కడ పదార్థము ఉన్నదో, అక్కడ అక్కడ ఐదు తత్వాలూ ఉన్నాయి. అది గుర్తుంచుకోండి.

స్థూలజగత్తులో కంటికి మీకు ఏదైనా ఒక పదార్థము కనిపిస్తే, అక్కడ కచ్చితంగా ఈ ఐదూ ఉంటాయి.

***ఏమిటా ఐదు?***

ఆకాశము,

ఆకాశం నుంచి వాయువు,

వాయువులోంచి అగ్ని,

అగ్నిలోంచి జలము,

జలములోంచి పృథ్వి.

ఇవి ఐదు. ప్ర-పంచము. అంచేత మనం చూస్తోన్న ఈ ప్రపంచం అంతా ఐదు తత్వాలతో ఉంది.

నేను మీకు వివరించటానికి, మీకు అర్థమయ్యేటట్టు చెప్పటానికి చేసే పదము ఏమిటంటే, జ్ఞానావస్థితచేతసః అనే పదాన్ని వివరించటానికి ప్రయత్నిస్తున్నాను.

*ఈ ఐదింటిలో*

ఆకాశము, వాయువు

అగ్ని

జలము, పృథ్వి

అగ్ని మధ్యన ఉన్నది.

*మహాభారతం యొక్క సంకేతాన్ని కనుక అర్థం చేసుకుంటే,*

యుధిష్ఠిరుడు, భీముడు - ఆకాశము, వాయువు

అర్జునుడు - అగ్ని

నకుల, సహదేవులు - జలము, పృథ్వి.

ఈ మధ్యన ఉన్నదాన్ని కాస్త మీరు జాగ్రత్తగా అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేయండి. జ్ఞానావస్థితచేతసః, మీ చేతనత్వం మధ్యలో ఉండాలి.

సాంఖ్యయోగంలో కూడా సమత్వం యోగవుచ్యతే అంటాడు. బేలన్స్!

ఒకవైపు ఆకాశము, వాయువు, ఇంకొక వైపు జలము, పృథ్వి. మధ్యన అగ్ని ఉంది. ఇది ఈక్వేషను.

ఆకాశము, వాయువు = జలము, పృథ్వి

ఈ జ్ఞానావస్థితచేతసః, ఈ జ్ఞానము ఎక్కడుంది? మధ్యన అగ్నిలో ఉంది.

⇨ ఐస్ ఉంది అనుకోండి, గట్టిగా ఉంది, ఘనపదార్థం, సోలిడ్ స్టేట్‌లో ఉంది, దాన్ని పృథ్వీ తత్వం అంటాం.

⇨ దానికి కొంచెం అగ్నిని చూపించాం. ఏమౌతుందది? పృథ్వీతత్వం నుంచి జలతత్వానికి వస్తుంది.

⇨ ఇంకాస్త వేడి చేశాం. నీరు నుంచి వాయువుగా మారింది.

*అంటే అగ్ని ఏం చేసింది?*

పృథ్వీతత్వం నుంచి జలతత్వానికి తీసుకొచ్చింది. జలతత్వం నుంచి వాయుతత్వానికి తీసుకెళుతుంది.

⇨ ఇంకాస్త వేడి చేశాం అనుకోండి, ఆకాశతత్వంలోకి వెళుతుంది.

కొంచెం సైన్స్ చదువుకున్నవాళ్ళు అయితే అది ఆకాశతత్వంలోకి ఎందుకు వెళుతుందో కూడా చాలా ఈజీగా చెప్పగలరు.

- పృథ్వీతత్వంలో అణువులు చాలా దగ్గరగా ఉంటాయి.
- జలతత్వంలో అణువులు కొంచెం దూరం అవుతాయి. కానీ కలిసే ఉంటాయి.
- వాయువుగా వచ్చేసరికల్లా అణువులు విడిపోతాయి.
- ఇంకా వేడి చేస్తే అణువులు దూరం దూరం వెళతాయి.

*అణువులు దూరం దూరంగా వెళతే మధ్యన ఏం వస్తుంది?*

ఆకాశం వస్తుంది. అంతేకదా! ఇంకా వేడి చేస్తూపోయాం అనుకోండి, అణువులన్నీ ఎక్కడికో పోతాయి, ఆకాశం మిగిలిపోతుంది. కదా!

*కానీ ఇదంతా దేని వల్ల జరిగింది?*

అగ్ని వల్ల జరిగింది.

అంచేత అగ్ని వల్ల ఆకాశం నుంచి వాయువు వస్తుంది. అగ్ని వల్ల ఆకాశము నుంచి వాయువు ఎలా వస్తుందో మీరు అవగాహన చేసుకోగలుగుతున్నారుకదా!

⇨ ఆకాశంలో అణువులన్నీ దూరం దూరంగా ఉన్నాయి.

⇨ వేడి తగ్గించాం. ఏమౌతుంది? మెల్లిమెల్లిగా అణువులు దగ్గరకి వస్తాయి. వాయువు.

⇨ ఇంకా తగ్గించాం. వాయుస్థితిలో ఉన్నటువంటి నీటి అణువులు నీరుగా మారిపోతాయి.

⇨ ఇంకా తగ్గించాం. ఐస్‌గా చేశాం.

*అంటే ఇంకా ఏం చేశాం మనం?*

అగ్నిని తీసేశాం.

ఆ జ్ఞానావస్థితచేతసః అనే పదంలో మనుష్యులకి అప్పుడు ఇంత పెద్ద ఆధ్యాత్మికమైన బ్యాక్‌గ్రౌండ్ ఉండేది. ఇప్పుడు ఈ బ్యాక్‌గ్రౌండ్ లేకపోవటం వల్ల మళ్ళీ మనం చెప్పుకోవలసి వస్తోంది.

⊠ అగ్నియే రెండు రకాలైనటువంటి మార్పులకీ కారణం. ఇటు కావాలి అంటే పృథ్వీతత్వం వైపు వచ్చేయొచ్చు. లేదంటే ఆకాశతత్వం వైపు తీసుకెళ్ళవచ్చు.

మీరు ఇంకొంచెం జాగ్రత్తగా ఆలోచిస్తే, ఇంకొక తమాషా వస్తుంది.

లోహముతో చేసిన వినాయకుడి బొమ్మ ఉంది. ఆ వినాయకుడి బొమ్మని పార్వతి బొమ్మగా మార్చాలి.

**ముందు దాన్ని ఏం చేయాలి?**

కరిగించాలి. అంటే వేడి చేస్తాం.

**కరిగించాక ఏం చేస్తాం?**

దాన్ని మళ్ళా చల్లారుస్తాం.

**చల్లార్చేటప్పుడు మీరు ఏం మార్పు చేస్తారు?**

మూసని మారుస్తారు. దాన్ని వినాయకుడి బొమ్మ వచ్చే మూసలో పోయకుండా, పార్వతి మూసలో పోశారనుకోండి, అది పార్వతి బొమ్మ అయిపోతుంది.

అంచేత ఏ పదార్థాన్ని అయినా మీరు అగ్నిని ఉపయోగించుకుని దాన్ని వాయుస్థితిలోకి తీసుకెళ్ళిపోయి మూస మార్చేశారనుకోండి, అప్పుడు దాని రూపం మారిపోతుంది. అదే సాయిబాబా వాళ్ళు చేసేది.

ధునీవాలా బాబా ఇసుకని బంగారంగా మార్చేయటం గురించి చెప్పానుకదా! కానీ అది ఎలా చేయగలిగాడు? జ్ఞానావస్థితచేతసః, జ్ఞానాన్ని ఉపయోగించుకుని.

అందుకని ఇది చెప్తున్నాను. అందులో మీరు సాధనలు చేయక్కరలేదు. మీకు అవగాహన అయితే ఆ మార్చటం మీకూ వచ్చేస్తుంది. ఇందులో ఏమీ లేదసలు.

కానీ అవగాహన అవటానికి ఇందాక ఉదాహరణ చెప్పానుకదా, అన్నంలో కంచం వేసుకుని తినాలి అనే భాష అప్పుడే మీకు అర్థమయిపోయింది. నాలుగైదు సార్లు అనే సరికి ఇప్పుడు మీకు అది క్రొత్తగా కూడా అనిపించటం లేదు. ఇందాక అయితే కొంత మంది నవ్వారు. ఇప్పుడు అసలు నవ్వటం లేదు. మాకు అర్థమయింది అంటున్నారు.

అంటే ఆ భాషకు మీరు అలవాటు పడ్డారు. అంతేగా! అలాగే ఈ జ్ఞానావస్థితచేతసః, అగ్ని యొక్క అసలైన స్వరూపాన్ని అవగాహన చేసుకోవాలి.

**ఏమిటి అగ్ని యొక్క అసలైన స్వరూపము?**

మీ చేతనత్వమే.

మీరు చూడగలుగుతున్నారు అంటే, మీరు వినగలుగుతున్నారు అంటే, మీలో అగ్ని ఉన్నట్టే లెక్క.

అగ్ని లేకపోతే ఏం లేదు, అది అర్థమవుతోందికదా! కాన్స్యస్‌నెస్. దాన్నే అరవిందో, ద మెంటల్ బోడీ అన్నాడు.

ఈ జ్ఞానావస్థితచేతసః, ఎప్పుడైతే మీలో ఈ అగ్ని ఉన్నదో, అగ్ని యొక్క లక్షణాలు మీలో కూడా ఉండాలికదా!

**అగ్ని యొక్క లక్షణాలు ఏమిటో ఇప్పుడే చెప్పానుకదా,**

ఘనపదార్థాన్ని జలపదార్థంగా, జలపదార్థాన్ని వాయుపదార్థంగా, వాయు పదార్థాన్ని ఆకాశపదార్థంగా మార్చగలిగే శక్తి అగ్నికి ఉంది.

మరి మీరు కూడా జ్ఞానావస్థితచేతసః, మీరు అగ్ని స్వరూపులుగానే ఉంటే, అంటే మీలో ఉన్న ఆ అగ్నిని మీరు ఉపయోగించుకోగలిగితే, అది మీలో ఉంది.

**చాలా మంది చాలా గొప్పగా ఏం చెప్తారు అంటే,**

గురువుగారు ఒకేసారి ఐదు శరీరాల్లో పనిచేశారట! ఎంత ఆశ్చర్యంగా చెప్తారో!

ఆశ్చర్యవత్పశ్యతి కశ్చిదేన
మాశ్చర్యవద్వదతి తథైవ చాన్యః
ఆశ్చర్యవచ్చైనమన్యః శృణోతి
శ్రుత్వాప్యేనం వేద న చైవ కశ్చిత్. (భ.గీ. 2-29)

ఈ ఆత్మను ఒకానొకడు ఆశ్చర్యమైనదానినివలె చూచుచున్నాడు. మఱియొకడు ఆశ్చర్యమైనదానినివలె (దీనినిగూర్చి) చెప్పుచున్నాడు. అట్లే వేఱొకడు ఆశ్చర్యమైనదానినివలె దీనినిగూర్చి వినుచున్నాడు. అట్లు వినియు, చూచియు, చెప్పియుగూడ ఒకడును దానిని సరిగా తెలిసికొనుటలేదు (సాక్షాత్తుగా అనుభవించుటలేదు).

ఎంతో ఆశ్చర్యంగా ఇప్పుడూ చెప్పుకుంటున్నాం కదా! కానీ నేను ఇంత గొప్పగా చెప్పేస్తున్నాను. నన్ను మార్చమంటే, నేనూ ఏ పదార్థాన్నీ మార్చలేను. అదీ ఆశ్చర్యం!

**ఏమిటక్కడ ఆశ్చర్యం?**

మనము అగ్ని యొక్క స్వరూపులము అయివుండి కూడా, అగ్నిని ఉపయోగించుకోలేకపోతున్నాం.

ఈ వేదాలు మొత్తము అగ్నివిద్యే. కఠోపనిషత్తులో కూడా పంచాగ్నివిద్య అని వస్తుంది. నచికేతుడు యమలోకానికి వెళతాడు. అసలు ఆ స్టేట్స్ ఆఫ్ కాన్స్యస్‌నెస్ ఎంత అద్భుతంగా చెప్తాడో. జ్ఞానావస్థితచేతసః, దానికి ఎన్ని రకాలుగా మన ఉపనిషత్తుల్లో కథలు ఉన్నాయో!

ఒక ఋషి ఒక యజ్ఞం తలపెట్టాడు. తలపెట్టాక ఏం చేస్తున్నాట్ట? వట్టిపోయినటువంటి ఆవుల్ని దానం చేస్తున్నాడు.

చిన్నప్పుడు తండ్రి చెప్పటం కొడుకు విన్నాడు, ఏదైనా దానం చేస్తే పనికొచ్చేది దానం చెయ్యాలి అని. వట్టిపోయిన ఆవుని దానం చేస్తే, దానం తీసుకున్న వాడు చచ్చాడన్నమాట, ఇప్పుడేం చేయాలో వాడికి తెలియదు.

"నాన్నా అలా చేయకూడదు, తప్పు అది. నువ్వు అలా వట్టిపోయిన ఆవుల్ని దానం చేయకు" అంటే తండ్రి వినిపించుకోలేదు. కొడుక్కి కోపం వచ్చింది. "నన్ను ఎవడికి దానం చేస్తున్నావు?" అన్నాడు. తండ్రి వినపించుకోలేదు.

యజ్ఞం చేస్తూవుంటే ఒక చిన్న కుర్రాడు, ఎనిమిదేళ్ళ వాడు వచ్చి పెద్ద వాడు థీరీ చెప్తాను అంటే తండ్రికి ఎలా ఉంటుంది? అందులో ఋషికి. మనం అది గుర్తుంచు కోవాలి. అంచేత రెండు మూడు సార్లు అనేసరికి విసుక్కుని "నిన్ను మృత్యువుకి దానం చేస్తున్నాను" అన్నాడు.

వీడు ఉండొచ్చుకదా, చిన్న కుర్రాడు, సరే అన్నాడు. డైరెక్ట్‌గా యమలోకానికి వెళ్ళిపోయాడు.

యమలోకానికి వెళ్ళిపోయి అక్కడ ఊరుకున్నాడా, యముడు ఎక్కడికో అవుట్ కేంప్‌కి వెళ్ళాడు. కేంప్‌కి వెళితే వీడు తిరిగి రావచ్చుకదా, ఆహా, అక్కడే కూర్చుండి పోయాడు. మూడు రాత్రుళ్ళు యమలోకం యొక్క ద్వారం దగ్గర కూర్చుండిపోయాడు.

సరే యముడు రానే వచ్చాడు. రాగానే ఏం జరిగింది, ఎలా ఉంది అంటే, ప్రైవేట్ సెక్రటరీ రిపోర్ట్ ఇచ్చాడు. "అంతా బాగానే ఉంది, నథింగ్ టూ ఫియర్, మీ కుర్చీకి నో ప్రోబ్లమ్. ఏ ఎమ్మెల్యేలూ మీ కుర్చీకి ఎసరు పెట్టటం లేదు. కానీ ఒక చిన్న కుర్రాడు ఉన్నాడు. వాడు మూడు రోజులు నుంచి మీ దర్శనం కోసం కూర్చుని ఉన్నాడు."

కొంప మునిగింది అన్నాడు. పరిగెట్టుకొచ్చాడు.

"నాయనా! బ్రహ్మచారి. నా సదనము ముందు మూడు రోజులు పాటు నిరాశ్రయంగా, ఆహారము లేకుండా కూర్చుని ఉండటము నాకు చాలా ప్రమాదము. అంచేత మూడు రాత్రిళ్ళు నువ్వు నా దగ్గర కూర్చున్నావు కనుక, మూడు వరాలు ఇస్తాను తీసుకో!" అన్నాడు.

సరే, ఏదో అడుగుతాడు, నా తండ్రికి ఆ దుర్బుద్ధి పోవాలి అని. ఏదో నేను మళ్ళా తిరిగి వెళితే నా తండ్రి మళ్ళా గుర్తించాలి అని. రెండు వరాలు. మూడవ వరం అడుగుతాడు. అగ్ని విద్య. జ్ఞానాగ్ని చేతసః. ఇప్పుడు మనం మాట్లాడుకుంటున్నది ఆ అగ్నివిద్య గురించే.

కానీ ఈ కథలన్నీ కూడా మనం చదివి చదివి చదివి, మళ్ళా ఇందాక చెప్పినట్టే. అగ్ని అనేసరికల్లా వేదాలలో చెప్పినటువంటి అగ్ని గురించి మనం మాట్లాడం. ఈ అగ్ని కనిపిస్తుంది మనకి.

ఈ అగ్ని కాదు మనకి కావలసింది, వేదాలలో చెప్తోన్నటువంటి అగ్ని. ఎన్.ఓ. అంటే, ఇంగ్లీషు లెటర్సు కాదు, నైట్రోజను, ఆక్సిజను గురించి చెప్పేటటువంటి జ్ఞానం కావాలి మనకి. ఆ జ్ఞానం కావాలి అంటే, ఆ కథలు మనం జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి.

**నేను మీకు చాలాసార్లు చెప్తాను,**

ఋషులకి కోపం వచ్చింది అంటే, ఋషులకి కూడా కోపం వచ్చింది అనే మూర్ఖత్వంలో మనం ఉండకూడదు. కోపం వచ్చేవాడు అసలు ఋషే అవడు.

మామూలు మంచి మనిషికే కోపం రాదు. చాలా శాంత స్వభావులుగా, సరళ స్వభావులుగా ఉంటారు. మనకి పరిచయస్థుల్లో గంగిగోవుల్లాంటి వాళ్ళు ఎంత మంది లేరు!

అంచేత కోపం రాకపోవటం అనేది ఋషుల యొక్క ఫండమెంటల్ పాయింట్.

ఋషులకి కోపం రాలేదు.

ప్రకృతి వారి ద్వారా, వారి వాక్కు ద్వారా శపించింది.

వాక్కు కూడా అగ్నే. మీకు కొంచెం ఆ లిటరేచర్‌లో అవగాహన ఉంటే వాక్కుని కూడా అగ్నితోనే పోలుస్తాం. అంచేత వాక్కు యొక్క అగ్ని ద్వారా వాళ్ళు శపించేవారు.

ఆ శాపగ్రస్థత వల్ల ఏం జరిగేదో ఆలోచించండి.

దూర్వాసుడికి చాలా కోపం. అదే కదా మనకి తెలుసు. అంతే కాకుండా దూర్వాసుడికి అది చాలా గొప్ప. లలితా సహస్రనామాల ముందు ఏమని వ్రాసుకుంటాడు అంటే, నేను క్రోధ భట్టారకుడ్ని, ఐయామ్ ద ఎంపెరర్ ఆఫ్ యాంగ్రీ యంగ్ మెన్ అని వ్రాసుకుంటాడు.

అంబరీషుడు ఏకాదశి వ్రతం చేశాడు. ద్వాదశి ఘడియలు దాటే లోపల ఆహారం తీసుకోవాలి.

రాజు, చక్రవర్తి. ఆయనకి గందరగోళం ఏమీ లేదు. మామూలుగా ఏకాదశి ఉపవాసం ఉన్నాడు. రాజకార్యాలన్నీ మామూలుగానే చేసుకున్నాడు. ద్వాదశి ఘడియలు వస్తున్నాయి. సరే, ఉపవాసాన్ని బ్రేక్ చేయటానికి కావలసిన పరిస్థితులు అన్నీ చేసుకుని మొదలెట్టబోతున్నాడు. క్రోధ భట్టారకులుంగారు, ద ఎంపెరర్ ఆఫ్ యాంగ్రీ ఫ్యూపుల్, దూర్వాసులుంగారు వచ్చారు.

వచ్చి ఏమన్నాడు, "నేను స్నానం చేసి ఇప్పుడే వస్తాను. తరవాత మనిద్దరం కలిసి ద్వాదశి చేద్దాం" అన్నారు. రాడే ఎప్పటికీ! అంచేత శాస్త్రం కోసం ద్వాదశి ఘడియలు వెళ్ళిపోకుండా ఉండటానికి కొంచెం మంచినీళ్ళు తీసుకుని ఆచమనం చేశాడు. ఆచమనం చేయగానే వచ్చాడు.

నేను ఎప్పుడూ చెప్తూవుంటానుకదా, బస్సు రాలేదు అంటారు. మీరు రిక్షాయో, ఆటోయో మాట్లాడుకుని ఎక్కుతారు, బస్సు వస్తుంది. అంచేత అది ఆ యుగంలో కూడా కరెక్ట్. ఈ ఫార్ములా తప్పేంకాదు.

వచ్చాడు. రాగానే ఆయనకి కోపం వచ్చింది.

ఎందుకు కోపం వచ్చింది?

- దూర్వాసుడు ఋషి. ఋషికి కోపం రావటం ఏమిటి అన్నది మీరు ప్రశ్నించుకుంటే మీకు కరెక్ట్ అవగాహన వచ్చేస్తుంది.

***ఎందుకు కోపం వచ్చింది అంటే,***

ఋషి యొక్క వాక్కు ఎప్పుడూ సత్యమే. అది అసత్యము కాదు. ఆయన ఏం చెప్పాడు, "నేను చెప్పేంత వరకు ద్వాదశి పారాయణ పూర్తిచేయకు" అన్నాడు.

ఋషి యొక్క వాక్కు మీద నమ్మకం ఉంటే, సుమతి అనే ఒక పతివ్రత సూర్యుడు ఉదయించకూడదు అంటే సూర్యుడు ఆగిపోయాడుకదా!

- మరి దూర్వాసుడు రానంత వరకు ద్వాదశి ఘడియలు ఎలా వెళ్ళిపోతాయనుకున్నాడు?

అక్కడ కోపం వచ్చింది.

శ్రీ గురువుకి ఎక్కడ కోపం వస్తుందో ఆలోచించుకోండి.

"ఈ మాత్రం మర్చిపోయావా నువ్వు? నేను ఋషిని కదా! మంచో, చెడో నా నోట్లోంచి ఒక మాట వచ్చేసింది. ఇంక జరగాల్సిందే ప్రకృతిలో. యూ కెనాట్ ఎస్కేప్ ఇట్."

శ్రీ జ్ఞానావస్థితచేతసః, ఈ అగ్ని విద్యలో కనుక మీరు నిష్ణాతులు అయితే, మీ వాక్కుకి కూడా ఆ శక్తి వస్తుంది. ఈ ఉదాహరణలు చెప్తోన్నది అందుకు.

దూర్వాసుడు ఎంత గొప్పవాడు అయితే మీకూ నాకూ ఏంటి లాభం? కానీ మనం కూడా అంత గొప్పవాళ్ళం అవగలము అని తెలుసుకుంటే చాలా మంచిది ఈ కథలు. అందుకు చెప్పేవి ఈ కథలు.

అందుకు కోపం వచ్చింది. కోపం వచ్చాక ఊరుకున్నాడా? "నీకు అవగాహన కాలేదు, నీకు రుచి చూపిస్తాను చూడు నా వాక్కు యొక్క శక్తి ఎంతదో!" అని శపిస్తాడు.

శపించే సరికి ఈ శాపం ఎవరికి తగులుతుంది? విష్ణువుకి తగులుతుంది.

- విష్ణువు అన్నా, అగ్ని అన్నా ఒకటే.

అంబరీషుడు విష్ణు భక్తుడు, అగ్ని భక్తుడు. అంచేత అది వాడిలో ఉన్న అగ్నికి తగిలింది. "ఇతన్ని రక్షిస్తానులే, నువ్వు అంబరీషుడికి ఇచ్చిన శాపాన్ని నేను స్వీకరిస్తాను!"

"నీ ఖర్మ పో!" అన్నాడు దూర్వాసుడు.

ఋషుల స్థాయి అలా ఉండేది.
భగవంతుడికి కూడా శాపం ఇచ్చేశాడు.

***ఆ శాపం వల్ల ఏమయింది?***

10 అవతారాలు వచ్చాయి మనకి.

విష్ణుభక్తుడు కనుక, అంబరీషుడికి ఇచ్చినటువంటి శాపాన్ని ఆ విష్ణువు తను స్వీకరించి, అప్పటి నుంచి 10 అవతారాలు అలా సృష్టిలో వస్తూనే ఉన్నాయి.

ఈ విషయాన్ని అర్థం చేసుకోండి, జ్ఞానావస్థితచేతసః ఈ జ్ఞానము.

అంచేత అక్కడ ఋషి ఏం చేశాడు? వట్టి పోయిన ఆవుల్ని ఇచ్చాడు అంటే, అవును! ఋషి వట్టిపోయిన ఆవుల్ని ఇచ్చాడు అని మనం ఒప్పేసుకుంటాం.

శ్రీ వట్టిపోయిన ఆవుల్ని ఇచ్చేసే యజ్ఞం చేసే ఋషి అసలు ఋషి ఎలా అవుతాడు?

- వాడు మనలాంటి వాడా ఏమిటి? వాళ్ళు కావాలనుకుంటే, కావలసినన్ని ఆవుల్ని సృష్టించుకోగలరు.

వట్టిపోయినటువంటి ఆవుల్ని ఎందుకు ఇచ్చాడు, ఏం చేశాడు అంటే, చాలా మంది సాధకులు చేసే భయంకరమైనటువంటి తప్పు అదే.

అవజానన్తి మాం మూఢా మానుషీం తనుమాశ్రితమ్
పరం భావమజానన్తో మమ భూతమహేశ్వరమ్. (9-11)

నా యొక్క పరమతత్త్వమును ఎఱుగని అవివేకులు సర్వభూతమహేశ్వరుడను, (లోకసంరక్షణార్థము) మనుష్యదేహమును ఆశ్రయించినవాడనునగు నన్ను అవమానించుచున్నారు (అలక్ష్యముచేయుచున్నారు).

నేను ఈ మానవశరీరంలోనే ఉన్నాను అనేది ఈ మూఢులు తెలుసుకోవటం లేదు అని ఏడుస్తాడు. నిజంగా ఏడుస్తాడు. ఆ మాట ఎలా ఉందో చూసుకోండి.

అశాస్త్రవిహితం ఘోరం తప్యన్తే యే తపో జనాః
దమ్భాహంకారసంయుక్తాః కామరాగబలాన్వితాః. (17-5)

కర్శయన్తః శరీరస్థం భూతగ్రామమచేతసః
మాం చైవాన్తఃశరీరస్థం తాన్విద్ధ్యాసురనిశ్చయాన్. (17-6)

ఏ జనులు శరీరమునందున్నట్టి పంచభూతసముదాయమును లేక ఇంద్రియ సమూహమును (ఉపవాసాదులచే) శుష్కింపజేయువారును, శరీరమందంతర్యామిగ నున్న నన్ను కష్టపెట్టువారును, దంభాహంకారములతో గూడినవారును, కామము, రాగము, (ఆసక్తి), పశుబలము కలవారును (లేక కామబలము, రాగబలము గల వారును) అవివేకులును అయి శాస్త్రమునందు విధింపబడనిదియు, తమకును ఇతరులకును గూడ బాధాకరమైనదియునగు తపస్సును జేయుచున్నారో, అట్టివారిని అసుర స్వభావము గలవారినిగ తెలిసికొనుము.

శరీరంలో ఉన్నటువంటి నన్ను కృశింపజేస్తారు.

మీరు ఆహారం మానేశారనుకోండి, నేను ఆహారం మానేసి నీరసపడిపోయాను అనే జ్ఞానము మీకు ఉంటోందా లేదా? ఈ జ్ఞానం మీలో ఎవరి వల్ల వస్తోంది? ఆ చేతనత్వం ఉండటం వల్ల. అంచేత మీరు ఆహారం మానేస్తే మీరు చేసిన గొప్ప పని ఏమిటి అంటే, మీ లోపల ఉన్న ఆయన్ని కష్టపెట్టారు. అంచేత ఇప్పుడు ఇంక ఆహారం మానకండి.

ఈసారి చెప్పండి, "జ్ఞానయోగంలో మాస్టారు చెప్పారు, నథింగ్ డూయింగ్, వ్రతాలు, ఉపవాసాలు చేసే వాళ్ళని మూఢులు అన్నారు."

- వ్రతాలు, ఉపవాసాలు మానకండి.
దాని విలువ దానికి ఉంది.

- కానీ ఈ సాధన చేస్తోన్న వాళ్ళకి మాత్రం కుదరదు. అది అర్థం చేసుకోండి. ఒకొక్క సాధన ఒకొక్క విధానంలో వెలుతూ వుంటుంది. ఒక సాధనలో ఉపయోగపడేది, ఇంకొక సాధనలో ఉపయోగపడదు.

అంచేత ఇక్కడ చెప్పినవి అన్నీ కూడా ఇంకొక చోట మీరు తీసుకెళ్ళిపోయి పెట్టేసి, అక్కడ మీరు ఉపయోగించుకోవటానికి దయచేసి గందరగోళం పడకండి.

అవజానన్తి మాం మూఢా మానుషీం తనుమాశ్రితమ్

అనే భగవద్గీత శ్లోకాన్ని విరిచి ఏం చెప్తారు అంటే, శ్రీకృష్ణుడు యొక్క గొప్పతనాన్ని అర్జునుడు కూడా అర్థం చేసుకోలేదు.

విశ్వరూపాన్ని చూశాక అర్జునుడు అదేకదా అన్నాడు.

సఖేతి మత్వా ప్రసభం యదుక్తం
హే కృష్ణ హే యాదవ హే సఖేతి
అజానతా మహిమానం తవేదం
మయా ప్రమాదాత్ప్రణయేన వాపి. (భ.గీ. 11-41)

నువ్వు ఇంత గొప్పవాడివి, ఇంత విశ్వరూపం నీలో ఉందని నాకు తెలియలేదు. అంచేత హే యాదవ, హే కృష్ణ, హే సఖా అని అన్నానని గడ గడ గడా వణికిపోతాడు.

నిజంగా ఆయన అంత గొప్పవాడయితే మనకేంటిట?

**మనకెందుకు అంటే,**

మనం కూడా అంత గొప్పవాళ్ళం కావచ్చు.

**ఎంచేత?**

- ఆ అగ్ని మనలో కూడా ఉంది. ఈచ్ సోల్ ఈజ్ పొటెన్షియల్లీ డివైన్. మీరు కూడా ఆ విశ్వాగ్నిని, మీరు కూడా ఆ జ్ఞానచేతసాన్ని డెవలప్ చేసుకోవచ్చు.
- ఆ డెవలప్ చేసుకోవటానికి కావలసిన కండిషన్సు నేను మీకు వివరిస్తున్నాను.

వట్టిపోయినటువంటి ఆవులు అంటే చాలా మంది సాధనలు చేసి చేసి చేసి ఏ స్థితికి జేరుకుంటారు అంటే, తరవాత వాళ్ళు ఆ ఇంద్రియాలను ఉపయోగించుకోలేరు.

అలహాబాద్‌లో ఒకసారి కుంభమేళాకి వెళ్ళినప్పుడు

1958లోనో ఎప్పుడో. ఒకడు చెయ్యి పైకి పెట్టుకుని ఉన్నాడు. వాడి చెయ్యి క్రిందకి రాదు. కృషించిపోయి ఉంది. గోళ్ళు పెరిగిపోయి ఉన్నాయి. ఎందుకు అంటే, మరి వాడికి ఎవరి మీద కోపం వచ్చిందో, ఏం వచ్చిందో, ఎడం చేయి దింపను అన్నాడు. సాధన. ఎన్నేళ్ళ బట్టి చెయ్యి పైన పెట్టాడో. ఇంక ఆ చేయి క్రిందకి దిగదు.

**ఆ చేయి ఏమైంది?**

వట్టిపోయింది. ఇంక ఆ చేయి వాడికి పనికిరాదు.

శ్రీ సాధనావిధానాలలో మీరు ఆ అతికి వెళ్ళిపోతున్నారేమో చూసుకోండి.

ఈ సాధన చేసేవాళ్ళు దయచేసి ఈ కండిషను మాత్రం మర్చిపోకండి. జ్ఞానయోగంలో 23వ శ్లోకంలో చెప్పిన సాధన, ఏంటా సాధన? *జ్ఞానావస్థితచేతసః* , మీ కాన్స్యస్‌నెస్ జ్ఞానములో రూట్ అయివుండాలి.

**ఏ జ్ఞానములో?**

శ్రీ నేను కూడా అగ్నినే, నేను కూడా భగవత్స్వరూపాన్నే, నేను కూడా ఆ విష్ణువునే అనేటటువంటి చేతనత్వం మీలో ఉందనుకోండి, మీ ప్రవర్తన ఎలా ఉండాలి?

-- ఆ స్థాయిలో ఉండాలి. అంతకంటే తక్కువ స్థాయిలో ఉండి, నేను అదే అనుకుంటే కుదరదుకదా!

వట్టిపోయిన ఆవుల్ని చాలా మంది సాధకులు భగవంతుడికి అర్పిస్తారు. ఎందుకూ పనికిరాదు. రిటైర్ అయిపోయాక సాధన చేస్తాం అంటే అంతేకదా! అంచేత మనం ఆ వట్టిపోయిన ఆవుల్ని అర్పించం.

అంచేత *గతసఙ్గస్య ముక్తస్య* ఈ విధంగానే చేయాలి, ఆ విధంగానే చేయాలి అనే రూఢివాదానికి లొంగము. అన్ని రకాలైన మానసిక పరిస్థితుల నుంచి బయటగా ఉంటాం.

ఉన్న తరవాత ఏం చేస్తాం? *జ్ఞానావస్థితచేతసః*, అగ్ని యొక్క క్వాలిటీలో, ఆ అగ్ని యొక్క క్వాలిటీ ఏమిటో రేపు ఇంకాస్త డీటైల్డ్‌గా మనం అర్థం చేసుకుందాం. ఆ చేతనత్వము, నేను అనే మాట మీరు ఉచ్చారణ చేయగలిగే చేతనత్వము. అదే అగ్ని. అక్కడ మీ మనస్సుని ఉంచి,

*యజ్ఞా యాచరతః కర్మ* - యజ్ఞము కొరకే కనుక మీరు పనులు చేస్తూవుంటే,

*సమగ్రం ప్రవిలీయతే* - వాడికి ఏ విధమైనటువంటి ప్రారబ్ధ కర్మ అంటదు, ఏ విధమైనటువంటి సంచిత కర్మ ఉండదు, ఏ విధమైనటువంటి ఆగామీ కర్మ కూడా ఉండదు. అంటే ఈ క్షణంలో వాడు జీవన్ముక్తుడే.

ఈ భావన మీరు అర్థం చేసుకుంటే, ఈ క్షణంలో మీరు జీవన్ముక్తులే. ఇది మెయిన్‌టెయిన్ చేయగలిగితే మీరు కూడా జనకాదయులే.

మీరు ఆ మానసికస్థితిలో ఉండిపోగలగాలి. ఆ మానసికస్థితిని కాసేపు కళ్ళుమూసుకుని ట్రై చేద్దాం.

ఆ మధ్యమాస్థితి, అర్జునస్థితి.
పృథ్వీతత్వము, జలతత్వము ఒకవైపు.
రెండవవైపు వాయుతత్వము, ఆకాశతత్వము.

ఇటు వాయుతత్వము, ఆకాశతత్వము వైపు మనం వెళ్ళం. అటు పృథ్వి, జలము వైపు వెళ్ళము. మధ్యలో ఉండిపోతాం. అందుకే అర్జునుడ్ని పాండవ మధ్యముడు అంటాం. సాధకులలో మధ్యమ స్థితి.

దీన్ని బుద్ధుడు కనిపెట్టాడు అని కూడా చెప్తూవుంటాం, ద గోల్డెన్ పాత్, ద మీన్ పాత్. ద మధ్యమ విధానము.

-- ఉపవాసాలూ ఎక్కువ అక్కర్లేదు, ఆహారాలూ ఎక్కువ తీసుకోవక్కరలేదు.

*యుక్తాహారవిహారస్య యుక్తచేష్టస్య కర్మసు*
*యుక్తస్వప్నావబోధస్య యోగోభవతి దుఃఖహా.* (6-17)

ఆ మానసికస్థితిలో హాయిగా ఉండండి.
ఆ మానసికస్థితిలో ఇంక అలా నిలబడిపోండి.


స్వస్తి.



# భగవద్గీత ఉపన్యాసాలు - 31

## జ్ఞానయోగము

1998, డిశంబరు 1 వ తారీఖున సుకృతవిల్లా, గుంటూరులో
మాస్టరుగారు భగవద్గీతపై ఇచ్చిన ఉపన్యాసము



- అభ్యాసం వల్ల జరిగే ప్రమాదం - యాంత్రికత
- అనంతమైన విద్య - అనంతమైన గురువులు
- ప్రకృతిలోని ప్రతీ సంఘటనా గురువే
- నిద్రాస్థితికి, ధ్యానస్థితికి తేడా
- మన చేతనత్వానికి వేదాలలో అగ్ని అని పేరు
- 4 పురుషార్థాలు - 4 వర్ణాలు
- యజ్ఞమయ కర్మలు చేస్తే మీ జీవితంలో ఆ విశాలత్వం వస్తుంది
- యజ్ఞము అంటేనే శాక్రిఫైస్
- అలాంటి భగవంతుడు లేడు
- వనరులు, కాలాన్ని ఎక్కడెక్కడ ఉపయోగిస్తామో, దాన్ని యజ్ఞము అంటాం

భగవద్గీత నాలుగవ అధ్యాయంలో 23వ శ్లోకం మనం చదువుకుంటున్నాం.

*గత సఙ్గస్య ముక్తస్య జ్ఞానావస్థితచేతసః*
*యజ్ఞాయాచరతః కర్మ సమగ్రం ప్రవిలీయతే.* (4-23)

దేనియందును సంగము (ఆసక్తి) లేనివాడును, రాగద్వేష కామక్రోధాది రూపసంసారబంధములనుండి విముక్తుడును, ఆత్మ జ్ఞానమందే మనస్సు నిలుకడ కలవాడును, భగవత్ప్రీత్యర్థము (లేక పరప్రాణిహితార్థము లేక, ధర్మము నిమిత్తము) కర్మము నాచరించు వాడునగు మనుజుని యొక్క కర్మ యావత్తు విలీనమైపోవుచున్నది (జన్మ, బంధాదులను గలిగింపక నశించుచున్నది.)

భగవద్గీత చదువుకుంటూ, మన అసలైనటువంటి ఉద్దేశ్యాన్ని మనం మరవకూడదు.

మనం ఏం చదువుకుంటున్నాం, ఏం చేస్తున్నాం అన్నది ముఖ్యంకాదు. ఎక్కడికి వెళ్ళటానికి ఇవంతా చేస్తున్నాం అన్నది ముఖ్యం. లక్ష్యం మర్చిపోకూడదు.

భౌతిక జగత్తులో లక్ష్యం చాలా ఇంపార్టెంట్.

- కానీ ఎందుకో ఆధ్యాత్మిక జగత్తులోకి వచ్చే సరికి సాధనలు చాలా ఇంపార్టెంట్ అయిపోతున్నాయి.

ప్రాణాయామం చేస్తున్నామా, ఆసనాలు వేస్తున్నామా, సూర్యనమస్కారాలు చేస్తున్నామా, ఏ మంత్రజపం చేస్తున్నాం, ఇవేవీ ఇంపార్టెంట్ కాదు.

- ఇవేవీ చేయకపోయినా ఆ లక్ష్యానికి వెళ్ళగలుగుతారు.

నడిచి అయినా వెళ్ళవలసిన చోటికి వెళ్ళగలం, ఏరోప్లేన్ మీద అయినా వెళ్ళవలసిన చోటకి వెళ్ళగలం.

*తేడా ఏమిటి అంటే,*

టైమ్ అండ్ సుఖం. ఈజీగా వెళ్ళగలుగుతామా, కష్టంగా వెళ్ళగలుగుతామా?

ఇక్కడ యోగము అనే పదంలో భగవద్గీతలో 18 రకాలైనటువంటి యోగాలు మనం చదువుకుంటున్నాం.

- ఈ 18 రకాలైనటువంటి యోగాలూ కూడా మానసిక స్థితిని మాత్రమే తెలుపుతున్నాయి.

మీ భౌతికస్థితులు, చేతులు ఎలా పెట్టారు, కాళ్ళు ఎలా పెట్టారు, కళ్ళు మూసుకుని ఉన్నారా లేదా, ముక్కు చివర చూస్తున్నారా, వెనకాతల చూస్తున్నారా, శరీరంలో ఏదైనా అంగం·మీద, హృదయంలోకాని, మూడవ కన్ను వద్ద కాని మీరు ధ్యానం పెట్టారా? ఇవేవీ యోగం కాదు.

- ఇవి యోగానికి తీసుకు వెళ్ళటానికి అనుకూలిస్తాయి. ఇవేవీ చేయకపోయినా యోగం వద్దకు వెళ్ళవచ్చు.

జర్మనీలో స్వీడెన్ బర్గ్ అని ఒక వ్యక్తి ఉండేవాడు. పెయింటరు క్రింద అసిస్టెంటు. ఒకసారి ఐదంతస్తుల భవంతో, ఆరంతస్తుల భవంతో, ఏదో ఒక దాని మీద గాజు కిటికీ తలుపులు తుడుస్తూ పై నుంచి క్రిందకి పడ్డాడు. హాస్పిటల్‌లో జాయిన్ చేశారు.

ఇంక జర్మనీలో ఏ రేడియో స్టేషను ఆన్‌లో ఉన్నా, అది వాడికి వినిపించటం మొదలెట్టింది. కంటిన్యూస్‌గా. రేడియో స్టేషన్ క్లోజ్ అయితే వీడికి వినిపించదుకాని, లేకపోతే కొన్ని రేడియో స్టేషన్లు 24 గంటలూ పనిచేస్తూనే ఉంటాయికదా, అన్ని రేడియో స్టేషనులూ వాడికి ఒకేసారి వినిపించటం మొదలెట్టాయి. చాలా కన్‌ఫ్యూజ్ అయ్యాడు.

- దివ్యశ్రవణము! ఆ క్రింద పడటంలో ఎక్కడో అది తెరుచుకుంది.

☹ అంచేత క్రింద పడటం కూడా ఒక సాధనే.

-- ధైర్యం ఉన్నవాళ్ళు దాన్ని ప్రాక్టీస్ చెయ్యొచ్చు. ఏమౌతుందో గ్యారంటీ లేదు.

కానీ, అలాంటివి పూర్వజన్మ సంస్కారం వల్ల జరుగుతాయి. వాళ్ళకి పడగానే ఎందుకు వచ్చింది అంటే, పూర్వజన్మలో ఆ చివారు వరకూ వచ్చేశాడు. నీళ్ళు మరగ టానికి 100 డిగ్రీలు సెంటిగ్రేడ్ హీట్ కావాలి. క్రిందటి జన్మలో ఏ 99 డిగ్రీల వద్దో శరీరం వదిలేసి ఉంటాడు. ఆ చివరి పుష్ ఆ సంఘటన వాడికి ఇచ్చింది.

- అంచేత యోగము అనేది ఈ దివ్యత్వాన్ని పొందటానికి కావలసినటువంటి పరిస్థితులు.

దివ్యశ్రవణము, దివ్యదృష్టి, దివ్యస్పర్శ, దివ్యమైన రుచి, అంటే మనకి ఉన్నటువంటి ఐదు ఇంద్రియాలూ కూడా దివ్యంగా మారిపోవాలి.

*దివ్యంగా మారిపోవాలి అంటే,*

ఇంకా విస్తారంగా మారాలి.

- కానీ ఈనాడు మన సమాజంలో ప్రకృతి నుంచి మీరు ఎంత దూరం అయిపోతే, సమాజంలో మీరు ఎంత పనికి రాకుండా పోతే, అది యోగవిద్య యొక్క, భగవ తత్త్వం యొక్క లక్షణాలు అని చెప్పుకుంటున్నాం.

- మనం చదువుకుంటున్నటువంటి భగవద్గీత సాధనలో వ్యక్తిని భౌతిక జగత్తులో కూడా మిగతా వాళ్ళకంటే గొప్పవాడిని చెయ్యాలి.

-- వైభవాన్ని అందివ్వాలి.

-- ఆ వ్యక్తి యొక్క వ్యక్తిత్వానికి ప్రపంచంలో ఉన్న వాళ్ళు అందరూ కూడా దాసోహం అనగలిగే స్థితికి వెళ్ళాలి.

- ఆ యోగవిద్య గురించి మనం మాట్లాడుకుంటున్నాం తప్ప, పలాయనవాదము, ప్రపంచం నుంచి పారి పోయే యోగవిద్యను మనం మాట్లాడుకోవటం లేదు. అది మనస్సులో ఉంచుకోండి.

*రెండవది మీరు గుర్తుంచుకోవలసింది ఏమిటి,*

చాలా మంది నిరంతరమూ అడుగుతూవుంటారు, "మరి ఇన్ని రకాలైన విధానాలు మీరు చెప్తూవుంటే, మేము ఏం చేయాలి? ఇవాళ ఈ శ్లోకంలో ఈ యోగం ఉందం టారు, ఇంకోసారి ఇంకో యోగం ఉందంటారు. మరి ఇన్ని సాధనలలో మేము ఏం చేయాలి?"

డాక్టరుగారి దగ్గరకి భార్య వెళ్ళి ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు చేసింది అంటే ఎవరి మీద చేసి ఉంటుందో మీకు అర్థమైపోయివుంటుందికదా! భార్యలు అందరూ భర్తలు మీద. భర్తలు అందరూ భార్యలు మీద. అంచేత భర్త మీద ఫిర్యాదు చేసింది.

"మోస్ట్ అన్‌డిపెండబులు నా భర్త అసలు. ఆయన ఏం అంటాడో, ఏం చేస్తున్నాడో ఆయనకి తెలియదు. అసలు నమ్మలేం! ఒకసారి ఒకమాట అంటాడు, ఇంకొకసారి ఇంకొక మాట అంటాడు. అసలు నేను భరించ లేకుండా ఉన్నాను డాక్టరుగారు. యూ షుడ్ డూ సమ్‌థింగ్!"

"అసలు ఏం జరిగిందమ్మా?"

"ఏం జరిగింది ఏంటి?" అని మళ్ళా రెచ్చిపోయింది.

"రెచ్చిపోవద్దుకాని, అసలు ఏం జరిగిందో చెప్పు!"

"నాలుగు రోజుల క్రిందట వంకాయ కూర చేశాను. చాలా అద్భుతంగా ఉంది అని మురిసిపోయి తిన్నాడు. వచ్చిన వాళ్ళకి అందరికీ కూడా నా భార్య వంకాయ కూర ఎంత బాగా చేసిందో అని చెప్పాడు.

"బావుందన్నాడుకదా అని రెండవ రోజు చేశాను. పరవాలేదు అన్నాడు. మూడవ రోజు కూడా అదే వంకాయ కూర చేశాన్నేను. అసలు మాట్లాడలేదు. నాలుగవ రోజు చేస్తే మళ్ళా వంకాయకూర చేశావా అని విసిరేశాడు.

"మోస్ట్ అన్‌డిపెండబులు. ఒకసారి వంకాయకూర బావుంది అంటాడు. ఇంకొకసారి బావుండ లేదంటాడు."

అందుకు ఇన్ని సాధనలు చెప్పబడేవి.

ఇవన్నీ కూడా మానసికస్థితికి సంబంధించినవే.

- ఒకరోజు ఉన్న మూడ్ ఇంకొక రోజు ఉండదు. లక్ష్యం తెలిస్తే, గోల్ తెలిస్తే, ఆ రోజు మూడ్ బట్టి మీరు మీ సాధనల్ని మార్చుకోవచ్చు. ఇట్ డజంట్ మేటర్.

మనస్సు యొక్క అసలైన లక్షణమే చంచలం. ఋషులకి ఈ విషయం మనకంటే చాలా బాగా తెలుసు.

- ఒకేదాన్ని కనుక చేయటం మొదలెడితే, మీరు చేసు కుంటూ పోతారు, మీరేం చేస్తున్నారో మీకు తెలీదు.

సహస్రనామాలు చదువుకుంటున్నప్పుడు ఆలో చించి చూడండి, మనస్సు ఎక్కడెక్కడో ఆలోచించేస్తూ వుంటుంది, నోళ్ళు సహస్రనామాలు చదివేస్తూవుంటాయి.

**ఇది ఎందుకు నేను చెప్తున్నాను అంటే,**

నా అనుభవం. నేను ఇక్కడ సహస్రనామాలు చదువుతూ, ఒక 10 నిమిషాలు తరవాత అరే నేను ఏం చదువుతున్నాను అని చూసుకుంటే, ఈ మధ్యన నేను సహస్రనామాలు చదువుతూనే ఉన్నాను. అందరూ వింటూనే ఉన్నారు. చాలా స్పష్టంగా పైకే చదువుతున్నాను. కానీ ......, మీకు అందరికీ ఆ అనుభవం వచ్చి ఉంటుంది.

ఇంక ఆ సహస్రనామాలు ఎందుకు?

- అభ్యాసం వల్ల ఈ ప్రమాదం ఉంది మనస్సుకి.

**మన ఉద్దేశ్యం ఏమిటి?**

మనస్సుని లొంగతీయటం.

- మీరు ఒకే స్తోత్రము, ఒకే సాధన ప్రతీ రోజూ చేస్తే జరిగే ప్రమాదం ఏమిటంటే,
-- అది అభ్యాసం అయిపోవటం వల్ల శరీరము ఆ పని యాంత్రికంగా చేసేయటం మొదలెడుతుంది.

మీరు ఏ ఉద్దేశ్యం అయితే సాధనలో చేస్తున్నారో, మనస్సుని లొంగదీయటానికి, అసలు అది జరిగే జరగదు.

అందువల్లనే ఒకే సిస్టమ్‌ని ప్రాక్టీస్ చేసే వ్యక్తులు, చివరికి ఏమీ మేం లాభం పొందలేకపోతున్నాం అంటారు.

- అందుకని ఇన్ని రకాలైనటువంటి సిస్టమ్స్.
  మీరు మార్చుకుంటూ ఉండాలి. అందుకని ఇక్కడ కూడా సాధనలు మారిపోతూవుంటాయి.

"మళ్ళా సాధన మార్చేశారా మాస్టారూ?"

**ఎందుకు మార్చేశాం అంటే,**

మెకానికల్ అయిపోయింది అని అర్థమయింది.

**మీరు అబ్జర్వ్ చేసుకోండి,**

మీ సాధనలు అన్నీ కూడా మెకానికలే. స్నానం చేస్తూ స్తోత్రాలన్నీ చదివేస్తారు. వంట చేస్తూ భగవద్గీత అంతా చదివేస్తారు. చాలా తృప్తి చెందుతారు.

మీరు వంట చేస్తూ ఆ పనులు చేస్తూవుంటే ఏ ఉద్దేశ్యం కోసం మీరు గీత చదువుతున్నారో, ఏ ఉద్దేశ్యం కోసం మంత్రజపం చేస్తున్నారో, అది ఎలా కలుస్తుందది?

**అందుకే నేను చెప్పాను,**

మనవి అన్నీ తల్లక్రిందులే భౌతిక జగత్తులో. రామ నామం చేసుకుంటూ, పూజలు చేస్తూవున్నప్పుడు ఆఫీసులో ఫైళ్ళు గుర్తొస్తాయి. ఆఫీసులో ఫైళ్ళు చూస్తూ, రామ, రామ, రామ, అనుకుంటాడు.

"మాస్టారు! నేను ఎంత భక్తుడ్నో! ఫైల్ చూస్తూ కూడా రామా రామా అనుకున్నాను."

ఠీ వద్దు! ఆఫీసులో ఆఫీసు పని చేద్దాం.
వంట చేస్తున్నప్పుడు వంట పని చేద్దాం.
పూజ చేస్తున్నప్పుడు పూజ మాత్రమే చేద్దాం.

కండిషన్ అది. ఏ విద్య నేర్చుకోవటానికి అయినా ఇదే సిస్టం. ఆత్మవిద్యకి వేరే క్రొత్త సిస్టమ్‌లేం ఉండవు.

☺ మరి ఎందుకు ఆ సిస్టమ్ మనం మర్చిపోయామో, ఎందుకు ఆ మానసికస్థితి అలా తప్పుడు త్రోవలో పడిపోయిందో అర్థం కావటం లేదు.

ఒక స్టూడెంటు థర్డ్ ఇయర్ ఇంజనీరింగ్ చదువుతున్నాడు. ఎండాకాలం సెలవల్లో ఇంటికి వచ్చాడు. సినిమాకి వెళ్ళాడు. సినిమా హాల్లో వాళ్ళ నాన్నగారి స్నేహితుడు, అంకుల్‌గారు కనిపించారు.

"నాయనా! ఏం చేస్తున్నావు?"

సినిమా చూస్తున్నానని చెప్పడుకదా! ఇంజనీరింగ్ చేస్తున్నాను అంటాడు. కానీ ఆ క్షణంలో ఏం చేస్తున్నాడని?

అంచేత ఇంజనీరింగ్ స్టూడెంట్ ఏ పని చేస్తోన్నా ఆల్వేస్ ఇంజనీరింగ్ స్టూడెంటే. కానీ ఇంజనీరింగ్ స్టూడెంటే కనుక సినిమా హాల్లో కూడా టి స్క్వేర్స్, సెట్ స్క్వేర్స్ పట్టుకుని వెళ్ళాడనుకోండి, తప్పుకదా!

క్లాసులో పాఠం చెప్తూవున్నప్పుడు, లేకపోతే పాఠాలు చదువుకుంటూవున్నప్పుడు మాత్రమే మనస్సు ఏకాగ్రతగా ఉండాలి. మిగతాటప్పుడు మీరు ఎలాగయినా ఉండొచ్చు.

యోగవిద్యలో ఈ కండిషన్ మర్చిపోతాం మనం ఎందుకో! నిరంతరము మనం అలా ఉండగలమా?

"మరి మీరు బోర్డేం పెట్టారు మాస్టారు? మాకేమో లెక్చర్లు ఇస్తున్నారు!"

<u>నిరంతర గురు సాన్నిధ్య అనుభూతి శిబిరము</u> అనేది ఇక్కడ. ఇల్లు అదీ అంతా వదిలేసి మూడు రోజుల పాటు ఆ అనుభవం తెచ్చుకోవటానికి ఇక్కడకి వచ్చి చేసినప్పుడు అది అవసరం. లేకపోతే అది అవసరం లేదు.

మీరు ఒక టైమ్ పెట్టుకుని, ఏ విధంగా అయితే కాలేజీలో, క్లాసెస్‌లో విద్య నేర్చుకోవటానికి ఒక నిశ్చితమైన టైమ్ పెట్టుకుంటారో, అలాగ ఆ టైమప్పుడు ఈ మానసిక స్థితి ఉంచుకోండి. మిగతా అప్పుడు ఈ మానసికస్థితి మీకు ఉండక్కరలేదు.

ఠీ ఆ మానసికస్థితిని ఆ గంటో, రెండు గంటలో మీరు ప్రాక్టీస్ చేస్తూ ఉంటే, మిగతాటప్పుడు ఆ వాసనలు మెల్లిమెల్లిగా మీ నిత్యజీవితం వైపు కూడా వీస్తాయి. మీరేం దాన్ని తెచ్చుకోవక్కరలేదు.

ఇది చాలా జాగ్రత్తగా మనస్సులో పెట్టుకోండి.

దాని తరవాత, "ఏ యోగపద్ధతిని మేము అనుసరించాలి? ఒక గురువు అల్‌రెడీ మాకు ఉన్నాడు. ఇంకొక గురువుని ఫాలో అవ్వొచ్చా?"

ఇదొక ప్రశ్న తరచూ అడుగుతున్నారు.

ఎలిమెంటరీ స్కూలు నుంచి ఎమ్.ఏ. వరకు మీకు ఎంతమంది గురువులు ఉన్నారు? ఆఫ్టరాల్ ఎందుకూ పనికిరానటువంటి, ఒక జన్మలోనే ఉపయోగపడే అపరా విద్యకు మీకు ఇంతమంది గురువులు కావలసి వస్తున్నారు.

మరి పరావిద్య, అనేక జన్మల నుంచి పనికొచ్చే విద్య అది. మనము పురుగులుగా ఆవిర్భవించినటువంటి స్థితిలో, ఆబ్రహ్మకీటజనని, పురుగులు స్థితి నుంచి ఆ బ్రహ్మత్వం వైపుకి వెళ్ళగలిగే స్థితి వరకూ చెప్పే విద్యను మీకు అందించే గురువులు ఎంత మంది కావాలి?

ఠీ ఒకే వ్యక్తి చెప్పాలనుకున్నా చెప్పలేడు.
ఇటీజ్ ఇంపాజిబుల్.

కాలేజీలో కెమిస్ట్రీ ఒకటే అంతా మేము చెప్పలేకుండా ఉన్నాం. కెమిస్ట్రీ లెక్చరర్సుమి 16 మంది, 20 మంది ఉంటాం. అందరూ కెమిస్ట్రీయే చెప్తాం. కానీ ఒకళ్ళు చెప్పింది ఇంకొకడు చెప్పడు. ఇంతా చేస్తే భౌతికమైనటువంటి జ్ఞానంలో కెమిస్ట్రీ ఒక చిన్న సబ్జెక్టు.

ఠీ మరి సంపూర్ణజీవితవిధానాన్ని ఆవరించుకుని, సర్వమావృత్యతిష్ఠతి, ఆ విద్యను నేర్పటానికి ఎంత మంది గురువులు కావాలి?
అనంతమైనటువంటి గురువులు కావాలి.
అనంతమైన విద్య, అనంతమైన గురువులు.

ప్రకృతే గురువు. ప్రకృతిలో జరుగుతోన్నటువంటి ప్రతీ సంఘటనా కూడా మనకి గురువే.

మరి ధ్యానపద్ధతులో?

ఒక కథ గుర్తుంచుకోమని రిపీటెడ్‌గా నేను మీకు చెప్పాను. రిపీటెడ్‌గా అదే కథలు ఎందుకు చెప్తాను అంటే, ఆ కథ గుర్తొచ్చే సరికి ఆ భావన మీకు వచ్చేయాలి అని.

కావాలని ఒకే కథని ఒకే విధంగా చెప్తాం. దానికి కారణం అది. ఆ కథ అనేసరికల్లా మీకు మొత్తం గుర్తొచ్చేస్తుంది. లేకపోతే కథలు మారుస్తూవుంటే మళ్ళా ఆ కథని అర్థం చేసుకోవటానికి టైమ్ పడుతుంది.

ముల్లా నసీరుద్దీన్ - మృత్యువు గురించి కథ చెప్పానుకదా! ముల్లా నసీరుద్దీన్ కాశ్మీరు లోయలలో ఉండేవాడు. శీతాకాలంలో పండే ఏదో పంట వేసుంది, రాత్రిళ్ళు ఆ మంచె ఎక్కి పంటకి కాపలాగా ఉండేవాడు. పగలు కాస్త ఊళ్ళో తిరుగుతూవుండేవాడు.

ఒకరోజు సాయంత్రం ఊళ్ళోకి వెళ్ళినప్పుడు ఏదో డాక్టర్స్ కాన్ఫరెన్స్ జరుగుతోంది. బయట ఆ బోర్డ్ చూస్తూవుంటే, అతనికి డాక్టరు చెప్తోన్న మాటలు వినిపిస్తున్నాయి.

మనిషి చచ్చిపోతే శరీరం అంతా బిగుసుకుపోతుంది, చల్లబడిపోతుంది. ఈగలు అవీ వాలినా శరీరంలో ఏ విధమైన కదలికలు ఉండవు అని ఇంకా ఏదో చెప్పబోతూవుంటే, అతనికి గుర్తొచ్చింది, నాకు పనుంది, ఇది వింటూ కూర్చుంటే ఎట్లా అనుకున్నాడు, వెళ్ళిపోయాడు.

లేటయింది. భార్య తలుపు తెరవలేదు, తిండి పెట్టలేదు. కప్పుకోవటానికి బట్టలు అవీ ఇవ్వలేదు. అలాగే వెళ్ళిపోయాడు పొలంలోకి.

కాశ్మీరు లోయ, చలి. రెండున్నరో ఎంతో అయింది, నిద్రలోనే బిగుసుకుపోయాడు. మధ్యన ఎప్పుడో అతనికి మెలకువ వచ్చింది. కదలలేక పోయాడు. అప్పుడు ఆ డాక్టరు మాటలు గుర్తొచ్చాయి, చనిపోతే ఒళ్ళు బిగుసుకుపోతుంది.

"రైట్ నేను చనిపోయాను!"

ఈ లోపల ఈగో ఏదో వాలింది. కదపలేడుగా!

"ఇది కూడా చెప్పాడు. కచ్చితంగా చచ్చిపోయాను."

ఈ లోపల ప్రొద్దున్నే లేచి మోర్నింగ్ వాక్‌కి వెళ్ళే అలవాటు ఉన్న ప్రక్కవూరి వాళ్ళు అక్కడికి వచ్చినట్టున్నారు. చూశారు. "అయ్యో పాపం ఎవరో చచ్చిపోయార్రా!"

ఇంకా గ్యారంటీ అయిపోయింది అతనికి. ప్రజలు కూడా అదే చెప్తున్నారు.

ప్రజలు వీడు చాలా భక్తుడు అంటూవుంటే, నేను భక్తుడ్నే కాబోలు అని వాడికి అనుమానం వస్తుంది.

గ్యారంటీ అయిపోయింది. హేమా హేమీ డాక్టర్లు మైక్‌లో ఉద్ఘోషన చేసిన లక్షణాలన్నీ నాలో ఉన్నాయి. నేను కూడా చనిపోయాను అనుకున్నాడు.

"సరే పాపం శవాన్ని ఇలా ఊరు బయట వదిలేస్తే ఏం బావుండదు, ఊళ్ళోకి తీసుకెళ్ళిపోదాం" అని ఊళ్ళోకి తీసుకొచ్చారు, నాలుగు రోడ్ల కూడలిలోకి వచ్చారు.

శీతాకాలంకదా, ఎవరూ రోడ్ల మీద లేరు. "ఒరేయ్ ఎవరూ లేరురా! వీడి ఇల్లు ఎక్కడుందో తెలియదు" అంటే, ఈ కదలిక దాని వల్ల వాడి శరీరంలో కొంచెం వేడి వచ్చింది.

"నేను చచ్చిపోయాను, అంచేత మాట్లాడకూడదు. కానీ మీకు తెలియదు కనుక చెప్తున్నాను, ఇటు వైపు నుంచి కుడి వైపు తిరగండి. నాలుగవది నా ఇల్లు" అన్నాడు. వీళ్ళు గాబరాపడి దాన్ని పారేసి వెళ్ళిపోయారు, అది వేరే కథ.

కానీ ఇక్కడ మన ధ్యానయోగాలు కూడా ఇలాగే ఉంటాయి. ధ్యానం చేస్తున్నాం, పని మనిషి వచ్చి తలుపు కొట్టింది. మనకి వినిపిస్తూనే ఉంది. కానీ ధ్యానం చేస్తున్నాం కదా అని లేవము. అంచేత ఎవడో గాఢ నిద్రలో ఉన్న పిల్లవాడో ఎవడో లేచి పాపం తలుపు తీయాలి. మీరు ధ్యానస్థితిలోకి వెళితే అసలు మీకు వినిపించదది.

వినిపించనప్పుడు మీరు దానికి రియాక్ట్ కాకపోతే ఓకె. వినిపించాక రియాక్ట్ కాకపోతే ముల్లా నసీరుద్దీన్.

మన సాధనలు ఇలా ఉంటాయి. నిరంతరము ఈ కథ గుర్తుంచుకోండి. అప్పుడు ఆ గాబరాలో పడం.

నిజంగా మనం ధ్యానయోగస్థితిలోకి వెళ్ళిపోతే, ఆ ధ్యానస్థితిలో మీకు బాహ్యస్మృతి గ్యారంటీగా ఉండదు. కానీ ఒకటి, నాకు చాలా సార్లు కలిగిన అనుభవం ఇది.

"ధ్యానంలో బాహ్యస్మృతి లేదు మాస్టారు!"

అలాగ చాలా మంది జపం చేస్తూ చేస్తూ నిద్రపోతూ ఉంటారు. అందులో నేను ఒకడ్ని.

శ్రీ అది ధ్యానస్థితి కాదు. నిద్రాస్థితి.

శ్రీ మంచిదే! ధ్యానం చేస్తూ చేస్తూ నిద్రలోకి వెళ్ళిపోవటం చాలా మంచిది. ఏం తప్పు లేదు.
అదేదో తప్పు జరిగిపోతోంది అని మీరు భయపడ కండికాని, అది ధ్యానస్థితి మాత్రం కాదు.

**ధ్యానస్థితి అని మీకు ఎలా తెలుస్తుంది?**

శ్రీ అద్భుతమైనటువంటి శాంతి,
చేతనత్వములో ఒక అద్భుతమైనటువంటి విస్తరణ, ఒక అద్భుతమైన ప్రేమతత్వము మీకు తెలియకుండానే మీలో డెవలప్ అవుతుంది.

క్రైస్టుని శిలువ వేస్తున్నప్పుడు ఒక మాట అంటాడు, లార్డ్ ఫర్గివ్ దెమ్. వాళ్ళని క్షమించేసెయ్.

**ఎంచేత క్షమించమన్నాడు?**

బికాజ్ దే నో నాట్ వాట్ దే డూ.
వాళ్ళకి తెలియదు, వాళ్ళేం చేస్తున్నారో!

ఆ క్షమించేటటువంటి గుణం!

లోపల వళ్ళుమండిపోతోన్నా, నేను యోగిని కనుక, వాళ్ళని క్షమించేయాలి అనుకుంటే, అది కరెక్ట్ కాదు. మీలో ఆ ప్రేమతత్వం, క్షమాగుణం సహజంగా ఉద్భవిస్తుంది.

-- బాహ్యస్మృతి కోల్పోయినటువంటి మీరు, స్మృతి వచ్చిన తరవాత ఈ శాంతి, ఈ ప్రేమ, ఈ క్షమాగుణం మీలోకి వస్తే అది సమాధి స్థితే, ధ్యానస్థితే.

అంచేత ఈ ధ్యానస్థితిలోకి వెళ్ళటానికి మీరు ఏ మార్గం ఉపయోగించుకుంటారు?

ఇవాళ సైకిల్ మీద కాలేజీకి వెళ్ళొచ్చు, రేపు లూనా మీద వెళ్ళొచ్చు. ఎల్లుండి మోటర్ సైకిల్ మీద వెళ్ళొచ్చు. ఇంకొక రోజు నడిచి వెళ్ళొచ్చు. ఇంకొక రోజు బస్సులో వెళ్ళొచ్చు. ఇంకొక రోజు నడిచే వెళ్ళొచ్చు. ఏ అభ్యంతరం లేదు, ఏ మార్గాన్ని అయినా మీరు అనుసరించవచ్చు. లేదూ, ఎగ్జాట్ ఆపోజిట్‌గా ఇంకొక స్నేహితుడి ఇంటికి వెళ్ళి, అక్కడ్నుంచి ఇంకొక స్నేహితుడి ఇంటికి వెళ్ళి, ఆ ఇద్దరు స్నేహితుల్ని కలిసి మళ్ళా కాలేజీకి వెళ్ళొచ్చు. ఎన్ని రకాలో.

**కానీ ఏం జరగాలి?**

కాలేజీకి వెళ్ళాలి.

అంచేత రోజుకొక ధ్యానపద్ధతిని మీరు ఉపయోగించుకోవచ్చు. 365 రోజుల్లో 365 రకాల ధ్యానపద్ధతులు మీరు ఉపయోగించుకోవచ్చు. ఏమీ ప్రమాదం జరగదు.

**కండిషన్ ఏమిటి?**

ధ్యానస్థితిలోకి వెళ్ళాలనే లక్ష్యం మర్చిపోకూడదు.

అందుకని ఆ మనస్సు యొక్క చంచలత్వానికి కావలసిన ఆహారాన్ని ఇవ్వటానికి ఇన్ని రకాలైనటువంటి యోగవిద్యలు చెప్పబడుతూవుంటాయి.

దీన్ని మనస్సులో గుర్తుంచుకుని, ఈ శ్లోకాలన్నిటినీ చదువుకుంటూ ఉందాం. ఇది మర్చిపోకండి ఎప్పుడూ.

*గత సఙ్గస్య ముక్తస్య జ్ఞానావస్థితచేతసః*
*యజ్ఞాయాచరతః కర్మ సమగ్రం ప్రవిలీయతే.* (4-23)

**జ్ఞానావస్థితచేతసః** అనేదానికి క్రిందటి సారి మనం చాలా డీటైల్డ్‌గా అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేశాం.

**ఏమిటి మనం అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేశాం?**

శ్రీ చేతనత్వము అనేది ఒక విచిత్రమైన లక్షణం కలిగి ఉంటుంది. ఆ విచిత్రమైన లక్షణాన్ని అగ్ని అంటాం.

మన అందరికీ చేతనత్వం ఉంది. ఉంది అని ఎలా తెలుస్తుంది? నేను ఉన్నాను అని మనకి తెలుస్తోంది కనుక. నేను అనే భావన మనలో ఉంటుంది కనుక. ఈ చేతనత్వాన్ని మనం అగ్ని అంటాం. అది అర్థం చేసుకోండి.

**ఈ అగ్ని ఏమౌతోంది?**

రకరకాలైన నామరూపాలలో మనకి దర్శనమిస్తోంది.

చేతనత్వము కేవలము మనకి మాత్రమే ఉంది అనుకోకండి. ఇనుముకీ చేతనత్వం ఉంది, రాగికీ చేతనత్వం ఉంది, వెండికి కూడా చేతనత్వం ఉంది.

ఎంచేత? ఇనుము ఎల్లప్పుడు ఇనుములాగే ప్రవర్తిస్తుంది. సడన్‌గా ఇనుము ఇంకొకలాగ ప్రవర్తించటం మొదలెట్టింది అనుకోండి,

☺ మనుష్యులకే ఆ కేపబులిటీ ఉంది.
వాడు ఎలా ప్రవర్తిస్తాడో యూ కెనాట్ ప్రిడిక్ట్.

కానీ మిగతా చేతనత్వాలన్నీ కూడా కచ్చితంగా ఆ స్వభావమే, ఆ గుణాలనే కలిగి ఉంటాయి.

☹ మనిషికి కూడా స్వభావం ఉంది, గుణాలూ ఉన్నాయి.

కానీ ఈ రకరకాల నామరూపాలతో దర్శనమిస్తోన్న ప్పటికీ అది ఒకే ఒక చేతనత్వము.

బంగారంతో చేసిన ఆభరణాలన్నీ బంగారమే. వాటిని ఉపయోగించే విధానాన్ని బట్టి మనం పేర్లు మారు స్తూవుంటాం. చేతి వేళ్ళకి పెట్టుకుంటే ఉంగరం అంటాం. నడుముకి పెట్టుకుంటే వడ్డాణం అంటాం. చేతులకి పెట్టు కుంటే భుజకీర్తులు అంటాం.

* అలాగే మన చేతనత్వానికి వేదాలలో అగ్ని అని పేరు. వేదాలన్నీ కూడా ఈ అగ్నినే ఉపాసన చేస్తాయి. ఈ అగ్నివిద్యనే తెలుపుతాయి.

**కానీ, ఈ అగ్ని ఏమిటి?**

సూర్యుడులో ఉన్నటువంటి వేడి.

కానీ సూర్యుడిలో వేడితో పాటు వెలుతురూ ఉంది.

* సూర్యుడిలో ఉన్నటువంటి వెలుతురుని వాడుక భాషలో అయితే చంద్రుడు అంటాంకాని, ఆధ్యాత్మిక జగత్తులో దానికి సోముడు అని పేరు. సోమరసము.

అంచేత సూర్యుడులో ఉన్నటువంటి చల్లదనము సోముడు. చల్లదనము అంటే "వెలుతురు వితౌట్ హీట్". అందుకే వెలుతురుని "కోల్డ్ హీట్" అని కూడా అనొచ్చు.

చేతసము, కాన్ష్యస్‌నెస్, ఎవేర్‌నెస్, నేను ఉన్నాను అనేటటువంటి ఉనికి, దీన్ని ఏమంటాం మనం? అగ్ని.

* ఈ అగ్ని, సోముడు, రెండూ కలిస్తే వేడీ ఉంటుంది, వెలుతురూ ఉంటుంది. దాన్ని సూర్యుడు అంటాం.

-- ఇవి మూడూ ఆధ్యాత్మవిద్యకి మూడు రకాలైన కళ్ళు. దీన్నే త్రినేత్రుడు అంటాం. చంద్ర సూర్యాగ్నిలోచన.

**కానీ అన్‌ఫార్చునేట్‌గా ఏమైపోయింది?**

పంకజము అనే మాట వాడాం అనుకోండి, పంక జము అని పేర్లు కూడా పెట్టుకుంటారు. పువ్వు అని పెట్టు కోరేమో! కానీ పంకజము అని పెట్టుకుంటాం కదా! పంక జము అంటే మన ఉద్దేశ్యం, పద్మము అని.

పంకజము అనే పదానికి అర్థము పద్మము కాదు. పంకజము అంటే మట్టిలో ఉద్భవించింది అని అర్థం. పంకజము అంటే మట్టిలో ఉద్భవించింది అనే అర్థాన్ని మనం పట్టుకోం. పంకజము అంటే పద్మమే.

పద్మము కూడా మట్టిలో ఉద్భవిస్తుంది. కానీ మట్టిలో ఉద్భవించేది పద్మము మాత్రమేనా? ఇంకా ఎన్నో.

అలాగే రాజమహిషి. మహిషి అంటే అటు రాణీ అనీ అర్థం ఉంది. ఇటు గేదె అని కూడా అర్థం ఉంది. అంచేత రాజుగారు రాజమహిషిని చూసి వస్తున్నారు అను కున్నాం అనుకోండి, నాకు సంస్కృతం చాలా బాగా వచ్చు కనుక, రాజుగారు గేదెని దర్శించి సభకి వేంచేశారు అంటే, సంస్కృతం ప్రకారం, మాట అర్థం ప్రకారం అది కరెక్టే కావచ్చుకాని, కామన్‌సెన్స్ ప్రకారం అది కచ్చితంగా తప్పే.

శ్రీ సందర్భాన్ని బట్టి మనము పదము యొక్క విశిష్టతను అర్థం చేసుకోవాలి.

సూర్యచంద్రాగ్నిలోచన.

**లోచన, కళ్ళు ఏం చెప్తాయి మనకి?**

విషయం గురించి సంపూర్ణమైనటువంటి అవగా హనని ఇస్తాయి. ఒక విషయాన్ని బాగా అర్థం చేసుకోవాలి అంటే కన్ను పనిచేస్తూవుండాలి.

* అందుకే ఒక మనిషి మాట్లాడుతూవుంటే, వాడ్ని చూడ కుండా కళ్ళుమూసుకుని వింటే అర్థమయ్యేదానికంటే చూస్తూ వినేది ఎక్కువ అర్థమవుతుంది.

చూపుతో వినంకదా! వినేది చెవులేకదా! మరి కళ్ళు మూసుకుని వినొచ్చుకదా! మీరు ఇప్పుడు ట్రై చేయండి.

* కళ్ళు మూసుకుని వింటే మీకు ఏకాగ్రత కుదరదు.

కళ్ళు! ఆ కళ్ళ యొక్క పని ప్రకృతిలో ఈ మూడూ చేస్తూవుంటాయి. చంద్రుడు కన్నులాగ పనిచేస్తాడు. సూర్యుడు, ఆదిత్యుడు, సన్ కళ్ళవలె పనిచేస్తాడు.

ఈ విశాలమైన అర్థాన్ని మీరు గుర్తు చేసుకుంటూ, జ్ఞానేచ్ఛితచేతస, మన కాన్ష్యస్‌నెస్, అగ్నికి ప్రతిస్వరూపము.

దీన్ని మనం నిరంతరము రకరకాలుగా త్రిప్పి త్రిప్పి త్రిప్పి త్రిప్పి అర్థం చేసుకోవాల్సి వస్తుంది. ఏది చెప్పినా అగ్ని గురించే మనం చెప్పుకుంటూవుంటాం.

ఏ అగ్ని? ఇందాక పంకజం అంటే పద్మం అనుకుంటామే, అలాగే అగ్ని అంటే మనకి ఈ అగ్ని గుర్తొస్తుంది. అసలు అగ్ని యొక్క స్వరూపం మనకి గుర్తురావటం లేదు.

### అగ్ని యొక్క స్వరూపం ఏమిటి?

పృథ్వి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము. ఈ పంచతత్వాలు గురించి చెప్పుకుంటూవున్నప్పుడు క్రిందటి సారి మనం అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేశాం.

- అగ్ని మిగతా నాలుగింటిని మార్చగలదు.

ఈ మిగతా నాలుగింటిని మార్చేటటువంటి అగ్నినే, అగ్ని పృథ్వీతత్వంగా మార్చగలదు. అగ్ని జలతత్వంగా మార్చగలదు. అగ్ని వాయుతత్వంగా మార్చగలదు. అగ్ని ఆకాశతత్వంగా మార్చగలదు.

- అంచేత ఈ అగ్నే నాలుగు రకాలైన ఫలితాలను ఇవ్వగలదు కనుక ప్రపంచంలో నాలుగు పురుషార్థములు మాత్రమే ఉన్నాయి. మీరు కావాలనుకున్నా ఐదవది లేదు. ఎంచేతంటే, ఓన్లీ ఫోర్ ఈజ్ పాజిబుల్.

### అగ్ని అంటే ఏమిటి?

వేడి కాదు, మన చేతనత్వము, మన ఎవేర్‌నెస్! నేను నేనుగానే ఉండటము అనేది. నేను మారిపోతానని మనకి ఎప్పుడూ అనుమానం రాదు. నేను నేనుగానే ఉంటాను. ఒకవేళ మారిపోయినా ఒకప్పుడు నేను ఇలాగ ఉండేవాడిని, ఇప్పుడు నేను ఇలాగ మారిపోయాను అని మనకి స్పష్టంగా తెలుస్తూనే ఉంటుందికదా!

ఇది వరకు నాకు చాలా కోపం వచ్చేది. ఇప్పుడు నాకు కోపం రావటం లేదు. లేకపోతే ఒకప్పుడు ఇంతగా విసుక్కునేవాడినికాదు, ఇప్పుడు విసుక్కుంటున్నాను.

- అంచేత విసుక్కోవటం, శాంతంగా ఉండటం అనే రకరకాలైన గుణాలు అన్నిటినీ దర్శించే ఎవేర్‌నెస్‌ని, జ్ఞానాన్ని, వేదభాషలో మనం అగ్ని అంటాం.

దీన్ని మనస్సులో ఉంచుకున్న తరవాత, అగ్నిని నాలుగు రకాలుగా ఉపయోగించవచ్చు అని చెప్పానుకదా!

ఆకాశతత్వంలోంచి వేడిని తగ్గిస్తే వాయువు అవుతుంది. వాయువులోంచి వేడిని తగ్గిస్తే నీళ్ళు అవుతాయి. నీళ్ళలోంచి ఇంకా వేడిని తగ్గిస్తే ఘనీభవిస్తాయి. ఫ్రిజ్‌లో అదేకదా చేస్తాం మనం. ఫ్రిజ్‌లో నీరు పృథ్వీ తత్వంగా ఘనీభవిస్తుంది. ఇవి నాలుగు పురుషార్థాలు మాత్రమే మనం చేయగలం ప్రపంచంలో. ఈ నాలుగింటి పెర్మిటేషను, కాంబినేషన్లు రకరకాలుగా ఉంటాయి.

ఆరు రుచులే ఉన్నాయి, షడ్రుచులే. ఈ ఆరు రుచులు నుంచి భగవంతుడికి తెలియాలి ఎన్ని రకాలైన వంటకాలు ఉన్నాయో! ఇంకా ఎన్ని రకాల క్రొత్త క్రొత్త వంటకాలు వస్తాయో! కానీ రుచులు మాత్రము ఆరే.

- అలాగే 4 రకాలైన అగ్ని సంబంధమైన ఎఫర్ట్స్, ప్రయత్నాలు ఉన్నాయి. పురుషార్థము అంటే ప్రయత్నం.
- ఈ నాలుగు రకాలైనటువంటి ప్రయత్నాలలో ఒకొక్క ప్రయత్నము యొక్క తీవ్రతను బట్టి నాలుగు రకాలైన వర్ణాలు ఏర్పడతాయి.

చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మ విభాగశః
తస్య కర్తారమపి మాం విద్ధ్యకర్తారమవ్యయమ్. (4-13)

బ్రాహ్మణక్షత్రియాదులను నాలుగు వర్ణములు సత్త్వాది గుణముల యొక్కయు, ఆ గుణములచే చేయబడు కర్మలయొక్కయు, విభాగము ననుసరించి నాచే సృజింపబడినవి. వారికి నేను కర్తనైనప్పటికిని (ప్రకృతికి అతీతుడనగుటచే) వాస్తవముగ నన్ను అకర్తగను, నాశరహితునిగను (నిర్వికారునిగను) ఎఱుగుము.

ఇదేంటిది? మనం చేసే పనుల యొక్క విశ్లేషణ.

మనం చేసే పనులు మళ్ళా రెండు రకాలుగా చెయ్యొచ్చు. మనిషిని రెండు రకాలుగా చంపొచ్చు. యుద్ధంలో చంపేయవచ్చు, కసితో, కోపంతో చిత్రవధ చెయ్యొచ్చు. కసితో ఎవర్నయినా చంపేస్తే మనల్ని కూడా చంపేస్తారు. కోపంతో కాకుండా చంపాలి కనుక చంపేరను కోండి, పరమవీర చక్ర ఇస్తారు.

చంపాలి కనుక చంపితే పరమవీర చక్ర వస్తుందే, అటువంటి కర్మల్ని ఈ శ్లోకంలో

యజ్ఞాయాచరతః కర్మ సమగ్రం ప్రవిలీయతే.

యజ్ఞమయ కర్మ అంటే అది. చేయవలసింది కనుక చేస్తున్నానుకాని, అది చెయ్యాలని ఉంది కనుక కాదు.

ఈ చిన్న మార్పు మీ ఆలోచనా విధానంలో వస్తే, మీరందరూ కూడా యోగిపుంగవులే. జనకమహరాజు కంటే, ఋషుల కంటే మీరు ఏ విధంగానూ తక్కువ కారు.

**ఇందులో మీరు ఏ విధంగా చెయ్యాలి?**

ఏ విధంగా చెయ్యాలి అనేది ఇంపార్టెంట్ కాదు. ఏ మానసికస్థితిలో చేస్తున్నారు?

ఈ మానసికస్థితికి నేను దేవాలయం ఉదాహరణ మీకు ఇస్తూవుంటాను. అదే ఉదాహరణలు రిపీట్ చేసుకొంటే, గుర్తుంచుకోవటానికి చాలా హాయిగా ఉంటుంది.

ఒక అద్భుతమైనటువంటి దేవాలయ నిర్మాణం జరుగుతోంది. చాలా గొప్ప దేవాలయ నిర్మాణం జరుగుతోంది కనుక నేచురల్‌గా టీవీ రిపోర్టర్సు వాళ్ళూ అందరూ వచ్చి ప్రశ్నలు అడగటం సహజమే. పనులు ఆపి మధ్యలో వాళ్ళని డిస్టర్బ్ చేస్తూ మైక్ ముందు పెడుతూవుంటారు.

సరే, అక్కడ ఒక కూలీ వాడి దగ్గరకి వెళ్ళి మైక్ ముందు పెట్టి ప్రశ్నించాడు, "నాయనా! నువ్వు ఈ పని ఎందుకు చేస్తున్నావు?" ఇంక వాడు తిట్టిన తిట్టు తిట్టకుండా గవర్నమెంటుని తిట్టాడు, తల్లితండ్రుల్ని తిట్టాడు, సమాజాన్ని తిట్టాడు. అందర్నీ తిట్టాడు.

తాను తప్ప మిగతా వాళ్ళు అందరూ తప్పే. అదీ చివరకి వాడి తిట్ల యొక్క సారాంశం. "నేను బాగా చదువుకున్నాను. కానీ ఎగ్జామినర్ మార్కులు వెయ్యలేదు." మొదటి తిట్టు. ఇంక అక్కడ్నుంచి "గవర్నమెంటు నా చదువుకి తగిన ఉద్యోగం ఇవ్వలేదు. నా ఖర్మ, ఇంత కంటే నేనేం చేయలేను" అని వాడు మొదలెట్టాడు.

దెబ్బకి వాడు గాబరాపడిపోయి, కట్ కట్ అని ఇంకొకడు దగ్గరకి తీసుకెళ్ళాడు. వాడూ కూలీవాడే, వాడూ రాళ్ళు కొడుతున్నాడు. వాడ్ని అడిగారు. "ఏం చేస్తాను? నాకు బాధ్యతలు ఉన్నాయి. దొరికిన ఉద్యోగం ఇది. నా పెళ్ళాం పిల్లల్ని పోషించాలి కనుక, నేను ఈ పని చేస్తున్నాను." వాడు ఎవర్నీ తిట్టలేదు, ఏమీ చేయలేదు. నా బాధ్యతలు నేను నిర్వర్తించుకుంటున్నాను అన్నాడు.

మూడవ వాడి దగ్గరకి వెళ్ళాడు. వాడు ఏడ్చేశాడు. వీడు కంగారు పడిపోయాడు. సరే, కాస్త వాడు ఆ బాధ, ఆవేదనను, వాడి కళ్ళ నీటి ప్రవాహానికి ఆనకట్ట వేసుకున్న తరవాత, అడిగాడు, "నాయనా! ఎందుకు ఏడుస్తున్నావు?"

"నా అదృష్టం ఏమని చెప్పేది! ఇంత అద్భుతమైన దేవాలయ నిర్మాణంలో నేను పాలుపంచుకుంటున్నాను. నేను వేస్తోన్న ఈ మార్గం గుండా ఎంత మంది భక్తులు వాళ్ళ వాళ్ళ భగవంతుడ్ని దర్శనం చేసుకోగలుగుతారో! ఇంత కంటే అదృష్టం ఏముంటుంది!" అన్నాడు.

పని ఒకటే, రాళ్ళు కొట్టటమే. మీ దృష్టికోణం!

- భగవద్గీత నాలుగవ అధ్యాయం మీకు ఈ దృష్టికోణాన్ని మార్చుకోవటం చెప్తుంది. సాధనలు ఏం చెప్పదు.

మీకు ఏ విధమైనటువంటి ఫిజికల్ యాక్ట్స్, కుడి చేయి ఇలా పెట్టుకో, ఎడం చేయి ఇలా పెట్టుకో అనేం చెప్పదు. ఏం చెప్తుంది? మీ మానసికస్థితి! దేవాలయం ఉదాహరణ అర్థమయిందికదా! ఆ మానసికస్థితి!

- మీరు ఏం చేస్తున్నా, ఎంత అద్భుతమైనటువంటి పని మీ ద్వారా జరుగుతున్నదో మీకు తెలియదు.

**ఎంచేత?**

ఈ సృష్టిలో మనిషి యొక్క విలువ ఎంతో మీరు ఊహించుకోండి. ఎంత పెద్ద విశాలమైనటువంటి విశ్వం ఉందో మీకు నేను చెప్పక్కరలేదు. ఆ విశాలమైనటువంటి విశ్వంలో ఈ సూర్యమండలం. ఆ సూర్యమండలంలో పృథ్వి ఒక గ్రహం. ఆ పృథ్వి గ్రహం యొక్క ఉపరితలం మీద జీవిస్తున్నాం మనం. అంతేకదా!

విరాట్ విశ్వములో పృథ్వి ఎంత? ఆ పృథ్వి లోపల బయట ఎన్ని రకాలైన వాతావరణాలు, ఎన్ని రకాలైన జీవాలు ఉన్నాయి? వాటిలో మనం ఒకళ్ళము. పృథ్విలో మూడు వంతులు నీరే, సముద్రమే. ఇంక మిగిలింది ఒక వంతు పృథ్వి. అందులో మనం భారతదేశంలో ఉన్నాం.

మేప్ చూసుకోండి. భారతదేశంలో స్వర్ణాంధ్ర ఎంత ఉంది? ఆ స్వర్ణాంధ్రలో గుంటూరు, ఆ గుంటూరులో వేణుగోపాలనగర్‌ని ఎక్కడ పట్టుకుంటారు? ఆ వేణుగోపాల నగర్‌లో ఈ నిరంతర గురుసాన్నిధ్య అనుభూతి శిబిరం జరిగే ప్లేస్ ఎంత ఉంది? అందులో మనం ఎంత? అతి తుచ్ఛమైన, హేయమైన, క్షుద్రమైనటువంటి జీవితం.

- కానీ ఇది ఎంత అద్భుతం! ఇప్పుడు ఇంత విశాలత్వాన్ని చెప్పుకున్నాంకదా! ఇది మీకు అర్థమయిందికదా! అంటే మీరు హేయం ఎలా అవుతారు, మీరు క్షుద్రం ఎలా అవుతారు? అవలేరు.

ఆ విశాలత్వం గురించి ఏ సాధన చేస్తే అర్థమవుతుంది? ఏ సాధనా చేయక్కరలేదు. ఇంత విశాలంగా ఉందని మీకు అర్థమవుతోందికదా!

- కానీ ఈ విశాలత్వాన్ని అంతా మీ మనస్సు పట్టుకుని, దాన్ని కూడా దాటి ఆలోచించగలుగుతోంది.

ఈ విశాలత్వం వెనకాతల ఏముంది అనే ఆలోచన మన మనస్సుల్లోకి వస్తోంది కనుక ఈ చేతనత్వాన్నే మనం ఏమంటాం? సర్వమావృత్య తిష్టతి. అన్నిటినీ కూడా అది ఆవరించుకుని ఉండును.

అన్నిటినీ ఆవరించి ఉన్న ఇంత అద్భుతమైన చేతనత్వాన్ని ఉంచుకుని కూడా ఏ విధంగా జీవిస్తున్నాం?

ఆ మూడు రకాలైన ఉదాహరణలలో, "ఛ, ఛ నేను అసలు ఎక్కడ ఉండాల్సింది? అమెరికా ప్రెసిడెంట్ యొక్క ప్రైవేట్ సెక్రటరీలాగానో, దేనిలాగానో ఉండాల్సిన వాడిని. ఇండియాలో, ఛీ, ఛీ, ఈ బ్రతుకు బ్రతుకుతున్నాను. ఛీ, ఛీ, ఇలాంటి పిల్లలా నాకు పుట్టాల్సిన వాళ్ళు. అసలు నరరత్నాలు పుట్టాలి. నరమాణిక్యాలు పుట్టాలి."

① ఉన్న పరిస్థితుల్ని తిట్టుకుంటూ ఉంటాం. అదొక వైపు.

② చాలా మందికి అసలు అంత ఓపికా ఉండదు. "పోనీలే, ఏదో ఒకటి! జరిగిపోతున్నాయి రోజులు. ఏదో ఒకటి గడిపేద్దాం. నాకు ఉన్నటువంటి బాధ్యతలు నేను చేస్తాను. చేయగలిగింది ఏదో చేస్తాను."

- ఈ రెండూ తప్పే.

**భగవద్గీత యొక్క ఈ 23 వ శ్లోకం ఏం చెప్తోంది?**

జ్ఞానావస్థితచేతసః మీరు ఇంకా విశాలంగా ఆలోచించుకోవచ్చు. ఇంకా విశాలంగా జీవితం జీవించవచ్చు మీరు.

- ఎప్పుడు ఇంకా మీ జీవితంలో విశాలత్వం వస్తుంది అంటే, యజ్ఞా యాచరతః కర్మ , యజ్ఞమయ కర్మ ఎప్పుడైతే మీరు చేస్తారో, అప్పుడు.

యజ్ఞమయ కర్మ అంటే, భారతదేశంలో యజ్ఞము అనే పదానికి చాలా అద్భుతమైనటువంటి రిపర్కషన్స్, అంటే సంబంధాలు ఉన్నాయి. యజ్ఞము అనే పదం ఎప్పుడైతే వాడతామో, చాలా చాలా మనకి గుర్తొస్తాయి.

వర్షం కురవటం లేదు, యజ్ఞం చేయ్.
గ్రహాలు కరెక్ట్‌గా లేవు, యజ్ఞం చేయ్.
పిల్లలు పుట్టటం లేదు, యజ్ఞం చేయ్.
యుద్ధంలో గెలవాలి, యజ్ఞం చేయ్.

ఫలానా వాడిని చంపటానికి కావలసినటువంటి పిల్లలు నాకు కావాలి, యజ్ఞం చేయ్. ఫలానా వాడు నన్ను అవమానపర్చాడు, వాడిని నేను చంపాలి, యజ్ఞం చేయ్. మహాభారతంలో, రామాయణంలో వచ్చే కథలు ఇవే కదా!

ఆ యజ్ఞవిధానలే ఇప్పుడూ జరుగుతున్నాయి. జాగ్రత్తగా మీరు మాత్రం ఇది మనస్సులో గుర్తుంచుకోండి. యజ్ఞవిధానంలో ఏమీ మార్పు లేదు. సత్యయుగంలో, త్రేతాయుగంలో, ద్వాపరయుగంలో యజ్ఞాలు చేయటానికి ఏ విధమైన కర్మకాండలు చెప్పబడ్డాయో, భావనలు చెప్పబడ్డాయో, ఏ విధమైన సామగ్రిని ఉపయోగించమన్నారో, అదే ఇప్పుడూ చేస్తున్నాం మనం. ఏమీ తేడా లేదు.

**మరి తేడా ఎక్కడ వచ్చింది?**

అప్పుడు యజ్ఞం చేస్తే పూర్ణాహుతిలోనే యజ్ఞ కుండంలోంచి కావలసిన పదార్థాలు బయటకి వచ్చాయి.

దశరథుడు పుత్రకామేష్టి యజ్ఞం చేస్తే పూర్ణాహుతి అప్పుడు ఆయనకి కావలసిన ఫలితం అప్పుడే వచ్చేసింది.

ద్రుపదుడు ద్రోణాచార్యుడి మీద కసితో యజ్ఞము చేస్తే, ఆ యజ్ఞకుండంలోంచి ఇద్దరు బయటకి వచ్చారు. ద్రౌపది, దృష్టద్యుమ్నుడు.

మరి ఇప్పుడు యజ్ఞంచేస్తే బయటకి పొగ వస్తోంది, కళ్ళమ్మట నీళ్ళు వస్తున్నాయి. పొగ రాకుండా యజ్ఞం చేద్దామంటే కుదరటం లేదసలు. ఎక్కడ తప్పు జరిగింది

**మరి ఇక్కడ ఏం చెప్తున్నాడు?**

యజ్ఞాయాచరతః కర్మ సమగ్రం ప్రవిలీయతే

ఈ యజ్ఞము అనే పదాన్ని మనం మర్చిపోయాం. యజ్ఞంలో ఏం ఉపయోగిస్తాం మనం ముఖ్యంగా?

అగ్నిని ఉపయోగిస్తాం.

అగ్నిని ప్రజ్వలింపజేయకుండా యజ్ఞం చేయం.

**అగ్ని ప్రజ్వరిల్లగానే అగ్ని ఏం చేయగలుగుతుంది?**

నాలుగు పనులు చేయగలుగుతుంది.

ఘనపదార్థం నుంచి ద్రవపదార్థము, ద్రవ పదార్థం నుంచి వాయుపదార్థము, వాయుపదార్థం నుంచి ఆకాశ పదార్థంగా అయినా మార్చగలదు.

లేదా, ద రివర్స్. ఆకాశ పదార్థం నుంచి వాయు పదార్థము, వాయు పదార్థము నుంచి ద్రవపదార్థము, ద్రవ పదార్థము నుంచి ఘనపదార్థము.

శ్రో: ఆ ప్రక్రియను మనం యజ్ఞంలో చేయటం లేదు.

శ్రీ: ఇక్కడ కూడా నేను చాలా సార్లు ఇప్పటికీ అబ్జర్వ్ చేస్తూనే ఉంటాను, ఎన్ని సార్లు మనం ఆ అవగాహన చేసుకున్నా, సర్వాభావే అక్షతాన్ సమర్పయామి అనే జాఢ్యం మాత్రం మనకి పోవటం లేదు.

మన ఇంటికి ఎవరైనా బంధువులు వచ్చారను కోండి, టీ బదులు మంచినీళ్ళు ఇస్తున్నాను, దీన్నే టీ అను కుని త్రాగేయండి. సాంబారు బదులు మంచినీళ్ళు పోస్తాను. దీన్నే సాంబారు అనుకోండి. అన్నం బదులు నీళ్ళు పోస్తు న్నాను. దీన్నే అన్నం అనుకుని త్రాగేయండి అని చెప్పం.

కానీ అగ్నిదేవుడ్ని ఆహ్వానించి, గురువుల్ని ఆహ్వా నించి, దేవతల్ని ఆహ్వానించి మనం చేసేది ఏమిటంటే, పుష్పాలు బదులు అక్షింతలు ఇంత మొహాన కొడతాం. దక్షిణ బదులు ఇంత అక్షింతలు మొహాన కొడతాం.

శ్రో: మీ ట్రీట్‌మెంటు మీ మానసికస్థితిని తెలుపుతోంది.

ఇన్ని లక్షల దేవాలయాలలో అన్ని దేవాలయాలలో పూజారులు ఉన్నప్పటికీ కూడా ఇంకొక రామకృష్ణ పరమ హంస నాకు కనిపించటం లేదు. ఎక్కడా వినలేదు నేను.

మనకి ఏదైనా ఆవేదన వస్తే, ఏదైనా బాధ వస్తే, మనం డైరెక్ట్‌గా దేవాలయానికి పరిగెడతాం. మరి అక్కడ ఉన్నటువంటి పూజారికి ఆ భగవంతుడి యొక్క దర్శనం ఎందుకు అవటం లేదు? ఒక రామకృష్ణ పరమహంసకి మాత్రమే ఎందుకు దర్శనం అయింది?

మిగతా వాళ్ళు అందరూ పూజా+అరి అవుతున్నారు తప్ప, పూజారులు అవటం లేదు. అరి అంటే శత్రువు అని కూడా అర్థం ఉంది. అంచేత పూజారి అంటే పూజకి శత్రువు అనే అర్థం కూడా రావచ్చు.

శ్రో: సంస్కృతం చాలా తికమక భాష.

అంచేత ఆ ఫలితం ఎందుకు రావటంలేదో ఈ శ్లోకంలో చెప్తున్నాడు. దాని తరవాత వచ్చేటటువంటి ప్రతీ శ్లోకంలో కూడా, నాలుగవ అధ్యాయం యొక్క చివరి వరకూ కూడా ఈ యజ్ఞము, ఈ యజ్ఞము,ఈ యజ్ఞము గురించే చెప్పుకుంటూ వస్తాడు పాపం ఆ జగద్గురువు.

శ్రో: మన పూజకి ఫలితాలు రాకపోవటానికి ఇదే కారణం, సర్వాభావే అక్షతాన్ సమర్పయామి.

చాలా భయంకరమైన ఒక కోర్టు కేసులో ఒకడు ఇరుక్కున్నాడు. శిక్ష తప్పదు. సరే, లాయర్ దగ్గరకి వెళ్ళాడు.

"నువ్వేమీ గాబరా పడక్కరలేదు. కానీ కాస్త ఫీజు దండిగా ఇవ్వాల్సి వస్తుంది" అన్నాడు.

"నా మొహంలాగ ఉంది! ఉరిశిక్ష పడేట్టు ఉంది. ఉరిశిక్ష తప్పిస్తే నువ్వు అడిగింది ఇస్తాను" అన్నాడు.

"అడిగిందేం ఇవ్వక్కరలేదు బాబూ, లక్ష రూపా యలు ఇవ్వు" అన్నాడు.

"సరే, రైట్!" అన్నాడు.

"సరే నువ్వేం మాట్లాడకసలు. కోర్టులో ఏ ప్రశ్న అడిగినా బే బే అంటూ ఉండు" అన్నాడు.

ఎవడు ఏం అడిగినా ఇంక బే బే యే. లాయరు అద్భుతంగా వాదించేశాడు, "చూశారా ఎంత అమాయకుడో! వీడికి బే బే అనటం తప్ప ఇంకేమీ రాదు. అలాంటి వాడు హత్య ఏం చేస్తాడు, ప్లానింగ్ ఏం చేస్తాడు" అన్నాడు.

సరే జడ్జి ఏదో తికమకలే అంతా అని వదిలేశాడు. సరే, లాయరు వీడి దగ్గరకి వచ్చి "నా ఫీజు!" అన్నాడు.

"బే బే" అన్నాడు.

సర్వాభావే అక్షతాన్ సమర్పయామి అని రెండు అక్షింతలు మీరు కొట్టేసి, ఏం కావాలి మీకు? మీకు మాత్రమే కాదు, తమాషా అది.

ఇటు ఏడు తరాలు, అటు ఏడు తరాలు కూడా,
పూజకి వచ్చిన వాళ్ళకి, పూజకి రానివాళ్ళకీ కూడా,

*అందరికీ ఏం ఏర్పడాలి?*

అయుః, స్థైర్య, క్షేమ, మర్చిపోయాను, ఆ శ్లోకం నాకు గుర్తులేదు. ఇవంతా వచ్చేయాలి.

*హౌ ఈజ్ దట్ పాజిబుల్?*

ఒక భర్త ''నీకు డైమండ్ నెక్లెస్ తెచ్చాను'' అని భార్యకి ఇచ్చాడు. వజ్రాలు బ్రహ్మాండంగా మెరిసిపోతున్నాయి. భార్య చాలా ఆనందించింది. సరే, ఈ లోపల కోటు జేబులో చేయి పెట్టింది. బిల్లు వచ్చింది. ఇరవై రూపాయలు ఉందక్కడ. ఇమిటేషన్ డైమండ్స్.

☺ ఏం చేసి ఉంటుందో ఊహించొచ్చుకదా! మనం అసలు దాని గురించి ఆలోచించొద్దు.

శ్రీ కానీ భగవంతుడికి మీరు ఏం ఇస్తున్నారు? ప్రతిగా మీరు ఏం అడుగుతున్నారు?

10 రూపాయలు కట్టి ఇంజనీరింగ్ కాలేజీలో సీటు కావాలి అంటే రాదు. కానీ, మీరు రెండు అక్షింతలు వేసేసి చేస్తే అది యజ్ఞకర్మ అవదు.

*యజ్ఞము అంటేనే అర్థం ఏమిటి అంటే,*

శాక్రిఫైస్, త్యాగము.

త్యాగము అనేది యజ్ఞం యొక్క పూర్తి అర్థం కాదు. ఇందాక పంకజం గురించి చెప్పినట్టే.

శ్రీ కానీ మీరు ఎంత పెద్ద త్యాగాన్ని చేస్తారో, అంత పెద్ద ఫలితం వస్తుంది.

శ్రీ రామకృష్ణ పరమహంసకి ఆ రిజల్ట్ ఎందుకొచ్చింది? తన సర్వస్వాన్నీ త్యాగం చేసేశాడు.

-- సర్వస్వాన్నీ త్యాగం చేసేశాడు కనుక భగవంతుడు కూడా ప్రతిగా తనని తాను పూర్తిగా ఇచ్చుకున్నాడు. లేకపోతే బే బే యే.

శ్రీ నువ్వు ఎంత ఇస్తే అంతే ఇస్తాడు తప్ప, నువ్వు ఇచ్చిన దాని కంటే ఎక్కువ ఇచ్చేశాడు అనుకోండి, ఆయన్ని న్యాయపూర్వకంగా వర్తించేటటువంటి, కర్మ ఫలితాన్ని ఇచ్చేటటువంటి వ్యక్తిగా ఎలా గుర్తిస్తాం?

ఒకడేమో రెండు అక్షింతలు ఇస్తే దణ్ణం పెట్టాడని అన్నీ ఇచ్చేస్తావా? ఒకడు నీకు దణ్ణం పెట్టలేదుకాని, చాలా కష్టపడ్డాడు. వాడికి ఫలితం ఇవ్వవా?

శ్రీ అలాంటి భగవంతుడు అసలు ఉన్నా వాడి జోలికి వెళ్ళకండి, చాలా ప్రమాదం.

-- మూడీయే కదా! వాడికి ఎప్పుడు ఏ మూడ్ వస్తుందో తెలియదు. వద్దు, అలాంటి భగవంతుడు మనకి వద్దు.

-- అలాంటి భగవంతుడు లేడు.

అంచేత యజ్ఞకర్మ, శాక్రిఫైస్, శాక్రిఫైస్. శాక్రిఫైస్ లేకుండా మీరు ఏ పనీ చేయలేరు. అదీ యజ్ఞకర్మ అంటే.

శ్రీ రెండు రకాలైన శాక్రిఫైస్‌లే మీరు చేయగలరు. మూడవ రకమైన శాక్రిఫైస్ లేదు కూడా.

① డబ్బులైనా శాక్రిఫైస్ చేయగలరు. డబ్బు అంటే నా ఉద్దేశ్యం వనరులు.

② లేకపోతే కాలాన్ని అయినా శాక్రిఫైస్ చేయగలరు.

శ్రీ ఇవి రెండూ లేకుండా మీరు ఏ కోరికనూ తీర్చుకోలేరు.

*సహ యజ్ఞాః ప్రజాస్సృష్ట్వా పురోవాచ ప్రజాపతిః*
*అనేన ప్రసవిష్యధ్వ మేషవోఽస్త్విష్ట కామధుక్.* (3-10)

పూర్వము బ్రహ్మదేవుడు యజ్ఞములతోగూడ ప్రజలను సృష్టించి 'ఈ యజ్ఞములచే మీరభివృద్ధినిబొందుడు. ఇవి మీ యభీష్టములను నెరవేర్చుగాక!' అని వారితో బలికెను.

శ్రీ యజ్ఞము అనేది మీ కోరికలను తీరుస్తుంది.

కోరికలు తీర్చే యజ్ఞాన్ని ప్రజాపతి, సృష్టికర్త బ్రహ్మ సృష్టి ఆదిలోనే మనిషిని ఎప్పుడైతే సృష్టించాడో, అప్పుడే యజ్ఞకర్మను కూడా సృష్టించాడు. *సహ యజ్ఞాః ప్రజాస్సృష్ట్వా* యజ్ఞాన్ని, ప్రజల్ని కలిసి సృష్టించాడు.

*సృష్టించి ఏం చెప్పాడు?*

మీకు కోరికలు ఉంటాయి. ఈ కోరికలని తీర్చుకోవటానికి *ఏషవోఽస్త్విష్ట కామధుక్*,

శ్రీ మీ కోరికలను మీరు యజ్ఞం ద్వారా పిండుకోండి.

శ్రీ ఒక 40 రోజుల పాటు జరిగే యజ్ఞాలు ఉన్నాయి. దాన్ని ''సత్రయాగాలు'' అంటాం.

-- ఒక రోజు, రెండు, మూడు రోజుల్లో పూర్తయిపోయే వాటిని యజ్ఞాలు అంటాం.

***యాగాలు, యజ్ఞాలకి తేడా ఏమిటంటే,***

① చాలా రోజుల పాటు జరిగేది యాగము.

② లిమిటెడ్ టైమ్ పాటు ఉండేది యజ్ఞము.

③ ఇంకా తక్కువ జరిగేది హోమము. ఒక గంటా, రెండు గంటల్లో పూర్తయిపోయే దానిని హోమము అంటాం.

కానీ ప్రక్రియ ఒకటే అన్నిటిలో కూడా.

③ తక్కువ తింటే టిఫిన్ అంటాం.

② ఎక్కువ తింటే భోజనం అంటాం.

① ఇంకా ఎక్కువ తింటే విందు అంటాం.

కానీ పదార్థాలు అవే ఉంటాయికదా!

ఆ విధంగా హోమము, యజ్ఞము, యాగము, ఈ మూడింట్లో కూడా రెండే వస్తువులు మనం ఉపయోగిస్తాం. మనకున్నటువంటి వనరుల్ని ఉపయోగించుకుంటాం, మనకున్నటువంటి కాలాన్ని ఉపయోగించుకుంటాం.

☞ వనరులు, కాలాన్ని ఎక్కడెక్కడ ఉపయోగిస్తామో, దాన్ని యజ్ఞము అంటాం, అది గుర్తుంచుకోండి.

ఇందాక నేను చెప్పిన ఉదాహరణ నిరంతరము గుర్తుంచుకోండి, పంకజము అంటే పద్మము మాత్రమే కాదు. పద్మము కూడా.

అలాగే ఇక్కడ మనం చేస్తున్నటువంటి యజ్ఞము మాత్రమే యజ్ఞము కాదు. ఇది కూడా యజ్ఞమే.

కానీ ఏదైనా యజ్ఞం అవ్వాలంటే, రెండు పనులు ఉండాలి. వనరులు, కాలాన్ని ఉపయోగించుకోవాలి.

సినిమాకెళ్ళాలి. అక్కడా ఇంతేకదా! ఇప్పుడెంత టికెట్టు? ఎంతో నాకు గుర్తులేదు. చాలా కాలం అయింది సినిమాహాల్‌కి వెళ్ళి. 15 రూపాయలు అనుకుందాం. ముందు ఈ రూపాయలు ఇచ్చేయాలికదా! బాబూ ఒక ఐదు నయాపైసలు తగ్గింది అంటే, వాడు ఒప్పుకోడు. ఐదు నయాపైసలు ఎక్కువ ఇస్తానన్నా ఒప్పుకోడు. ఆ క్లాస్‌కి తగిన టికెట్ కావాలి అంటే సరిపడా వనరులు ఉండాలి.

***తరవాత ఇంకా ఏం కావాలి మీకు!***

మూడు గంటలు టైమ్ ఉండాలి మీకు. టైమ్ లేకుండా సినిమాకి వెళ్ళే మూడ్ రాదుగా!

కానీ ఇంకొకటి కూడా ఉంది, నేను చెప్పటం మర్చిపోయాను, సినిమా హాల్‌లోకి వెళితే ఇంకొకటి త్యాగం చేయాల్సి వస్తుంది, మీ నెత్తురు. నల్లులు అవీ ఉంటాయి కదా! అది మరి నేను లెక్కపెట్టటం మర్చిపోయాను. కానీ అది మన సినిమాహాల్స్‌కి.

అంచేత వనరులు, కాలము, ఈ రెండిటిని మీరు కరెక్ట్‌గా ఉపయోగించుకోగలగాలి.

☞ మీరు ఎంత కాలాన్ని, ఎంత వనరుల్ని ఉపయోగించుకుంటారో, దానికి తగినటువంటి ఫలితము మాత్రమే మీకు లభిస్తుంది. అంతకంటే ఎక్కువ రాదు.

బాల్కనీ క్లాసు టికెట్టు మీరు తీసుకుంటే, అక్కడికే వెళతారు. చైర్ టికెట్టు తీసుకుంటే, అక్కడికే వెళతారు.

***కానీ మన కోరికలు ఎలా ఉంటాయి?***

అదీ మనం చేస్తోన్నటువంటి తప్పు.

☞ యథాశక్తి అనే పదంతో ఆధ్యాత్మిక వాదులు తమని తాము మోసగించుకుంటోన్నంత ఎక్కువగా ఇంకెవ్వరూ మోసగించుకోరు.

యథాశక్తి అంటే అర్థమేంటి?

ప్రిన్స్‌పాల్ దగ్గరకి వెళతాం. డొనేషన్సు ఉంటాయి. బేరం మొదలెడతాం అక్కడ. ఆయన ఒక లక్ష అడిగితే, మనం ఎలాగో అలాగ మనం ఇవ్వగలిగినంత మేగ్జిమమ్ ఇవ్వటానికి ట్రై చేస్తాం. కదా!

కానీ భగవంతుడి దగ్గరకి వచ్చేసరికి యథాశక్తి బంగారంతోకాని, వెండితోకాని, మట్టితోకాని, ఆఖరికి భావనతోకాని మీరు విగ్రహాన్ని తయారుచేసుకోవచ్చు అని చెప్పారనుకోండి, "భావనతో చేసుకుంటాం లెద్దు!"

☞ మీకు కూడా భావనలోనే వస్తుంది.
మీరు భావించుకోండి అంటాడు.

☺ మీరు భావనలో విగ్రహం తయారు చేసుకుని కారు కావాలి అన్నారనుకోండి, సరే, కారులో తిరుగుతున్నాను అని భావించుకోండి అంటాడు. దానికేముంది.

అంచేత ఈ యజ్ఞము,

*యజ్ఞాయాచరతః కర్మ సమగ్రం ప్రవిలీయతే.*

ఈ పాయింట్ చాలా జాగ్రత్తగా అర్థం చేసుకున్న తరవాత, నెక్స్ట్ మూడు శ్లోకాలు మనకు చాలా ఈజీగా అర్థమయిపోతాయి.

అంచేత, గత సఙ్గస్య ముక్తస్య ఈ యజ్ఞం చేస్తున్నప్పుడు మీకు రెండు ఉండకూడదు. ఏం ఉండకూడదు?

① అసక్తి ఉండకూడదు, సంగం ఉండకూడదు.

② ఫ్రీగా కూర్చోగలగాలి.

ఎప్పుడైనా అంతేకదా! యజ్ఞం చేయటానికి కూర్చున్నారు. మనస్సు ఎక్కడో ఉంది, ఫ్రీగా లేరు, కరెక్ట్‌గా చేయలేరు. ఎక్కడో ఆసక్తి ఉంది, ఫ్రీగా చేయలేరు. అంచేత

*గత సఙ్గస్య ముక్తస్య జ్ఞానావస్థితచేతసః*
*యజ్ఞాయాచరతః కర్మ సమగ్రం ప్రవిలీయతే.* (4-23)

దేనియందును ఆసక్తి లేనివాడు, రాగద్వేష కామక్రోధాది రూపములు, సంసార బంధముల నుండి విముక్తుడై ఆత్మజ్ఞానము నందే మనస్సును నిలకడ గలిగినవాడు భగవత్ప్రీత్యర్థము చేసే కర్మమును ఆచరించువాడు యజ్ఞమయ కర్మమును ఆచరించువాడు జన్మబంధాదులను కలిగింపక ముక్తి చెందుతాడు.

అర్థమయిందికదా! నెక్స్ట్ శ్లోకం చూడండి.

*బ్రహ్మార్పణం బ్రహ్మహవిర్బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతమ్*
*బ్రహ్మైవ తేన గన్తవ్యం బ్రహ్మకర్మసమాధినా.* (4-24)

యజ్ఞమునందలి హోమసాధనములు, హోమద్రవ్యములు, హోమాగ్ని, హోమము చేయువాడు, హోమము చేయబడినది - అన్నియును బ్రహ్మస్వరూపములే యనెడి ఏకాగ్రభావముతో ఆ యజ్ఞాది కర్మలను జేయు మనుజుడు బ్రహ్మమునే పొందగలడు.

యజ్ఞము ఎలా చేయాలో చెప్తున్నాడు.

***యజ్ఞం అంటే అర్థమయిందికదా,***

మన యొక్క వనరులు, కాలము మీరు ఎంత ఎక్కువ దేని కోసము ఉపయోగిస్తే, అది వస్తుంది మీకు.

- ఇల్లు కట్టుకోవటానికి మీ కాలాన్ని, వనరుల్ని ఉపయోగించుకున్నారు, ఇల్లు వస్తుంది.
- కారు కొనుక్కోవటానికి మీ కాలాన్ని, వనరుల్ని ఉపయోగించుకున్నారు, కారు కొనుక్కుంటారు.
- భగవంతుడ్ని దర్శించటానికి మీ యొక్క వనరుల్ని, కాలాన్ని వినియోగిస్తారు, భగవంతుడ్ని దర్శించుకుంటారు.

*యే యథా మాం ప్రపద్యన్తే తాంస్తథైవ భజామ్యహమ్*
*మమ వర్త్మానువర్తన్తే మనుష్యాః పార్థ సర్వశః.* (4-11)

ఓ అర్జునా! ఎవరేప్రకారముగ నన్ను సేవింతురో వారిని ఆప్రకారముగనే నేననుగ్రహింతును. మనుజులు సర్వవిధముల నామార్గమునే అనుసరించుచున్నారు.

నన్ను ఎవరెవరు ఏ విధమైన భావనలో కొలుస్తారో, ఆ విధమైన భావననే వాళ్ళకి అందిస్తూవుంటాను.

అంచేత యజ్ఞకర్మ ఎలా చేయాలో చెప్తున్నాడు. యజ్ఞం చేయాలి అంటే, ఎంతో కొంత హోమం చేయాలి. హోమ సాధనములు అంటే ఏమిటో అర్థం చేసుకోండి.

హోమసాధనములు ఏ స్థితిలో ఉంటాయి? ఘనస్థితిలో ఉంటాయి, పదార్థ రూపంలో ఉంటాయి.

కంటికి కనిపిస్తూవుంటాయి.

ఈ హోమసాధనాల్ని మనం అగ్నిలో వేస్తున్నాం. అవి వాయు రూపంలోకి వెళ్ళిపోతూవుంటాయి.

కంటికి కనిపించని రూపంలోకి
వెళ్ళిపోతూవుంటాయి.

***మొన్న మనం చెప్పుకున్నాంకదా,***

మన దగ్గర పనికిరాని ఇత్తడి, పనికిరాని లోహము ఉంటే, వాటిని మనం కరిగించేస్తాం. కరిగించిన తరవాత మనకి ఏ రూపం కావాలంటే ఆ మూసలో పోసుకుంటే ఆ రూపం వస్తుంది.

పనికిరాని, మనకి ఇష్టంలేని, ముక్కముక్కలు అయిపోయినటువంటి లోహపదార్థపు ముక్కల్ని హోమ పదార్థముగా వినియోగించుకుంటే,

***ఈ హోమపదార్థం అంటే మీకు అర్థమయిందికదా,***

హోమపదార్థం అంటే వాటి యొక్క భౌతిక ద్రవ్యమయస్థితి నుంచి జలమయస్థితిలోకికాని, లేకపోతే ఆకాశ స్థితిలోకి కాని, వాయుస్థితిలోకికాని పంపిస్తాం.

ఇక్కడ మనం వాయుస్థితిలోకి పంపిస్తున్నాం. ఆ ప్రక్రియ ఇక్కడ ఈ యజ్ఞంలో కూడా జరుగుతోంది.

*బ్రహ్మార్పణం బ్రహ్మహవిర్బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతమ్*
*బ్రహ్మైవ తేన గన్తవ్యం బ్రహ్మకర్మసమాధినా.* (4-24)

రాగితో మనము ఒక వినాయకుడ్ని తయారుచేద్దాం అనుకున్నాం. మన దగ్గర పాడైపోయిన చిలుమెత్తినటువంటి రాగి ముక్కలు చాలా ఉన్నాయి. రకరకాల పాతకాలపువి ఏవో రాగిముక్కలు ఉన్నాయి. రాగితో వినాయకుడ్ని తయారుచేయాలి అంటే, ఏం చేయాలి ముందు?

శ్రీ ఆ పనికిరానటువంటి, పాడైపోయినటువంటి రాగి ముక్కల్ని మాత్రమే హోమద్రవ్యంగా వెయ్యాలి.

-- ఏ పదార్థాన్ని ఏ రూపంలో మనం దించుకోదల్చుకున్నామో, దానికి తగినటువంటి పదార్థాన్ని మనం యజ్ఞంలో వెయ్యాలి.

*బ్రహ్మార్పణం* – బ్రహ్మత్వాన్ని, బ్రహ్మత్వం అంటే ఏమిటి? అన్ని చోట్లా వ్యాపించివున్నటువంటి తత్వాన్ని మనం పట్టుకోదల్చుకుంటే, అన్ని చోట్లా వ్యాపించగలిగే పదార్థాన్ని మాత్రమే హోమము చేయాలి.

*బ్రహ్మహవిర్* – బ్రహ్మను పొందటానికి కావలసినటువంటి హవిస్సునే మనం వేయాలి.

మన పిల్లవాడు ఇంజనీరింగ్ కాలేజీలో జాయిన య్యాడు. డబ్బు తీసుకుని బజారుకి వెళ్ళాం. ఏ పుస్తకాలు కొనుక్కుంటాం? చాలా అందంగా ఉండి, అద్భుతమైన గెటప్‌లో యండమూరి వీరేంద్రనాథ్ క్రొత్త నవల రిలీజ్ అయింది. చాలా అందంగా ఉంది కవరు. దాన్ని కొనం.

చెత్త కవరు, అస్సలు డిజైన్ బాగోలేదు. ఏదో ఒక స్కేలు ముక్క కవరు మీద వేశాడు. ఫర్ ఇంజనీరింగ్ స్టూడెంట్స్ ఓన్లీ అన్నాడు. ఏం చేస్తాం మనం? అదే కొంటాం.

అంచేత మనం ఏ విధమైనటువంటి హవన సామగ్రి వేస్తున్నామో, ఆ హవన సామగ్రి ద్వారా తిరిగి మనకి లభించేటటువంటిది దానికి తగినటువంటి ఫలితాన్నే ఇస్తుంది తప్ప, ఇంకొక విధమైనటువంటి ఫలితాన్ని ఇవ్వదు.

*మనం ఇక్కడ హవనం చేస్తున్నప్పుడు ఏం చేస్తున్నాం?*

దేన్నయినా హవనం చేసేస్తాం.

ఏ పదార్థాన్ని అయినా వేసేస్తాం.

శ్రీ ఏ పదార్థాన్ని అయినా వేసేస్తే, మీకు కావలసింది రాదు. ఆ పదార్థం ఏది మీకు ఇవ్వగలదో, అది మాత్రమే ఇస్తుంది.

జాగ్రత్తగా ఉండండి, ఈ శ్లోకంలో చెప్పేదది.

*బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతమ్* – అగ్ని. బ్రహ్మ అనేటటువంటి అగ్నిలో వేయండి.

మనం ఇక్కడ అగ్ని ప్రజ్వలింపజేస్తాం. అగ్ని ప్రజ్వ లింపజేసిన తరవాత ఇతి పంచోపచారై పూజయేత్ అని అక్కడ చదివేస్తాడు. నెక్స్ట్ స్టెప్‌కి వెళ్ళిపోతాడు.

*ఇతి పంచోపచారై పూజయేత్ అంటే అర్థం ఏమిటి?*

పంచోపచారాలతో పూజ చేయి నాయనా అని. వీడు పూజా చేయడు, ఏం చేయడక్కడ. ఇతి పంచోపచారై పూజయేత్ అనేసి యన్మండలం బ్రహ్మ..... ఈ శ్లోకానికి వెళ్ళి పోతాడు. పూజ ఎగిరిపోయింది.

శ్రీ పంచోపచారాలు పంచతత్వాలకి ప్రతీకలు.

పృథ్వీతత్వము, జలతత్వము, అగ్నితత్వము, వాయుతత్వము, ఆకాశతత్వము, ఈ ఐదు తత్వాలకీ సంబంధించిన పూజ ఎందుకు చేస్తాం మనం?

ఆ యజ్ఞకుండంలో రగులుతోన్నటువంటి అగ్ని నుండి మనకి ఏది కావాలో, ఆ ఎవేర్‌నెస్‌లో ఉండాలి.

ఇప్పుడు నా దగ్గరకి ఎవరైనా వచ్చారు. గబుక్కున ఇప్పుడు కెమిస్ట్రీ మీద ఒక ప్రోబ్లమ్ అడుగుతారు. వాడికి భగవద్గీత చెప్పటం మొదలెడితే నేను? వాడు జుట్టు పీక్కుని పారిపోతాడు. అప్పుడు నా చేతనత్వం ఎలా ఉండాలి? కెమిస్ట్రీ చేతనత్వం ఉండాలి.

హిందీ వచ్చిన వాడు ఎవడో వస్తాడు. గురుదేవుల లిటరేచర్ ఏదో ఉందిటకదా, ఫలానా హిందీ పుస్తకం కావాలి అని అడిగాడు. నువ్వు ఉండవయ్యా, ఇక్కడ కూర్చో. తెలుగు భాషలో చెప్తాను నేను నీకు అని *బ్రహ్మార్పణం బ్రహ్మ హవిర్బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతమ్* అంటే ఇది అని మొదలెట్టా ననుకోండి, వాడికి తెలుగు రాదు పాపం. వాడి పరిస్థితి మీరు ఊహించుకోండి.

శ్రీ అగ్ని అనేది చేతనత్వము, ఎవేర్‌నెస్, కాన్షస్‌నెస్. దానికి ప్రతీక.

-- అక్కడ రగిల్చినటువంటి అగ్ని మీలో రావాల్సినటువంటి చేతనత్వానికి ప్రతీక.

నేనే కెమిస్ట్రీ చెప్పొచ్చు. గీత చెప్పొచ్చు. సావిత్రి చెప్పొచ్చు. ఇదేదీ కాకుండా మొన్న సినిమా హాల్లో ఏం జరిగిందో కూడా చెప్పొచ్చు.

కానీ, ఆ చేతనత్వం మారుతోందికదా!

ఆ మరి ఇక్కడ అగ్నిని మీరు మార్చకపోతే, మీకు ఆ ఫలితం ఎలా వస్తుంది?

**ఎలాంటి అగ్ని కావాలంటున్నాడు?**

బ్రహ్మాగ్నౌ - బ్రహ్మను పొందేటటువంటి చేతనత్వాన్ని రగుల్చుకోండి.

బ్రహ్మణా హుతమ్ - మీరు వేసేటటువంటి ఆహుతి కూడా ఆ రిజల్ట్‌ను మనస్సులో ఉంచుకునే వెయ్యాలి.

**వేస్తే ఏమిటి?**

బ్రహ్మైవ తేన గన్తవ్యం బ్రహ్మకర్మసమాధినా.

ఆ అప్పుడు మీరు చేసేటటువంటి ఆ పని ఆ బ్రహ్మను మీ దగ్గరకి తీసుకొస్తుంది.

జనమేజయుడు ఒక యజ్ఞం చేస్తాడు. ఏమిటా యజ్ఞం పేరు? సర్పయాగం. తక్షకుడు పరీక్షిత్తుని చంపేస్తాడు కదా! అతనికి కోపం వస్తుంది. అంచేత అసలు ఆ నాగ వంశమే ఉండకూడదు, పాములే అసలు భూమి మీద ఉండకూడదు అని యజ్ఞం మొదలెడతాడు.

తక్షకుడికి, ఇంద్రుడికి పెద్ద ఫ్రండ్‌షిప్పు. అదేంటో తమాషా. అంటే ఆపోజిట్ ఎట్రాక్ట్స్ ఏమో! రౌడీలకీ, పోలీసులకీ ఫ్రండ్ షిప్ ఉన్నట్టే, ఇటు తక్షకుడికి, ఇంద్రుడికీ ఫ్రండ్ షిప్ అన్నమాట.

**ఈ తక్షకుడు ఏం చేశాడు?**

ఈ యజ్ఞం జరుగుతోంది అని తెలిశాక, ఆ మంత్ర విద్యను ఎదుర్కోలేనని తెలిసి, ఇంద్రుడు యొక్క సింహాసనాన్ని చుట్టబెట్టుకుని కూర్చుంటాడు.

ఎన్ని సార్లు ఆహుతులు వేసినా, అన్ని రకాల పాములు యజ్ఞకుండంలో పడుతున్నాయికాని, తక్షకుడు రావటం లేదు.

సరే, ఏం జరిగింది అని ఋషుల్ని అడిగాడు. "ఏం చేస్తామయ్యా, హై పొలిటికల్ ఇన్‌ఫ్లుయెన్స్ తీసుకొచ్చాడు. వాడ్ని నువ్వు యజ్ఞకుండంలో అరెస్ట్ చెయ్యలేవు" అన్నారు.

**అంటే ఏమన్నాడు?**

ఇంద్రసహిత, ఇంద్రుడితో పాటు తక్షకుడు రాగాక అన్నాడు. చచ్చాడు ఇంద్రుడు ఇప్పుడు. కదిలాడు. మధ్యలో మళ్ళా మీడియేటర్స్ ఉంటారుకదా, వద్దులే బాబూ అనవసరంగా పెద్ద వాళ్ళ జోలికి మనం ఎందుకు వెళ్ళటం, వదిలేయ్ అని ఋషులు నానా గందరగోళం చేశారు.

ఆ బ్రహ్మకర్మసమాధినా, ఆ సమాధి స్థితిలో, అంటే ఆ ఎవేర్‌నెస్ ఆఫ్ కాన్ష్యస్‌నెస్‌లో కనుక మీరు ఏ విధమైనటువంటి యజ్ఞాన్ని చేస్తారో, ఆ ఫలితాన్ని ప్రపంచంలో ఏ శక్తీ ఆపలేదు.

ఇంద్రుడ్ని కూడా లాగేయొచ్చు అందులోకి. కానీ లాగం, అది వేరే విషయం. ప్రెసిడెంట్ ఏదైనా చేసేయొచ్చు అని వాడి ఇష్టం వచ్చిన పనులు చేయడుకదా!

దైవమేవాపరే యజ్ఞం యోగినః పర్యుపాసతే
బ్రహ్మాగ్నావపరే యజ్ఞం యజ్ఞేనైవోపజుహ్వతి. (4-25)

కొందఱుయోగులు దేవతారాధనారూపమైన యజ్ఞమునే అనుష్ఠించుచున్నారు. మఱికొందఱు జీవబ్రహ్మైక్యభావనచే జీవుని పరబ్రహ్మమను అగ్నియందు హోమముచేయుచున్నారు (ఆహుతి నొనర్చుచున్నారు.)

దైవమేవాపరే యజ్ఞం యోగినః పర్యుపాసతే - కొంత మంది యోగులు ఏం చేస్తారు? ఈ బ్రహ్మతత్వాన్ని గురించి కాకుండా, ఈ క్రియేటివ్ యాక్టివిటీని కాకుండా, వాళ్ళకి కావలసినటువంటి దేవతలను ఈ యజ్ఞ విధానంలో పూజిస్తారు, వాటిని పొందుతూవుంటారు.

బ్రహ్మాగ్నావపరే యజ్ఞం యజ్ఞేనైవోపజుహ్వతి - కొందరు ఏమీ కోరరు. ఈ టెక్నిక్, ఈ యజ్ఞవిధానం నేర్చుకుంటారు.

**ఈ టెక్నిక్ నేర్చుకున్నాక ఏం చేస్తారు?**

యజ్ఞవిధానం, ఈ టెక్నిక్ వాడికి తెలిసిపోయింది. ఇంక వాడి ఇష్టం.

డాక్టరు రోగనివారణ టెక్నిక్ నేర్చుకున్నాడు. అందరూ వాడి దగ్గరకే వస్తూవుంటారు.

**అలాగే ఒకడు ఏం చేస్తాడు?**

ఈ యజ్ఞాన్ని టెక్నిక్ మాత్రమే నేర్చుకుంటాడు.

అటు దేవతల్నీ పూజించదు, అటు బ్రహ్మదేవుణ్ని పూజించదు, ఎవర్నీ పూజించదు. అలాగ యజ్ఞవిధానాన్ని నేర్చుకునే వాళ్ళు కొంత మంది ఉంటారు.

శ్రోత్రాదీనీన్ద్రియాణ్యన్యే సంయమాగ్నిషు జుహ్వతి
శబ్దాదీన్విషయానన్య ఇన్ద్రియాగ్నిషు జుహ్వతి . (4-26)

కొందఱు చెవి మొదలగు ఇంద్రియములను నిగ్రహమనెడి అగ్నులందును, మఱికొందఱు శబ్దాదివిషయములను ఇంద్రియములనెడి అగ్నులందును హోమము చేయుచున్నారు.

ఈ సంయమము అనే పదము ఇందాక పంకజం గురించి నేను చెప్పినట్టే దాని అర్థాన్ని పూర్తిగా కోల్పోయిన పదము. ఆ అర్థాన్ని మనం జాగ్రత్తగా గమనించుకోవాలి అంటే, పాతంజలి యోగ సూత్రాలులోకి వెళ్ళాల్సి వస్తుంది.

ఇప్పటికే గడియారాలు మీదకి మన దృష్టి వెళుతోంది కనుక, మీది వెళ్ళినా, వెళ్ళకపోయినా నాది వెళుతోంది కనుక, ఇక్కడ ఆపుదాం మనం.

**కాని మీరు చేయవలసింది ఏమిటి అంటే**

గబుక్కున లేచిపోకండి. ఒక్కసారి కళ్ళు మూసుకుని, ఆ మానసికస్థితి, ఇంతసేపు ఒక అద్భుతమైనటువంటి విద్య గురించి మాట్లాడుకున్నాం. ఒక్క ఐదు నిమిషాలు ఇవాళ ఏం చెప్పుకున్నామో, దాని గురించి నెమరేసుకోండి.


అగ్ని అంటే ఏమిటో చెప్పుకున్నాం.

తరవాత యజ్ఞం అంటే ఏమిటో తెలుసుకున్నాం.

అగ్ని అనేటటువంటి చేతనత్వాన్ని, యజ్ఞవిధానము అనేటటువంటి ట్రాన్స్ఫర్మేషన్ అఫ్ ఎలిమెంట్స్, ఒక తత్వం నుంచి ఇంకొక తత్వంలోకి వెళ్ళేటటువంటి విద్యను అర్థం చేసుకోవటానికి మనం ప్రయత్నం చేశాం.

దీన్ని కొంచెం మళ్ళా జ్ఞప్తికి తెచ్చుకోండి.

స్వస్తి.



# భగవద్గీత ఉపన్యాసాలు - 32

## జ్ఞానయోగము

1998, డిశంబరు 2 వ తారీఖున సుకృతవిల్లా, గుంటూరులో
మాస్టరుగారు భగవద్గీతపై ఇచ్చిన ఉపన్యాసము



- ధారణ, ధ్యాన, సమాధిల కలయిక సంయమనం
- యోగవిద్యలో మొట్టమొదటి మెట్టు యమ, నియమాలు
- యమ, నియమాలతో వచ్చే భౌతిక సిద్ధులు
- అర్హత లేనిది కావాలనుకోవటం దొంగతనమే
- మీరు పిల్లల్ని కసితో బాదుతున్నారు
- యమములు - సామాజికంగా పాటించేవి
- నియమములు - వ్యక్తిగతంగా పాటించేవి
- ఫలానా గురువు యొక్క శిష్యుడ్ని అనే ఆసనం మీద కూర్చోండి
- ప్రత్యాహారము - ఆహార, విహారాల సమత్వము
- ధ్యానం, సమాధి మీ చేతిలో లేదు. ఇట్ హేపెన్స్

భగవద్గీత 4 వ అధ్యాయంలో 26వ శ్లోకము.

శ్రోత్రాదీనీన్ద్రియాణ్యన్యే సంయమాగ్నిషు జుహ్వతి
శబ్దాదీన్విషయానన్య ఇన్ద్రియాగ్నిషు జుహ్వతి . (4-26)

జ్ఞానయోగ సాధకుడు, అవగాహన ఉన్నటువంటి సాధకుడు శబ్దాలను మిగతా తత్వాలు యొక్క విషయాలను సంయమము అనేటటువంటి అగ్నిలో ఆహుతి చేస్తాడు.

సంయమనము. ఈ పదము కూడా శ్రీకృష్ణుడు అర్జునుడికి చెప్తోన్నప్పుడు భారతదేశములో ప్రతీ వాడికి ఈ శబ్దం యొక్క అర్థం చాలా స్పష్టంగా తెలుసు.

***కానీ ఈనాడు ఈ పదానికి అర్థం ఏమైపోయింది అంటే,***

కంట్రోల్ అని. సంయమనము చేసుకోవటం అంటే కంట్రోల్ చేసుకోవటం అని.

శ్రీ సంయమనము అనే పదానికి అర్థం యోగభాషలో కంట్రోల్ అని కాదు.

❋ ధారణ, ధ్యాన, సమాధి అనేటటువంటి మూడు స్థితులు ఎప్పుడైతే ఒకే చోట కలుస్తాయో, దాన్ని సంయమనము అంటాం.

అదొక టెక్నికల్ వర్డ్.

అంచేత ఆ టెక్నికల్ వర్డ్‌ని మనం పూర్తిగా అర్థం చేసుకోనంత వరకు ఈ సాధనా విధానాన్ని అర్థం చేసుకోలేం.

అంచేత కొంచెం దాని గురించి అవగాహన పెంచుకున్నాక ఈ శ్లోకంలో ఉన్నటువంటి సాధన ఎలా చేసుకోవాలో మనం తెలుసుకోవటానికి ప్రయత్నం చేద్దాం.

- పతంజలి అనేటటువంటి ఋషి యోగసూత్రాలు వ్రాశాడు. వాటిని అష్టాంగ యోగవిధానము అంటాం.
- ఈ అష్టాంగ యోగవిధానంలో 8 స్టెప్స్ ఉన్నాయి.
- -- యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార - ఈ ఐదు ఒక స్థితి. బాహ్యస్థితి.
- -- అంతరంగస్థితికి సంబంధించినటువంటివి మిగతావి మూడు - ధారణ, ధ్యాన, సమాధి.

ఈ యోగవిద్యను నేర్చుకుంటోన్నప్పుడు, ఈ పదాలు వింటోన్నప్పుడు మనకి ఏమనిపిస్తుంది అంటే, ఇదేదో చాలా కష్టమైనది అని.

- శ్రీ కానీ యోగవిద్యలో మీరు నిత్యజీవితంలో నిరంతరం అనుభూతి చెందుతోన్నటువంటి విషయాలకే ఒక స్పష్టమైనటువంటి నిర్వచనం ఇచ్చి పేరు పెడతాం.
- ధారణ, ధ్యాన, సమాధి - ఇవి మూడూ కూడా మీకు తెలిసున్నవే. ఇవి మానసికస్థితికి సంబంధించినటు వంటి యోగవిద్య సాధనా పద్ధతులు.

ఈ సాధనా పద్ధతులు అర్థం చేసుకోవటానికి ముందు, మిగతా ఐదింటి గురించి కూడా మనం కొంచెం తెలుసుకోవటానికి ప్రయత్నం చేద్దాం. సందర్భం వచ్చింది కనుక, తరవాత కూడా దాని అవసరం వస్తుంది కనుక.

- ప్రతీ యోగవిద్యా ఈ ఎనిమిది అంగాలు మీదే ఆధార పడి ఉంటుంది.
- -- భగవద్గీతలోని 18 అధ్యాయాలూ కూడా యోగవిద్యే అంటే అర్థం, భగవద్గీతలోని 18 అధ్యాయాలూ కూడా ఈ అష్టాంగ యోగవిద్య మీద ఆధారపడివుండాలి.

ఈ అష్టాంగాలను మీరు చాలా ఫ్లూయంట్‌గా, తరచుగా మాటలలో దొర్లించుకుంటూ ఉండాలి. అప్పుడు కాని ఈ పదాలకి మనం సాధనావిధానంలో తెలుసుకునే అర్థాన్ని అవగాహన చేసుకోలేం.

- అన్నిటి కంటే ముఖ్యంగా యోగవిద్య సాధకుడు ప్రపంచంలో ఉన్నటువంటి మిగతా వ్యక్తులతో తనకి ఉన్నటువంటి తేడాని గమనించుకోవాలి.

ఏమిటా ముఖ్యమైన తేడా అనేది నేను నిరంతరం చెప్తూవుంటానుకదా, యోగవిద్యా సాధకుడు ఎల్లప్పుడు శీర్షాసనంలోనే ఉంటాడు. అంటే శీర్షాసనం వెయ్యడు. తల్లక్రిందులుగా ఉండడు.

వాడి దృష్టి తల్లక్రిందులుగా ఉంటుంది.

- శ్రీ అది లేనివాడు యోగవిద్యకి అనర్హుడు.

అందువల్లే ఈనాడు గురువుల యొక్క అనుగ్రహం పేరుతో, ఆధ్యాత్మికత పేరుతో వచ్చే పుస్తకాలన్నీ కూడా యోగవిద్య యొక్క స్థాయిని బట్టి చూసుకుంటే చిత్తు కాగితాలు కంటే ఎక్కువ ఉపయోగం ఉండదు వాటికి.

- శ్రీ ఇది మీకు నచ్చినా, నచ్చకపోయినా మీరు మీ మనస్సు ల్లో చాలా స్పష్టముగా ధృడతరము చేసుకోకపోతే యోగములో ముందుకు వెళ్ళలేరు.

"సాధన మొదలెట్టాను, నాకు రోగం పోయింది. నేను గాయత్రీ చేస్తున్నాను, నా కూతురు పెళ్ళయింది. నేను ఇన్ని యజ్ఞాలు చేశాను, మా అప్పులు తీరిపోయాయి!"

- శ్రీ దీని కొరకు అయితే యోగవిద్య మీకు అనవసరం. మనం యోగవిద్య దీని కోసం చేయటం లేదు. అది మీరు చాలా స్పష్టంగా గుర్తుంచుకోండి.
- యోగవిద్య అనేది అసలు మనము ఎందుకు జన్మ ఎత్తాము? ఈ జన్మ పరంపరలకు కారణం ఏమిటి? ఈ జన్మ పరంపరలలో మనము ఇలాగ పుట్టుతూ, చస్తూ ఉండటమేనా? లేకపోతే దీనికి ఒక విశేషమైన లక్ష్యము ఏమైనా ఉన్నదా? ఈ ప్రశ్నలకి జవాబు యోగ విద్యలో వెతుక్కోవాలి మనం.
- శ్రీ రెండు మాత్రలు వేసుకుంటే తగ్గిపోయే రోగానికి యోగ విద్య మీరు సాధన చెయ్యక్కర్లేదు.
- -- అది యోగవిద్య సాధనకి కూడా మార్గము కాదు. మీరు తప్పుడు త్రోవలో వెళ్ళిపోతున్నారు.
- శ్రీ సాధన చేయటం వల్ల భౌతిక సుఖాలు లభించాయి, లేకపోతే భౌతిక సుఖాలు కోసమే మేము సాధనలు చేస్తున్నాం అంటే ఆ యోగవిద్య ఎందుకూ పనికిరాదు.

*నిరంతరము నేను మీకు చెప్తూవుంటాను,*

బుద్ధుడు తరవాత ఇంకొక బుద్ధుడు రాలేదు. రామ కృష్ణ పరమహంస తరవాత రామకృష్ణా మిషన్‌లో ఇంకొక రామకృష్ణ పరమహంస ఆవిర్భవించలేదు. అరవిందో

మిషన్‌లో మళ్ళా ఇంకొక అరవిందో మనకి కనిపించదు.

చాలా మంది ఏమంటారు అంటే, "యోగులు చాలా రహస్యంగా ఉంటారు. వాళ్ళు ఉన్నారేమో!"

సూర్యుడ్ని దాచగలమా? నేను కప్పేసుకుంటాను, నన్ను ఎవరూ గుర్తించకూడదు అనుకున్నా కూడా సూర్యుడు తన ప్రభావాన్ని చూపిస్తూనే ఉంటాడు. దానికి కారణం ఈ విధమైనటువంటి మనకి వచ్చిన రాంగ్ ఐడియాస్!

- భౌతికమైనటువంటి అవసరాలు యోగవిద్య తీర్చదు, తీర్చలేదు, అసంభవము. భగవంతుడు తీర్చలేడు, గురువు తీర్చలేడు, ఎవడూ తీర్చలేడు.

*ఎంచేత తీర్చలేడు?*

మనం ఏ స్థితిలో, ఎక్కడ ఉన్నామో, ఆ స్థితిలో ఉండటానికి ఒక అద్భుతమైన శక్తి కారణం. దాన్ని మీరు భగవంతుడు అనండి, ప్రకృతి అనండి, ఏదైనా అనండి.

మనం పుట్టాలి అనుకున్న చోట మనం పుట్టలేదు. మనం చావాలి అనుకునేటప్పుడు మనము చావలేము. మరి మధ్యలో మీ ఇష్టం వచ్చినట్టు మీరు చేయగలరని ఎలా అనుకుంటున్నారు అని? మన అపోహ అది. మన ఇష్టం వచ్చినట్టు మనకి జరగటం లేదు. ప్రకృతి మనల్ని ఎటు తోస్తోందో, అటు వెళుతున్నాం.

- మనం ఇష్టం వచ్చినట్టు జీవించటానికి ముందు మనం ఎందుకు జీవిస్తున్నామో తెలియాలి. అది తెలియనప్పుడు ఇలాంటి గందరగోళాలే ఏర్పడతాయి.
- అనంతమైనటువంటి యోగవిద్యకు ఆధారమైన భారతదేశంలో యోగవిద్య యొక్క అంకురాలే ఇప్పుడు నాశనం అయిపోతున్నాయి.
- -- ఆ నాశనం కాకుండా ఉండటానికి ఈ క్లాసులు నిర్వర్తించుకుంటున్నాం. అది గుర్తుంచుకోండి.

*మనం సాధన ఎందుకు చేస్తున్నాం అంటే,*

- భౌతిక జగత్తులో ఉచ్ఛస్థితికి వెళ్ళటానికి కాదు. ప్రకృతి రహస్యాలను తెలుసుకుని, ప్రకృతి రహస్యాలలో మన జీవితంలో ప్రకృతి నిర్దేశం ఏమైనా ఉన్నదా? అనేది తెలుసుకోవటానికి. ప్రకృతి మనల్ని ఒక విశేషమైన లక్ష్యం కొరకు భూమి మీదకి పంపించింది.

"నా పరిస్థితి ఏమిటి మాస్టారు! నేను అతి సాధారణ మానవుణ్ని. నేనేం చేయగలను?"

చెప్పులు కుట్టే రైదాస్ అలా అనుకోలేదు.
బట్టలు అల్లే కబీరుదాసు అలా అనుకోలేదు.
సక్కూబాయి అలా అనుకోలేదు.
మాలా పిచ్చావధూతమ్మ అలా అనుకోలేదు.
వీళ్ళందరు గురించీ మనం చెప్పుకుంటున్నాం.

- ఆ స్థాయికి వెళ్ళటానికి చేసే ప్రయత్నాలలో అష్టాంగ యోగవిద్య అవసరం అవుతుంది. లేకపోతే అవసరం లేదది. అందుకని ఇదంతా చెప్పుకు రావల్సి వచ్చింది.
- అష్టాంగ యోగవిద్యలో మొట్టమొదట మనం సాధన చేయవలసినవి యమ, నియమాలు.
- ఈ యమ, నియమాలలో నిష్ణాతత్వం సంపాదించకుండా, ఆ విధమైన జీవిత విధానం జీవించకుండా ఆధ్యాత్మిక జగత్తులో మనం ముందుకు వెళ్ళలేం.
- కానీ, ఆ యమ, నియమాలనే మనం సవ్యంగా ప్రాక్టీస్ చేసుకుంటే, అద్భుతమైన సిద్ధులు మనకి లభిస్తాయి అని పాతంజలి యోగసూత్రం చెప్తోంది.

*యమము అంటే,*

సమాజంలో మనం ఎలా ప్రవర్తించాలి అనేది.

*నియమము అంటే,*

వ్యక్తిగతంగా మనం ఎలా జీవించాలి అనేది.

దానికి ఐదు, ఐదు సూత్రాలు ఉన్నాయి. ఆ ఐదూ మీరు నిరంతరమూ జ్ఞప్తి చేసుకుంటూ, ఆ విధంగా జీవించటానికి మనము శాయశక్తులా ప్రయత్నించాలి.

- అహింస, సత్యము, అస్తేయము, బ్రహ్మచర్యము, అపరిగ్రహము - ఇవి యమములు.

అహింస కనుక మీరు ప్రాక్టీస్ చేయగలిగితే, అంటే మనో వాక్కాయ కర్మలా మీరు ఆలోచనలలో కూడా ఎవరికీ బాధ కలిగించే ప్రయత్నము చేయకపోతే,

తత్సన్నిధౌ వైర త్యాగః

పాతంజలి సిద్ధి గురించి చెప్తాడు. మీరు అహింస ప్రాక్టీస్ చేస్తున్నారా, లేదా అనే దానికి ప్రూఫ్ ఏమిటి అంటే,

① అతని సన్నిధానంలో వైరభావాలు ఉండవు.

మళ్ళా అతను అక్కడ ఉండకపోతే ఫలితం ఉండదు.

వాల్మీకి ఆశ్రమంలో ఆవులు, సింహాలు కూడా ఒకే చోట నీళ్ళు త్రాగేవి అని చెప్తారు. అది అసంభవం అనుకుంటారు. అసంభవం కాదు, సంభవమే అది.

అహింస తరవాత సత్యము.

*సత్యము అంటే,*

చూసింది చూసినట్టు చెప్పటం. విన్నది విన్నట్లు చెప్పటం. ఎంత ఉందో, అంతే చెప్పటం. దానికి అల్లటమూ లేదు, డైల్యూట్ చేయటమూ లేదు.

② 12 ఏళ్ళ పాటు ఈ సత్యాన్ని ఎవరైతే ప్రాక్టీస్ చేస్తారో, అతను ఏం అంటే, అది జరుగుతుంది.

ఋషుల యొక్క వాక్కు జరగటానికి కారణం వాళ్ళ యొక్క సత్యప్రతిష్ఠయే. అంచేత మీ వాక్కుకి పవర్ రావాలి అంటే, మీరు యోగవిద్యా సాధకులు అవ్వక్కర్లేదు.

*గురుదేవులు అందుకే ఎప్పుడూ చెప్తూవుంటారు,*

"చచ్చిపోయిన నాలికతో మీరు ఏ మంత్రాన్ని జపం చేసినా, అదేం పలుకుతుంది?" అన్నారాయన.

*నాలిక ఎందుకు చచ్చిపోతుంది?*

నోరు విప్పితే అబద్ధం. ఆఖరికి హాస్యానికి కూడా అబద్ధాలే చెప్తాం.

శ్రీ అలాంటి అలవాటు యోగ సాధకుడు పోగొట్టుకోవాలి.

సతీ సుమతి గురించి మనం సినిమాల్లో అవీ చూస్తాం. అది జరుగుతుందా అని మీకు డౌట్ వస్తుంది. కచ్చితంగా జరుగుతుంది. 12 ఏళ్ళ పాటు మీరు ఎప్పుడూ అబద్ధం చెప్పకుండా ఉంటే, మీకు మూడ్ వచ్చేసి, ఇంక రేపు సూర్యుడు ఉదయం కాడు అని అంటే, గ్యారంటీగా సూర్యుడు ఇంక ఉదయించలేడు. మళ్ళా మీరు సూర్యుడ్ని మళ్ళా ఉదయించమని చెప్పేంత వరకు ఉదయించడు.

పుస్తకాల్లో వ్రాసినవి ఇవేం అసంభవాలేం కాదు. మనం చెయ్యక అంతే. మనిషి అంత పెద్ద బరువు ఎత్తగలడా అంటాం. కానీ ఒలింపిక్స్‌లో వాళ్ళు పెద్ద పెద్ద బరువులు ఎత్తుతున్నారు. ఎంచేత ఎత్తుతున్నారు? బై ప్రాక్టీస్.

ఔ అంచేత సత్యము ఎప్పుడైతే పలకటము మొదలెడతాడో, వాక్కు యొక్క నిజ స్వరూపం అర్థమవటం మొదలెడుతుంది.

వాక్కు తరవాత అస్తేయము.

దొంగతనం చేయకుండా ఉండటము.

*దొంగతనం చేయకుండా ఉండటం అంటే ఏమిటి?*

మనది కాని వస్తువుని మనం ముట్టుకోకుండా ఉండటం. అంతకంటే ఇంకేం లేదు. మనదికాని వస్తువు ఇంకొకళ్ళ పెర్మిషన్ లేకుండా మనం ఉపయోగించుకుంటే, ఆధ్యాత్మిక జగత్తులో అది కూడా దొంగతనంలోకే వస్తుంది.

③ అస్తేయాన్ని ప్రాక్టీస్ చేసే వ్యక్తి భూమి లోపలకి కనుక తన దృష్టిని ప్రసరింపచేస్తే, భూమిలో ఉన్న రత్నాలు అతనికి కనిపించటం మొదలెడతాయి.

మరి మనకి కనిపించటం మొదలెడితే ఏం చేస్తాం ముందు? అందుకని కనిపించవు. అవి కనిపించకపోవటానికి కారణం అంతే.

అలెగ్జాండరు భారతదేశం యొక్క గొప్పతనం గురించి చాలా విన్నాడు. భారతదేశంలో రాజుల యొక్క తీర్పు ఎలా ఉంటుంది అనేది తెలుసుకోవటానికి మారు వేషంలో, పోరస్, పురుషోత్తముడి రాజ్యానికి వస్తాడు.

అతను వచ్చిన రోజే ఒక కేసు నడుస్తోంది. కేసు ఏమిటి? ఒకడు పొలాన్ని అమ్మాడు. ఇంకొకడు పొలాన్ని కొన్నాడు. కొన్న రెండు, మూడు నెలల తరవాత ఎప్పుడో లోతుగా దున్నుతూ ఉంటే నిధి కనిపించింది.

*ఇప్పుడు కేసు ఏమిటి అంటే,*

నిధి దొరికినవాడు ఏమంటాడు అంటే, "నువ్వు నాకు అమ్మినప్పుడు నిధి ఉంది అని నీకు తెలియదు. నువ్వు నాకు పొలాన్ని మాత్రమే అన్నావు కనుక నిధి నీది"

అమ్మినవాడు ఏం అంటాడు, "నిధి ఉంది అని నాకు తెలియదుకదా! అమ్మేశాను. ఇప్పుడు దొరికింది. కనుక నిధి నీది"

అదీ ఆ కేసు. ఇప్పటిలాంటి కేసు కాదు.

అస్తేయం అంటే అది.

భారతదేశం యొక్క ద గోల్డెన్ పీరియడ్, ఆ చంద్ర గుప్తుడు కాలం అది. మరి నిధి ఇప్పుడు దొరికితే?

అలెగ్జాండరుకి భలే ఆశ్చర్యం వేసింది. ఏం తీర్పు చెప్తాడో చూద్దాం, అదే నేను అయితేనా అని మనస్సులో అనుకున్నాట్ట. ఏం చేసుండేవాడు అలెగ్జాండరు?

***ఇప్పుడు గవర్నమెంటు ఏం చెప్తోంది!***

నిధులు దొరికితే గ్యారంటీగా అవి మీవి కాదు. మీ పొలాల్లో, మీ ఇళ్ళల్లో దొరికినా నిధి గవర్నమెంటుది.

అంచేత అలెగ్జాండరూ అదే తీర్పు చెప్తాడు అనుకున్నాడు. అతను అది తీర్పు చెప్పలేదు. అడిగాట్ట, "మీకు అడపిల్లలు ఉన్నారా, మీకు మగపిల్లలు ఉన్నారా?" అదేం ఫ్యామిలీ ప్లానింగ్ రోజులు కావుకదా, "ఉన్నారు."

"ఒక పని చేయండి, మీ అమ్మాయిని వాళ్ళ అబ్బాయికి ఇచ్చి పెళ్ళి చేసేయండి. కట్నంలో ఆ నిధి ఇచ్చేయండి సరిపోతుంది" అన్నాట్ట.

అస్తేయము. ధనము మీద ఉన్న ఆ రాగహీనత.

ధనము అప్పుడూ అవసరమే. అప్పుడూ బీదవారు ఉండేవారు, అప్పుడూ బాధలు ఉండేవి, ధనం ఆవశ్యకత ఉండేది. ధనం లేనివాళ్ళకి ధనం కావాలి అనిపించేది.

కానీ, ఈ విధమైన అస్తేయము, "నాది కాదుకదా అది. దాన్ని నేను ఎందుకు ఉపయోగించుకోవాలి?"

కానీ ఇప్పుడు జీవితాలలో, "నాకు హక్కు ఉన్నా, లేకపోయినా, మిగతా వాళ్ళ అందరికంటే ముందుగా నాకు ప్రమోషన్ వచ్చేయాలి."

- అదీ స్తేయమే! నీకు అర్హత లేనిది నీకు కావాలనుకోవటం అదీ దొంగతనమే.

అంచేత ఎప్పుడైతే ఈ విధంగా మీరు మనది మాత్రమే మేం ముట్టుకుంటాం అని తెలుసుకుంటారో, అతనికి భూమిలో ఉన్న రత్నమాణిక్యాలు, నిధులు అన్నీ కనిపించటం మొదలెడతాయి.

అతను ఎక్కడ ఏది చేసుకోమని చెప్తే, అక్కడ అనంతమైనటువంటి లాభాలు ఏర్పడతాయి.

జంషెడ్‌జీ టాటా ఫ్యాక్టరీ పెట్టాలని ఎక్కడ పెట్టాలని వివేకానందని అడిగాడు. సరే, ఆయన అక్కడ అక్కడా తిరిగి, ఆ చోటు చూపించాడు. నిజంగా చెప్పాలంటే, ఫ్యాక్టరీకి ఆ కాలంలో అనుకూలమైనటువంటి పరిస్థితి కాదు అదక్కడ. కావలసిన వనరులు అక్కడ లేవు. కానీ వివేకానంద చెప్పాడుకదా అని పెట్టాడు అక్కడ.

ఏమైందది? ఇప్పటికీ అది ఒక మహానగరంగా భాసిల్లుతోంది ఫ్యాక్టరీ. మరి మిగతా ఫ్యాక్టరీలు అన్నీ రెండవ రోజే సిక్. ఫ్యాక్టరీలకే రోగాలు వచ్చేస్తాయి. గవర్నమెంటు ఫ్యాక్టరీలు అంతా లాసుల్లోనే నడుస్తూవుంటాయి.

ఎంచేత? అంతా స్తేయమే. స్టాకు రిజిస్టర్‌లో స్తేయం. వచ్చిన వనరుల్లో స్తేయం. అంతా స్తేయమే, ఇంకేం మిగులుతుంది అక్కడ?

- అంచేత అస్తేయం కనుక నేర్చుకుంటే, మన శరీరంలో ఉన్న అనేక వజ్రవైఢూర్యాలు, మాణిక్యాలు, అవి కూడా మనకి అర్థమవుతాయి.

అంచేత అష్టాంగ యోగవిద్యలో మొదటి మెట్టులోనే ఎన్ని సిద్ధులు ఉన్నాయో చూడండి. ఇవంతా మొదటి మెట్టే. యమములో ఉన్న ఐదు భాగాలు చెప్తున్నాను.

అహింస, తత్సన్నిధౌ వైరత్యాగః అతని దగ్గర దెబ్బలాటలు ఉండవు. నిజంగా ఆ పరిస్థితి ఏర్పడుతుందా?

ఋషుల యొక్క జీవితంలోనే కాదు, గాంధీగారి జీవితంలోనే మనం చూస్తాం. చోరాచోరీలో, కలకటా దగ్గర రైయిడ్స్ జరుగుతున్నాయి, అందరూ కొట్టేసుకుంటున్నారు, చంపేసుకుంటున్నారు. ప్రైమ్ మినిస్టరు, వాళ్ళందరూ ఢిల్లీలో కూర్చుని, చాలా ప్రమాదం, మీరు వెళ్ళకూడదు అని చెప్తూవుంటే, ఒక్కడూ వెళ్ళిపోయాడక్కడికి. గాంధీ సినిమాలో చూశారుకదా, చాలా కరెక్ట్‌గా పిక్చరైజ్ చేశాడది.

ఒకడు వస్తాడు గొడ్డలి పట్టుకుని. నా కూతుర్ని నా కళ్ళ ముందే వీళ్ళు చంపేశారు. నేను వీళ్ళను ఈ గొడ్డలితో చంపేద్దామనుకుంటున్నాను. కానీ నువ్వేమో తిండి మానేసి చచ్చిపోతానని కూర్చున్నావు ఇక్కడ. నీ చావు నా మీద రాకూడదు అని చెప్పి తన అస్త్రాన్ని అక్కడ పడేస్తాడు.

తత్సన్నిధౌ వైరత్యాగః. అక్కడికెళితే వైరత్యాగం

అవుతుంది. నేను ఢిల్లీలో కూర్చుని అక్కడ రాయిడ్స్ ఆపే స్తాను అంటే అది కుదరదు. అది గుర్తుంచుకోండి మళ్ళా.

అందుకే ఈ గురువులుకాని, సాధకులుకాని, వాళ్ళు అహింస ఎంత ప్రాక్టీస్ చేశారు అని తెలుసుకోవటానికి అడవుల్లోకి వెళ్ళిపోతారు. మన గణపతి సచ్చిదానంద చరిత్రలోకాని, మిగతా గురువుల చరిత్రలోకాని, వాళ్ళు అడవులకి వెళ్ళిపోతే పాములు, తేళ్ళు, జెర్రెలు, సింహాలు, ఇవన్నీ వాళ్ళ చుట్టూరా తిరుగుతూవుంటాయి. వాళ్ళని ఏం చెయ్యవు. చెయ్యకపోవటానికి కారణం ఏమిటంటే, వాళ్ళల్లో ఉన్నటువంటి అహింసే.

- అహింస యొక్క పరాకాష్ఠ వైరత్యాగాన్ని చేస్తుంది.
- అంచేత మన కుటుంబాలలో ఎక్కడైనా వైరత్వం ఉంటే, మానసికమైనటువంటి క్లేశాలు ఉంటే, అహింస ప్రాక్టీస్ చేయాలి. దేర్ ఈజ్ నో అదర్ వే. యోగవిద్య మొట్టమొదట చెప్పేది అది.

### అహింస ప్రాక్టీస్ చేయటం అంటే ఏమిటి?

మనకి మంచి కోరేవాళ్ళకి మంచి కోరటం పెద్ద గొప్పేంకాదు. మనకి చెడు చేస్తోన్న వాళ్ళకి కూడా మంచి జరగాలి అనుకోవటం అనేది అహింస యొక్క ప్రాక్టీస్.

అహింస, సత్యము, అస్తేయము, బ్రహ్మచర్యము.

- బ్రహ్మచర్యము సాధారణ బ్రహ్మచర్యము నుంచి నిరంతరము మన మనస్సు భగవంతుడి మీద లగ్నం అవటం వరకు వేరీ అవుతూవుంటుంది.
- కానీ మన సాధనా విధానంలో దాన్ని నేచర్ ఈజ్ ఆల్వేస్ రైట్ అనేటటువంటి ఫార్ములాతో అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేస్తాం.

### అంటే, ఏం చేస్తున్నాం మనం అక్కడ?

ప్రకృతి ఏ పరిస్థితుల్లో ఉంచుతుందో, ఎలా ఉంచుతుందో, అలా ఉండటానికి ప్రయత్నం చేస్తాం.

తరవాత అపరిగ్రహం.

అస్తేయానికి అపరిగ్రహానికి తేడా ఉందికదా!

- అస్తేయం అంటే మనది కాని వస్తువు ముట్టుకోం.
- అపరిగ్రహం అంటే ఎవడైనా మనకి ఏదైనా ఒక వస్తువు ఇచ్చినా తీసుకోము.

శ్రీకృష్ణ సీరియల్‌లో సుధాముడు ఒక బ్రాహ్మణుడు ఎలా జీవించాలో చూపించాడు. వాడు అడుక్కునే తినాలి. ఎలా అడుక్కోవాలి? ఐదు ఇళ్ళు మాత్రమే అడుక్కోవాలి.

ఐదిళ్ళల్లో ఆ రోజు కర్మం చాలక, వాళ్ళ మూడ్ బావుండలేదు. గెస్ట్‌లు ఎవరో వచ్చేసి ఇరిటేట్ చేస్తున్నారు. లేకపోతే పిల్లలు స్కూలుకి వెళ్ళటం లేదు, లేకపోతే పిల్లవాడి రిజల్ట్ వచ్చింది. ఏదో వచ్చింది, మూడ్ బాగోలేదు. అప్పుడు వీడు వెళ్ళి భవతి భిక్షాందేహి అంటే "పో, పోవయ్యా!" అంటాం. పో పోవయ్యా అంటే, సరేలే ఇంకొక ఐదు కాదు.

- ☺ పిల్లలు టాస్ వేస్తూవుంటారు. ఎంత వరకూ టాస్ వేస్తూవుంటారు? వాళ్ళు అనుకునేది పడేంత వరకు.

అలా కుదరదు. అపరిగ్రహం అంటే అది.

- మీరు తీసుకోవద్దనీ కాదు, అడగవద్దనీ కాదు. నాకు ఇంత చాలు అని ఒక లిమిట్ పెట్టుకోండి.
- నాకు ఇంత చాలు అన్నాక మిగతాది వస్తే తీసుకుంటాం. రాకపోతే కావాలని కోరుకోం.

**యదృచ్ఛాలాభసన్తుష్టో ద్వన్ద్వాతీతో విమత్సరః**
**సమః సిద్ధావసిద్ధౌ చ కృత్వాపి న నిబధ్యతే. (4-22)**

అప్రయత్నముగ లభించినదానితో సంతుష్టిని బొందువాడును, సుఖదుఃఖాది ద్వంద్వములను దాటినవాడును, మాత్సర్యములేనివాడును, ఫలముయొక్క ప్రాప్తాప్రాప్తములందు సమబుద్ధిగలవాడు (లేక కార్యము సిద్ధించినను, సిద్ధింపకున్నను సమభావముతో నుండువాడు) నగు మనుజుడు కర్మముచేసినను బంధింపబడడు.

ఏది లభిస్తే, దానితో ఆనందంగా ఉంటాం.

⑤ ఇది ప్రాక్టీస్ చేసుకోగలిగితే, పాతంజలి ఏం చెప్తాడు అంటే, మీకు పూర్వజన్మ స్మృతులు లభిస్తాయి.

అంచేత ఇన్ని సిద్ధులు, ప్రతీదీ అద్భుతమైన సిద్ధే కదా! అహింస ప్రాక్టీస్ చేస్తే, విషజంతువులు కాని, క్రూర మనుష్యులు కాని మిమ్మల్నేం చేయలేరు.

అంగుళీమాలుడి అలవాటు ఏమిటంటే, వాడికి ఎదురుగుండా ఎవడు వస్తే, వాడి చేయి నరికేయటం, వాడి వ్రేళ్ళని మెడలో వేసేసుకోవటం. బుద్ధుడుతో చెప్పారు, "నాయనా నువ్వు అటు వెళ్ళకు, వాడు వస్తున్నాడు" అని. "సరే, నేను బయలుదేరాను, ఇంక నేను చేసేదేముంది?" ఏమైందో తెలుసుకదా కథ. అహింస!

**మనమేం చేస్తాం?**

అద్భుతమైనటువంటి అహింస ప్రాక్టీస్ చేస్తాం.

❁ పిల్లవాడు బాగా చదువుకోవాలని, మంచి చేస్తున్నాం అని వాడ్ని చితక బాదేస్తాం. అది ఎంత తప్పో, మీరు ఆలోచిస్తే మీ అంతట మీకే తెలుస్తుంది.

చాలా మంది నన్ను అడుగుతారు, "అయితే మాస్టారు, పిల్లవాడ్ని కొట్టకూడదా, దండించకూడదా?"

దండించి ఎంత మందిని మార్చగలమో మన న్యాయ వ్యవస్థే చెప్తోందికదా!

ఇన్ని జైల్సు ఉన్నాయి, ఎవడూ మారడు. కానీ ఒక బుద్ధుడు, ఒక వివేకానంద, ఒక రామకృష్ణ పరమహంస వేలాది మంది మనుష్యుల్ని మార్చేశారు.

అహింస. ఆ అహింసను మీరు బాగా ప్రాక్టీస్ చేసుకోవటానికి ప్రయత్నించండి.

ఇమ్మీడియెట్‌గా నాకో ప్రశ్న వేస్తారు, "మాస్టారు నన్ను దోమ కుట్టింది. దోమని చంపొచ్చా, చంపకూడదా?"

చాలా హాయిగా మీరు చంపొచ్చు. దోమని చంపటానికి అహింసకి సంబంధం లేదు. అహింస అనేది ఒక మానసికస్థితి. అందుకే నేను మీతో రిపీటెడ్‌గా చెప్తాను, భారతీయ ఆధ్యాత్మికత సర్వనాశనం అయిపోయింది అని.

యుద్ధం చేస్తోన్న వీరుడు హింస చేస్తున్నాడా లేదా? అర్జునుడు ఇప్పుడు హింస చేయబోతున్నాడా లేదా? ఎవర్ని చంపబోతున్నాడు? వాళ్ళ తాత, ముత్తాతల్ని, గురువుల్నే చంపబోతున్నాడు. వాళ్ళ మీద పూలు కాదు జల్లేది, బాణాలు జల్లుతున్నాడు. ఇంతకీ అది అహింస అవునా, కాదా?

"అయితే మేం అలాగే మా పిల్లల్ని బాదేస్తున్నాం మాస్టారు, మీకేం తెలుసు?"

❁ మీరు అలా ఏం బాదటం లేదు. మన మాట వినటం లేదు అనే కసితో వాళ్ళని బాదుతున్నాం.

అంచేత అహింస అనేది ఒక మానసికస్థితి.

❁ మీరు ఎవరికీ ఏ విధమైన హానీ స్వయముగా తలపెట్టరు. మీ ద్వారా ఎవరికైనా ఏదైనా హాని జరిగితే, అది వారి ఖర్మ! పరిస్థితుల వల్ల జరుగుతుంది.

మరి దీని మధ్య గీత ఎలా గీసుకోవటం?

**నేను మీతో చెప్తానుకదా,**

సెంటిపీడ్, వంద కాళ్ళ జంతువు నడుస్తోందిట. ఒక తుంటరి కుర్రాడు అడిగాట్ట దాన్ని.

"నేను రెండు కాళ్ళతో అడుగులు వేయటం నేర్చుకోవటానికి ముందు ఎడం కాలా, ముందు కుడికాలా అని అవస్థ పడ్డాను. మరి నువ్వు ఇన్ని కాళ్ళతో గుమ్‌గుమ్‌గుమ్ అని నడుస్తున్నావుకదా! ముందు నువ్వు ఏ కాలు ఎత్తుతావు, తరవాత ఏ కాలు ఎత్తుతావు?" అని.

"అవును సుమా, కదా! ఇది చాలా పెద్ద ప్రశ్నే!" అని ఆగిపోయిందిట. ఇంక అప్పట్నుంచి అది నడవటం లేదు, ఆలోచిస్తూ అక్కడే ఉందిట.

అంచేత అహింస ఎలా చెయ్యాలని మీరు ప్రశ్న మీద ప్రశ్న వేస్తూ కూర్చుంటే, ఇక్కడే ఉండిపోతారు. ప్రాక్టీస్ చెయ్యండి, అహింస అన్నది ఏమిటో, దాని వేరియస్ స్థితులు ఏమిటో మీకే అర్థమవుతుంది.

అలాగే సత్యానికి, సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్, న బ్రూయాత్ సత్యమప్రియం.

ఋషులు చెప్పినటువంటి వాక్కు అది.

శ్రీ సత్యమే మాట్లాడు. కానీ ప్రియకరమైనటువంటి సత్యం అయితేనే మాట్లాడండి. ఒకవేళ అది అప్రియం అయింది అనుకోండి, నబ్రూయాత్ సత్యమప్రియం. మౌనంగా ఉండిపోండి. ఊరుకోండి అంతే.

ఈ విధంగా మీరు అనేక వేరియస్ సాధనల్లో యమాన్ని కనుక పాటిస్తే, మీకు వచ్చే సిద్ధులు ఎంత?

① మీ సన్నిధానంలో వైరం ఉండదు.

② మీరు ఏమి అంటే అది జరుగుతుంది.

③ రత్నాలు, మాణిక్యాలు అవీ మన ఇళ్ళల్లో ఏవైనా ఉంటే అవి మన కంటికి కనిపిస్తాయి.

కానీ కనిపించినా మీరు ఉపయోగించుకోరు. ఎంచేతంటే, మీరు అస్తేయం ప్రాక్టీస్ చేస్తున్నారు కనుక.

④ నిరంతరమూ భగవంతుడి యొక్క సన్నిధానంలో మీరు జీవిస్తూవుంటారు.

⑤ మీ యొక్క పూర్వజన్మ స్మృతులు తెలుస్తాయి.

మీ యొక్క పూర్వజన్మ స్మృతులు తెలిసినప్పుడు సహజంగానే మీతో పాటు ఉన్నటువంటి వాళ్ళ యొక్క పూర్వజన్మ స్మృతులు కూడా తెలుస్తాయి.

***ఎంచేతంటే,***

కచ్చితంగా మీతో సంబంధం కలిగివున్న వాళ్ళే మీతో పాటు దగ్గరగా పుడతారు. ఈ జన్మలో మీ చుట్టూరా ఉన్న వ్యక్తులు పూర్వజన్మలో ఇంకో రకమైనటువంటి సంబంధ బాంధవ్యాలతో మీతో ఉన్నారు. అవి మీకు తెలుస్తాయి.

ఇవి పాతంజలి యొక్క యోగశాస్త్రంలో యమము అనేది ప్రాక్టీస్ చేస్తే వచ్చే లాభాలు సమాజంలో.

❋ రెండవది, నియమము. స్వంతంగా వాడు చేసుకునేవి.

-- శుచి, సంతోషము, తపస్సు, స్వాధ్యాయము, ఈశ్వర ప్రణిధానము - ఇవి ఐదు నియమాలు.

శుచిగా ఉండటం యొక్క పరాకాష్ట మడిగా మారింది. నన్ను ముట్టుకోకు, నన్ను ముట్టుకోకు.

యోగసాధకుడు తన జీవితాన్ని మనోవాక్కాయ కర్మలా పరిశుద్ధంగా ఉంచుకుంటే, నా జీవితంలోనే నేను అనేక సార్లు చూశాను, ఆ వ్యక్తి బస్సు ఎక్కుతాడు, సిటీస్‌లో బస్సులు ఎంత రష్‌గా ఉంటాయో తెలుసుకదా మీకు. కానీ వీడు కూర్చున్న చోట ఎవడూ కూర్చోడు. వీడు మడి, మడి, నన్ను ముట్టుకోకు అనేం చెప్పక్కర్లేదు.

❋ శుచి కనుక మనం ప్రాక్టీస్ చేసుకుంటే సహజంగానే మీ జోలికి ఎవడూ రాడు. మిమ్మల్నెవరూ ముట్టుకో లేరు. అసంభవం అది.

మహాభారతంలో నారాయణాస్త్రాన్ని సోమదత్తుడు అనేటటువంటి ఒక వ్యక్తి అర్జునుడి మీద ప్రయోగిస్తాడు. ఆ నారాయణాస్త్రానికి విరుగుడు శౌచమే.

శుచి అనే శక్తి మీలో జాగృతం అవ్వాలి.

***శుచి అనే శక్తి అంటే ఏమిటో అర్థం చేసుకోండి,***

అగ్ని గురించి నిన్న మనం చెప్పుకున్నాం కొంచెం. అగ్ని అనేది ఒక మానసికస్థితి అని చెప్పాన్నేను మీకు. ఆ మానసిక స్థితిని మూడు రకాలుగా వేదాల్లో చెప్తూవుంటాడు. పావక, పవమాన, శుచి.

① "పావక" అనే అగ్ని మనం ఉపయోగించేది.

② "పవమాన" అనేటటువంటి అగ్ని హనుమంతుడు ఉపయోగించుకున్నది.

③ "శుచి" అనే అగ్ని సీతాదేవి ఉపయోగించుకున్నది.

అంతకంటే డీప్‌గా ఇవాళ చెప్తే, అసలు నేను చెప్ప దల్చుకున్నది మిస్సవుతాను. అంచేత ఇది గుర్తుంచుకోండి.

*యశ్శుచిః ప్రయతో భూత్వా జుహుయా దాజ్యమన్వహం*
*శ్రియః పంచ దశర్చంచ శ్రీకామః సతతం జపేత్.*

శ్రీసూక్తంలో చివరి శ్లోకం.

***యశ్శుచిః*** - శుచి అనే అగ్నిని ఎవరైతే ప్రజ్వలింప జేయగలుగుతున్నాడో, అంటే, ఘర్షణతో యజ్ఞకుండంలో ఏర్పడిన "అగ్ని"ని "పవమాన" అగ్నిగా మార్చుకుని ఆ పవమాన అగ్నిని "శుచి" అనే అగ్నిగా మార్చుకోవాలి.

ఇంద్రుడి యొక్క భార్య పేరు శుచి. ఇంద్రుడు అంటే మనస్సే. అగ్ని యొక్క భార్యకి ఎలాగైతే స్వాహా అని మనం పేరు పెడతామో, మనస్సు యొక్క భార్య పేరు శుచి. ఆ మానసికస్థితి శుచి. నిరంతర పవిత్రత అన్న మాట. అసలు పవిత్రత తప్ప ఇంక ఏం ఉండదు.

*న హి జ్ఞానేన సదృశం పవిత్రమిహ విద్యతే*
*తత్స్వయం యోగసంసిద్ధః కాలేనాత్మని విన్దతి. (4-38)*

ఈ ప్రపంచమున జ్ఞానముతో సమానముగ పవిత్రమైనది ఏదియును లేదు. అట్టి జ్ఞానమును (కర్మ) యోగసిద్ధిని పొందిన వాడు కాలక్రమమున తనయందే స్వయముగ పొందుచున్నాడు.

జ్ఞానాన్ని మించినటువంటి పవిత్రమైనది ఇంక ఏదీ లేదు. ఆ శుచి గురించి మాట్లాడుతున్నాడు.

① ఆ శుచి కనుక ఎవరైనా ప్రాక్టీస్ చేస్తే, వాడు శరీరాలను మార్చేసుకోగలడు.

-- ఈ శరీరం నుంచి ఇంకొక శరీరానికి, అలా ఒక శరీరం నుంచి ఇంకొక శరీరానికి వ్యక్తి వెళ్ళిపోగలడు.

శుచి తరవాత సంతోషము.

❋ నేచర్ ఈజ్ ఆల్వేస్ రైట్. సంతోషం! ఏది దొరికితే అంతే ఆనందం. ఎక్కడ ఉంటే అదే ఆనందం.

② అతని సన్నిధానంలో పరమమైన ఆనందం, తుష్టి అంటామే, పీస్, శాంతి లభిస్తుంది అని చెప్పాడు.

తపస్సు! ఇక్కడ పెద్ద గందరగోళం.

నాతో చాలా మంది అంటూవుంటారు, "మాస్టారు, మీరు హిమాలయాలకి కాని, అడవులకికాని మీరు వెళితే మమ్మల్ని తీసుకెళ్ళండి" అని.

అంటే నన్ను వెళ్ళిపొమ్మనికదా వీళ్ళు అంటున్నారు అని నాకు చాలా బాధ వేస్తుంది. అంతేకదా! మీరు వెళ్ళి నప్పుడు తీసుకెళ్ళండి అంటే అర్థం ఏమిటి?

మనింటికి ఎవరైనా గెస్టులు వచ్చారు. "ఏమండి మీరు వెళుతున్నప్పుడు ఈ పుస్తకం తీసుకెళతారా" అంటే అర్థమేంటి? ఇంక మీరు వెళ్ళండి అని చెప్పటమేగా!

కానీ హిమాలయాలకి, అడవులకి నేను వెళతానో, వెళ్ళనో నాకు తెలియదుకాని, అక్కడికెందుకు వెళతాం అంటే తపస్సు చేసుకోవటానికి వెళతాం.

సరే పదండయ్యా తపస్సు చేసుకోవటానికి ఇప్పుడు వెళదాం అని మనం బయలుదేరదాం.

**ఎక్కడికెళదాం హిమాలయాల్లో!**

త్రియుగీ నారాయణ అని ఒక అద్భుతమైన స్థలం ఉంది. నాకు గత 10, 15 ఏళ్ళగా అక్కడికి వెళ్ళాలని కోరిక.

- త్రియుగీ నారాయణ పార్వతీ పరమేశ్వరుల వివాహం జరిగిన స్థలము. అక్కడ అప్పుడు రగిల్చినటువంటి అగ్ని ఇప్పటికీ వెలుగుతూనే ఉంది.

చాలా మంది గురువులు, ఈ శిరిడీసాయి, మా గురుదేవులు, శ్రీరామశర్మ ఆచార్య, అక్కడ్నుంచే అగ్నిని తీసుకొచ్చి అఖండ అగ్నిని వాళ్ళు స్థాపించారు. అక్కడికి వెళ్ళాలని నా కోరిక. కుదరటం లేదు.

సరే, మనమందరం వెళ్ళాం. చలిగా ఉంటుంది. అంచేత ముందే తిట్టుకోవటం మొదలెడతారు మీరు. సరే, మొదటి రోజే కదా ఇంక. అంచేత ఇంకా పెద్దగా గాబరా ఉండదు. పడుకున్నాం, నిద్రలేచాం.

ఇప్పుడు తపస్సు చేయాలి మనం. ఎలా చేయాలో తెలుసా? వెళ్ళి ఏం చేస్తాం అని? అందుకు వెళ్ళటం లేదు.

మా స్నేహితులు కొంత మంది హిమాలయాలకీ అక్కడికీ వెళ్ళి, ఆ చార్‌ధామ్ యాత్ర, బదరీనాథ్, కేదార్‌నాథ్, ఇంకా ఏవో రెండు ఉన్నాయి. అవి చూసి వస్తూవుంటారు.

నాకు నిజంగా హిమాలయాలు అంటే ఒక ప్రేమ. అంచేత వెళ్ళి వచ్చిన వాళ్ళను అడుగుతూవుంటాను, "మీరు ఏం చేశారు, మీరు ఏం చూశారు?" అని.

**మా స్నేహితులు నాకు ఇచ్చిన జవాబు ఏమిటంటే,**

నాకు ఎంత ఆనందం వేస్తుందో! "మాస్టారు, మీకు తెలియదు, అక్కడ కూడా ఇడ్లీ, సాంబారు దొరుకుతుంది."

☺ బదరీనాథ్‌కి అక్కడికీ దానికా వెళ్ళింది? వెళితే ఇడ్లీ, సాంబారే దొరుకుతుంది. మీ దృష్టి ఎలా ఉంటుందో, అదే ఉంటుంది. తపస్సు మీద మీ దృష్టి ఏది?

**తపస్సు యొక్క అంతరార్థం ఏమిటి అంటే,**

- ఇంద్రియాలకు, వాటికి ఇష్టమైనటువంటి పదార్థము ఇవ్వము. అది తపస్సు అంటే. దానికి ఏది ఇష్టమో, అది ఇవ్వం. అది తప్ప మిగతావన్నీ ఇస్తాం.

నోటికి మాట్లాడాలని ఉంటుంది. మాట్లాడం.
కన్నుకి చూడాలని ఉంటుంది. చూడం.
నాలికకి రుచికరమైనవి తినాలని ఉంటుంది. తినం.
చెవులకి మంచి పాటలు వినాలని ఉంటుంది. వినం.
ఇదీ తపస్సు.

దీని కోసం మీరు ఏ విధమైన ప్రయత్నాలు చేస్తారు, ఏమి చేస్తారు అనేది నిర్ణయించుకుని చేసుకోవటం తపస్సు.

③ ఈ తపస్సు వల్ల క్షీయతే శరీర వాసనా. శరీరంలో ఉన్న వాసనలు, మన శరీరంలో ఉన్న లిమిటేషన్స్, శరీరం లో ఉన్న మాలిన్యాలు తొలగిపోతాయి.

తరవాత స్వాధ్యాయము.

భగవద్గీత, గాయత్రీ రామాయణం, రామాయణం, మహాభారతం, ఇవి చదువుకోవటం.

- కానీ చదువుకుంటే స్వాధ్యాయం అవదు. చదువు కున్నది మీ మీద ప్రయోగించుకుంటే, ప్రాక్టీస్ చేస్తే, అదీ స్వాధ్యాయం అవుతుంది.

మీరు ఎన్ని సంవత్సరాలు భగవద్గీత చదివినా ఏమీ

అవదు. కానీ భగవద్గీతలో స్వయంగా విష్ణువే ఏం చెప్తాడు? భగవద్గీతలోని శ్లోకార్థాన్ని అయినా మీరు ప్రాక్టీస్‌లో పెట్టగలిగితే మీ జన్మ తరించిపోతుంది అంటాడు. అదీ స్వాధ్యాయం.

- చదివినటువంటి విషయాలను, చదివినటువంటి మంచి వాటిని ప్రాక్టీస్‌లో పెట్టుకోవటం స్వాధ్యాయం.

దాని తరవాత లాస్టది, ఈశ్వరప్రణిధానము.

- ప్రకృతి అంతా కూడా భగవంతుడి యొక్క నిర్మాణమే. మనం ఎక్కడ ఉన్నామో, అక్కడ భగవంతుడే మనల్ని పెట్టాడు.

**భగవంతుడికి మనం ఇచ్చేటటువంటి లక్షణాలు ఏమిటి?**

సర్వజ్ఞుడు, సర్వవ్యాపి, సర్వసమర్థుడు, ప్రేమమయుడు, దయామయుడు, అంతా, అన్నీ సాగరాలే ఆయన. మరి అంత అద్భుతమైనటువంటి వ్యక్తి మనల్ని ఈ చోట పెట్టాడు అంటే, ఇంతకంటే మంచి చోటు ఆయనకి కనిపించలేదు మనల్ని పెట్టటానికి.

- అంచేత మనకి కష్టాలు వచ్చినా, దుఃఖాలు వచ్చినా భగవంతుడ్ని తప్పు పట్టుకోవద్దు.
- -- మనకి సుఖాలు వచ్చినా భగవంతుడికి దయచేసి కృతజ్ఞత చెప్పుకోవద్దు. రెండిటికీ కారణం మీరే.
- ఈశ్వర ప్రణిధానము. ఈశ్వరుడు మనల్ని ఎక్కడ ఉంచాడో, అక్కడ కరెక్ట్‌గా ఉన్నాం.

**ఆ ఉండటానికి కారణం ఏమిటి?**

మన యొక్క కర్మలు కనుక, ఆ కర్మలు యొక్క భావనని కనుక మనం అర్థం చేసుకోగలిగితే, ఈ ఐదు నియమాలను మనం దాటేస్తాం.

యమ, నియమ, ఆసన.

ఆసనం అనేసరికల్లా మనకి రకరకాలైనటువంటి భంగిమలు గుర్తొస్తూవుంటాయి. కానీ పాతంజలి యోగ శాస్త్రంలో ఆ ఆసనాలు గురించి మాట్లాడటం లేదు.

**ఏ ఆసనం గురించి మాట్లాడుతున్నాడు?**

ఒక వ్యక్తి ఒక్క క్షణం ముందు వరకు నిరుద్యోగి. వాడు ఇంటర్వ్యూకి వెళితే ఆ బయట చెట్టు క్రింద కూర్చుంటాడు. అక్కడ ఉన్న నౌకర్లు వాళ్ళూ వాడి మాట వినరు. ఇంటర్వ్యూ అవుతుంది, ఎక్కడయితే ఇంటర్వ్యూ జరుగుతోందో, అక్కడే వాడికి కలెక్టర్ పోస్టింగ్ వచ్చింది అనుకుందాం. ఇప్పుడు వాడు ఎక్కడ కూర్చుంటాడు?

కలెక్టర్ "ఆసనం" మీద కూర్చుంటాడు.

**కూర్చోగానే ఈ నిరుద్యోగికి ఏమైపోయింది?**

పవర్స్ వచ్చేశాయి. ఇంక అందరూ వాడి చుట్టూరా పరిగెడతారు.

- ఆసనం అంటే అది. మీరు ఏ ఆసనం మీద కూర్చున్నారు? మామూలు వ్యక్తిగా కూర్చున్నారా?
- -- ఫలానా గురువు యొక్క శిష్యుడిగా కూర్చున్నారా?
- ఒక గురువు యొక్క శిష్యుడుగా మీరు సాధన చేస్తే, ఆసనం మీద కూర్చుంటే, ఆ గురువు యొక్క తపఃశ్శక్తి అంతా మీకు ఉపయోగపడుతుంది.

అందుకు గురువు కావాలి అనేది.

ఇంటర్వ్యూకి మామూలుగా వెళ్ళటానికి, కలెక్టర్ గారి అబ్బాయిగా వెళ్ళటానికి తేడా మీకు తెలుసుకదా!

**ఎక్కడ తేడా వచ్చింది?**

ఆసనంలో తేడా వచ్చింది.

అంచేత మనం ఋషులకికాని, గురువులకికాని, దేవతలకికాని ఆసనం సమర్పిస్తాం. "సర్వాభావే, ఆసనార్థే అక్షతాన్ సమర్పయామి." ఏమీ అవదక్కడ.

ఆసనము. ఏ మానసికస్థితిలో ఉన్నారు?

**యోగ యొక్క మానసికస్థితి ఏమిటి అంటే,**

- ఫలానా గురువు యొక్క శిష్యుడ్ని అనేటటువంటి ఆసనం మీద కూర్చోండి.

**మరి ఫలానా గురువు యొక్క శిష్యుడు ఎలా ఉండాలి?**

ఒక సంఘటన నాకు ఇప్పటికీ ఆశ్చర్యమే! నేను టెన్త్ క్లాస్ వరకు బెనారస్‌లో సెంట్రల్ యూనివర్సిటీ స్కూల్లో చదువుకున్నాను. అనిబిసెంటు దాన్ని స్థాపించింది, థియోసాఫికల్ సొసైటీని లీడ్ చేసినావిడ. 10 వ క్లాసు తరవాత హైస్కూలు దాటేశాను. తరవాత ఇంకొక కాలేజీలో ఎక్కడో చదివాను, తరవాత యూనివర్సిటీలో చదివాను.

రీసెర్చ్ చేసుకుంటూ అప్పుడు ఆంధ్రా యాజిటేషన్ జరుగుతోంది. 70స్‌లో. ఆ యాజిటేషన్‌లో వచ్చాను. వస్తే రైల్లో ఎవరో ఒక ప్రొఫెసరు కేరళాకి వెళుతున్నాడు.

"ఏం బాబూ నువ్వు సెంట్రల్ హిందూ స్కూల్లో చదివావా?" అన్నాడు.

"మీకు ఎలా తెలిసింది" అన్నాను.

"ఆ ముద్ర పడిపోతుంది బాబూ!"

సెంట్రల్ హిందూ స్కూల్లో చదివిన వాడిని గుర్తు పట్టేయొచ్చు, తెలిస్తే, ఆ ముద్ర తెలిస్తే, ఆ ఆసనం తెలిస్తే.

***ఇది ఎందుకు చెప్పుకొచ్చానో అర్థమవుతోందికదా,***

- మీరు ఒక గురువుని ఎన్నుకుంటే, మీ యొక్క ఆసనము ఆ గురువుకి తగిన స్టాండర్డ్‌లో ఉండాలి.

మరి ఆ గురువుకి తగిన స్టాండర్డ్‌లో ఉండాలి అంటే, ఆ గురువు మీ నుంచి ఏం కోరుకుంటున్నాడు? ఆ గురువు మీకు ఏం చెప్పాడు? ఆ గురువు యొక్క జీవిత విధానం మిమ్మల్ని ఏ విధంగా మార్చబోతోందో, ఇవంతా తెలియాలి. పాతంజలి యోగశాస్త్రంలో ఆసనానికి అంత విలువ ఉంది.

- అంచేత ఆసనం ఎవడు నిర్ణయిస్తాడు? నువ్వు ఏ ఆసనంలో కూర్చోవాలో గురువు నిర్ణయిస్తాడు.

మళ్ళా ఆసనం అంటే, "దర్భాసనం మీద కూర్చో మంటారా మాస్టారు!"

ఎక్కడ కూర్చున్నా ఒకటే.
దాని వల్ల ఏమీ మార్పు రాదు.

కేవలము ఒక గుడ్డ పీలిక మార్చేస్తే సిద్ధి వచ్చేస్తే ఎంత హాయో! ఆ మూర్ఖత్వం నుంచి మనం బయటపడాలి.

"చాలా పవర్‌ఫుల్ మాస్టారు!" పులి చర్మం మీద కూర్చుని సాధన చేస్తున్నాట్ట వాడు. చాలా పవర్‌ఫుల్! ఆ పులి చంపిన జంతువులన్నీ వచ్చి వాడి మీద భూతాల్లాగా పడ్డాయంటే, పరిగెడతాడు. దాని వల్ల ఏం అవ్వవు.

ఆసనం అంటే గురువు యొక్క మానసిక స్థితి.

- ఆ మానసికస్థితి మీకు అర్థమవ్వాలి అంటే, గురువు యొక్క వ్యక్తిత్వంలో మీరు కలిసిపోవాలి.

స్థిర సుఖం ఇతి ఆసనం.

- గురువులోనే మీ చేతనత్వం స్థిరపడిపోవాలి. మళ్ళా అలా అని చెప్పి మీరు కష్టపడకూడదు.

ఆ సాధనలు చేయటానికి, గురువులాగ ప్రవర్తించ టానికి ఇమిటేషన్ చేసేసి, "గురువులాగ బట్టలు వేసుకు న్నానుకదా, గురువులాగ నడుస్తాను."

బట్టలు కాదు కావలసింది అక్కడ.

***కావలసింది ఏమిటి?***

- గురువు ఏ మానసికస్థితిని నీలో పెంపొందిచాలని కోరుకుంటున్నాడో, ఆ మానసికస్థితిని తెచ్చుకుని సాధన మొదలెట్టాలి. ఆసనం అంటే అది.

- మనము ఏడుగురు గురువుల్ని ఎన్నుకున్నాం. వాళ్ళ యొక్క ఆసనాల్ని మీరు గమనించుకోవాలి.

సి.వి.వి. - బ్లావెట్స్కీ
లాహిరీ మహాశయ - యోగానంద
రామకృష్ణ పరమహంస - శారదామాత
శిరిడీసాయి - సత్యసాయి
అరవిందో - శ్రీమాత
శ్రీరామశర్మ ఆచార్య - మాతా భగవతీదేవి శర్మ

వీళ్ళ ఆసనాలు ఏమిటి? దానికి ఏ విధమైన మాన సిక స్థితిలో కూర్చుని సాధన మొదలెట్టాలో తెలుసుకోండి.

ఆసనం తరవాత ప్రాణాయామం.

ఈ ప్రాణాయామం గురించి నేను ఇప్పుడు ఎక్కువ ఎందుకు చెప్పదల్చుకోలేదు అంటే, దీని తరవాత వచ్చే శ్లోకాల్లో, ఈ జ్ఞానయోగంలోనే ప్రాణాయామం గురించి శ్రీకృష్ణుడే స్వయంగా చెప్తాడు.

ప్రాణాయామము తరవాత ప్రత్యాహారము.

***ప్రత్యాహారము అంటే ఏమిటి?***

- ఇంద్రియాలకు ఎంత ఆహారం ఇవ్వాలో అంతే ఇచ్చి, అంతకంటే ఎక్కువా, తక్కువా కాకుండా ఆహారం ఇస్తే, ఇంద్రియాలు మిమ్మల్ని బాధించవు.

ఇది ఒక పెద్ద స్టేట్‌మెంట్‌లాగ ఉందికాని, యోగ విద్యలో దీన్ని సమత్వము అంటాం.

సమత్వం యోగ ఉచ్యతే.

❊ ప్రత్యాహారం అంటే ఆకలేసింది, ఎంత ఆకలేసిందో, అంతే తినండి. రుచి కోసం తినకండి. చదువుకొంటున్నారు, ఎంత చదువుకోవాలో, అంతే చదవండి. చూస్తున్నారు, ఎంత చూడాలో అంతే చూడండి.

ఈ పదాలకు అర్థం ఏమిటో మీరు విశ్లేషణ చేసుకోండి. ఆహారానికి ఎగ్జాంపుల్ ఇచ్చానుకదా, కడుపు నిండేంత వరకు తినండి.

*సాధారణంగా యోగవిద్యలో ఏం చెప్తాం?*

సగం ఆహారంతో నింపుకోండి.
మిగతా సగంలో 1/4 నీళ్ళతో నింపుకోండి.
మిగతా 1/4 ఖాళీగా ఉంచుకోండి.

❊ ఇది నాలికకు సంబంధించిన ప్రత్యాహారం. అలాగే మిగతా ఇంద్రియాలకు కూడా ప్రత్యాహారాలు చేసుకున్నాక మాత్రమే అంతరంగ సాధనలోకి ప్రవేశిస్తాం.

ఆ అంతరంగ సాధన ప్రవేశమే ఈ శ్లోకం చెప్తోంది.

*శ్రోత్రాదీనీన్ద్రియాణ్యన్యే సంయమాగ్నిషు జుహ్వతి*

ఇంద్రియాలు అన్నీ ప్రత్యాహారాలు ద్వారా తమ చేతనత్వాన్ని సంపూర్ణమైన ఎవేర్‌నెస్‌లో నింపుకున్నాయి.

*శబ్దాదీన్విషయానన్య ఇన్ద్రియాగ్నిషు జుహ్వతి*

యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహారాలు అర్థం చేసుకున్నాంకదా!

❊ ఇప్పుడు అంతరంగ విద్యను అర్థం చేసుకుందాం. అవి ధారణ, ధ్యాన, సమాధి.

*తమాషా ఏమిటి అంటే,*

ఇవన్నీ మీకు వచ్చు. మీరందరూ కూడా సమాధిస్థితి తెలియని వాళ్ళు మాత్రము కాదు.

"ఏమో మాస్టారు, మీకు పూర్వజన్మలు అన్నీ తెలుస్తాయి. అక్కడ మేము సమాధిస్థితిలో ఉన్నామేమో!"

❊ ఈ జన్మలోనే, ఈ రెండు మూడు రోజుల్లోనే మీరు అనేక సార్లు సమాధి స్థితిలోకి వెళ్ళారు. కానీ అది సమాధి స్థితి అని మీకు తెలియదు. ధ్యానస్థితి అని మీకు తెలియదు. ధారణస్థితి అని మీకు తెలియదు.

❊ యోగవిద్యలో మీరు నిత్యజీవితంలో ఉపయోగించుకునే ఈ మూడు స్థితులు, ధారణ, ధ్యాన, సమాధి స్థితులను భగవంతుడి వైపు త్రిప్పుకుంటాం, ఆత్మ జ్ఞానం వైపు త్రిప్పుకుంటాం.

ఇది మీరు నిత్యజీవితంలో ఉపయోగించుకునేదే. వీటిని సినిమా హాల్లో కూడా ఉపయోగించుకుంటాం.

❊ ధారణ, ధ్యానము, సమాధి - ఈ మూడింటిని కలిపి "సంయమాగ్ని" అంటాం.

సంయమాగ్ని అనే మాట వాడుతున్నాడుకదా!

*శ్రోత్రాదీనీన్ద్రియాణ్యన్యే సంయమాగ్నిషు జుహ్వతి*

శ్రోత్రము అంటే చెవులు. అలాగే ఇంద్రియాలు యొక్క ఈ మిగతా విషయాలన్నిటినీ కూడా సంయమము అనే అగ్నిలో మీరు వేసేస్తున్నారు అని చెప్తున్నాడు.

సినిమాహాల్లో ఇది ఎలా చేస్తున్నారో చూడండి.

*ధారణ అంటే ఏమిటంటే,*

సినిమా హాల్‌కి వెళ్ళాం. తెర లేవలేదు, వాడేదో పాటలు వేస్తున్నాడు. "ఇంతకీ ఇక్కడ ఏం సినిమా ఆడుతోంది?" అని ప్రక్కవాడిని మీరు అడుగుతారు.

చాలా మంది అది అడుగుతారు, నాకు ఆశ్చర్యం అసలు. సినిమా హాల్‌కి వచ్చాడు. టికెట్ కొనుక్కున్నాడు. ఏం సినిమా ఆడుతోంది అని ప్రక్కవాడ్ని అడుగుతాడు. సరే, అది అంత ఎవేర్‌నెస్‌లో జీవిస్తున్నారు.

① మాట్లాడుతూవుంటారు, అంతా చేస్తూవుంటారు. కానీ మధ్య మధ్యన తెర మీద మీ దృష్టి పడుతూ ఉంటుంది. ఇది "ధారణ" అంటాం.

అంటే దేని గురించి అయితే మనం ఆలోచించబోతున్నామో, దాని మీద తప్ప, మిగతావన్నీ చేసుకుంటూ వుంటాం. ఇంకా సినిమా చూడటం మొదలెట్టలేదు, కానీ అక్కడికెళ్ళి కూర్చున్నాం. మన ఉద్దేశ్యం సినిమా చూద్దామని.

అలాగే పూజ చేయటానికి, ధ్యానం చేయటానికి కూర్చున్నాం. ధ్యానం తప్ప మిగతావన్నీ చేస్తూవుంటాం. "టీవీ కట్టేయ్యండర్రా, డిస్టర్బ్ అవుతోంది అని, ఒరేయ్ పిల్లలూ మీరు బయటకి వెళ్ళిపోండర్రా!" లేకపోతే ఏదో,

మీరు ఆ పూజ చేయటానికి కావలసిన పరిస్థితులు ఏర్పర చుకోవటానికి కావలసిన స్థితిని ధారణ అంటాం.

తెరలేచింది. హాల్లో ఉన్న గందరగోళం అంతా సర్దు మణుగుతుంది. సినిమా బావుందనుకోండి, మెల్లిమెల్లిగా మీ మనస్సు సినిమా మీద లగ్నం అయిపోతుంది.

② ప్రక్కన ఎవరు కూర్చున్నారు, ఎవరు మాట్లాడుతు న్నారు, ఇవేవీ మీకు గుర్తురావు. నేను చూస్తున్నాను అని మీకు తెలుస్తుంది, సినిమా చూస్తూవుంటారు. దీన్ని "ధ్యానము" అంటాం.

అంటే ఒకే విషయం మీద మీ మనస్సు లగ్నం అయింది.

③ కొంతసేపు అయిన తరవాత మిమ్మల్ని మీరు మర్చిపో తారు. మీరు ఉన్నారని మీకు గుర్తు కూడా ఉండదు. మీలో సినిమా మాత్రమే ఉంటుంది. అది "సమాధి".

సమాధి అదే!

❋ సినిమాలో ఉన్న ఎట్రాక్షన్ ఏమిటి అంటే, ఇన్‌డైరెక్ట్‌గా మీరు అక్కడ సమాధిలో ఉంటారు.

అంటే, జ్ఞానము, జ్ఞేయము, జ్ఞాత - సబ్జెక్టు, ఆబ్జెక్టు, నాలెడ్జి, ఇవి మూడే ఉంటాయి ఎప్పుడూ. జ్ఞాన యోగంలో త్రిపుటి అని చెప్పుకుంటున్నాంకదా!

చూసేవాడు సినిమా హాల్లో కుర్చీలో కూర్చున్నాడు. ఏం చూద్దామనుకుంటున్నాడు? సినిమా. చూస్తున్నాను అనేటటువంటి జ్ఞానము.

### ఈ జ్ఞానము దేని వల్ల వచ్చింది?

ఇంద్రియాలు వల్ల వచ్చింది. శ్రోత్రాదీనీన్ద్రియాణ్యన్యే చెవులు, మిగతా ఇంద్రియాలు వల్ల వాడికి నేను సినిమా చూస్తున్నాను అనేటటువంటి జ్ఞానం వచ్చింది.

① ధారణ - ఇంకా సినిమా మొదలెట్టలేదు.

② ధ్యానము - సినిమా మొదలయిందికాని, వీడు ఇంకా సర్దుకుంటున్నాడు. జస్ట్ అప్పుడే పేర్లు పడుతున్నాయి.

③ సమాధి - మెల్లిమెల్లిగా నేను చూస్తున్నాను అనేది కూడా వాడు మర్చిపోయి, కేవలము ఏం మిగులుతుంది అక్కడ? సినిమా మాత్రమే మిగులుతుంది. అందులో వాడు లీనమైపోతాడు.

### మీరు సాధన చేస్తున్నప్పుడు ఏం చేయాలి?

ఆ గురువు యొక్క స్వరూపాన్నో, దేవత యొక్క స్వరూపాన్నో మీరు పెట్టుకున్నారు. మీకు నచ్చినటువంటి గాయత్రీ మాత ఫొటో ఎదురుగుండా పెట్టుకుని ఉన్నారు.

### ఏం చేస్తారు మొట్టమొదట మీరు?

ధారణ చేస్తారు. అంటే ఏమిటి? హంస ఉంది, నీళ్ళు, తామర పూలు ఉన్నాయి. అమ్మ కాళ్ళకి ఆ పిందెలు ఉన్నాయి. ఇంక అవంతా ఆ క్రింద నుంచి పైకి, పై నుంచి క్రిందకి, దీన్నే నఖ శిఖ పర్యంతము అంటాం. పైకి క్రిందకి అమ్మ యొక్క స్వరూపాన్ని చూస్తూ ఉంటారు.

వెనకాతల ఫ్యాన్ కదులుతోంది, వాడు ఎవడో మాట్లాడుతున్నాడు. ఇవంతా మీకు వినిపిస్తూనే ఉంటాయి. ఈ స్థితిని ధారణ అంటాం.

### మెల్లిమెల్లిగా మీ ప్రయత్నం ఏమున్నాలి అంటే,

సినిమా చూస్తున్నప్పుడు మీరు సినిమాలో ఎలా అయితే లీనం అయిపోయారో, ఆ గాయత్రీ మాత యొక్క స్వరూపంలో లీనం అయిపోవటానికి ప్రయత్నం చేయండి.

❋ మరి ఎలా లీనం అవుతారు? మీరు చూస్తూవుంటే లీనం అవలేరు. అందుకని సహస్రనామాలు పెట్టారు.

ఒకొక్క పేరు మీరు ఉచ్చారణ చేసుకుంటూ, ఆ పేరు యొక్క అద్భుతమైనటువంటి రసాన్ని ఆస్వాదిస్తూ, "ఈ కాలి మీదే కదా బ్రహ్మ, ఇంద్ర, వరుణులు, వీళ్ళందరూ శరణు కోరారు! ఈ కాలి యొక్క శరణం మీద వల్ల కదా ఈ ప్రపంచం అంతా నడుస్తోంది! ......."

ఇంక మీ ఇష్టం, మీరు ఎలా ఆలోచించుకుంటారో అలా. ఒకొక్క వ్యక్తి ఒకొక్కలాగ ఆలోచిస్తారు.

### ఇంక అప్పుడేమవుతోంది?

గాయత్రీ మాత ఫొటో నుంచి మీ మనస్సు ధ్యాన స్థితిలోకి వెళ్ళింది. గాయత్రీ మాత యొక్క భావాల్లోకి వెళు తోంది. గాయత్రీ మాత యొక్క స్వరూపంలోకి వెళుతోంది.

మెల్లిమెల్లిగా నేను ఇది ఆలోచిస్తున్నాను అని మీరు మర్చిపోతారు. కేవలము ఆ తల్లి మాత్రమే మిగులుతుంది.

అది మిగిలితే సాక్షాత్కారం జరుగుతుంది.

ఇది ట్రిక్ అంతే అక్కడ.

*అంటే ఏం చేశాం అక్కడ?*

ధారణ నుంచి ధ్యానం, ధ్యానం నుంచి సమాధి లోకి వెళ్ళిపోయాం. ఈ మూడూ కలిసిపోయాయి.

ఈ మూడూ కలిసిపోయే విద్యనే ఇక్కడ ఒక లైనులో చెప్పాడు.

*శ్రోత్రాదీనీన్ద్రియాణ్యన్యే సంయమాగ్నిషు జుహ్వతి*

సంయమము అనేటటువంటి అగ్నిలో మీరు దాన్ని హోమం చేస్తారు. ఇది అర్థం చేసుకుని చేయండి.

గాయత్రీమాత స్వరూపం మీకు కష్టం అవుతుంది అనిపిస్తే రాములవారి పట్టాభిషేకం బొమ్మ తీసుకోండి. ఎంచేతంటే, మీకు అది కొంచెం ఈజీయర్ అవుతుంది.

ఆ బొమ్మని పైకి, క్రిందకి మీరు చూస్తూనే ఉన్నారు. ప్రక్క నుంచి బల్లి వెళ్ళింది. బల్లి కనిపిస్తూనే ఉంటుంది మీకు. అక్కడ ఆ ధూపము, దీపము అంతా వెలిగించారు, అవీ కనిపిస్తూనే ఉంటుంది. అంచేత ఆ రాములవారి పట్టాభిషేకం బొమ్మా మీకు కనిపిస్తోంది, చుట్టూరా ఉన్నవీ కనిపిస్తున్నాయి. ఈ స్థితిని ధారణ అంటాం.

*మెల్లిమెల్లిగా ఏం చేస్తాం మనం?*

ఆ రాముని కాళ్ళని, ఆయన ధనుస్సుని చూస్తూ, ఆయన జీవితంలోని సంఘటనలు నెమరేసుకుంటాం. ఇలా చేశావటకదా, అలా చేశావటకదా! కీర్తనలు అన్నీ అంతేకదా! వాటిని నెమరేసుకుంటూ ఉంటాం.

*నెమరేసుకుంటూవుంటే మీ మనస్సు ఇంక ఏమౌతోంది?*

బాహ్యమైనటువంటి బొమ్మనుంచి అంతర్గతంలో ఉన్న రాముడులోకి లీనం అవుతుంది. మెల్లిమెల్లిగా లీనం అయి, చివరికి ఏం జరగాలి అంటే, నేను ధ్యానం చేస్తున్నాను అనేటటువంటిది కూడా మీరు మర్చిపోవాలి.

*మర్చిపోతే అక్కడ ఎదురుగుండా మిగిలేది ఏమిటి?*

రాముడే. అదే సాక్షాత్కారం అంటే.

❊ ఈ ప్రోసెస్‌నే మనం కనుక కాస్త జాగ్రత్తగా ప్రాక్టీస్ చేసుకోగలిగితే యజ్ఞంలోకి మారుతుంది.

*యజ్ఞం అంటే ఏమిటో మీకు చెప్పానుకదా,*

సైక్లిక్ ప్రోసెస్.

❊ మరి యజ్ఞవిధానంలో ధారణ, ధ్యాన, సమాధి ఏం అవ్వాలి? రివర్స్ అవ్వాలి.

సమాధి నుంచి ధ్యానము,
ధ్యానము నుంచి ధారణ.

అది ఎలాగూ అవుతుంది? మీరు సమాధి స్థితిలో ఎంత సేపు ఉంటారు? మళ్ళా మెల్లిమెల్లిగా మీకు బాహ్య స్మృతి వస్తుంది. బాహ్యస్మృతి నుంచి మళ్లా మెల్లగా ధారణ స్థితికి వస్తారు. అప్పుడు లేస్తారు.

❊ ధారణతో మొదలెడతారు, ధారణతో లేస్తాం.

శ్రీ ధ్యానము, సమాధి మీ చేతిలో లేదు.
ఇట్ హేపెన్స్.

*అందువల్లే ఏం చేస్తాను నేను?*

నేచర్ ఈజ్ ఆల్వేజ్ రైట్. మీరు చేసేదేం లేదు.

కానీ గుడ్డిగా చేయకుండా మీ మనస్సుని కనుక అక్కడ పెట్టి, ఇదీ నేను చేయబోతున్నాను అని ఈ మూడు స్టెప్పులు మీరు మనస్సులో ఆలోచించుకుని, పూజ చేయటానికి ఎక్కువ టైమ్ వేస్ట్ చేయకండి. సర్వాభావే అక్షతాన్ సమర్పయామి అని కూడా అనకండి.

శ్రీ మానసికంగా పూజ చేయటానికి ట్రై చేయండి.

ఆసనమే సమర్పించదల్చుకున్నారు, రత్నఖచితమైన ఆసనాన్ని మీరు ఊహించుకోవచ్చు. నైవేద్యమే పెట్టదల్చుకున్నారు. అద్భుతమైన వంటకాలు చేయండి. కావాలంటే వంట చేస్తున్నట్టు కూడా మీరు ఊహించేసుకోవచ్చు. "వంకాయలు తీసుకొచ్చాను, వంకాయలు తరుగుతున్నాను." దానితో ఎన్ని రకాల కూరలు చెయ్యొచ్చో నాకు తెలియదు! ఇవంతా మీరు ఊహించుకోవచ్చు.

ఇదంతా ధ్యానంలోకే వెళుతుంది.

ఇదంతా చేసుకుంటూ, చేసుకుంటూ, చేసుకుంటూ, చివరికి ఒకానొక స్థితిలో మీరు ఇది చేస్తున్నారు అనేటటువంటి స్మృతి కచ్చితంగా పోతుందది.

ప్రకృతి యొక్క లక్షణం అది.

సినిమాలో జరుగుతోందికదా! సినిమాలో ఏం జరుగుతోందో, అది ఇక్కడా జరుగుతుంది.

- దీన్ని మీరు ప్రాక్టీస్ చేసుకోగలిగితే, ఈ శ్లోకం ఏం చెప్తోంది అంటే, ఈ ఇంద్రియాతీత స్థితిని దాటుకుని వెళ్ళిపోయి సమాధిస్థితిలో ఉండిపోగలుగుతారు.

కానీ ఈ సమాధిస్థితిలో కూడా మూడు రకాలైన సమాధులు ఉన్నాయి. నిరోధ సమాధి అని ఒకటి, ఏకాగ్రతతో కూడిన సమాధి ఒకటి, ఈ రెండిటికి మధ్యన ఇంకొక సమాధి ఉంది. కానీ ఇవంతా ఎంత చెప్పుకున్నా, ఆ సమాధి స్థితిలోకి వెళితే తప్ప మనకి తెలియదు.

***ఈ సమాధి స్థితిలో ఎలాంటి తేడాలు వస్తాయి అంటే,***

ఒకడికి చిరంజీవి ఇష్టం, ఇంకొకడికి శ్రీదేవి ఇష్టం. వాళ్ళు సినిమా చూస్తూ సమాధి స్థితిలో ఉన్నారు. బాహ్య స్మృతి ఏం లేదు, సినిమాలో లీనమయిపోయారు. కానీ ఆ సినిమాలో కూడా చిరంజీవి ఇష్టమైనవాడు చిరంజీవి మీద కాన్సన్ట్రేట్ చేస్తాడు. శ్రీదేవి ఇష్టమైనవాడు? ......

- సమాధిలో కూడా మళ్ళా అక్కడ తేడాలు ఉన్నాయి. అలా 48 రకాల తేడాలు సమాధిస్థితిలో ఉన్నాయని చెప్పుకుంటూ ఉంటాం.

ఆ సమాధి స్థితి గురించి, ఆ సమాధిస్థితిలో ఉండి యజ్ఞం ఎలా చేయాలి అనేది రేపు డిస్కస్ చేసుకుందాం.

ఎస్.ఎస్.వై.లో మూడు రోజుల పాటు ఈ సాధనే చెప్పబడుతుంది. ఈ విషయం మాత్రం వాళ్ళు చెప్పరు. ఎందుకు చెప్పరో నాకు తెలియదు. చెప్పకూడదు అనేమో!

***నాకు అలవాటు ఏమిటంటే,***

నాకు తెలిసున్నంత చెప్పేస్తాను. దాచుకోవటం నాకు చేతకాదు. నాకు, మా గురువుగారికి వచ్చేటటువంటి అద్భుతమైనటువంటి వీక్‌నెస్ అది.

మా ఆసనాలు అవి.

ఎస్.ఎస్.వై.లో ఉండే ఏ.ఎమ్.సి. యొక్క తెలుగు పేరు ఏమిటంటే, నిత్య సమాధి యోగా. నిరంతరం, 24 గంటలూ సమాధిస్థితిలోనే ఉండే ప్రాక్టీస్. మరి ఆ పరిస్థితి ఎలా ఉంటుందో, ఏం ఉంటుందో, రేపు ఆలోచిద్దాం.

కళ్ళు మూసుకుని ఇప్పుడు చెప్పిన విషయాలను మెల్లిగా రెండు మూడు మాటలలో గుర్తు చేసుకుందాం.

- పాతంజలి యొక్క అష్టాంగ యోగవిద్యలో యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యాన, సమాధి గురించి చెప్పుకున్నాం.

-- అందులో మొదటి ఐదు - యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహారాలు - బాహ్యజగత్తుకి సంబంధించినవి.

కానీ వీటిని మనం ప్రాక్టీస్ చేసినా, భౌతికజగత్తులో అనంతమైనటువంటి సిద్ధులు మనకి లభిస్తాయి.

-- ధారణ, ధ్యాన, సమాధి - ఈ మూడింటిని కలిపి సంయమనము అనే పేరుతో చెప్పావుంటాం.

ఈ మూడూ కూడా సమాధి యొక్క విభిన్న స్థితులలోకి సాధకుడిని తీసుకెళతాయి.


-- ఈ సమాధి స్థితిలో ఉంటూ జీవించటం అనేది అన్ని యోగస్థితుల యొక్క లక్ష్యము.

ఇదీ మనం ఇవాళ అర్థం చేసుకున్నది.

శాంతంగా సమాధిస్థితిలో
కొన్ని నిమిషాలు అలా ఉండిపోండి.

స్వస్తి.

mission RK
SSS-Hyderabad.
Phone: 23834474





## డా॥ ఎమ్. శ్రీరామకృష్ణగారి
## సాహిత్యం వివరాలు

| | | |
|---|---|---|
| 1. | అనుగ్రహ మాలామంత్రము | 35.00 |
| 2. | స్వర్ణయుగము మాసపత్రిక పాత సంచికలు | 100.00 |
| 3. | మాస్టర్ ఆర్.కె. లెటర్స్ - 1 | 75.00 |
| 4. | మాస్టర్ ఆర్.కె. లెటర్స్ - 2 | 90.00 |
| 5. | ఐశ్వర్యము యొక్క మానసికస్థితి | 160.00 |
| 6. | సీక్రెట్ డాక్ట్రిన్ ఉపన్యాసాలు | 400.00 |
| 7. | భగవద్గీత ఉపన్యాసాలు - 1 | 160.00 |
| 8. | భగవద్గీత ఉపన్యాసాలు - 2 | 160.00 |
| 9. | భగవద్గీత ఉపన్యాసాలు - 3 | 160.00 |
| 10. | భగవద్గీత ఉపన్యాసాలు - 4 | 160.00 |

ప్రతులకు :
పి. సీతారాముడు, ఇంద్ర సర్వీసెస్, 7-7-4/1, కుముదవల్లి రోడ్,
రైల్వే గేటు దగ్గర, భీమవరం - 534 203 ఫోన్ నెం. : 08816 - 309719